www.apteachers.in

నవ వసంతం - 3

తెలుగు వాచకం (ప్రథమ భాష)

ఎనిమిదో తరగతి

పాఠ్యపుస్తక అభివృద్ధి, ప్రచురణ సమితి

శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు
కమీషనర్
పాఠశాలవిద్య
ఆంధ్రప్రదేశ్, అమరావతి.

శ్రీ బి. ప్రతాప్‌రెడ్డి
సంచాలకులు,
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణసంస్థ,
ఆంధ్రప్రదేశ్, అమరావతి.

శ్రీ డి. మధుసూధనరావు
సంచాలకులు,
ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం
ఆంధ్రప్రదేశ్, అమరావతి.

సంపాదకులు

డా॥ పోరంకి దక్షిణామూర్తి విశ్రాంత ఉపసంచాలకులు
తెలుగు అకాడమి, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్

డా॥ డి. చంద్రశేఖర రెడ్డి విశ్రాంత ప్రధానాచార్యులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాల, హైదరాబాద్

డా॥ దహగాం సాంబమూర్తి విశ్రాంత ప్రధానాచార్యులు
ప్రభుత్వ ఉపాధ్యాయ విద్యాకళాశాల, వరంగల్

ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు తెలుగు శాఖాధిపతి
ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం, చిత్తూరు

డా॥ నోరి రాజేశ్వర రావు ఉపన్యాసకులు
ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం ప్రభుత్వాంధ్ర ప్రాచ్యకళాశాల హైదరాబాద్

సమన్వయకర్తలు

డా॥ ఆశావాది ప్రకాశ రావు,
విశ్రాంత ప్రధానాచార్యులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పెనుగొండ, అనంతపురం.

సి.హెచ్. వి.ఎస్.ఎన్. శర్మ
తెలుగు ఉపాధ్యాయులు,
లూటుకుర్రు, తూ॥గో॥జిల్లా

టి.వి.యస్. రమేష్
కో-ఆర్డినేటర్
యస్.సి.ఇ.ఆర్.టి ఆంధ్రప్రదేశ్

విద్యవల్ల ఎదగాలి
వినయంతో మెలగాలి

H3K9RZ

చట్టాలను గౌరవించండి
హక్కులను పొందండి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ

'దేశ భాషలందు తెలుగు లెస్స'

విద్యవల్ల ఎదగాలి
వినయంతో మెలగాలి

చట్టాలను గౌరవించండి
హక్కులను పొందండి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచేత ఉచిత పంపిణీ

www.apteachers.in

© Government of Andhra Pradesh, Amaravati

First Published 2013

New Impressions - 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020.

All rights reserved

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copy right holder of this book is the Director of School Education, Amaravati, Andhra Pradesh.

This Book has been printed on 70 G.S.M. SS Maplitho
Title Page 200 G.S.M. White Art Card

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచేత ఉచిత పంపిణీ

Printed in India
at the Govt. Text Book Press
Amaravati
Andhra Pradesh

www.apteachers.in

ముందుమాట

భాషను ఆలోచించే సాధనంగా పరిగణించి 'నవవసంతం' అనే పేరుతో ఎలిమెంటరీ స్థాయి పాఠ్య పుస్తకాల రూపకల్పనను ప్రభుత్వం 2011-12 లో ప్రారంభించింది. చదవడం, రాయడం వంటి ప్రాథమిక సామర్థ్యాలు పొందిన పిల్లలు ఎలిమెంటరీ స్థాయిలో ప్రవేశించి, భాష గురించి, భాషలోని వివిధ ప్రక్రియలగురించి ఆరు, ఏడు తరగతుల పాఠ్య పుస్తకాల ద్వారా అభ్యసించి ఎనిమిదో తరగతిలో ప్రవేశిస్తారు. ఈ పిల్లల్లో భాషా సామర్థ్యాలు, సృజనాత్మకత, ఉన్నతమైన వైఖరులు, వ్యక్తిత్వ నిర్మాణం, సాహిత్యాభిరుచి, సామాజికస్పృహ, మానవతా విలువలు వంటివి పెంపొందడానికి వీలుగా 'నవవసంతం-3'ను రూపొందించారు. అందుకోసం ప్రాచీన, ఆధునిక సాహిత్యాల నుండి పద్యం, ఆత్మకథ, ద్విపద, వ్యాసం, యాత్రాచరిత్ర, శతకం, కథ, నాటిక, వచనకవిత, గజల్, వార్తావ్యాఖ్యలను పాఠ్యాంశాలుగా చేర్చారు. ఇందుకోసం వివిధ ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలకు సంబంధించిన రచనలను ఎంపిక చేశారు.

ప్రతి పాఠం చివర ఉన్న అభ్యాసాలు పిల్లలను ఆలోచింపజేయడంతోపాటు వారిలో విశ్లేషణాత్మక ధోరణిని, బహుకోణాల్లో అర్థం చేసుకొనే లక్షణాన్ని, సమకాలీన సామాజిక అంశాలకు అన్వయించి అవగాహన చేసుకొనే నేర్పును, ప్రత్యేకమైన వైఖరుల నిర్మాణాన్ని పెంపొందించడానికి దోహదపడేలా ఉన్నాయి. వ్యాకరణాన్ని సులభంగా అర్థంచేసుకొనేలా, వ్యాకరణనియమాలను రూపొందించారు. పాఠ్యపుస్తకం చివర **పదాలు-అర్థాలు** పేరుతో పట్టికను పొందుపరచారు. దీనివల్ల విద్యార్థుల్లో నిఘంటు వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.

ఉపాధ్యాయులు తరగతి గదుల్లో సోపానక్రమం ప్రకారం పాఠ్యబోధన చేయడానికి వీలుగా పాఠాల నిర్మాణాన్ని అమర్చారు. ప్రతి పాఠాన్నీ ప్రారంభించేందుకుముందు పిల్లలకు పాఠంపట్ల ఆసక్తిని పెంపొదించడానికి చర్చ, ప్రశ్నించడం, ఆలోచింపజేయడం కోసం పద్యాలు, కవితలు, గేయాలు, కార్టూన్లు, చిత్రాలు, ప్రశ్నలు, సంఘటనలు, చిన్నకథలు మొదలయినవి చేర్చారు. అట్లాగే ప్రక్రియ, కవిపరిచయం, విశేషాంశాలు ప్రత్యేకంగా పొందుపరచారు.

భాషోపాధ్యాయులు భాషను సమర్థంగా వినియోగించే వాతావరణాన్ని తరగతిగదిలో కల్పించాలి. పిల్లలకు భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, ప్రశ్నించే అవకాశం ఇవ్వాలి. పాఠ్యాంశంలోని విషయాన్ని ఉన్నదున్నట్లుగా వివరించడంకన్నా, ఆ విషయంలోని అంతరార్థాన్ని, విశేషాంశాలను, విలువలను, కవి హృదయాన్ని అర్థంచేసుకోడానికి వీలుగా తరగతి గదిలో చర్చలు జరపాలి. జట్టు కృత్యాలవంటి భాగస్వామ్య పద్ధతులద్వారా బోధనాభ్యసన ప్రక్రియను నిర్వహించాలి. పాఠంలోని విషయంలో అక్కడక్కడ ప్రత్యేకమైన పదప్రయోగాలు, జాతీయాలు, సందేశాత్మక వాక్యాలు, ఆలోచింపజేసే సంఘటనలున్నాయి. ఇవి భాషాభ్యసనాన్ని అర్థవంతంగా చేయడానికి, పిల్లల్లో సాహిత్య విమర్శపట్ల ప్రాథమిక అవగాహన పెంపొందించడానికి తోడ్పడతాయి. పాఠ్యాంశాలకు అనుబంధంగా పూర్వగాథలు, గ్రంథాలయ పుస్తకాలు, పరామర్శ గ్రంథాలు, సాహితీ చరిత్ర, కవుల జీవితవిశేషాలు మొదలయినవి పిల్లలు చదువుకునేలా వాతావరణాన్ని కల్పించాలి. తదనుగుణంగా భాషోపాధ్యాయులు పాఠశాల గ్రంథాలయాలను బలోపేతం చేసి, సక్రమంగా వినియోగించుకోవాలి.

ఈ వాచకరూపకల్పనలో పాల్గొన్న సంపాదకమండలి సభ్యులకు, విషయనిపుణులకు, సమన్వయకర్తలకు, ఉపాధ్యాయులకు, చిత్రకారులకు, ముద్రణడిజైనర్లకు ధన్యవాదాలు. పాఠ్యపుస్తక రూపకల్పనలో సలహాలు, సూచనలు అందజేసిన ఢిల్లీ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు **ప్రొఫెసర్ రమాకాంత్ అగ్నిహోత్రి** గారికి, ప్రత్యేక ధన్యవాదాలు.

ఒక ఆవృతం పూర్తయింది. నవ్యాంధ్రప్రదేశ్ ఆవిర్భవించింది. తెలుగునేల నలుచెరగులా వెలుగులీనుతున్న జాతి ఔన్నత్యాన్ని అక్షరబద్ధం చేసి తరువాతి తరానికి అందించేందుకుగాను పాఠ్యపుస్తకంలో కొద్దిపాటి మార్పులు చోటుచేసుకున్నాయి. స్థానిక సంస్కృతి, కళలు, కళాకారుల గురించి, అద్భుత ప్రతిభాపాటవాలు ప్రదర్శించి తమ జీవితాన్ని ఇతరులకు ఆదర్శప్రాయంగా మలుచుకున్న స్ఫూర్తిప్రదాతల గురించిన పాఠ్యాంశాలు పొందుపరచడం జరిగింది. కొత్త పాతల మేలు కలయికతో రూపుదిద్దుకున్న ఈ పాఠ్యపుస్తకం పిల్లల్లో భాషాజ్ఞానంతోపాటు సాహిత్యాభిరుచిని, అధ్యయనాభిలాషను పెంపొందింపజేసి తెలుగుభాష గొప్పతనాన్ని గ్రహించేందుకు ఉపకరిస్తాయని ఆశిస్తున్నాం.

సంచాలకులు
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ,
ఆంధ్రప్రదేశ్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచేత ఉచిత పంపిణీ

www.apteachers.in

వందే మాతరం

– బంకించంద్ర ఛటర్జీ

వందేమాతరం వందేమాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం వందేమాతరం
శుభ్రజ్యోత్స్నాపులకిత యామినీం
పుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం వందేమాతరం.

మా తెలుగు తల్లి

– శంకరంబాడి సుందరాచారి

మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్నతల్లికి మంగళారతులు
కడుపులో బంగారు కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు దొరలించు మా తల్లి
గలగలా గోదారి కదిలిపోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి
అమరావతీ నగర అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు
తిక్కయ్య కలములో తియ్యందనాలు
నిత్యమై, నిఖిలమై నిలిచియుండేదాక
రుద్రమ్మ భుజశక్తి, మల్లమ్మ పతిభక్తి
తిమ్మరుసు ధీయుక్తి, కృష్ణరాయల కీర్తి
మా చెవుల రింగుమని మారుమ్రోగేదాక
నీ ఆటలే ఆడుతాం – నీ పాటలే పాడుతాం
జై తెలుగు తల్లీ! జై తెలుగు తల్లీ! జై తెలుగు తల్లీ!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచేత ఉచిత పంపిణీ

www.apteachers.in

జాతీయ గీతం

– రవీంద్రనాథ్ ఠాగూర్

జనగణమన అధినాయక జయహే!
భారత భాగ్య విధాతా !
పంజాబ సింధు గుజరాత మరాఠా,
ద్రావిడ ఉత్కళ వంగా !
వింధ్య హిమాచల యమునా గంగా,
ఉచ్ఛల జలధి తరంగా !
తవ శుభనామే జాగే !
తవ శుభ ఆశిష మాంగే !
గాహే తవ జయగాథా !
జనగణ మంగళదాయక జయహే
భారత భాగ్య విధాతా !
జయహే ! జయహే ! జయహే !
జయ జయ జయ జయహే !

ప్రతిజ్ఞ

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకుగర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను. నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను. జంతువులపట్ల దయతో ఉంటాను. నా దేశంపట్ల, నా ప్రజల పట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

ఉపాధ్యాయుల విభాగం

H3U5TH

www.apteachers.in

ఉపాధ్యాయులకు సూచనలు

- పాఠ్య పుస్తకాన్ని సమర్థంగా వినియోగించడానికి **ముందుమాట**ను, పాఠ్య పుస్తకం ద్వారా **ఆశించే సామర్థ్యాలను, విషయసూచికను** తప్పని సరిగా చదవాలి.
- మాతృభాష తెలుగు బోధనకు వారానికి ఆరు పీరియడ్ల చొప్పున 220 కాలాంశాలు (పీరియడ్లు) ఉంటాయి.
- ఈ పుస్తకం 180 పనిదినాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించారు. సగటున ఒక్కొక్క పాఠానికి 11 పీరియడ్లు చొప్పున 121 కాలాంశాలు, ఉపవాచక బోధనకు 18 కాలాంశాలు, పునరభ్యసనానికి 41 కాలాంశాలు కేటాయించుకోవాలి.
- పునరభ్యసనమనే ప్రక్రియ పాఠ్యాంశాన్ని నేర్చుకోవడంలో వెనుకబడిన విద్యార్థులకోసం కేటాయించబడింది. దీనిని ఉపాధ్యాయులు తప్పనిసరిగా నిర్దేశించిన పీరియడ్లలో కృత్యాలను నిర్వహించాలి.
- ఉపవాచక పాఠ్యాంశాలు కేవలం విస్తార పఠనానికి మాత్రమే ఉద్దేశించినవి. వీటిని పిల్లలతో తప్పక చదివించాలి. వీటి గురించి పిల్లలతో మాట్లాడించాలి. అవసరమైనచోట్ల ఏకపాత్రాభినయం లాంటి సృజనాత్మకకృత్యాలను చేసేలా చూడాలి. ఆయా పాఠ్యాంశాల్లోని విషయాల గురించి పిల్లలు సొంత మాటల్లో రాయడం, తమకు అన్వయించుకొని ప్రతిస్పందించడం, అభిప్రాయాలు ప్రకటించడం వంటి చర్యలను ప్రోత్సహించాలి.
- పాఠాన్ని బోధించడమంటే 'ఉన్ముఖీకరణ' నుండి 'ప్రాజెక్టు పని' పూర్తి చేయడం, 'నేనివి చేయగలనా?' వరకు అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి.
- పాఠాన్ని బోధించడమంటే కేవలం సారాంశాన్ని అందించడం మాత్రమే కాదు. నిర్దేశించిన ప్రతి సామర్థ్యంపై విద్యార్థికి అవగాహన, అధికారం కలిగేటట్లు చేయడం.
- ఒక పాఠానికి కేటాయించిన మొత్తం కాలాంశాలలో పాఠంలోని విషయాన్ని బోధించడానికి గరిష్ఠంగా నాలుగు కాలాంశాలు ఉపయోగించాలి. మిగిలిన కాలాంశాలు అభ్యాసాల సాధనకై వెచ్చించాలి.
- పాఠ్యాంశ బోధనలో నాలుగు సోపానాలను గుర్తుంచుకోవాలి.
- **(అ) ఉన్ముఖీకరణ :** దీని కొరకు చిత్రాలు, వివిధ సంఘటనలు, కథలు, గేయాలు, మొదలైనవి ఉన్నాయి. ఇందుకోసం ఒక పీరియడ్ కేటాయించుకోవాలి.

  (i) చర్చ ద్వారా ఉన్ముఖీకరణ చేయాలి. విద్యార్థి సృజనను గుర్తించాలి.

  (ii) చర్చ / ప్రశ్నల ద్వారా శీర్షికా ప్రకటన చేయాలి.

  (iii) పాఠ్యాంశం లోని విషయాన్ని చిత్రాల ఆధారంగా విద్యార్థులచే ఊహింపజేయాలి.

  (ఆ) అర్థసంగ్రహణ- పఠన కృత్యం : ఇందుకోసం ఒక పీరియడ్ కేటాయించుకోవాలి.

  'విద్యార్థులకు సూచనలు' అనుసరించి విద్యార్థులచే అర్థ సంగ్రహణ చేయించాలి. అందుకై వ్యక్తిగత పఠన కృత్యంగా తప్పని సరిగా 'మౌన పఠనం' చేయించాలి. జట్టు కృత్యాన్ని నిర్వహించాలి.

  (ఇ) పాఠ్యాంశంపై చర్చ - అవగాహన : ఇందుకోసం 3 నుండి 4 పీరియడ్లు కేటాయించుకోవాలి.

  ఉపాధ్యాయుడు పాఠ్యాంశంపై అవగాహన కలిగించటానికి చర్చను నిర్వహించాలి.

  (ఈ) అభ్యాసాల సాధన : 'ఇవి చేయండి' శీర్షిక తో ఇది మొదలౌతుంది. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగతంగా శ్రద్ధపెట్టి నిర్వహించాలి, అభ్యాసాలపైన అవగాహన కలిగించి సొంతంగా చేసేలా అభ్యాసం కల్పించాలి. అభ్యాసాలకోసం ఒక్కొక్కదానికి ఒక పీరియడ్ కేటాయించుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచేత ఉచిత పంపిణీ

www.apteachers.in

- ప్రతిపాఠాన్నీ ప్రణాళికాబద్ధంగా బోధించాలి. ఇందుకోసం పాఠ్యప్రణాళికను కింది విధంగా రాయాలి. 1) పాఠంపేరు 2) కాలాంశాల సంఖ్య 3) సాధించాల్సిన సామర్థ్యాలు 4) పీరియడ్లవారీ విభజన

కాలాంశాల సంఖ్య	బోధనాంశం	బోధన వ్యూహం	బోధన సామగ్రి / వనరులు

5) ఉపాధ్యాయుడి తయారీ, అదనపు సమాచార సేకరణ 6) ఉపాధ్యాయుడి ప్రతిస్పందన.

- స్వీయరచన, సృజనాత్మకత, ప్రాజెక్టు పనులు, ప్రశంసలోని అంశాల గురించి రాయడానికి పూర్తి తరగతిలో సూచనలు ఇవ్వాలి. చేయించాలి. పిల్లలు రాసిన తరవాత చర్చ ద్వారా సరిదిద్దాలి. ఆ తర్వాత సొంతంగా నోటుబుక్కులో రాయమనాలి.
- ఏ పరిస్థితుల్లోనూ గైడ్లు, స్టడీ మెటీరియల్స్ చూసి ప్రశ్నలకు జవాబులు, అభ్యాసాలు రాయడం చేయగూడదు. ఒకవేళ అలా రాస్తే, మార్కులు రావని చెప్పాలి.
- ఆయా పాఠాలను ఆధారంగా చేసుకొని అవకాశమున్న చోట్ల మానవత్వపు విలువలు, పర్యావరణం, కళలు, పని అనుభవం, జీవవైవిధ్యం మొదలైనవాటిని గురించి పిల్లలచేత చర్చింపజేయాలి.
- * (పువ్వు) గుర్తు ఉన్న పద్యాలను తప్పనిసరిగా విద్యార్థులచేత కంఠస్థం చేయించాలి.
- తెలుగు సాహిత్యంపై ఆసక్తి, అభిరుచి కలిగించేలా పాఠశాల గ్రంథాలయంలోని ప్రాచీన, ఆధునిక సాహిత్య గ్రంథాలను పరిచయంచేసి చదివించాలి. పాఠాలతో సంబంధమున్న గ్రంథాలను కూడా పిల్లలచేత చదివించాలి.
- నిరంతర సమగ్ర మూల్యాంకనంలో భాగంగా పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు సామర్థ్యాలవారీగా అంచనావేయాలి. ప్రత్యేక రిజిస్టర్‌ను ఏర్పాటు చేసుకొని విద్యార్థుల ప్రగతిని వ్యక్తిగతంగా “నిర్ధారిత సామర్థ్యాలవారీగా” నమోదు చేస్తూండాలి.
- నిరంతర సమగ్ర మూల్యాంకనంలో భాగంగా జూలై, ఆగష్టు, నవంబర్, ఫిబ్రవరి మాసాల్లో నిర్మాణాత్మక మూల్యాంకనంలో పిల్లల భాగస్వామ్యం పరిశీలన, రాసిన అంశాలు, ప్రాజెక్టు పనులు, లఘుపరీక్ష ఆధారంగా పిల్లల ప్రగతిని అంచనా వేసి నమోదు చేయవలసి ఉంటుంది.
- సెప్టెంబర్ / అక్టోబర్, డిసెంబర్ / జనవరి, ఏప్రిల్ మాసాల్లో నిర్వహించే సంగ్రహణాత్మక మూల్యాంకనం కోసం ఉపాధ్యాయులే సామర్థ్యాల ఆధారంగా ప్రశ్నపత్రాలు తయారుచేసుకొని పరీక్షించాలి.
- పాఠాలలోని అభ్యాసాలను సొంతంగా రాయడం ఆధారంగా పిల్లలు రాసిన అంశాలకు మార్కులు కేటాయించాలి. అట్లే ప్రాజెక్టు పనులకు కూడా కేటాయించాలి.
- పాఠ్యపుస్తకాన్ని ఉపకరణంగా చేసుకొని విద్యార్థుల భాషాభివృద్ధితోపాటు సర్వతోముఖవికాసానికి ఉపాధ్యాయుడు తోడ్పడాలి – పాటుపడాలి.
- ప్రతి పాఠంలో ఇచ్చిన సృజనాత్మకతలోని అంశాలను పిల్లలు రాసిన తరవాత పుస్తక సంకలనంగా చేసి తరగతిలో ప్రదర్శించాలి.
- ‘విద్యార్థులకు సూచనలు’ పిల్లలతో చదివించి అర్థంచేయించాలి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచేత ఉచిత పంపిణీ

www.apteachers.in

రూపకల్పనలో పాల్గొన్నవారు

శ్రీమతి యన్. సరోజినీ దేవి
విశ్రాంత ఉపన్యాసకులు, యస్.సి.ఈ.ఆర్.టి.

శ్రీ చెఱుకూరి వెంకట సూర్యనారాయణ శర్మ, యస్.ఎ. (తెలుగు)
జి.ప.ఉ.పా., లూటుకుర్రు, తూ.గో.జిల్లా

శ్రీ ముప్పల రాంబాబు, యస్.ఎ. (తెలుగు)
జి.ప.ఉ.పా., కోడూరు, విశాఖపట్నంజిల్లా

డా॥ ఊటుకూరి వరప్రసాద్, యస్.ఎ. (తెలుగు)
జి.ప.ఉ.పా., కన్నాపురం, పశ్చిమ గోదావరి జిల్లా

డా॥ దోనెపూడి నరేశు బాబు, తెలుగు పండితులు
జి.ప.ఉ.పా., గోస్పాడు, కర్నూలుజిల్లా

శ్రీ కట్టా శ్రీనివాస రావు, యస్.ఎ. (తెలుగు)
జి.ప.ఉ.పా., తాడువాయి, ప.గో.జిల్లా

శ్రీమతి గూడా సుబ్బలక్ష్మి, తెలుగు పండితులు
జి.ప.ఉ.పా., పూడిపర్తి, నెల్లూరుజిల్లా

శ్రీ పి.జనార్ధన్, ఉపన్యాసకులు
ప్ర.జి.వి.శి.సం(డైట్)., కర్నూల్‌జిల్లా

శ్రీ పైడి హరినాథ రావు విశ్రాంత ఉపాధ్యాయుడు
ఎచ్చెర్ల, శ్రీకాకుళంజిల్లా

దివ్వెల చిన్నారావు తెలుగు పండితులు
మం.ప.ప్రా.ఉ.పా., కూర్మరాజుపేట, విజయనగరంజిల్లా

సి.హెచ్.ఏడుకొండలు, తెలుగు పండితులు
జి.ప.ఉ.పా., సుంకేశుల, ప్రకాశంజిల్లా

అయ్యగారి శ్రీనివాస రావు యస్.ఎ. (తెలుగు)
జి.ప.ఉ.పా., కోనాడ, విజయనగరంజిల్లా

చిత్రకారులు

శ్రీ కె. బాబు, వడ్డెపల్లి వెంకటేశ్, శ్రీ బీర శ్రీనివాస్, గవరయ్య,
శ్రీ కూరెళ్ళ శ్రీనివాస్, శ్రీ బి.వి.ఆర్.చారి, శ్రీ. టి.వి. రాం కిషన్, శ్రీ కె. సురేందర్,

క్యూ ఆర్ కోడ్స్ బృందం

పోకూరి శ్రీనివాస్, *APeKX* –కోఆర్డినేటర్,
హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ – డిజిటల్ ఎడ్యుకేషన్,
ఎస్.సి.ఈ.ఆర్.టి., ఆంధ్రప్రదేశ్, అమరావతి.

నాగెళ్ళ ఆల్విన్ జోసఫ్
అసిస్టెంట్ కోఆర్డినేటర్ – డిజిటల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్,
ఎస్.సి.ఈ.ఆర్.టి., ఆంధ్రప్రదేశ్, అమరావతి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచేత ఉచిత పంపిణీ

www.apteachers.in

విషయసూచిక

క్ర.సం.	పాఠం	ప్రక్రియ	ఇతివృత్తం	కవి/రచయిత	నెల	పుట
1	అమ్మకోసం	పద్యం	మాతృభక్తి, విలువలు	నన్నయ భట్టు	జూన్	1
2	ఇల్లు-ఆనందాల హరివిల్లు	వ్యాసం	కుటుంబ విలువలు	రచయితల బృందం	జూలై	12
3	హద్దులు హద్దులు (ఉపవాచకం)	కథ	హాస్యం	నండూరి సుబ్బారావు	జూలై	22
4	నీతి పరిమళాలు	పద్యం	నైతిక విలువలు	శతక కవులు	ఆగస్ట్	26
5 F	అజంతా చిత్రాలు	యాత్రారచన	దర్శనీయ స్థలం	నార్ల వేంకటేశ్వరరావు	ఆగస్ట్	35
6	గుశ్వం (ఉపవాచకం)	నాటిక	హాస్యం	బాలల అకాడమి	ఆగస్ట్	45
7	ప్రతిజ్ఞ	వచన కవిత	సామాజిక చైతన్యం	శ్రీ శ్రీ	సెప్టెంబర్	54
8	ప్రకృతి ఒడిలో	వ్యాసం	యాత్రాచరిత్ర, కళలు పర్యావరణం- వైజ్ఞానిక అవగాహన	కొడవటిగంటి కుటుంబరావు	సెప్టెంబర్	64
9	గులాబి అత్తరు (ఉపవాచకం)	కథ	మానవ సంబంధాలు	శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి	అక్టోబర్	73
10 F	హరిశ్చంద్రుడు	ద్విపద	వ్యక్తిత్వ విలువలు	గౌరన	అక్టోబర్	83
11	జీవన భాష్యం	గజల్	సామాజికస్పృహ	సి. నారాయణరెడ్డి	నవంబర్	91
12	మధుపర్కాలు (ఉపవాచకం)	కథ	సంస్కృతి- మానవసంబంధాలు	రావూరు వేంకట సత్యనారాయణ రావు	డిసెంబర్	101
13	సందేశం	పద్యం	జాతీయసమైక్యత	ఎస్.టి. జ్ఞానానందకవి	డిసెంబర్	108
14	సంస్కరణ	వార్తావ్యాఖ్య	సామాజిక స్పృహ	నండూరి రామమోహనరావు	జనవరి	117
15	జీవ గడియారాలు (ఉపవాచకం)	వ్యాసం	శాస్త్రవిజ్ఞానం	రచయితల బృందం	జనవరి	127
16	భూదానం	ఆత్మకథ	సామాజిక స్పృహ	వినోభా భావే	ఫిబ్రవరి	131
17	స్ఫూర్తిప్రదాతలు (ఉపవాచకం)	వ్యాసం	మానసికోల్లాసం	రచయితల బృందం	ఫిబ్రవరి	139
	* పునశ్చరణ & సామర్థ్యాలు * పునశ్చరణ & సాధన				మార్చి ఏప్రిల్	

సూచనలు

F ఉన్న పాఠాలు సంస్కృతం కాంపోజిట్ కోర్సుగా చదివేవారు నేర్చుకోవలసిన అవసరం లేదు.

_ పువ్వు గుర్తుగల పద్యాలు కంఠస్థం చేయాలి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచేత ఉచిత పంపిణీ

www.apteachers.in

ఈ పాఠ్యపుస్తకం ద్వారా విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాలు

(I) వినడం -మాట్లాడడం

- పద్యాలు, గేయాలు, వార్తావ్యాఖ్య, వచన కవిత... మొదలయిన వాటిని విని అర్థం చేసుకోవాలి, ప్రతిస్పందించగలగాలి.
- ఏదైనా ఒక విషయం గురించి సమర్థిస్తూ, లేదా వ్యతిరేకిస్తూ సరైన కారణాలతో వివరించగలగాలి. అభిప్రాయం స్పష్టంగా చెప్పగలగాలి.
- ఆయా పాఠ్యాంశాల ద్వారా వచ్చే సందేశాలను చెప్పగలగాలి; భేదాలను గుర్తించగలగాలి.
- పద్య, గేయ భావాలను స్పష్టంగా వివరించగలగాలి.
- మిత్రులతో చర్చల్లో చురుకుగా పాల్గొనగలగాలి
- భావాలను ఊహిస్తూ చెప్పగలగాలి. సరైన దిశలో ఆలోచనలను వ్యక్తీకరించగలగాలి.

(II) ధారాళంగా చదవడం, అవగాహన చేసుకోడం, ప్రతిస్పందించడం

- పద్యాలను, గేయాలను ధారాళంగా, భావయుక్తంగా, రాగయుక్తంగా చదవగలగాలి.
- విభిన్న అంశాలకు సంబంధించిన శీర్షికలను ఆలోచించి సూచించగలగాలి.
- విషయాన్ని చదివి సమచార పట్టికలు తయారుచేయడం,ప్రశ్నలురాయడం,శీర్షికలు పెట్టడం వంటివి చేయగలగాలి.
- అపరిచిత, పరిచిత విషయాలను చదివి అవగాహన చేసుకొని జవాబులను రాయగలగాలి.
- పాఠం ఆధారంగా జవాబులను సొంతమాటల్లో రాయగలగాలి.

(III) స్వీయరచన

- అనుభూతులు, ప్రతిస్పందనలు, అనుభవాల గురించి సొంతమాటల్లో రాయగలగాలి.
- అభిప్రాయాలను, సూటిగా, స్పష్టంగా సొంతమాటల్లో రాయగలగాలి.
- సమస్యలకు పరిష్కారాల గురించి ఆలోచించి సూచనలను రాయగలగాలి.
- పాఠ్యాంశం పై సంపూర్ణ అవగాహనతోను, అధికారంతోను వివరణలు రాయగలగాలి.
- ఒక విషయాన్ని సమర్థిస్తూ లేదా విభేదిస్తూ సరైన కారణాలతో రాయగలగాలి.

(IV) పదజాలం

- వివిధ సందర్భాలకనుగుణంగా భాషలోని జాతీయాలను, ఈ పుస్తకంలో పరిచయమైన కొత్తపదాలను ఉపయోగించగలగాలి.
- పర్యాయపదాలను, నానార్థాలు, ప్రకృతి వికృతులు, వ్యుత్పత్త్యర్థాలను తెలుసుకొని ప్రయోగించగలగాలి
- భాషాక్రీడలద్వారా, నిఘంటువు ఉపయోగం ద్వారా పదజాలాన్ని పెంచుకోగలగాలి, సందర్భోచితంగా వినియోగించగలగాలి.

(V) సృజనాత్మకత

- పాఠ్యాంశాలను వివిధ సాహితీప్రక్రియల్లోకి అంటే గేయం, కథ, సంభాషణ, లేఖ, పద్యం మొదలగు రూపాల్లోకి మార్చగలగాలి.
- ముగింపు లేని అంశాలకు ముగింపునివ్వగలగాలి.
- వివిధ అంశాలపై పోస్టర్లు, కరపత్రాలు (బ్రోచర్లు) మొదలైనవాటిని తయారు చేయగలగాలి. వాటి గురించి రాయగలగాలి.
- భావనల ఆధారంగా చిత్రాలను గీయగలగాలి, వర్ణనలు రాయగలగాలి.

(VI) ప్రశంస

- లింగ, వర్గ, మత భేదాలను పాటించకుండా సామర్థ్యాలను ప్రశంసించగలగాలి.
- కవులను, కవుల భావాలను ప్రశంసించగలగాలి.
- స్ఫూర్తిమత్వంతో తరతమ భేదాలను పరిగణించకుండా ప్రశంసించగలగాలి.
- ఉదాత్తభావనలతో, ప్రాంతాలకతీతంగా వ్యక్తులను, సంస్థలను ప్రశంసించగలగాలి.
- ఇతర భాషల్లోని గొప్పతనాన్ని గ్రహించి ప్రశంసించ గలగాలి.

(VII) భాషాంశాలు

- వాక్యభేదాలను గుర్తించి సందర్భోచితంగా వాక్యప్రయోగాలు చేయగలగాలి.
- సంధులు, సమాసాలను గుర్తించగలగాలి. సూత్రాలను సొంతమాటల్లో అర్థవంతంగా రాయగలగాలి.
- అలంకారాలు, ఛందస్సుపై అవగాహన పెంచుకొని గుర్తించగలగాలి. లక్ష్యలక్షణ సమన్వయాలను అర్థవంతంగా సొంతమాటల్లో వివరించగలగాలి.

www.apteachers.in

1. అమ్మకోసం

-నన్నయ భట్టు

చదవండి - ఆలోచించండి - చెప్పండి

ఆ.వె. తల్లి దండ్రి మీద దయలేని పుత్రుండు
పుట్టనేమి? వాడు గిట్టనేమి?
పుట్టలోన చెదలు పుట్టదా? గిట్టదా?
విశ్వదాభిరామ! వినురవేమ!

ప్రశ్నలు

1. కవి ఈ పద్యాన్ని ఎవరి గురించి చెప్పారు?
2. చెదలతో ఎవరిని పోల్చారు?
3. మన ప్రాచీన కథలలో తల్లిదండ్రులకు సేవచేసినవారి గురించి మీకు తెలుసా?

ADESH

నేపథ్యం

కద్రువ, వినత కశ్యప ప్రజాపతి భార్యలు. పెద్దభార్య కద్రువకు కశ్యపుని వరంవల్ల వేయిమంది కుమారులు పుట్టారు. వారే కర్కోటకాది సర్పాలు. వినతకు అనూరుడు, గరుత్మంతుడు పుట్టారు. అనూరుడు సూర్యుని రథసారథి. వినత పందెంలో ఓడిపోయి కద్రువకు దాసి అయింది. తల్లితోపాటు గరుత్మంతుడు కద్రువ కుమారులకు సేవలు చేస్తూ ఉండేవాడు. మహాశక్తిమంతుడైన గరుత్మంతుడు తమ దాస్యానికి కారణం తెలుసుకోడానికి తల్లి దగ్గరకు వెళ్ళాడు.

ఈ పాఠం నన్నయ రాసిన శ్రీమదాంధ్ర మహాభారతంలోని ఆదిపర్వం ద్వితీయాశ్వాసం లోది.

విద్యార్థులకు సూచనలు

1. పాఠంచిత్రం ఆధారంగా పద్యాల భావాలను ఊహించండి. చెప్పండి.
2. పాఠం చదవండి. పదపట్టిక చూసి పదాలకు అర్థాలు తెలుసుకోండి.
3. సందర్భానికి తగిన అర్థాన్ని గ్రహించి చిత్రాలు ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
4. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

www.apteachers.in



*ఉ. ఆయతపక్షతుండహతి నక్కులశైలము లెల్ల నుగ్గుగాc
జేయు మహాబలంబును బ్రసిద్ధియునుం గల నాకు నీపనిం
బాయక వీcపునం దవడుcబాముల మోవను, వారికిం బనుల్
సేయను నేమి కారణము సెప్పుము దీనిc బయోరుహాననా! 1

వ. అని యడిగిన వినత తనకుం గద్రువతోడి పన్నిదంబున నైన దాసీత్వంబును, జెప్పి యిట్లనియె. 2



కం. నీ కతమున నా దాస్యము
ప్రాకటముగc బాయు ననిన పలు కెడలోనం
జేకొని, యూఅడి నిర్గత
శోకస్థితి నున్నదానc జూవె ఖగేంద్రా ! 3

వ. 'కొడుకులు సమర్థులైనం దల్లిదండ్రుల యిడుమలు వాయుట యెందునుం గలయది గావున నీయట్టి సత్పుత్త్రుం బడసియు దాసినై యుండుదాననే', యనిన విని వైనతేయుండు దద్దయు దుఃఖితుండై, యొక్కనాcడు కాద్రవేయుల కిట్లనియె. 4

కం. మా యీ దాస్యము వాయు ను
పాయము సేయుండు, నన్నుc బనుపుం డిష్టం
బేయది దానిన తెత్తు న
జేయుండనై యమరవరులంc జేకొనియైనన్. 5

వ. అనిన నయ్యురగులు కరుణించి గరుడుని కిట్లనిరి. 6

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచేత ఉచిత పంపిణీ

www.apteachers.in

*చ. 'అమితపరాక్రమంబును, రయంబును, లావును గల్గు ఖేచరో
త్తముఁడవు నీవు; నీదయిన దాస్యము వాపికొనంగ నీకుఁ జి
త్తము గలదేని, భూరిభుజదర్పము శక్తియు నేర్పడంగ మా
కమృతముఁ దెచ్చియి' మ్మనిన నవ్విహగేంద్రుఁడు సంతసంబునన్ 7

వ. 'అట్ల చేయుదు, నమృతంబు దెచ్చి మీ కిచ్చి, యేనునుం,
దల్లియు దాస్యంబువలన విముక్తుల మగువార' మని నొడివి,
తద్వృత్తాంతం బంతయుం దల్లికిం జెప్పి 'యమృతహరణార్థం బరిగెద
నని మ్రొక్కి, తల్లి దీవనలు గైకొని గమనోన్ముఖుండై...... 8

*మ. వితతోల్కాశనిపుంజ మొక్కొ యనఁగా విన్వీథి విక్షిప్త ప
క్షతి వాతాహతిఁదూలి, తూల శకలాకారంబు లై వారిద
ప్రతతుల్ సాల్పడి నల్గడం జెదరఁగాఁ బాఱెన్ మనోవేగుఁడై
పతగేంద్రుం డమృతాంతికంబునకుఁ దత్పాలుర్ భయం బందఁగన్. 9

వ. అంత, 10

ఉ. ఘోరవికార సన్నిహిత కోపముఖంబులు, దీప్తవిద్యుదు
ల్కారుణ దారుణాక్షములునై, నిజదృష్టి విషాగ్ని నన్యులం
జేరఁగనీక యేర్చుచుఁ బ్రసిద్ధముగా నమృతంబు చుట్టు ర
క్షారతి నున్న యుగ్రభుజగంబుల రెంటిని గాంచి చెచ్చెరన్. 11

వ. అయ్యురగంబులం దనపక్షరజోవృష్టి నంధంబులం జేసి, వాని
శిరంబులు ద్రొక్కి, పరాక్రమం బెసంగ నమృతంబు గొని,
గరుడుండు గగనంబున కెగసి .... యురగుల యొద్దకు వచ్చి,
మరకతహరితం బైన కుశాస్తరణంబున నమృతకలశంబు
నిలిపి, యురగులకుం జూపి యిట్లనియె. 12

కం. అనిమిషనాథ సుగుప్త మ
యిన యమృతము దెచ్చి మీకు నిచ్చితి, నస్మ
జ్జననీదాస్యము వాసెను,
దినకరపవనాగ్నితుహినదీప్తుల కరిగాన్ 13



www.apteachers.in

కవి పరిచయం

నన్నయభట్టు (ఊహాచిత్రం)

ఆదికవి, వాగనుశాసనుడని బిరుదులు పొందిన నన్నయ పదకొండోశతాబ్ది కవి. రాజమహేంద్రవరం రాజధానిగా ఆంధ్రదేశాన్ని పరిపాలించిన తూర్పుచాళుక్యరాజు రాజరాజనరేంద్రుని ఆస్థానంలోనివాడు. వ్యాసుడు సంస్కృతంలో రచించిన మహాభారతాన్ని అనుసరించి తెలుగులో రచించిన కవిత్రయంలో మొదటివాడు నన్నయ. ఆంధ్రశబ్దచింతామణి అనే వ్యాకరణ గ్రంథం రచించిన తరవాత భారతంలో ఆది, సభాపర్వాలను, అరణ్యపర్వం 4వ ఆశ్వాసంలో 142 పద్యాల వరకు ఆంధ్రీకరించాడు. చాముండికా విలాసము, ఇంద్ర విజయము నన్నయ ఇతర రచనలు.

అక్షరరమ్యత, ప్రసన్నకథాకలితార్థయుక్తి, నానారుచిరార్థ సూక్తినిధిత్వం నన్నయ కవిత్వంలోని ప్రధాన లక్షణాలు. అనుసృజన పద్ధతిలో, శైలిలో తరవాతి కవులకు మార్గదర్శకుడయాడు నన్నయ.

ప్రక్రియ – ఇతిహాస కవిత

ఇది ఇలా జరిగింది అని చెప్పేది ఇతిహాసం. ఇతిహాసంలో కథకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఈ కథలు గ్రంథస్థం కాకముందు వాగ్రూపంలో ఉండేవి. రామాయణం, మహాభారతం మన భారతీయ ఇతిహాసాలు.

పద్యాల భావాలు

1. పద్మంవంటి ముఖం గల తల్లీ! విశాలమైన రెక్కలతో, వాడి అయిన ముక్కుతో కులపర్వతాలన్నిటినీ పిండిగా చేయగల గొప్పబలం, కీర్తి గల నేను, నీచమైన పాములను ఎల్లకాలం వీపు మీద మోయడానికి, వాటికి సేవలు చేయడానికి గల కారణమేమిటో చెప్పు.

2. అని గరుడుడు అడగగా, వినత తన సవతి అయిన కద్రువతో పందెంలో తాను ఓడిపోయినందువల్ల కలిగిన దాసీతనాన్నీ గురించి కొడుకుతో స్పష్టంగా చెప్పి, ఇలా అన్నది :

3. "ఓ పక్షిశ్రేష్ఠుడా! నీ కారణంగా నా దాసీతనం పోతుం"దని అనూరుడు చెప్పిన మాటలను మనస్సులో ఉంచుకొని, సమాధానపడి దుఃఖం పోగొట్టుకొని ఉన్నాను.

4. "కొడుకులు శక్తిమంతులైతే తల్లిదండ్రుల కష్టాలు తొలగిపోవడం సహజమే. కాబట్టి నీవంటి యోగ్యుడైన కుమారుణ్ణి పొంది, నేను ఇంకా దాసీగానే ఉండాలా?" అనగా గరుడుడు దుఃఖించి, కద్రువ పుత్రులైన పాములతో ఒకనాడు ఇలా అన్నాడు :

5. "నా తల్లికి, నాకు దాస్యం పోవడానికి ఆలోచన చేయండి. దీని కోసం మీకు ఇష్టమైన దేదో ఆజ్ఞాపించండి. దేవతాశ్రేష్ఠులను లోబరచుకొనైనా దాన్ని సాధిస్తాను".

6. అని గరుడుడు అడగగా ఆ పాములు (కద్రువ కుమారులు)జాలిపడి గరుడునితో ఇలా చెప్పాయి :

7. "నీవు అంతులేని విక్రమాన్ని, వేగాన్ని, బలాన్ని కలిగిన పక్షిశ్రేష్ఠుడివి. నీకు దాస్యం పోగొట్టుకోవాలనే కోరిక ఉంటే భుజబలం, సామర్థ్యం తెలిసేలా మాకు అమృతాన్ని తెచ్చిఇయ్యి". అప్పుడు గరుత్మంతుడు సంతోషంతో...

SCERT ANDHRA PR

www.apteachers.in

8. "అలాగే చేస్తాను. స్వర్గంనుంచి అమృతం తెచ్చి మీకు ఇచ్చి, నేనూ మా తల్లి వినతా దాస్యంనుంచి విముక్తి పొందుతాం," అని పలికి, ఆ విషయమంతా తల్లికి చెప్పి "అమృతం తేవటానికి వెళ్తున్నా,"నని పలికి నమస్కరించి తల్లి ఆశీస్సులుపొంది, వెళ్లటానికి సిద్ధమై......

9. పక్షిరాజు మనోవేగంతో బయలుదేరాడు. అప్పుడతడు ఉల్కలాగ ప్రకాశిస్తున్నాడు. ఆకాశంలో కదులుతూ ఉన్నప్పుడు అతని రెక్కల గాలివల్ల మేఘాలు దూదిపింజలై చెదిరిపోతున్నాయి. అమృతాన్ని రక్షిస్తున్నవారు భయపడేటట్లుగా గరుత్మంతుడు మనోవేగంతో అమృతమున్నచోటుకు వెళ్ళాడు.

10. అప్పుడు.

11. అమృతాన్ని రక్షిస్తున్న భయంకరమైన రెండుసర్పాలను గరుత్మంతుడు చూశాడు. అవి ఆ సమీపానికి ఎవరినీ రానీయడం లేదు. వాటిముఖాలు కోపాన్ని వెలిగక్కుతున్నాయి. చూపులు విషమనేఅగ్నిని చిమ్ముతున్నాయి.

12. గరుడుడు తనరెక్కలవల్ల రేగిన దుమ్ముతో వాటికళ్ళు కనబడకుండా చేశాడు. వాటి తలలను తొక్కి పట్టాడు. అమృతాన్ని తీసుకొని ఆకాశానికి ఎగిరాడు. కద్రువ కుమారుల దగ్గరకు వచ్చాడు. మరకతమణులలాగా పచ్చగా ఉన్న దర్భల పరుపుపై అమృతం ఉన్న పాత్రను పెట్టాడు. దాన్ని పాములకు చూపించి, ఇట్లా పలికాడు :

13. "దేవేంద్రుడి రక్షణలో ఉన్న అమృతాన్ని తెచ్చి మీకు ఇచ్చాను. దీనికి సూర్యుడు, గాలి, అగ్ని, చంద్రుడు సాక్షులు – దీనితో నా తల్లి దాస్యం తొలగిపోయింది" అన్నాడు.

SCERT ANDHRA PRADESH

ఇవి చేయండి

I. వినడం – మాట్లాడటం

1. తల్లిదండ్రులు కష్టాల్లో ఉన్నప్పుడు పిల్లలు ఏం చేయాలి? ఎందుకు?
2. నేటికాలంలో తల్లిదండ్రులపట్ల పిల్లలవైఖరి ఎలా ఉంది? దీనికి కారణాలు ఏమిటి?
3. పాఠంలో ఏయే పద్యాలు మీకు నచ్చాయి? ఎందువల్ల?

II. చదవడం, అవగాహన చేసుకోడం

1. అమృతం తేవడానికి వెళుతున్న గరుత్మంతుణ్ణి వర్ణించిన పద్యం ఏది? ఆ పద్యాన్ని, దాని భావాన్ని రాయండి.
2. 1, 9 పద్యాలకు ప్రతిపదార్థాలు రాయండి. ప్రతి పదార్థం అంటే పద్యంలోని ప్రతి ఒక్క పదానికీ అర్థం రాయడం. ప్రతిపదార్థం రాయడంలో అన్వయక్రమం సాధించేందుకు పదాలవరస మార్చిరాయడం, పదాలమధ్య సంబంధంకోసం అక్కడక్కడా ప్రత్యయాలుచేర్చడం జరుగుతుంది.

www.apteachers.in

ఉదా॥ చ. 'అమితపరాక్రమంబును, రయంబును, లావును గల్గు ఖేచరో
త్తముఁడవు నీవు; నీదయిన దాస్యము వాపికొనంగ నీకుఁ జి
త్తము గలదేని, భూరిభుజదర్పము శక్తియు నేర్పడంగ మా
కమృతముఁ దెచ్చియి' మ్మనిన నవ్విహగేంద్రుఁడు సంతసంబునన్

ప్రతిపదార్థం

నీవు	=	గరుత్మంతుడివైన నీవు
అమిత	=	అధికమైన
పరాక్రమంబును	=	శౌర్యమూ
రయంబును	=	వేగమూ,
లావును	=	బలమూ
కల్గు	=	ఉన్న
ఖేచర+ఉత్తముడవు	=	పక్షి శ్రేష్ఠుడివి;
నీది+అయిన	=	నీ (యొక్క)
దాస్యము	=	బానిసత్వాన్ని
పాపికొనంగ	=	పోగొట్టుకునేందుకు
నీకున్	=	నీకు
చిత్తము	=	ఇష్టము (కోరిక)
కలదు+ఏని	=	ఉన్నట్లైతే
మాకున్	=	ఉరగులమైన మాకు
భూరి	=	గొప్పదైన
భుజదర్పము	=	భుజగర్వము
శక్తియున్	=	బలము
ఏర్పడంగ	=	ప్రకటితమయ్యేటట్లు
అమృతమున్	=	అమృతాన్ని
తెచ్చి+ఇమ్ము	=	తెచ్చి ఇయ్యి
అనినన్	=	అని పలుకగా,
ఆ+విహగ+ఇంద్రుడు	=	పక్షిశ్రేష్ఠుడైన ఆ గరుత్మంతుడు
సంతసంబునన్	=	సంతోషంతో (ఇలా అన్నాడు......)

3. పాఠంలోని కింది పద్య పాదాలకు సమానార్థక వాక్యాంశాలను గుర్తించండి.

i. అనిమిషనాథ సుగుప్తమయిన యమృతము ( )

(అ) అనిమిషనాథునికి ఇష్టమైన అమృతం (ఆ) ఇంద్రుడు దాచిపెట్టిన అమృతం

(ఇ) ఇంద్రునికి అయిష్టమైన అమృతం (ఈ) ఇంద్రుడు దాచి కాపాడుతూ ఉంచిన అమృతం

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

ii. ఆయత పక్షతుండ ( )

(అ) ఆయన పక్షి శ్రేష్ఠుడు (ఆ) ఆయన పక్షపాతి

(ఇ) పెద్ద రెక్కలున్నవాణ్ణి (ఈ) పెద్ద పక్షిని నేను

iii. నీయట్టి సత్పుత్త్రుం బడసియు దాసినై యుండుదాననే? ( )

(అ) నీవంటి ఉత్తమకుమారుణ్ణి పొంది కూడా దాసిగానే ఉండనా?

(ఆ) నీవంటి ఉత్తమకుమారుణ్ణి పొందాను కనుక ఇక దాసిగా ఉంటాను.

(ఇ) నీవంటి గొప్పకుమారుణ్ణి పొంది కూడా దాసిగానే ఉన్నాను.

(ఈ) నీవంటి గొప్పకుమారుణ్ణి పొందినా దాసిగానే ఉంటాను.

4 కింది మాటలు ఎవరు ఎవరితో అన్నారో ఏ సందర్భంలో అన్నారో రాయండి.

(అ) మా యీ దాస్యము వాయు నుపాయము సేయుండు

(ఆ) నీ కతమున నా దాస్యము ప్రాకటముగఁ బాయునని

(ఇ) నీదయిన దాస్యము వాపికొనంగ నీకు ఁజిత్తము గల్గేని

(ఈ) దినకరపవనాగ్ని తుహినదీప్తుల కరిగాన్

SCERT ANDHRA PRADESH

5 కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా జవాబులు రాయండి.

(అ) గరుడుడు తల్లిని ఏమని ప్రశ్నించాడు?

(ఆ) కద్రువ కుమారులను గరుడుడు ఏమడిగాడు? దానికి వాళ్ళేమన్నారు?

(ఇ) అమృతాన్ని ఎవరు, ఎలా రక్షిస్తున్నారు?

(ఈ) అమృతం తెచ్చిన గరుడుడు కద్రువ కుమారులతో ఏమని చెప్పాడు?

III. స్వీయరచన

1 కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

(అ) ఎంతో కష్టమైనప్పటికీ, దాస్యవిముక్తికోసం గరుడుడు అమృతం తెచ్చాడు కదా! అయితే దాస్యవిముక్తికి లేదా స్వేచ్ఛకు ఉన్న గొప్పతనం ఏమిటో వివరించండి.

(ఆ) వినత తన విముక్తికోసం కొడుకు మీద ఆశపెట్టుకుంది కదా! నేటికాలంలో తల్లిదండ్రులు తమ పిల్లల వల్ల ఏమి ఆశిస్తున్నారు?

(ఇ) మీరు మీ తల్లిదండ్రులకు ఏ విధంగా సహాయపడుతున్నారు? ఇంకా వాళ్ళకు ఏ విధంగా సహకారం అందించాలని అనుకుంటున్నారు?

(ఈ) యోగ్యులైన పిల్లలవల్ల తల్లిదండ్రులకు కలిగే ప్రయోజనాలు ఏమిటి?

www.apteachers.in

2 కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

(అ) "సమర్థులైన కొడుకులు తల్లిదండ్రుల కష్టాలు తొలగిస్తారు" – ఈ వాక్యాన్ని సమర్థిస్తూ సొంతమాటలలో రాయండి.

(ఆ) ఈ పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

IV. పదజాలం – వినియోగం

1 కింది పేరా చదవండి. పేరాలో గీత గీసిన పదాలకు ఒక్కొక్క దానికి మూడు సమానార్థక పదాలు పేరా కింద ఉన్నాయి. వాటిలోనుంచి సరైన పదాలను ఎంపిక చేసి రాయండి.

నభమున దట్టమైన వారిదములు విస్తరించాయి. ఉరుములు మెరుపులతోపాటు కులిశములు రాలాయి. దీనితో విపినంలో ఉండే వృక్షాలు కూలిపోయాయి. పన్నగాలన్నీ పుట్టలలోకి దూరాయి. మబ్బులు వీడగానే పతంగుడు మళ్ళీ దర్శనమిచ్చాడు.

(ఆకాశం, పాము, పిడుగు, మేఘం, సూర్యుడు, అడవి, అరణ్యం, రవి, మబ్బు, అశని, ఫణి, గగనం, వనం, సర్పము, నిర్ఘాతము, అభ్రము, భానుడు, అంబరం.)

2 కింది పదాలకు అర్థాలు రాయండి, సొంత వాక్యాల్లో ఉపయోగించండి.

అమితం, పరాక్రమం, దాస్యం, సత్పుత్రుడు, ప్రసిద్ధి, విముక్తి

SCERT ANDHRA PRADESH

V. సృజనాత్మకత

పాఠం ఆధారంగా గరుడునికీ, కద్రువ కుమారులకూ మధ్య జరిగిన చర్చను సంభాషణరూపంలో రాయండి.

VI. ప్రశంస

పొరుగూరిలో మీకు మంచి స్నేహితుడున్నాడు. ఆ మిత్రుడు అనారోగ్యంతో ఉన్న తండ్రికి సేవలుచేస్తూ తల్లిదండ్రుల అభిమానం పొందాడని తెలుసుకున్నారు. అతణ్ణి ప్రశంసిస్తూ లేఖ రాయండి.

VII. భాషను గురించి తెలుసుకుందాం

1. సమాపక, అసమాపక క్రియలు

(అ) కింది క్రియాపదాలను చదవండి.

తిని, చూసి, వండి, విని చూస్తే, చేస్తూ, వింటే, ఆడుతూ

పై క్రియలలో పని పూర్తికాలేదని తెలుస్తుంది. ఇలా పని పూర్తికాని క్రియలను అసమాపక క్రియలని అంటారు. అట్లాగే, **తిన్నాడు, చదివాడు, చూశాడు, వండింది, విన్నది, చేస్తాడు** మొదలయిన క్రియాపదాల వల్ల పని పూర్తి అయినట్లు తెలుస్తుంది. ఇలా పని పూర్తిఅయినట్లు తెలిపే క్రియలను సమాపక క్రియలు అంటారు.

www.apteachers.in

(ఆ) కింది వాక్యాలు చదవండి. సమాపక, అసమాపక క్రియాపదాల కింద గీత గీయండి.

- రాజు అన్నం తిని బడికి వెళ్ళాడు.
- గీత వంట చేసి అందరికీ వడ్డించి తాను తిని నిద్రపోయింది.
- రజని నిద్ర లేచి స్నానంచేసి పూజచేసి అన్నం తిని బడికి వచ్చింది.

2. సామాన్య వాక్యాలు

(అ) రాజు అన్నం తిన్నాడు.

(ఆ) గోపి పరీక్ష రాశాడు.

(ఇ) గీత బడికి వెళ్ళింది.

పై వాక్యాలు గమనించండి. ఆ వాక్యాల్లోని తిన్నాడు, రాశాడు, వెళ్ళింది అనే క్రియలు సమాపక క్రియలు. ప్రతి వాక్యంలో ఒకే ఒక సమాపక క్రియ ఉంది. అలా ఒకే ఒక సమాపకక్రియ ఉంటే ఆ వాక్యాలను సామాన్యవాక్యాలు అని అంటారు. కొన్ని సామాన్య వాక్యాలు క్రియ లేకుండా కూడా ఉంటాయి.

ఉదా: ఢిల్లీ దేశ రాజధాని.

3. సంశ్లిష్ట వాక్యాలు

గీత బజారుకు వెళ్ళింది. గీత కూరగాయలు కొన్నది.

పై వాక్యాలలో గీత నామవాచకం. గీత మొదటి వాక్యంలో ఉన్నందువల్ల రెండో వాక్యంలో పునరుక్తమైన నామవాచకం తొలగించి, మొదటి వాక్యంలోని క్రియ 'వెళ్ళింది'ని 'వెళ్ళి' అనే అసమాపక క్రియగా మార్చి రాస్తే **సంశ్లిష్టవాక్యం** ఏర్పడుతుంది.

గీత బజారుకు వెళ్ళి, కూరగాయలు కొన్నది.

3 కింది సామాన్య వాక్యాల్ని సంశ్లిష్ట వాక్యాలుగా మార్చి రాయండి.

(అ) విమల వంట చేస్తుంది. విమల పాటలు వింటుంది.

(ఆ) అమ్మ నిద్రలేచింది. అమ్మ ముఖం కడుక్కుంది.

(ఇ) రవి ఊరికి వెళ్ళాడు. రవి మామిడిపండ్లు తెచ్చాడు.

H4VP18

3 కింది సంశ్లిష్ట వాక్యాల్ని, సామాన్య వాక్యాలుగా మార్చి రాయండి.

(అ) తాత భారతం చదివి నిద్రపోయాడు.

(ఆ) చెట్లు పూతపూసి కాయలు కాస్తాయి.

(ఇ) రాము నడుచుకుంటూ వెళ్ళి తన ఊరు చేరాడు.

4. కింది పదాలను విడదీసి సంధుల పేర్లను రాయండి.

(అ) ఔరౌర = ________ + ________ (   )

(ఆ) దధ్యోదనము = ________ + ________ (   )

(ఇ) ప్రథమైక = ________ + ________ (   )

(ఈ) చిట్టచివర = ________ + ________ (   )

(ఉ) అత్యుగ్రము = ________ + ________ (   )

SCERT ANDHRA PRADESH

2 కింది పదాలను కలిపి సంధుల పేర్లను రాయండి. సంధి సూత్రాలు తెలపండి.

(అ) మొదట	+	మొదట	=	______	( )
(ఆ) దేవ	+	ఐశ్వర్యం	=	______	( )
(ఇ) దేశ	+	ఔన్నత్యం	=	______	( )
(ఈ) కడ	+	కడ	=	______	( )
(ఉ) అతి	+	ఉగ్ర	=	______	( )

3 ఆమ్రేడిత సంధి

ఏడో తరగతిలో ఆమ్రేడితసంధిని గురించి కొంత తెలుసుకున్నాం గదా! ఆమ్రేడిత సంధికి సంబంధించిన మరో సూత్రాన్ని తెలుసుకుందాం.

ఔర + ఔర = ఔరౌర

ఆహా + ఆహా = ఆహాహా

అచ్చుకు ఆమ్రేడితం పరమైతే తరచుగా సంధి అవుతుంది. అయితే

1. పగలు + పగలు = పట్టపగలు
2. చివర + చివర = చిట్టచివర
3. కడ + కడ = కట్టకడ

పై పదాలు పరిశీలిస్తే ఇవీ ఆమ్రేడితమున్న రూపాలే. కానీ పై సూత్రం ఇక్కడ వర్తించడం లేదు.

పగలు + పగలు = పట్టపగలు అవుతోంది అంటే 'ప' తర్వాత ఉన్న 'గలు' అన్న అక్షరాలకు బదులుగా 'ట్ట' వచ్చింది. 'ట్ట' వచ్చి పట్టపగలు అయింది.

చివర + చివర అన్నప్పుడు 'చి' తర్వాత రెండక్షరాల మీద 'ట్ట' వచ్చి చిట్టచివర అయింది.

కడ + కడ అన్నప్పుడు 'డ' స్థానంలో 'ట్ట' వచ్చి కట్టకడ అయింది.

SCERT ANDHRA PRADESH

ఇప్పుడు కింది వాటిని కలిపి రాయండి.

ఎదురు + ఎదురు = ______

కొన + కొన = ______

మొదట + మొదట = ______

ఆమ్రేడితం పరంగా ఉంటే 'కడ' మొదలైన శబ్దాల మొదటి అచ్చు మీద అన్ని అక్షరాలకు 'ట్ట' వస్తుండడం గమనించాం కదా! అలానే మరిన్ని ఉదాహరణలను గమనించండి.

బయలు + బయలు = బట్టబయలు – మొదటి 'యలు' స్థానంలో 'ట్ట' వచ్చి, బట్టబయలు

తుద + తుద – తుట్టతుద – మొదటి 'ద' స్థానంతో 'ట్ట' వచ్చి, తుట్టతుద

నడుమ + నడుమ – నట్టనడుమ – మొదటి 'డుమ' స్థానంలో 'ట్ట' వచ్చి, నట్టనడుమలుగా మారాయి.

పై ఉదాహరణల ఆధారంగా సూత్రం తయారు చేద్దాం.

www.apteachers.in

'ఆమ్రేడితం పరంగాఉంటే కడాదుల తొలి అచ్చుమీది అన్ని అక్షరాలకు అదంతమైన ద్విరుక్తటకారం వస్తుంది.'

* కింది పదాలను కలిపి రాయండి. ఏం మార్పు జరిగిందో రాయండి.

పిడుగు + పిడుగు = ______________

బయలు + బయలు = ______________

చదవండి – ఆనందించండి.

దేశభాషలందు తెలుగు లెస్స

జనని సంస్కృతంబు సకల భాషలకును
దేశభాషలందు తెలుగు లెస్స
జగతి తల్లికంటె సౌభాగ్యసంపద
మెచ్చు టాడుబిడ్డ మేలుగాదె?

– శ్రీనాథుడు
('క్రీడాభిరామము'లోది)

తెలుఁగ దదేల యన్న, దేశంబు దెలుఁగ, గేను
దెలుఁగు వల్లభుండఁ, దెలుఁగొకండ,
యెల్ల నృపులు గొలువ నెఱుఁగవే బాసాడి
దేశభాషలందుఁ దెలుఁగు లెస్స

– శ్రీకృష్ణదేవరాయలు
('ఆముక్తమాల్యద'లోది)

ప్రాజెక్టు పని

"కష్టపెట్టబోకు కన్నతల్లి మనసు, నష్టపెట్టబోకు నాన్నపనులు" వంటి పద్యాలు "అమ్మను మించిన దైవం లేదు" వంటి సూక్తులు కొన్నింటిని సేకరించి తరగతిలో ప్రదర్శించండి.

పునరభ్యసనం (వెనుకబడిన విద్యార్థుల కొరకు)

1. పాఠ్యాంశాలలోని పదాల జాబితాను ఉపాధ్యాయుడు తయారుచేసి చదివించాలి.
2. విద్యార్థులచే ఉక్తలేఖనం రాయించాలి. దోషాలు సవరించాలి.
3. పాఠ్యాంశ సారాంశాన్ని 4 లేదా 5 వాక్యాలలో నల్లబల్లపై రాసి విద్యార్థులచే చదివించాలి, రాయించాలి, దోషాలు సవరించాలి.

H55K2V

నేనివి చేయగలనా ?

1.	తల్లిదండ్రుల పట్ల పిల్లలవైఖరి ఎలా ఉండాలో చెప్పగలను.	ఔను / కాదు
2.	పద్యాలను భావయుక్తంగా చదవగలను. ప్రతిపదార్థం రాయగలను.	ఔను / కాదు
2.	పాఠ్య సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలను.	ఔను / కాదు
3.	పాఠంలోని పాత్రలతో సంభాషణలు రాయగలను.	ఔను / కాదు

తెలివైనవాళ్ళు మొదట చేసే పనిని తెలివితక్కువవాళ్ళు చివరిలో చేస్తారు.

2. ఇల్లు-ఆనందాల హరివిల్లు

ఆలోచించండి - చెప్పండి

ప్రశ్నలు

1. మొదటిచిత్రంలో ఎవరెవరున్నారు?
   ఏం జరుగుతున్నది? ఏం మాట్లాడుతున్నారు?
2. రెండవచిత్రంలో ఎవరెవరున్నారు?
   ఏం జరుగుతున్నది? ఏం మాట్లాడుతున్నారు?
3. మీ కుటుంబంలో ఎవరెవరు ఉంటారు?
4. మీ ఇంటి వాతావరణం ఎలాఉంటుంది?

ఉద్దేశం

భారతదేశంలోని కుటుంబవ్యవస్థ పట్ల అంతర్జాతీయ సమాజం అనేక ప్రశంసలను కురిపించింది. ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన మన కుటుంబవ్యవస్థ గొప్పతన్నాన్ని తలచుకుంటూ, దాన్ని కాపాడుకోవాలని తెలపడమే ఈ పాఠ్యభాగ ఉద్దేశం.

విద్యార్థులకు సూచనలు

1. పాఠం చిత్రం ఆధారంగా పాఠంలోని విషయాన్ని ఊహించండి. చెప్పండి.
2. పాఠం చదవండి. పదపట్టిక చూసి పదాలకు అర్థాలు తెలుసుకోండి.
3. సందర్భానికి తగిన అర్థాన్ని గ్రహించి చిత్రాలు ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
4. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

www.apteachers.in

పక్షి ఆకాశమంతా విహరించి వచ్చినా తిరిగి చేరుకునేది తన గూటికే. మనిషికూడా ప్రపంచంలోని అద్భుతమైన ప్రదేశాలెన్నింటికి వెళ్ళి చివరకు చేరుకునేది తన ఇంటికే. అందుకే మనిషి జీవితంలో ఇంటికి చాలా ప్రాధాన్యం ఉంది!

ఇల్లంటే ఇటుకలు, ఇసుక, సిమెంటు, రాళ్ళతో కట్టిన నాలుగు గోడల నిర్మాణమో, ఓ పూరిగుడిసో, ఓ బంగళాయో, భవనమో కాదు. ఇల్లంటే మన భావోద్వేగాలన్నింటినీ పంచుకునే అనుబంధాల వేదిక.

ఇల్లంటే .... అమ్మ,

ఇల్లంటే .... నాన్న,

అక్కా చెల్లెళ్ళు, అన్నా తమ్ముళ్ళు తాతయ్య, నాన్నమ్మ, ... ఇదే కుటుంబం.

ఇది సుఖసంతోషాల వాకిలి. ఆనందాల లోగిలి. ప్రేమానురాగాల పల్లకి. తల్లిదండ్రులూ పిల్లలూ కలిసి ఉండే ఒక అందమైన ఆత్మీయ బంధం.

సామాజిక, మానసిక శాస్త్రవేత్తల అభిప్రాయంలో "ఒకే గొడుగునీడలో ఉంటూ, మానసిక, ఆర్థిక సహాయ సహకారాలందుకుంటూ, సహజ ఆమోదయోగ్యమైన సంబంధాలున్న స్త్రీపురుషులూ వారి పిల్లలూ ఉన్న సమూహమే కుటుంబం".

RADESH

కాలాలు మారినా, ఏళ్ళు గడిచినా భారతదేశంలో ఇప్పటికీ కుటుంబవ్యవస్థ నిలిచి ఉంది. విశ్వసనీయత, సమగ్రత, ఏకత అనే మూడు మూలస్తంభాల మీద మన కుటుంబవ్యవస్థ ఆధారపడి ఉంది. "అందరి సుఖంలో నా సుఖం ఉంది. వారికోసమే నా జీవితం" అనే త్యాగభావన భారతీయ కుటుంబానికి ప్రాతిపదిక.



సమాజంలో కుటుంబమే అత్యంత కీలకమైంది. ప్రప్రథమ సమూహం కుటుంబమే. వ్యక్తి సమాజంలో ఒంటరిగా మనజాలడు. కుటుంబంతో తాను మమైకమై జీవించడం ద్వారా ఆనందాన్ని పొందుతాడు. అందుకే పుట్టుకతోనే మనిషికి కుటుంబంతో విడదీయలేని అనుబంధం ఏర్పడుతుంది.

పోషణ, భద్రత కల్పించడం కుటుంబవ్యవస్థలో మౌలికాంశాలు. కుటుంబ వ్యవస్థకు పునరుత్పత్తి ప్రాథమిక లక్షణం. కుటుంబంలో అనుభవాలు, అనుభూతులు కాలానుగుణంగా మారుతూంటాయి. పిల్లలకు సమాజంలో ఒక స్థానాన్ని కల్పించడం, విచక్షణ జ్ఞానాన్నివ్వడం, సంస్కృతిని వారసత్వంగా అందించడం కుటుంబ వ్యవస్థ ప్రధాన ఉద్దేశాల్లో ఒకటి.

కుటుంబ భావన, వ్యవస్థ నిన్నమొన్నటిది గాదు. దీనికి వేలసంవత్సరాల చరిత్ర ఉంది. ఇది వివాహబంధంతోనే మొదలవుతుంది. నాగరికతా సౌరభం లేని ఆదిమ మానవుడు పెళ్ళి, ఇల్లు అనే సంబంధం లేకుండా ఇష్టం వచ్చినట్టు జీవించాడు. కొంత నాగరికత అలవడిన తరవాత సమూహాలను ఏర్పరుచుకొని జీవించడం ప్రారంభించాడు. వ్యవసాయంచేసి

www.apteachers.in

పంటలు పండించడం మొదలుపెట్టాక గుహలనుంచి గృహంలోకి మారిపోయాడు. అదే ఒక పెద్దమలుపు. తాను నిర్మించుకున్న ఇంటిపై, కుటుంబంపై ఎనలేని మక్కువను పెంచుకున్నాడు. వివాహబంధాన్ని వివేచనతో ఏర్పరుచుకొని అందమైన కుటుంబాన్ని రూపొందించుకున్నాడు.

వేదకాలంనాటికే నాగరికమైన పద్ధతుల్లో ఈ కుటుంబవ్యవస్థ ఏర్పడిందని కొందరు చరిత్రకారుల భావన. వారి రాతల వల్ల కుటుంబ జీవనవిధానం ఆ కాలంలో అత్యున్నత స్థాయిలో ఉండేదనీ, భార్యాభర్తల సంబంధ బాంధవ్యాలు ఉన్నతశ్రేణిలో ఉండేవనీ తెలుస్తూంది. వేల ఏండ్ల నుంచీ విలువలకు కట్టుబడి జీవిస్తూ విశ్వానికి ఆదర్శంగా నిలిచిన కుటుంబ వ్యవస్థ మనది. ఆనాడు కుటుంబ జీవనం చాలా వరకు సాఫీగా సుఖంగా సాగిపోయిందనీ, అది చాలా నియమబద్ధంగా ఉండేదని తెలుస్తూంది.

కుటుంబంలో తల్లి పాత్ర అత్యంత కీలకమైంది, గౌరవ ప్రదమైంది. అందుకే ఒకప్పుడు మాతృస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. 'ఇంటికి దీపం ఇల్లాలు' అనే నానుడిని బట్టి భారతీయ సంస్కృతిలో స్త్రీకి ఎంతటి ఉన్నతస్థానం ఇచ్చారో అర్థమవుతుంది.

అంతేగాక ఆనాటి సమాజంలో ఉన్న నాలుగు ఆశ్రమాల్లోనూ గృహస్థాశ్రమానికి అత్యంత ప్రాధాన్యం ఉండేది. గృహస్థాశ్రమ ధర్మం ద్వారా ఇతర ఆశ్రమ ధర్మాలు సక్రమంగా కొనసాగుతాయి. అందుకే గార్హస్థ్య జీవితం అతి సుందరమని వారి భావన. పూర్వకాలం నుండీ ఉన్న కుటుంబవ్యవస్థ ప్రధానంగా ఉమ్మడికుటుంబ వ్యవస్థ. ఈ వ్యవస్థ నేటికీ దక్షిణ భారతదేశం కంటే ఉత్తరభారతదేశంలో ఎక్కువగా కొనసాగుతూంది.

ఉమ్మడికుటుంబంలో కష్టసుఖాల్ని అందరితోనూ పంచుకోడం జరిగేది. తద్వారా పరస్పరం ఓదార్పు లభించేది.



ఆశ్రమాలు : 1. బ్రహ్మచర్యం, 2. గృహస్థాశ్రమం, 3. వానప్రస్థాశ్రమం, 4. సన్న్యాసాశ్రమం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచేత ఉచిత పంపిణీ

www.apteachers.in

ప్రతిపనిలోనూ సహాయసహకారాలూ, సూచనలూ, సలహాలు లభించేవి. అందరూ శుభాశుభాలకు చేదోడువాదోడుగా నిల్చేవారు. ఆనందాన్ని పంచుకొనేవారు. ఇలా వాతావరణం ఆహ్లాదకరంగా, సందడిగా ఉండేది.

చిన్నపిల్లలకైతే మహాసరదాగా ఉండేది. అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యల ఒడిలో ఒదిగిపోయేవాళ్ళు. పెద్దల ఆలనపాలనల్లో, వాళ్ళు చెప్పే కమ్మని కబుర్లతో, కథలతో ఆరోగ్యంగా పెరిగేవారు. అంతేగాక వాళ్ళ కుటుంబాల గొప్పతనాన్ని, గొప్పవాళ్ళను గురించి తెలుసుకొనేవారు. దేవాలయాలకు వెళ్ళాలన్నా, అంగట్లోకి వెళ్ళాలన్నా మరెక్కడికి వెళ్ళాలన్నా పిల్లలు పెద్దలతో వెళ్ళటానికే ఉత్సాహపడేవారు. ఇంట్లో అందరికీ పెద్దలపట్ల భయభక్తులుండేవి. తల్లిదండ్రుల సేవ భగవంతుని సేవగా భావించేవారు. ఈ విధమైన జీవనవిధానంవల్ల జీవితపథనిర్దేశం జరిగేది.

పిల్లలు స్వేచ్ఛగా వాళ్ళ స్నేహితుల ఇళ్ళకు వెళ్ళడం, అక్కడ పెద్దవారితోచనువుగా మాట్లాడడం వీళ్ళ ఆలోచనలకు పదును పెట్టేది. సమాజ స్థితిగతులనూ, ఆచారవ్యవహారాలనూ, సంస్కృతిసంప్రదాయాలనూ పిల్లలు ప్రత్యక్షంగా విని, చూసి ఆకళింపు చేసుకొనేవారు.

ఉమ్మడి కుటుంబాల్లో పిల్లలందరికీ ఒకేసారి భోజనాలు వడ్డించడం అనేది మహాసరదాగా ఉండేది. ఆడవాళ్ళకు అదో అవధానం చేసినంత పని అయేది.

ఆటపాటల్లోనూ, కొట్లాటల్లోనూ, అవసరాలను తీర్చుకోడంలోనూ ఒకరితో ఒకరు పోటీపడేవారు. కాని పెద్దల కనుసన్నలలో, భయ భక్తులతో క్రమశిక్షణలో ఉండేవారు. ఏం కావాలన్నా (పిప్పరమెంటో, బిస్కట్టో) ఏదైనా జరిగినా అమ్మమ్మ, నాన్నమ్మలను చేరేవారు. వాళ్ళు కూడా ప్రేమతో దగ్గరికి తీసుకునేవారు. 'అసలుకంటే వడ్డీ'యే ముద్దు కదా!

అలా 'కలిసి ఉంటే కలదు సుఖం' అనే సూత్రం ఆధారంగా సమష్టి కుటుంబం కుటుంబవ్యవస్థకు బలాన్ని చేకూర్చేది. కొందరి మనోభావాలు భిన్నంగా ఉన్నప్పటికీ మొత్తం కుటుంబానికి అక్కరకు వచ్చేదే అమలయ్యేది. స్వార్థపరతకు తావు తక్కువ. 'మన' అనే భావనకు అందరూ లోనై ఉండేవారు. రైతుకుటుంబాల్లో ఐతే ఇంటిల్లిపాదీ ఇంటి పనుల్లో, బయటి పనుల్లో పాలుపంచుకొనేవారు. శ్రామిక వర్గం అంతా దాదాపు అలానే ఉండేది. ఊరిలో ఏదన్నా పెళ్ళిలాంటి కార్యక్రమాలు జరిగితే అందరూ శ్రమను పంచుకొని ఆ కార్యక్రమం చేసేవారికి ఆనందం కలిగించేవారు. ఈ సంఘీభావమే దేశానికి వెన్నెముక

www.apteachers.in

అయింది. సిరిసంపదలను పోగు చేసింది. ప్రపంచంలోనే భారతదేశాన్ని ఉన్నతస్థానంలో నిలబెట్టింది ఆనాడు. మన ఇతిహాసాలైన రామాయణభారతాలు ఈ సమష్టి కుటుంబ వ్యవస్థను ప్రతిబింబిస్తాయి.

కాలం మారింది. కుటుంబం అనే మాటకు అర్థం, దాని నమూనా మారిపోయింది. ఉమ్మడి కుటుంబంలో వ్యక్తి స్వేచ్ఛకు ఆర్థిక స్వాతంత్ర్యానికీ, సమానత్వానికీ ప్రాధాన్యం లేకపోవడం, స్వార్థం పూర్తిగా పెరిగిపోవడం, వీటివల్ల ఉమ్మడి కుటుంబవ్యవస్థలో మార్పులు అనివార్యమయాయి. చిన్నకుటుంబభావన బలపడింది. సమష్టి వ్యవస్థ పూర్తిగా వ్యష్టి వ్యవస్థగా మారింది. తత్కారణంగా జీవన సరణిలో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఆధునికతవల్ల శ్రమవిభజనలో కొత్త మార్పులు వచ్చాయి. స్త్రీపురుష సంబంధాల్లో కొత్త ధోరణులు ఏర్పడ్డాయి. ఆర్థికస్వేచ్ఛ, సమానత్వం, వ్యక్తిస్వాతంత్ర్యం అనే మూడింటిపైనే 'వ్యష్టి' కుటుంబం ఆధారపడింది. ఈ వ్యష్టి కుటుంబంలో వ్యక్తిగత గౌరవం, సమాజంలో ప్రత్యేక గుర్తింపు, నిర్ణయాధికారం లభిస్తాయి. అయితే ఇలా వ్యక్తి ప్రాధాన్యం పెరిగి ఉమ్మడికుటుంబ వ్యవస్థ మరుగున పడిపోతుంది.



దీనివల్ల కుటుంబపరమైన వారసత్వ భావనలు అందుతున్నాయా? దేశీయ సాంస్కృతిక, జీవన సంప్రదాయాలూ నిలుస్తున్నాయా? మానవ సంబంధాలూ ఆప్యాయతానురాగాలు ఉంటున్నాయా? ఆర్థిక స్వావలంబనకోసం భార్యాభర్తలిద్దరూ సంపాదించాల్సిన అవసరం ఉన్నప్పటికీ జీవితానికి అదే గమ్యం, అదే లక్ష్యం అవుతున్నది. పిల్లలకు టీవీలు, కంప్యూటర్లే ఆటపాటలౌతున్నాయి. భాష పరిమితికి లోనవుతున్నది. భావం సంకుచితమౌతున్నది. అనుభూతులు లోపిస్తున్నాయి. తల్లిదండ్రులకు పిల్లల సంక్షేమమే తొలి ప్రాధాన్యం కావలసి ఉండగా, దానిపట్ల వాళ్ళు తగినంత శ్రద్ధ చూపడం లేదు. అది పిల్లల మనస్తత్వంమీద విపరీతమైన ప్రభావాన్ని చూపుతుంది. తల్లిదండ్రులు పిల్లలకు వారసత్వంగా ఆరోగ్యం, సంస్కారం, చదువు, విజ్ఞానం మంచితనం, పరోపకారగుణం అందించాలే తప్ప కేవలం డబ్బుకాదని గుర్తించాలి. పిల్లల సమస్త సద్గుణాలకూ, దుర్గుణాలకూ 'ఇల్లే' పునాది కానీ ఆ 'ఇల్లే' కనుమరుగవుతోంది.

పిల్లలు కేర్ టేకింగ్ సెంటర్లలో .....
భార్యాభర్తలు ఉద్యోగాలలో ......
పెద్దవాళ్ళు వృద్ధాశ్రమాల్లో .....

H5EG4I

www.apteachers.in



ఆ మానవ సంబంధాలు ఏవి? అనురాగాలు ఏవి ? వారసత్వ అనుభూతులు ఎక్కడ? కుటుంబ నేపథ్యం, గొప్పతనం తెలిసే అవకాశం ఏది?

ఆధునికీకరణ, నగరీకరణ, పాశ్చాత్యీకరణ, కంప్యూటరీకరణలు ఈ పరిస్థితికి కారణాలనీ కుటుంబవ్యవస్థపై ఇవి ఎనలేని ప్రభావాన్ని చూపుతున్నాయనీ సామాజిక శాస్త్రవేత్తలు అంటున్నారు. యంత్రశక్తి వినియోగం నానాటికీ పెరుగుతూంది. బట్టలు నేయడం, నూనెలు తీయడం మొన్నటిమాట. బట్టలుతకటానికి, నగల తయారీకి, నీళ్ళు తోడటానికి, పొలం దున్నటానికి, చెప్పులు కుట్టడానికి, చివరకు గిన్నెలు కడగటానికీ, కడిగిన చేతులు ఆరటానికి యంత్రశక్తినే వాడటం వల్ల మనిషి బద్ధకస్థుడౌతున్నాడు. చలాకీతనాన్ని కోల్పోతున్నాడు. అనేక రోగాలపాలౌతున్నాడు.

ఈ యాంత్రిక జీవన విధానంవల్ల కుటుంబంలోని అందాలు, ఆనందాలు హరించిపోతున్నాయి. వ్యష్టి కుటుంబంలోని లోపభూయిష్ఠమైన, స్వార్థంతో కూడిన జీవన విధానం వల్ల ఈ మార్పులు సంభవించాయి. కుటుంబసభ్యులు సుఖాల్నీ, సంతోషాల్నీ, కష్టాల్నీ, బాధల్నీ, పరస్పరం పంచుకోవాల్సి ఉండగా 'ఎవరికి వారే యమునా తీరే' అన్న విధంగా మెలగుతున్నారు. ఈ బలీయమైనకారణాలవల్లే పిల్లల్లో కొందరు అందరూ ఉండీ అనాథలుగా, మరికొందరు సమాజ వ్యతిరేకశక్తులుగా మారిపోతున్నారు. సమాజానికి పెనుసవాళ్ళను విసురుతున్నారు; అశాంతి, హింసలకు ప్రధాన కారకులవుతున్నారు. పిల్లలపై తల్లిదండ్రుల ప్రభావంతోపాటు, సమాజం, సమవయస్కులు, ప్రసారసాధనాల ప్రభావం కూడా ఉందనేది ఎవరూ కాదనలేని వాస్తవం. కాని ఇప్పటికీ మంచి కుటుంబనేపథ్యం నుంచి వచ్చిన పిల్లలు వీటన్నిటినీ అధిగమించి సమాజంలో నిలదొక్కుకుంటున్నారు.

ఇదిలా ఉండగా వృద్ధుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. వాళ్ళ ఆలనాపాలనా చూసే ఓపిక లేక, తమకు భారం అనే భావనతో వృద్ధాశ్రమాల్లో చేర్చి పిల్లలు బాధ్యతల్ని వదిలించుకుంటున్నారు. ఇది అందరూ ఆలోచించాల్సిన విషయం. కాబట్టి ఆర్థిక సంబంధాలూ, వ్యక్తిగత స్వార్థమూ, హక్కులూ వీటన్నిటికంటే మన బాధ్యతలూ మానవ సంబంధాలూ ముఖ్యమని, అవి మన మనుగడకు ఆధారభూతాలనీ తెలుసుకోవాలి.

అలాగని వ్యష్టికుటుంబంవల్ల ఇబ్బంది అని చెప్పలేం. వ్యష్టికుటుంబంలో ఉన్నప్పటికీ కుటుంబ భావనలు పిల్లలకు వివరించి చెప్పగలగాలి...... పెద్దల బలాన్ని పొందాలి, బలగాన్నీ పెంపొందించుకోవాలి. యాంత్రికత తగ్గాలి. మానవశక్తి, యుక్తి, నైపుణ్యాలు మన వారసత్వ సంపదను పెంచేలా ఉపయోగపడాలి. ఎవరి సంపాదన వారికి ఉండటం మంచిదే. అయినా సమస్యలను పరస్పరం ఆలోచించుకొని పరిష్కరించుకోవాలి. బాధ్యతలు పంచుకోవడంవల్ల యజమాని భారం తగ్గుతుంది. అంత మాత్రాన మానవసంబంధాలు విచ్ఛిన్నం కాగూడదు. యంత్రశక్తిమీదనే ఆధారపడి బద్ధకస్థుడు కాగూడదు. యంత్రశక్తి అంతా ఏదో రకంగా ప్రకృతిపై ఆధారపడే ఉన్నది. ప్రకృతి వనరులను వాడుకోడం మనకు ధర్మమే కాని వాటిని దోచుకోడం, నిరుపయోగం చేయడం మన లక్ష్యం కాగూడదు.

మనం చేసే పని ఏదైనా మన సంస్కృతిని, వారసత్వాన్ని, దేశ ఔన్నత్యాన్నీ ఇబ్బడిముబ్బడిగా పెంచి వారసులను ఉత్తేజితులను చేసే విధంగా ఉండాలి. అందుకు సమష్టి లేదా వ్యష్టి కుటుంబ వ్యవస్థలు దోహదం చేయాలి.

కుటుంబం అనే హరివిల్లులో అమ్మానాన్నలు, పిల్లలతోపాటు, తాతానాన్నమ్మలు, కూడా ఒక భాగమైతే అందం, ఆనందం వెల్లివిరుస్తుంది. 'ఇల్లే ఇలలో స్వర్గం' అవుతుంది.

సమాజానికి కుటుంబం వెన్నెముక. మంచికుటుంబం, మంచిసమాజం వీటినుంచి మంచిదేశం, మంచి ప్రపంచం ఏర్పడతాయి. ఇందుకు అందరూ కృషి చేయాలి.

SCERT ANDHRA PRADESH

www.apteachers.in



కుటుంబం అనే మాట మధురమయినది. కుటుంబం అన్న భావన తలపునకు రాగానే మనస్సులో ఏదో అనిర్వచనీయమైన హాయి కలుగుతుంది. తీపి జ్ఞాపకాలెన్నో గుర్తుకు వస్తాయి.

చిన్ననాటి నుంచి ఇంట్లో అందరితో గడిపిన మధుర క్షణాలు, జీవితంలో జరిగిన సంఘటనలు పెద్దయిన తరవాత సినిమాలా కళ్ళముందు మెదలాలి. ఈ మధురమైన అనుభూతిని పదికాలాల పాటు పదిలంగా ఉంచుకోవాలంటే చక్కని కుటుంబం కావాలి. గాంధీజీ, నెహ్రూ, ఠాగూర్, అబ్దుల్ కలాం లాంటి మహనీయులెందరికో వారి కుటుంబ నేపథ్యమే స్ఫూర్తి.

ఉమ్మడి కుటుంబం, వ్యష్టి కుటుంబాల మేలి కలయికతో సమానత్వం, ఆర్థిక స్వాతంత్ర్యం, వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలగకుండా; ఆధిపత్యాల పోరులేని, ప్రేమానురాగాలు, విలువలు, మానవ సంబంధాలు అంతస్సూత్రమైన ఒక మంచి కుటుంబ వ్యవస్థ రూపుదిద్దుకోవాలి. అప్పుడే సమాజం, దేశం, ప్రపంచం సుఖశాంతులతో విలసిల్లుతాయి.

ఇవి చేయండి

I. వినడం - మాట్లాడడం

1. కుటుంబం ఎలా ఉండాలి? మీ కుటుంబం గురించి చెప్పండి.
2. మీకు తెలిసిన సమష్టి కుటుంబాన్ని గురించి మాట్లాడండి.
3. కుటుంబంలో 'మన' అనే భావన లేకపోతే ఎలా ఉంటుంది?

II. చదవడం, అవగాహన చేసుకోవడం

1 కింది పదాలను పాఠంలో గుర్తించండి. ఆ వాక్యాలను చదవండి. వాటి గురించి చెప్పండి.

ఆశ్రమధర్మాలు, గృహస్థాశ్రమం, జీవితపథం, గార్హస్థ్య జీవితం, సమాజ స్థితిగతులు, సంఘీభావం, సమష్టి వ్యవస్థ, ఆర్థిక స్వాతంత్ర్యం, విశ్వసనీయత, సమగ్రత.

SCERT ANDHRA PRADESH

2 పాఠం చదివి సరైన సమాధానాలను గుర్తించండి.

1. ఇల్లు అంటే ఇలా ఉండాలి ( )
   (అ) అందమైన భవనం (ఆ) అంతస్తుల భవనం (ఇ) ప్రేమానురాగాల నిలయం (ఈ) ఇవేవీ లేనిది.
2. వేదకాలం అంటే ( )
   (అ) రామాయణ భారతాల తరవాతికాలం
   (ఆ) రామాయణ భారతాల మధ్యకాలం
   (ఇ) రామాయణ భారతాల ముందుకాలం
   (ఈ) కలియుగ కాలం
3. ఇంటికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంలో ఉండాల్సింది. ( )
   (అ) భార్యాభర్తలకు సమప్రాధాన్యం (ఆ) భార్యకే ఎక్కువ ప్రాధాన్యం
   (ఇ) భర్తకే ఎక్కువ ప్రాధాన్యం (ఈ) పిల్లలకే ఎక్కువ ప్రాధాన్యం

www.apteachers.in

4. సంస్కృతిసంప్రదాయాలు ఎలా అలవడతాయి? ( )

(అ) కుటుంబంద్వారా (ఆ) సమాజంద్వారా

(ఇ) పాఠశాలద్వారా (ఈ) వీటన్నిటిద్వారా

5. "అందరి సుఖంలో నా సుఖం ఉంది" దీనిలో ఏ భావన ఉంది? ( )

(అ) స్వార్థభావన (ఆ) నిస్స్వార్థభావన

(ఇ) విశాలభావన (ఈ) సంకుచితభావన

3 కింది ప్రశ్నలకు పాఠం చదివి జవాబులు రాయండి.

అ. కుటుంబమంటే ఏమిటి?

ఆ. భారతీయ సంస్కృతిలో స్త్రీకి ఉన్నతస్థానం ఇచ్చారు? ఎందుకు?

ఇ. వ్యష్టి కుటుంబం అంటే ఏమిటి? ఇవి ఎందుకు ఏర్పడుతున్నాయి?

ఈ. కుటుంబ వ్యవస్థకు మూలస్తంభాలేమిటి?

ఉ. తల్లిదండ్రులు పిల్లలకు వారసత్వంగా ఇవ్వాల్సిందేమిటి?

III. స్వీయరచన

1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

(అ) "దేశానికి కుటుంబవ్యవస్థ వెన్నెముక" అనడానికి కారణాలు రాయండి.

(ఆ) "అసలు కంటే వడ్డీయే ముద్దు" ఈ సామెతను పాఠం ఆధారంగా వివరించండి.

(ఇ) "కలిసి ఉంటే కలదు సుఖం" దీన్ని వివరించండి.

(ఈ) యాంత్రిక జీవనం అంటే ఏమిటి?

(ఉ) పిల్లలు సమాజంలో నిలదొక్కుకోవడానికి కుటుంబ నేపథ్యం ఎలా ఉపయోగపడుతుంది?

SCERT ANDHRA PRADESH

2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

(అ) సమష్టి కుటుంబానికీ, వ్యష్టి కుటుంబానికీ మధ్య వ్యత్యాసమేమిటి? దాని పరిణామాలెలా ఉన్నాయి?

(ఆ) కుటుంబవ్యవస్థ బాగా కొనసాగాలంటే మనమేం చేయాలి?

IV. పదజాలం

1. కింది పదాలకు సాధారణ అర్థాలు ఉంటాయి. కాని పాఠంలో ఏ అర్థంలో ఉపయోగించారో వివరించండి.

అ. పునాది ఆ. పెద్దమలుపు ఇ. అవధానం

ఈ. మరుగున పడిపోవడం ఉ. కనుమరుగవడం

2. కింది జంట పదాలనుపయోగించి సొంతవాక్యాలు రాయండి

అ. తల్లి-తండ్రి ఆ. ప్రేమ - అనురాగం ఇ. అమ్మమ్మ - నాన్నమ్మ

ఈ. అందం - ఆనందం ఉ. అవస్థ - వ్యవస్థ ఊ. హక్కులు - బాధ్యతలు

www.apteachers.in

3. కింది మాటలకు వ్యతిరేక అర్థానిచ్చే పదాలు గళ్ళల్లో ఉన్నాయి. వాటిని వెతికి, వాటినుపయోగించి వాక్యాలు రాయండి.

అ. సహాయత

ఆ. ఐక్యత

ఇ. సమానత్వం

ఈ. ఉత్సాహం

ఉ. ప్రాధాన్యం

గ	ల	గ	ల	ని	శ్రీ	అ
అ	నై	క్య	త	స్స	రా	స
రా	వి	చె	ట్టు	హా	ము	మా
ని	రు	త్సా	హం	య	డు	న
బా	వ	గా	రు	త	క	త్వం
న	అ	ప్రా	ధా	న్యం	చ	మి

V. సృజనాత్మకత

వేసవి సెలవుల్లో మీరు మీ స్నేహితుల ఇంటికి వెళ్ళారు. ఆ కుటుంబం మిమ్మల్ని ఎంతో ప్రేమగా చూసుకుంది. ఇంటికి తిరిగి వచ్చాక మీ స్నేహితులకు కృతజ్ఞతలు తెలుపుతూ లేఖ రాయండి.

లేదా

తాతయ్య, నాన్నమ్మ, అమ్మా నాన్నలు, పిల్లలూ అంతా కలిసిఉంటేనే కుటుంబం అంటారు. కాని నేటి కాలంలో ఎంతోమంది వృద్ధులను వృద్ధాశ్రమాల్లో చేరుస్తున్నారు. ఇది సరికాదని ప్రజలందరికీ తెలియజేయడానికి కరపత్రం తయారుచేయండి.

VI. ప్రశంస

మీరు చూసిన లేదా మీకు తెలిసిన ఒక మంచి కుటుంబాన్ని గురించి మీ భావనలను తెలుపుతూ మీ స్నేహితుడికి/ తాతయ్యకు ఉత్తరం రాయండి.

SCERT ANDHRA

VII. భాషాంశాలు

1. కింది సామాన్య వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా మార్చండి.

H5I3SF

ఉదా – శర్వాణి పాఠం చదివింది. శర్వాణి నిద్రపోయింది.

శర్వాణి పాఠం చదివి, నిద్రపోయింది.

(అ) మహతి ఆట ఆడింది. మహతి అన్నం తిన్నది.

(ఆ) శ్రీనిధి జడవేసుకుంది. శ్రీనిధి పూలు పెట్టుకుంది.

(ఇ) మాధవి పాఠం చదివింది. మాధవి పద్యం చెప్పింది.

(ఈ) శివాని కళాశాలకు వెళ్ళింది. శివాని పాటల పోటీలో పాల్గొన్నది.

(ఉ) నారాయణ అన్నం తింటాడు. నారాయణ నీళ్ళు తాగుతాడు.

(ఊ) సుమంత్ పోటీలకు వెళ్ళాడు. సుమంత్ మంచి అలవాట్ల గురించి ప్రసంగించాడు.

www.apteachers.in

2. కింది సంశ్లిష్ట వాక్యాలను సామాన్య వాక్యాలుగా రాయండి.

ఉదా – శరత్ ఇంటికి వచ్చి, అన్నం తిన్నాడు.

శరత్ ఇంటికి వచ్చాడు. శరత్ అన్నం తిన్నాడు.

(అ) కందుకూరి రచనలు చేసి సంఘ సంస్కరణ చేశాడు.

(ఆ) రంగడు అడవికి వెళ్ళి కట్టెలు తెచ్చాడు.

(ఇ) నీలిమ టి.వి. చూసి నిద్రపోయింది.

(ఈ) రజియా పాటపాడుతూ ఆడుకుంటున్నది.

W5NC66

3. సంయుక్త వాక్యం

కింది వాక్యాలను గమనించండి.

విమల తెలివైనది. విమల అందమైనది. – విమల తెలివైనది, అందమైనది.

"ఇలా రెండు సామాన్య వాక్యాలు కలిసి ఒకే వాక్యంగా ఏర్పడటాన్ని సంయుక్త వాక్యం" అంటారు.

4. సంయుక్త వాక్యంగా మారేటప్పుడు వాక్యాల్లో వచ్చే మార్పులను గమనించండి.

(అ) వనజ చురుకైనది. వనజ అందమైనది.

వనజ చురుకైనది, అందమైనది – రెండు నామపదాల్లో ఒకటి లోపించడం

(ఆ) అజిత అక్క, శైలజ చెల్లెలు.

అజిత, శైలజ అక్కాచెల్లెళ్ళు – రెండు నామపదాలు ఒకచోట చేరి చివర బహువచనం చేరింది.

(ఇ) ఆయన డాక్టరా? ఆయన ప్రొఫెసరా?

ఆయన డాక్టరా, ప్రొఫెసరా? – రెండు సర్వనామాలలో ఒకటి లోపించడం

మరికొన్ని సంయుక్త వాక్యాలను రాయండి.

ANDHRA PRADESH

ప్రాజెక్టు పని

ఈనాటి మానవసంబంధాల పై వార్తా పత్రికల్లో అనేక వార్తలు, కథనాలూ వస్తుంటాయి. వాటిని సేకరించి తరగతిలో వినిపించండి.

పునరభ్యసనం (వెనుకబడిన విద్యార్థుల కొరకు)

1. పాఠ్యాంశాలలోని పదాల జాబితాను ఉపాధ్యాయుడు తయారుచేసి చదివించాలి.
2. విద్యార్థులచే ఉక్తలేఖనం రాయించాలి. దోషాలు సవరించాలి.
3. పాఠ్యాంశ సారాంశాన్ని 4 లేదా 5 వాక్యాలలో నల్లబల్లపై రాసి విద్యార్థులచే చదివించాలి, రాయించాలి, దోషాలు సవరించాలి.

నేనివి చేయగలనా?

1. ఇంటికి ఉన్న ప్రాధాన్యాన్ని చెప్పగలను.	ఔను / కాదు.
2. పాఠం చదివి ముఖ్యమైన పదాల గురించి వివరించగలను.	ఔను / కాదు
3. సమష్టి, వ్యష్టి కుటుంబాల వ్యత్యాసాలు, ప్రయోజనాలు వివరించగలను.	ఔను / కాదు
4. కృతజ్ఞతలు తెలుపుతూ లేఖ రాయగలను. కరపత్రం రాయగలను.	ఔను / కాదు

www.apteachers.in

3. హద్దులు హద్దులు

(ఉపవాచకం) - నండూరు సుబ్బారావు

మరది : బావా బావా పన్నీరు, బావని పట్టుకు తన్నేరు.... వీధీ వీధీ తిప్పేరు, వీసెడు గంధం పూశేరూ... బావా బావా పన్నీరు!

మామగారు : ఒరే చిన్నాడా, ఏమిటా అల్లరి! అతను వచ్చినప్పటినుంచీ చూస్తున్నా. ఒకటే వికవికలు... ఒకటే పకపకలు. నవ్వు నాలుగువిధాల చేటు. అలా నవ్వకండి అంటే వినరేం? అదేమిటో అల్లుడిగారు కూడా ఒక కొత్తా లేదు, ఒక పాతా లేదు, ఏమిటేమిటో మాట్లాడతాడు.

అత్తగారు : ఎంత బావగారయినా కొంచెం హద్దుల్లో ఉండాలి నాయనా! అలా అతను సందర్భం లేకుండా మాట్లాడుతుంటే ప్రతివాళ్ళూ అతనికేమన్నా పిచ్చేమో అని అనుకుంటున్నారు. కొత్త అల్లుడు కదా! కొంచెం బెట్టుగా, ముక్తసరిగా వుండటం మంచిది కాదూ?

మామ : నేను నా పెళ్ళయిన కొత్తలో ఇలాగే వుండేవాడినా!

అత్త : సరే! మీ సంగతే చెప్పండి. ఫలహారం వద్దనేవారు. ఎవరితోనూ అసలు మాట్లాడేవారే కాదు. మిమ్మల్ని చూసి మా ఊళ్ళోవాళ్ళంతా "మరీ ఏమిటి ఈయనగారు ముంగిముశానమ్మల్లే ఉంటాడూ, మరీ అంత ముళ్ళముప్పితనం పనికిరాదు, దానికీ ఒక హద్దంటూ వుండాలి" అనేవారు.

మామ : అది సరేగాని, అల్లుడుగారొచ్చారు గదా అని ఫలహారాలు అంతచేటు చేయడం మంచిది కాదు. దానిక్కూడా ఒక హద్దంటూ పెడుదూ. హద్దుమీరి అన్నీ చేసిపెడితే అతని ఆరోగ్యం పాడవుతుంది. పొద్దున్నే ఇడ్లెన్లు, పదింటికి బొబ్బట్లూ, గారెలతో భోజనం, మధ్యలో కారప్పూసా, మధ్యాహ్నం మొక్కజొన్న పొత్తులూ, రాత్రి తాలింపు శనగలూ యేమిటా చిరుతిళ్ళు?

అల్లు : (బాధపడుతూ) అమ్మో... బాబో.... కడుపునొప్పి... మెలి తిప్పేస్తోంది. నాకొద్దు బాబో అంటే 'తిను తినూ' అంటూ కంచంలో గుమ్మరించారు. వేళాకోళానికని మరదలూ, బావమరదీ పట్టుపట్టి తినిపించారు. దేనికైనా ఒకహద్దుండాలి. నాయనోయ్, బాబోయ్ కడుపునొప్పి.

అత్త : యేమిటి నాయనా బాధపడుతున్నావు?

అల్లు : బాధేమిటి, యమబాధ! మీరు పెట్టిన గారెలూ, బూరెలూ, బొబ్బట్లూ, మొక్కజొన్న పొత్తులూ కడుపులో చేరి మీటింగు పెట్టుకుంటున్నాయి. ఎగిరెగిరి గంతులేస్తున్నాయి. నాయనోయ్.... బాధ!

మరది : బావా నీకు తంపట వేరుశనగకాయలు, తేగలు బాగా ఇష్టమటగా?

అల్లు : ఇప్పుడొద్దు బాబోయ్! తర్వాత చూద్దాం. ఇప్పుడేనా వేళాకోళాలు. దేనికయినా హద్దూ పద్దూ వుండాలి. అలా బలవంతాన తినిపించి కదూ నన్నీ స్థితికి తెచ్చారూ! బాబోయ్ నొప్పి.

అత్త : కొంచెం అల్లంరసం నూరివ్వనా నాయనా!

మరది : అల్లంరసం పట్టే సందేవుంటే బావగారు మరి రెండు బొబ్బట్లే లాగించేవారు. వారికి బొబ్బట్లు బాగా ఇష్టమట కూడాను.

అల్లు : ఒరే బావా నాకు కోపం వచ్చిందంటే తెలుసా! మొన్న మా వూళ్ళో ఒకడిని చితక కొట్టి – అమ్మో కడుపునొప్పి?

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

మరది : నీ కోపానికి కూడా కొంత హద్దంటూ ఉండాలి బావా! మరీ ఎవరిమీద పడితే వాళ్ళమీద, ఎప్పుడు పడితే అప్పుడు అంత కోపం పనికిరాదు.

అత్త : నీవుండరా అతగాడు బాధతో మెలికలు తిరిగిపోతుంటే మధ్యలో నీ గొడవ పనికిరాదు.

మరది : ఎంత కొత్తఅల్లుడయితే మాత్రం, పండక్కి వచ్చాడుగదా అని, అదేపనిగా పెట్టడమా? మీరు కాస్త తగ్గించి పెట్టకూడదా, అతను కాస్త తగ్గించి తినకూడదా?



అల్లు : ఇదే ఆఖరిపండగ. ఇక జన్మలో ఈ వూరు రాను. బాబోయ్ నే చచ్చిపోతున్నా!

అత్త : ఇదెక్కడి అఘాయిత్యమండీ? దిక్కుమాలిన దాన్ని నేనేనా దీనికంతా కారణం. ఏ డాక్టరునన్నా తీసుకురండి. అలా నిలబడి చూస్తారేం?

అల్లు : ఒకపక్క ప్రాణం పోతుంటే తీరిగ్గా ఆలోచిస్తూ కూర్చుంటారేం? ఆలోచనకు కూడా ఒక హద్దుండాలి.

మామ : సరేపదండి! అసలే పండక్కి అల్లుణ్ణి తీసుకొచ్చినందుకే బోలెడు ఖర్చు అయింది. అంతచేటు ఖర్చు పనికిరాదే. మన హద్దులో మనముంటే మంచిదే అంటే విన్నావా. ఇప్పుడీ ఆసుపత్రి ఖర్చు కూడానూ!

అత్త : మీ పిసినిగొట్టుతనం బంగారంగానూ! మరీ అంత లోభిత్వం పనికిరాదు. దానికీ ఒక హద్దుండాలి. అవసరం వచ్చినప్పుడు ఖర్చు చేయకపోతే ఎలా?

అల్లు : అమ్మో, నొప్పి, నే బతకను.

మామ : సరేపదండి, డాక్టరుగారి దగ్గరకుపోదాం. (డాక్టరుగారి ఆసుపత్రి)

డాక్టరు : ఏమిటండీ! ఆ గావుకేకలు హద్దూపద్దూ లేకుండా?

మామ : ఇంకా హద్దేమిటండీ? ఒక ప్రక్క మా అల్లుడు కడుపునొప్పితో మెలితిరిగిపోతుంటే, మీరు అర్జంటుగా పరీక్ష చేయాలి, మీ తతిమ్మా కేసులను కొంచెం హద్దులోపెట్టి ఈ కేసు ముందు చూడాలి!

అల్లు : నే బతకను బాబోయ్.... కడుపునొప్పి.

డాక్టరు : ఇలా వచ్చి ఈ బల్లమీద పడుకో బాబూ!

అల్లు : మీరంతా కలసి నన్నెత్తి బల్లమీద పడుకోబెట్టండి. నేనుగా పడుకోలేను.
(అందరూ కలసి అల్లుడిని బల్లమీద పడుకోపెడతారు.)

మామ : హద్దూ పద్దూ లేకుండా లేడిపిల్లలా ఎగిరిగంతులేసేవాడు. ఎంత అవస్థ వచ్చిపడింది తండ్రీ నీకు! డాక్టరుగారూ! మా వియ్యంకుడుగారికి కబురేమయినా చేయమంటారా?

డాక్టరు : ఏమిటండీ ఆ కంగారు! నన్ను పరీక్ష చేయనీయండి. కంగారుకు కూడా ఒక హద్దుండాలి!...

అల్లు : అన్నిటికీ హద్దులుండాలి. నా కడుపునొప్పికే హద్దులేకుండా పెరిగిపోతోంది బాబోయ్!

డాక్టరు : వెంటనే ఇతనికి ఆపరేషన్ చేయాలి! కడుపులో ఏమిటేమిటో చాలా కనిపిస్తున్నాయి.

అల్లు : అయ్యబాబోయ్! ఆపరేషనే! అయితే నే బతకను.

డాక్టరు : మరేం ఫర్వాలేదు బాబూ, నీకేం ఫర్వాలేదు!

మరది : భయానికి కూడా కొంచెం హద్దుండాలి బావగారూ!

అల్లు : నా భయానికేంగాని, నీ అల్లరికి కాస్తా హద్దులు పెట్టాలి.

డాక్టరు : ఏమిటి ఆపరేషను చెయ్యమంటారా? వెయ్యిరూపాయలవుతుంది.

మామ : వెయ్యిరూపాయలే! అదేమిటి డాక్టరుగారూ, మీ ఫీజుకు మరీ హద్దులేకుండా వుంది.

డాక్టరు : ఏంచేస్తాం! అదంతే... వెయ్యిరూపాయలిచ్చి మనిషిని బతికించుకున్నా సరే! లేకపోతే భగవంతునిమీద భారం వదలి తీసుకుపోయినా సరే!

మామ : ఏమే! భగవంతునిమీద భారంవదలి తీసుకుపోదామా ఇంటికి?

అత్త : మీ వేదాంతం మండా, వేదాంతానికి కూడా ఒక హద్దుండాలి. అవతల అతను కిందా మీదా పడుతూ కొట్టుమిట్టాడుతుంటే–

మామ : నీ మూలంగానే!

అత్త : మీ మూలంగానే!!

మామ : కాదు, మీ మూలంగానే, నీ మూలంగానే!

అత్త : మీ మూలంగానే. మీ మూలంగానే.

డాక్టరు అబ్బబ్బ! ఏమిటి మీ పోట్లాటకూడా ఇక్కడేనా? దానికి ఒక హద్దుండాలి.

మామ : సరే కానీయండి డాక్టరుగారూ, అంతా మీ దయా భగవంతుడి దయా.

డాక్టరు : సరే, నర్స్! ఆపరేషనుకు సిద్ధంచెయ్యి.

అల్లు : అయ్యబాబోయ్! ఎదురుగుండా ఆ రంపమేమిటి దాంతో కోస్తారా?

డాక్టరు : దేంతో కోస్తే నీకెందుకు? మాట్లాడకుండా ఈ బల్లమీద పడుకోవయ్యా.
(పేషంటు కనిపించకూడదు. డాక్టరు రంపంతో కోసినట్లు అభినయించి పొట్టలోనుంచి బొబ్బట్లు, గారెలు, చెమ్చాలు, ఇంకా కొన్ని కొన్ని ఒక్కొక్కటిగా తీసి ప్రేక్షకులకు చూపించి పక్కన పెడుతూ వుంటాడు.)

డాక్టరు : ఏమండీ! పెద్దవాళ్ళెవరో ఒకసారి ఇలా రండి.

అత్త : ఏం డాక్టరుగారూ, ఎలా వుంది? ఆపరేషను అయిపోయిందా?
కులాసాగా ఉన్నాడా మా అల్లుడు?

డాక్టరు : ఏ మల్లుడూ, నా మొఖం అల్లుడు.

SCERT ANDHRA PRADESH

అత్త : (గుండెలు బాదుకుంటూ) అయిపోయిందా, అయ్యో నాతల్లీ! ఓనా కూతురా! చిన్నతనంలోనే నీకీ అవస్థ–

డాక్టరు : ఛా.ఛా! ఊరుకోండి. మీ కంగారుకు కూడా ఒక హద్దుండాలి. మీ అల్లుడు నిక్షేపంలా ఉన్నాడు. ఆపరేషను సక్సెస్‌ఫుల్. అతన్ని డిస్టర్బు చేయకండి.

మామ : అలాగే బాబూ! జబ్బేమిటసలు?

డాక్టరు (పెద్దపళ్ళెంలో చూపించి) ఈ పళ్ళెంలో చూడండి! గారెలు, బొబ్బట్లు, వేరుశనగపప్పులు.... ఇవిగో అయిదుపైసల నాణాలు, పదిపైసల నాణాలూ.



మరది : డాక్టరుగారూ నా పెన్ను ఒకటిపోయింది ఉందేమో చూడండి.

అత్త : డబ్బులెక్కడివబ్బా!

మామ : నే చెప్పలా, నీ దాపరికంమండా, చిల్లరడబ్బులు తీసుకెళ్ళి మెంతుల డబ్బాలోనూ, పప్పుల డబ్బాలోనూ దాచుకుంటావుగా, శనగపప్పుతోపాటు బొబ్బట్లలో కలిసి లోపలికి వెళ్లుంటాయి.

మరది : తిండికి కూడా ఒక హద్దుండాలండీ. ఏం ప్రపంచంరా బాబూ... అన్నిటికీ ఒకటే హద్దులు.

తినడానికి హద్దులు. నవ్వడానికి హద్దులు. ఆలస్యానికి హద్దులు. తొందరకు హద్దులు. చాదస్తానికి హద్దులు... అల్లరికి హద్దులు.. పిసినారితనానికి హద్దులు. ఖర్చుకు హద్దులు... హద్దులు... హద్దులు! అన్నింటికీ ఒకటే హద్దులు!

(అంతా నవ్వుతారు)

SCERT AP

కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. ఈ నాటిక సారాంశాన్ని సొంత మాటల్లో రాయండి.
2. ఈ నాటికలో మీకు నచ్చిన హాస్య సంఘటను రాయండి.
3. హద్దులు హద్దులు నాటిక ద్వారా రచయిత ఇచ్చిన సందేశాన్ని వివరంగా చర్చించండి.

*ఈ నాటికను మీ పాఠశాలకార్యక్రమంలో ప్రదర్శించండి.

www.apteachers.in

4. నీతి పరిమళాలు

- శతక కవులు

చదవండి - ఆలోచించండి - చెప్పండి

1. మీకు తెలిసిన నీతి వాక్యాలు తెలపండి?
2. నీతులు ఏ ఏ రూపాల్లో ఉంటాయి?
3. వందకుపైగా పద్యాలుండే ప్రక్రియను ఏమంటారు?
4. మకుటం అంటే ఏమిటి ?
5. మకుటం ఏ రకంగా ఉండవచ్చు ?
6. మీకు తెలిసిన నీతిశతకాల పేర్లు చెప్పండి.
7. మీకు తెలిసిన శతక కవుల పేర్లు చెప్పండి.
8. శతకాలలో కేవలం నీతిని బోధించేవే ఉంటాయా? వివరించండి.
9. ఇంతవరకు మీరు కంఠస్థం చేసిన పద్యాల్లో ఏయే శతకాల పద్యాలున్నాయి?

SCERT ANDI

ఉద్దేశం

శతకపద్యాలు సమాజం పోకడలను తెలుపుతాయి. మనిషి ఎలా జీవించాలో చెబుతాయి. వీటి ద్వారా విద్యార్థులలో నైతికవిలువల్ని పెంపొందించటమే ఈ పాఠం ఉద్దేశం.

ఈ పాఠంలోని పద్యాలు వివిధ కవులు రాసిన శతకాల లోనివి.

విద్యార్థులకు సూచనలు

1. పాఠంలోని చిత్రాలను చూడండి. పద్యభావాలను ఊహించండి.
2. పాఠం చదవండి. పదపట్టిక చూసి పదాలకు అర్థాలు తెలుసుకోండి.
3. సందర్భానికి తగిన అర్థాన్ని గ్రహించి చిత్రాలు ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
4. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

www.apteachers.in

*చ. తనకు ఫలంబు లేదని యెదం దలపోయఁడు కీర్తిఁ గోరు నా
ఘనగుణశాలి లోకహితకార్యము మిక్కిలి భారమైన మే
లనుకొని పూను శేషుఁడు సహస్రముఖంబుల గాలి గ్రోలి తా
ననిశము మోవఁడే మఱి మహాభరమైన ధరిత్రి భాస్కరా! 1

(భాస్కరశతకం)

*చ. చదువది యెంతగల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణసంయుతులెవ్వరు మెచ్చ రెచ్చటం
బదనుగ మంచి కూర నలపాకము చేసిననైన నందు నిం
పొదవెడు నుప్పులేక రుచి పుట్టఁగ నేర్చునటయ్య భాస్కరా! 2

(భాస్కరశతకం)

*ఉ. భూషలు గావు మర్త్యులకు భూరిమయాంగద తారహారముల్
భూషిత కేశపాశ మృదుపుష్ప సుగంధజలాభిషేకముల్
భూషలు గావు పూరుషుని భూషితుఁ జేయుఁ బవిత్రవాణి, వా
గ్భూషణమే సుభూషణము, భూషణముల్ నశియించు నన్నియున్. 3

(సుభాషిత రత్నావళి) 3

SCERT ANDHRA

*చ. వనకరి చిక్కె మైనసకు, వాచవికిం జెడిపోయె మీను, తా
వినికికిఁ జిక్కెఁ జిల్వ గనువేదురుఁ జెందెను లేళ్ళు, తావినో
మనికి నశించెఁ దేటి, తరమా యిరుమూటిని గెల్వ నైదుసా
ధనముల నీవె గావఁదగు దాశరథీ కరుణాపయోనిధీ ! 4

(దాశరథిశతకం)

www.apteachers.in

*ఆ.వె. క్షమను కడఁక నెవరు గాపాడుకొందురో
క్షమను చిరము వారు కావ గలరు
కదలకుండ నెవరికడ క్షమయుండునో
సర్వకార్యములకు క్షములు వారు 5

(సభారంజన శతకం)

*శా. ఊరూరం జనులెల్ల బిచ్చమిడరో, యుండం గుహల్గల్గవో
చీరానీకము వీధులం దొరకదో శీతామృత స్వచ్ఛ వాః
పూరం బేరుల బారదో తపసులం బ్రోవంగ నీవోపవో
చేరంబోవుదు రేల రాజుల జనుల్ శ్రీకాళహస్తీశ్వరా ! 6

(శ్రీకాళహస్తీశ్వర శతకం)

ANDHRA PRADESH



సీ. దుష్టు సూర్యుని దెస దుమ్మెత్తి చల్లినఁ
దనపైనె పడుఁగాక దానికేమి
కొండతోఁ దగరు ఢీకొని యెంత తాఁకినఁ
దల వ్రక్కలగుఁగాక దాని కేమి
మిడతలు చిచ్చుపై వడి నెంతయెగసినఁ
దామె పొక్కెడుఁ గాక దానికేమి
వలఁ బడ్డ మీ నెంత వడి దాఁక బొరలిన
దనుఁజుట్టు కొనుఁగాక దాని కేమి

తే.గీ. యెదిరి సత్త్వంబు తన సత్త్వమెఱుఁగలేక
పోరువాఁడెందున వివేకబుద్ధి యంద్రు
కలిత లక్ష్మీశ, సర్వజగన్నివేశ
విమల రవికోటిసంకాశ వేంకటేశ ! 7

(వేంకటేశ శతకం)

ఆ.వె. చదువు జీర్ణమైన స్వాంతంబు పండును
తిండి జీర్ణమైన నిండు బలము
చెఱుపు గూర్పు రెండు జీర్ణముల్గాకున్న
విశ్వహితచరిత్ర వినర మిత్ర 8

(మిత్ర సాహస్రి)

www.apteachers.in

కవుల పరిచయం

కవుల పేర్లు	కాలం	శతకం
మారద వెంకయ్య	17వ శతాబ్ది	భాస్కర శతకం
మూలం – భర్తృహరి అనువాదం – ఏనుగులక్ష్మణకవి	7వ శతాబ్ది 18 శతాబ్ది	సుభాషిత త్రిశతి సుభాషిత రత్నావళి
కంచెర్ల గోపన్న (రామదాసు)	17వ శతాబ్ది	దాశరథి శతకం
మూలం – నీలకంఠదీక్షితులు అనువాదం – ఏలూరిపాటి అనంతరామయ్య	17వ శతాబ్ది 20 శతాబ్ది	సభారంజన శతకం
ధూర్జటి	16వ శతాబ్ది	శ్రీకాళహస్తీశ్వర శతకం
తాళ్ళపాక పెద్ద తిరుమలాచార్యులు	16వ శతాబ్ది	వేంకటేశ శతకం
కొండూరు వీర రాఘవాచార్యులు	20వ శతాబ్ది	మిత్ర సాహస్రి

ప్రక్రియ – శతకం

వందకు పైగా పద్యాలు గల రచన శతకం. ప్రతి పద్యం చివర మకుటం ఉంటుంది. మకుటం పదాలుగా, పాదాలుగా ఉండవచ్చు. శతకాలు ప్రధానంగా నీతి, భక్తి వైరాగ్యాలను బోధిస్తూంటాయి.

భావాలు

1. భాస్కరా! కీర్తిని కోరే గుణవంతుడు తనకు ఎలాంటి లాభాన్నీ ఆశించడు. లోకానికి మేలుజరిగే కార్యమెంత భారమైనా చేయడానికి పూనుకుంటాడు. ఆదిశేషుడు గాలిని మాత్రమే మేస్తూ తన వేయిపడగలమీద ఈ పెద్ద భూభారాన్ని నిత్యం మోస్తున్నాడు కదా!

2. భాస్కరా! ఎంత చదువు చదివినా, అందులోని అంతరార్థాన్ని, మనోజ్ఞతను గ్రహించలేనప్పుడు ఆ చదువు వ్యర్థం. దాన్ని గుణవంతులు మెచ్చుకోరు. ఎన్ని పదార్థాలు వేసి బాగా వంటచేసినా దానిలో తగినంత ఉప్పు లేకపోతే అది రుచించదు కదా!

3. బంగారుహారాలు ధరించడం. సిగలో పువ్వులు పెట్టుకోవడం. సుగంధద్రవ్యాలు వాడడం, పన్నీటితో స్నానంచేయడం, మొదలైనవి మానవుడికి అలంకారాలు కావు. సంస్కారవంతమైన మాటే నిజమైన అలంకారం. మిగిలిన అలంకారాలు నశించిపోయేవే.

4. దయాసముద్రుడవైన ఓ రామా! తన దురదను పోగొట్టుకోవడానికి ఏనుగు, నోటిరుచి ఆశించి చేప, సంగీతానికి లొంగి పాము, అందానికి బానిసయై జింక, పూలవాసనలకు మైమరచి తుమ్మెదలు బందీలవుతున్నాయి. ఇలా ఒక్కొక్క ప్రాణీ ఒక్కొక్క ఇంద్రియ చపలత్వంవల్లనే నశిస్తూన్నాయి. ఈ పంచేంద్రియ చాపల్యం గల నేను అరిషడ్వర్గాన్ని ఎలా జయించగలను? నీవే నన్ను కాపాడాలి.

5. ఎవరు ప్రయత్నంతో క్షమను (ఓరిమిని) కాపాడుకొంటారో, వారు క్షమను (భూమిని) కాపాడతారు. ఎవరిలో క్షమ (సహనం) నిశ్చలంగా ఉంటుందో, వారు అన్ని పనుల్లోనూ క్షములై (సమర్థులై) ఉంటారు.

www.apteachers.in

6. శ్రీకాళహస్తీశ్వరా! తినడానికి అడిగితే ఎవరైనా ఇంత బిచ్చం పెడతారు. నివసించడానికి గుహలున్నాయి. వస్త్రాలు వీధుల్లో దొరకుతాయి. తాగడానికి నదులలో తియ్యనినీరు ఉంది. మానవులను కాపాడడానికి నీవున్నావు. అయినా ఈ ప్రజలు రాజులను ఎందుకు ఆశ్రయిస్తున్నారో తెలియడం లేదు.

7. ఓ వేంకటేశ్వరా! నీవు లక్ష్మీసమేతుడివి. లోకమంతటా నిండి ఉన్నవాడివి. సత్యకోటి తేజస్సు కలవాడివి. లోకంలో ఎవరైనా దుర్మార్గుడై సూర్యుని మీద దుమ్మెత్తి పోస్తే అది వాడిమీదే పడుతుంది. కొండతో పొట్టేలు ఢీకొంటే దాని తలే బద్దలౌతుంది. మిడతలదండు మంటల పైకి ఎగిసిపడితే అవే మాడిపోతాయి. వలలో చిక్కుకున్న చేప ఎంత గింజుకున్నా మరింతగా బందీ అవుతుంది. ఇలా ఎదుటివాడి బలం తెలియకుండా యుద్ధానికి దిగితే వాడిని అవివేకి అంటారు.

8. లోకక్షేమాన్ని కోరే మిత్రమా! ఒకమాట విను. చదివిన చదువును జీర్ణించుకుంటే మనసు పరిపక్వమౌతుంది. తిన్న తిండి జీర్ణమైతే బలం కలుగుతుంది. ఆ రెండూ జీర్ణం కాకుండా ఉండిపోతే చెరుపుచేస్తాయి.

ఇవి చేయండి

SCERT ANDHRA PRADESH

I. వినడం - మాట్లాడడం

1. పాఠంలోని పద్యాలను అర్థవంతంగా, రాగయుక్తంగా చదవండి.
2. పద్యాల్లోని నీతిని సొంతమాటల్లో చెప్పండి.
3. 'చదువు జీర్ణం' కావటాన్ని మీరు ఎలా అర్థం చేసుకున్నారో చెప్పండి.

II. చదవడం, అవగాహన చేసుకోవడం

1. పాఠంలోని పద్యాలు ఆధారంగా కింద తెలిపినవాటిని వేటితో పోల్చారో రాయండి.

(అ) రసజ్ఞత (ఆ) అవివేకం (ఇ) వాక్కు

2. కింద ఇచ్చిన భావానికి తగిన పద్యపాదం గుర్తించి రాయండి.

(అ) గొప్పవారు లోకానికి మేలుజరిగే పనులను ఎంత కష్టమైనా చేస్తారు.

(ఆ) పొట్టేలు కొండతో ఢీకొంటే, దాని తల పగులుతుంది.

(ఇ) తిన్నతిండి జీర్ణమైతే బలం కలుగుతుంది.

(ఈ) రసజ్ఞత లేకపోతే గొప్పవాళ్ళు మెచ్చుకోరు.

3. 'సభారంజన శతకం' లో క్షమ అనే పదాన్ని ప్రతి పాదంలోనూ వాడటం కనిపిస్తున్నది కదా! క్షమను ఏఏ అర్థాలలో ఉపయోగించారో చెప్పండి.

4. పాఠంలోని పద్యాలు ఆధారంగా తప్పు-ఒప్పులు గుర్తించండి.

(అ) రత్నహారాలు మనిషికి నిజమైన అలంకారం. ( )

(ఆ) ఉప్పులేని కూరైనా రుచిగా ఉంటుంది. ( )

(ఇ) సూర్యుని పైకి దుమ్ము ఎత్తి పోస్తే అది పోసినవాడిమీదే పడుతుంది. ( )

(ఈ) తిండి జీర్ణం కాకపోతే మనకు ఆరోగ్యం. ( )

www.apteachers.in

5. పాఠం ఆధారంగా జవాబులు రాయండి.

(అ) గొప్పవారివల్ల ప్రజలకు కలిగే మేలు ఏమిటి ?

(ఆ) రాజులను ఎందుకు ఆశ్రయించకూడదని కవి భావించాడు?

(ఇ) 'ఎలాంటి చదువు వ్యర్థమని' మీరు తెలుసుకున్నారు?

(ఈ) ఏవేవి అవివేకమైన పనులని ఈ పాఠం ద్వారా తెలుసుకున్నారు? వీటివల్ల కలిగే ఫలితాలు ఏమిటి?

(ఉ) నిజమైన అలంకారం ఏది?

(ఊ) ఏ ఏ బలహీనతల వల్ల ఏవేవి ఎలా నశిస్తాయి ?

III. స్వీయరచన

1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

(అ) గొప్పవాళ్ళే లోకహితమైన కార్యాలు ఎందుకు చేస్తారో మీరు ఊహించి రాయండి.

(ఆ) వాక్కు మనిషికి నిజమైన అలంకారమని ఎలా చెప్పగలవు?

(ఇ) సమర్థులు అంటే ఎవరు? సామర్థ్యం ఎలా వస్తుంది?

(ఈ) చదువును మంచికూరతో కవి ఎందుకు పోల్చాడు?

2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

(అ) మంచితనమంటే ఏమిటి? కొందరిలో మీరు గమనించిన మంచితనాన్ని గూర్చి రాయండి.

(ఆ) 'సమర్థులకు క్షమ అవసరం' వివరించండి.

SCERT ANDHRA PRADESH

IV. పదజాలం

1. కింది వాక్యాల్లో సమానమైన అర్థాన్నిచ్చే పదాలున్నాయి. వాటిని గుర్తించి, వాటి కింద గీతలుగీయండి.

(అ) హృదయం మంచిదైతే అతడు మంచిమనిషి. అతని డెందములో అందరిపట్ల అభిమానమే ఉంటుంది. ఎదలో కల్మషం లేకుండా మాట్లాడితే అందరి చిత్తాలు సంతోషిస్తాయి.

(ఆ) మిడుతలు చిచ్చుపైకి ఎగిసిపడ్డాయి. అడవిలో వహ్ని రగులుకొన్నది. అగ్నిలో చేయిపెడితే కాలుతుంది.

2. కింది పదాలకు వ్యతిరేకార్థకం రాసి, ఈ రెండు పదాలతోనూ సొంత వాక్యాలు రాయండి.

ఉదా:– కీర్తి – అపకీర్తి

మంచిపనులు చేస్తే కీర్తి వస్తుంది. చెడ్డపనులు చేస్తే అపకీర్తి వస్తుంది.

(అ) అహితం (ఆ) బాగుపడు (ఇ) నిస్సారం (ఈ) ఫలం

3. కింది పదాలు చదవండి. ఏవైనా రెండేసి పదాలను ఉపయోగిస్తూ సొంతవాక్యాలు రాయండి.

(అ) చదువు (ఆ) చెడిపోవు (ఇ) హారాలు (ఈ) ధనం

(ఉ) దుష్టుడు (ఊ) బలం (ఎ) మార్గం (ఏ) చంచలస్వభావం

ఉదా – చదువు జీవితానికి మార్గం చూపుతుంది.

www.apteachers.in

V. సృజనాత్మకత

'పాఠశాలలో పిల్లలకు 'పద్యాలతోరణం' అనే పోటీ పెట్టారు. ఈ పోటీలో పిల్లలందరూ పాల్గొనాలని తెలియజేయడానికి ప్రకటన రాయండి. ప్రకటనలో నిర్వహించే తేదీ, స్థలం, సమయం మొదలగు వివరాలు ఉండాలి.

VI. ప్రశంస

పాఠంలోని పద్యాలలో మీ మనసుకు హత్తుకున్న పద్యాలను గురించి, మీ మిత్రులతో చర్చించండి. మీరు చర్చించిన విషయాలు పదివాక్యాల్లో రాయండి.

(లేదా)

చక్కని నీతులు చెప్పిన శతకకవుల గొప్పతనాన్ని వర్ణిస్తూ ఒక వ్యాసం రాయండి.

VII. భాషను గురించి తెలుసుకొందాం

1. కింది పదాలను విడదీసి, సంధులు పేర్లు రాయండి

(అ) చాలకున్న	=	చాలక + ఉన్న	(అ + ఉ)	(అత్వసంధి)
(ఆ) అదేమిటి	=	+	(+)	( )
(ఇ) వెళ్ళాలని	=	+	(+)	( )
(ఈ) ఒకింత	=	+	(+)	( )

2. కింది పదాలు చదవండి. పదంలోని చివరి అక్షరం కింద గీత గీయండి.

పూచెను, వచ్చెను, తినెను, చూచెన్, ఉండెన్.

పై పదాలను గమనిస్తే, పదాల చివర 'ను,న్'లు కనిపిస్తాయి. అంటే పదాల చివర నకారం ఉన్నది. ఈ 'న'కారాన్ని ద్రుతం అంటారు. ఈ చివరన 'న'కారం గల పదాలను ద్రుతప్రకృతికాలు అంటారు. పూచెను, వచ్చెను, చూచెన్, మొదలైనవి ద్రుత ప్రకృతికాలే.

మరికొన్ని ద్రుతప్రకృతాలను రాయండి.

3 కింది వాటిని గమనించండి.

ఉదా – (అ) పూచెన్ + కలువలు = పూచెన్ + గలువలు

(ఆ) దెసన్ + చూచి = దెసన్ + జూచి

(ఇ) చేసెన్ + టక్కు = చేసెన్ + డక్కు

పైన తెలిపిన ఉదాహరణల్లాగా కింది వాటిని వివరించండి.

చేసెను + తల్లీ   దెసను + చూసి

మొదటి ఉదా॥లలో ద్రుతప్రకృతికానికి 'క' పరమైతే, దానికి ఆదేశం (దాని స్థానంలో) 'గ' వచ్చింది.

రెండో ఉదా॥లలో ద్రుతప్రకృతికానికి 'చూ' పరమైతే దానికి ఆదేశంగా 'జూ' వచ్చింది.

అలాగే 'ట' కు 'డ' ఆదేశంగా వచ్చాయి. అంటే క → గ చ → జ ట → డ లు వచ్చాయి.

క, చ, ట, త, ప లకు పరుషాలని పేరు. గ, జ, డ, ద, బ లకు సరళాలని పేరు.

పై ఉదాహరణలలో భావాన్ని బట్టి సూత్రీకరిస్తే

'ద్రుతప్రకృతికాలకు పరుషాలు పరమైతే సరళాలు ఆదేశంగా వస్తాయి.'

ఇప్పుడు కింది ఉదాహరణ చూడండి.

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

పూచెఁగలువలు (ద్రుతం అరసున్న (ఁ) గా మారింది)

పూచెంగలువలు (ద్రుతం సున్న (0) గా మారింది)
పూచెన్గలువలు (మీది హల్లుతో కూడడం అంటే సంశ్లేషకావటం)
పూచెనుగలువలు (ద్రుతం మార్పు చెందకుండా వచ్చింది.)

పై ఉదాహరణ ఆధారంగా సంధి జరిగిన తీరును సూత్రీకరిస్తే

– ఆదేశ సరళానికి ముందున్న ద్రుతానికి బిందుసంశ్లేషలు విభాషగా వస్తాయి.

అంటే ఒక్కోసారి బిందువు వస్తుంది; ఒక్కోసారి సంశ్లేష వస్తుంది.

ఛందస్సు :

1 ఒకే అక్షర గణాలు

ఒకే అక్షరం గణంగా ఏర్పడితే అది ఏకాక్షరగణం. ఈ గణంలో ఒక గురువు లేదా ఒక లఘువు ఒక్కొక్కటే గణంగా ఉంటాయి. ఉదా :

I	I	U	U
సు	త	రా	మూ

2 రెండు అక్షరాల గణాలు

రెండేసి అక్షరాలు కలిసి గణాలుగా ఏర్పడుతాయి. వీటిలోనూ గురువు, లఘువులుంటాయి. ఇవి నాలుగు రకాలు.

అ) ఒక గురువు ఒక లఘువు కలిసి గణంగా ఏర్పడితే ఆ గణాన్ని 'గలం' లేదా 'హ' గణం అని అంటారు.

ఉదా :

UI	U I	U I	U I	U I
రా మ	ఉ ప్పు	తం డ్రి	గీ త	సం త

ఆ) ఒక లఘువు, ఒక గురువు కలిసి గణంగా ఏర్పడితే అది 'లగం' లేదా 'వ'గణం అని అంటారు.

ఉదా :

I U	I U	I U	I U
ర మా	వడిన్	ప్రణీత్	శశీ

ఇ) రెండూ గురువులే గల గణాన్ని – 'గగం' అంటారు.

ఉదా :

U U	U U	U U	U U	U U
రామా	చందం	మైత్రీ	ప్రేమ్‌జీ	రాణీ,

ఈ) రెండూ లఘువులే గల గణాన్ని – 'లలం' అంటారు

ఉదా :

I I	I I	I I	I I	I I	I I
జయ	క్షితి	రఘు	ప్రభ	గిరి	ఖర

రెండక్షరాల గణాలు నాలుగు రకాలు ఉన్నాయి కదా! ఒక్కొక్క దానికి 4 పదాల చొప్పున రాయండి.

ఉదా : గలము / హగణము –

U I	U I	U I	U I
లక్ష్మి	రాత్రి	బండి	లేమ

www.apteachers.in

3 మూడు అక్షరాల గణాలు

మూడేసి అక్షరాలు గల గణాలు ఎనిమిది. పట్టికలో చూడండి. మరికొన్ని పదాలు రాయండి.

క్ర.సం.	లక్షణం	గుర్తులు	గణం పేరు	ఉదాహరణ	పదాలు
1.	మూడు గురువులు	UUU	'మ'గణం	UUU శ్రీరామా	
2.	మొదట గురువున్నది	UII	''భ'గణం	U I I రాముడు	
3.	మధ్యగురువున్నది	IUI	'జ'గణం	I U I మనస్సు	
4.	చివర గురువున్నది	IIU	'స'గణం	I I U వదనం	
5.	మూడు లఘువులున్నది	III	'న'గణం	I I I బలము	
6.	మొదట లఘువున్నది	IUU	'య' గణం	I U U గిరీశా	
7.	మధ్యలఘువున్నది	UIU	'ర'గణం	U I U వందనం	
8.	చివర లఘువున్నది	UUI	'త'గణం	UUI శ్రీలీల	

ప్రాజెక్టు పని

శతకపద్యాలలో చెప్పిన నీతులకు సరిపోయే కథలను సేకరించి, వాటికి నీతిపద్యాలను జోడించి ఆల్బమ్ తయారు చేయండి.

పునరభ్యసనం (వెనుకబడిన విద్యార్థుల కొరకు)

1. పాఠ్యాంశాలలోని పదాల జాబితాను ఉపాధ్యాయుడు తయారుచేసి చదివించాలి.
2. విద్యార్థులచే ఉక్తలేఖనం రాయించాలి. దోషాలు సవరించాలి.
3. పాఠ్యాంశ సారాంశాన్ని 4 లేదా 5 వాక్యాలలో నల్లబల్లపై రాసి విద్యార్థులచే చదివించాలి, రాయించాలి, దోషాలు సవరించాలి.

H5X87T

నేనివి చేయగలనా ?

1. పద్య భావాలు సొంతమాటల్లో చెప్పగలను. — ఔను / కాదు
2. పద్యాలను రాగయుక్తంగా, భావయుక్తంగా చదవగలను. తప్పులు గుర్తించగలను. — ఔను / కాదు
3. నీతుల గురించి, మంచితనం గురించి సొంతమాటల్లో రాయగలను. — ఔను / కాదు
4. పద్యాలపోటీ కోసం నోటీసు తయారు చేయగలను. — ఔను / కాదు

www.apteachers.in

5. అజంతా చిత్రాలు

- నార్ల వేంకటేశ్వర రావు

ఆలోచించండి - చెప్పండి

1. పై చిత్రంలో ఎవరెవరు ఉన్నారు?
   ఏం చేస్తున్నారు? ఏం మాట్లాడుతున్నారు?
2. విహారయాత్ర అంటే ఏమిటి?
   ఎందుకు వెళతారు?
3. ఒక అందమైన ప్రదేశాన్నో దృశ్యాన్నో
   చూసినప్పుడు మనకు ఏమనిపిస్తుంది?

ఉద్దేశం

భారతీయ చరిత్ర, సంస్కృతులను ప్రతిబింబించే ప్రాచీన కట్టడాలెన్నో అజ్ఞానం, నిర్లక్ష్యం, స్వార్థాలవల్ల పాడైపోతున్నాయి. వీటి ప్రాధాన్యాన్ని గుర్తించి పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

ప్రస్తుత పాఠ్యభాగం నార్లవేంకటేశ్వరరావు రచించిన 'నార్లరచనలు' ఐదవసంపుటి లోనిది.

విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. పదపట్టిక చూసి పదాలకు అర్థాలు తెలుసుకోండి.
2. సందర్భానికి తగిన అర్థాన్ని గ్రహించి చిత్రాల ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
3. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

www.apteachers.in

చూసిన ఒక దృశ్యాన్ని వర్ణించడం సులభమేమో కాని, జీవించిన ఒక అనుభూతిని వర్ణించడం సులభమా? ఇరుకు కొంప నుంచి కదిలి, ఇరుకు బజార్ల వెంట నడిచి, అపారమైన సముద్రపు అంచున నిలిచినప్పుడు మనం పొందే అనుభూతిని వర్ణించడం సులభమా? మన పరిమితజీవితాలలో, తల ఎత్తి అనంతాకాశంలోని అనంతకోటి నక్షత్రాలను పరికించగానే మనం పొందే అనుభూతిని వర్ణించడం సులభమా?

పచ్చని చెట్టుగాని, పచ్చికబయలుగాని చెదురుగా కానవచ్చే బస్తీలో బతుకుతూ, గాలికి తలలు కెరటాల్లా లేచిపడుతూండగా, దిక్చక్రాన్ని అంటుతున్నట్టు కానవచ్చే పచ్చని వరిచేలను చూసినప్పుడు కలిగే అనుభూతిని వర్ణించడం సులభమా?

హృదయాన్ని ఊపే ఏ అనుభూతినీ, జీవితాన్ని కదిలించే ఏ అనుభూతినీ సులభంగా వర్ణించలేము.

ఇటీవలనే అజంతా, ఎల్లోరాలను చూసి వచ్చిన నన్ను ఏమిచూసి వచ్చినావని మిత్రులడిగినప్పుడు నేను వారికి సులభంగా గాని, సవిస్తరంగా గాని సమాధానం చెప్పలేకపోవడానికి నేను ఆ దృశ్యాన్ని చూసి రావడం కాక, ఆ అనుభూతిలో జీవించిరావడమే కారణమై ఉండాలి.

జల్గామ్‌కు దక్షిణంగా 35 మైళ్ళ దూరాన, ఔరంగాబాద్‌కు ఉత్తరంగా 55 మైళ్ళ దూరాన అజంతా గుహలున్నాయి. వాటి పరిసర ప్రాంతాల ప్రకృతి సౌందర్యాన్ని చూస్తే అజంతా గుహలలోని భారతీయ చిత్రకళ అంతకు ముందుగాని, అటు తర్వాత గాని అందుకొననంతటి మహోన్నత శిఖరాలను అందుకొనగలగడానికి ఒక ముఖ్యకారణం స్పష్టం కాకపోదు.

గుహలను సమీపిస్తుంటే, ఇటు పచ్చని కొండ అటు పచ్చని కొండ – ఈ రెండు కొండల మధ్య వాఘోరానది. రాళ్ళ గుట్టల గుండా జలజల ప్రవహిస్తూ నది పాడుకునే పాటలను వింటూ, నది అంచువెంట కాలినడకన, గుహలకు చేరాలి.

ANDHRA PRADESH

www.apteachers.in

మీ పైన నీలాకాశం, మిమ్ము అలరిస్తూ అడవి పువ్వులు, మిమ్ము ఆవరిస్తూ ఆ పువ్వుల కమ్మనినెత్తావులు. గుహలను చేరేవరకు రెండు, మూడు మెలికలను కాబోలు మీరు తిరుగుతారు. ఏ మెలికలో అడుగుపెడితే, దానికి అదే ఒక ప్రపంచం.

ఇటు కొండ – అటు కొండ – ముందు కొండ – వెనుక కొండ – పైన కొండ – పక్కనే నది – నీలాకాశం – నీలాల నీళ్ళు – పచ్చని చెట్లు – కమ్మని తావులు – అది వేరే ప్రపంచం – అదొక స్వాప్నిక జగత్తు. భూలోకస్వర్గం – ఈ వాక్యానికి తుది మొదలు లేనట్టున్నది. అయితే అజంతా గుహలను సమీపించగానే తుది మొదలులేని జగత్తులోకే నేను ప్రవేశించాను. ఆ దృశ్యాన్ని తలచుకున్నా అంతే జరుగుతుంది.

మీకు ఇటు ఉండే కొండ – అటు ఉండే కొండ – మిమ్ము మెలికలు తిప్పించే కొండ – అన్నీ ఒక్కటే. కొండ చివర మెలికే వాఘోరానది జన్మస్థానం. నేను కొండ పై కెక్కి చూడలేదుగాని, పైన ఏడుకొలనులున్నాయట. కొలను నుంచి కొలనుకు జాలువారుతూ, 250 అడుగుల ఎత్తు నుంచి పెద్ద ధారగా వాఘోరానది కొండ దిగువకు దూకుతుంది. దూకిన తర్వాత కొండతిరిగిన మలుపులన్నీ తానూ తిరుగుతూ, సమతల ప్రదేశానికి చేరి, కొన్ని వందల మైళ్ళు ప్రవహించి, తపతిలో కలుస్తుంది.

SCERT ANDHRA PRADESH

వాఘోరా పుట్టిన చోటనే ఉన్నాయి అజంతాగుహలు. వెతుక్కుంటూ వెడితేనే కాని, సాహసించి వెడితేనే కాని, కనబడదు ఆ చోటు. వాఘోరా జన్మస్థానం తెలుసుకోవాలనే కుతూహలంతో ఏ సాహసికుడో ఆదిలో అక్కడికి వెళ్ళాడు. ఇప్పుడు కొండను త్రవ్వి, నదిగట్టున రోడ్డు వేశారు. ఆదిలో ఇటు కొండ – అటు కొండ – మధ్యలో నది. నడవడానికి దారైనా ఉండేది కాదట. నది మధ్యనుంచే నడవవలసి వచ్చేదట. మరీ విపరీతంగా వర్షాలు కురిస్తే తప్ప నదిలో నీళ్ళు మోకాటి లోతైనా ఉండవు.

వాఘోరా పుట్టిన చోట కొండ అర్ధచంద్రాకారంగా ఉంటుంది. దాని ఒక వంపులో అజంతా గుహలుండగా, రెండవ వంపుపైన వలయాకారంలో ఏదో ఒక కట్టడం కనబడుతూ ఉంటుంది. దాన్ని 'వ్యూ పాయింట్" అంటారు. మధ్యకాలంలో కొన్ని శతాబ్దాల పాటు అజంతా గుహలన్న మాటే ప్రపంచానికి తెలియకుండా పోయింది. మేజర్ గిల్ అనే బ్రిటిష్ మిలటరీ ఆఫీసర్ 1819లో వేటకు వెళ్ళి, ఒక జంతువును తరుముకుంటూ కొండపైకి పోగా, ఎదురుగుండా గుబురుచెట్ల సందునుంచి – ఏదో – చెక్కడపు పని అతడి దృష్టిని ఆకర్షించిందట. సాహసించి అతడు కొండ దిగి, వాఘోరానదిని దాటి, తిరిగి కొండపైకి ఎగబాకి చూడగా, తనకు అల్లంత దూరంలో చెట్లసందుగా కానవచ్చింది అజంతా గుహలలో పదహారవదాని శిరోభాగమని తేలిందట. లోకం మరచిపోయిన అజంతాగుహలను మేజర్ గిల్ ఏ ప్రదేశం నుంచి తొలిసారిగా చూసినాడో అదే "వ్యూపాయింట్". వ్యవధిలేక నేను వెళ్ళలేదు గాని, చాలా మంది "వ్యూ పాయింట్"కి వెళ్ళి, అక్కడి నుంచి అజంతా గుహలను చూస్తూ ఉంటారు.

www.apteachers.in

బౌద్ధానికి క్షీణదశపట్టిన ఘట్టంలో అజంతాగుహల అస్తిత్వాన్ని సయితం సభ్యలోకం విస్మరించింది. అయితే బందిపోటు దొంగలు మాత్రం వాటి ఉనికిని క్రీస్తుశకం తొమ్మిదవశతాబ్ది తర్వాత ఎప్పుడో గుర్తించారు. చుట్టు ప్రక్కల ఊళ్ళను, బస్తీలను దోచుకొని, ఆ గుహలలో వారు నివసిస్తూ వుండేవారు. వంటలు చేసుకొనడానికి వారు పెట్టుకున్న పొయ్యిల పొగలతోనే పెక్కు గుహలలోని కుడ్య, చిత్రాలు మసి పూసుకొని పూర్తిగా చెడిపోయాయి. వారికి సులభంగా అందుబాటులో లేకపోవడమే రెండవ గుహలోని కుడ్యచిత్రాలు నేటికీ అంతగా చెక్కుచెదరక పోవడానికి కారణమై ఉండాలి.

జవహర్‌లాల్ నెహ్రూ అజంతా గుహల గురించి ఈ క్రింది విధంగా వివరించాడు. "అజంతా మనను ఏదో స్వాప్నిక జగత్తులోకి తీసుకువెడుతుంది. అయినా, అది అతివాస్తవికమైన లోకమే". ఈ కుడ్యచిత్రాలను చిత్రించినవారు బౌద్ధ భిక్షువులు.

ఇక్కడ అందాలొలుకుతున్న స్త్రీలు అశేషంగా వున్నారు. రాకుమార్తెలు, గాయనీమణులు, నృత్యాంగనలు ఎక్కడ చూసినా స్త్రీలే. కూర్చున్నవారు కొందరు, నిలబడి ఉన్నవారు కొందరు, ముస్తాబు చేసేవారు కొందరు, ఊరేగింపుగా వెళుతున్నవారు కొందరు. ఎంతో పేరొందినవారు ఈ అజంతా స్త్రీలు. బోధిసత్వుని అలౌకిక సుందర విగ్రహాన్ని, ఆయన అంత గంభీరమూర్తిని చిత్రించిన భక్తిశ్రద్ధలను, ఈ జగత్తును చిత్రించటంలో వీరు చూపించారు. అజంతా గుహలు మొత్తం 29. వాటిలో అయిదు బౌద్ధచైత్యాలైతే, మిగిలినవి బౌద్ధ విహారాలు. మొత్తం 29లో రెండింటినో, మూడింటినో ప్రారంభించి,

పూర్తి చేయకుండానే ఆపివేశారు. ఈ రెండు మూడింటిలో తప్ప మిగిలిన అన్నింటిలోను ప్రతిస్తంభాన్ని, ప్రతికుడ్యాన్ని, చివరికి కప్పులనైనా విడిచిపెట్టకుండా, చిత్రాలతో నింపివేశారు. కానీ ఈనాడు పదమూడు గుహలలో మాత్రమే చిత్రాలు – కాదు – వాటి శిథిలాలు మాత్రం – కానవస్తున్నాయి. చెక్కు చెదరకుండా ఎన్నో కొన్నిచిత్రాలు మిగిలింది ఒకటవ, రెండవ, తొమ్మిదవ, పదవ, పదహారవ, పదిహేడవ గుహల లోనే.

గుహల గోడలకు మట్టిగిలాబా చేసి, దానిపై పలచగా సున్నం పూసి, ఆ పూతపై దాని తడి ఆరకముందే చిత్రాలను వేశారు. వానతేమకు మట్టిగిలాబా పొక్కి, అది పొరలు పొరలుగా వూడి పోయినందున కొన్ని చిత్రాలు కాలక్రమాన నశింపు అయిపోయి వుండవచ్చును. కాలగతివల్ల ఈ విధంగా కొన్నిచిత్రాలు పోగా, గుహలలో అప్పుడు తలదాచుకొన్న బందిపోటుదొంగలు పెట్టిన పొగకు మరికొన్ని మసి పూసుకుపోయాయి. పోతే ఇటీవల కాలంలో శాశ్వతకీర్తి సంపాదన కోసం గోళ్ళతో బొమ్మలపై తమ పేర్లను కొందరు వ్రాయడం వల్ల మరికొన్ని చిత్రాలు శిథిలమై పోయాయి. కాగా,నేటికీ నిలిచినది మొత్తంలో నూటికి ఒక వంతో, రెండువంతులో ! కొన్నాళ్ళనాడు జాగ్రత్త

SCERT ANDHRA PRADESH

www.apteachers.in



పడినా, ఇంతకు రెట్టింపు చిత్రాలైనా మిగిలి ఉండేవేమో! ముప్ఫయి సంవత్సరాల పాటు ఎంతో శ్రమపడి మేజర్ గిల్ ఎన్నో చిత్రాలను కాపీ చేసుకోగా, వాటిలో చాలాభాగం 1866లో లండన్‌లోని "క్రిస్టల్ ప్యాలెస్" లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు దగ్ధమైపోయాయి. ఇలా దగ్ధం కాగా, మిగిలిన వాటికి జాన్ గ్రిఫిల్క్ కాపీలు యెత్తగా, ఆ కాపీలలో సగభాగం సౌత్ కెన్ సింగ్టన్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో బూడిద పాలైనాయి. మేజర్ గిల్ కాపీ చేసిననాటికి ఇప్పటికంటె కనీసం రెట్టింపు చిత్రాలు ఉండి ఉండాలి. ఇప్పుడు అన్ని చిత్రాలు లేవు సరిగదా, వాటి కాపీలైనా లోకానికి దక్కకుండా పోయినాయి.

ఈనాడు మిగిలిన చిత్రాలు మొత్తంలో నూటికి ఒకటి రెండు వంతులు మాత్రమే అయినప్పటికీ, అవే ఒక విశాలప్రపంచాన్ని, దాని ఆశానిరాశలతో, రాగవిరాగాలతో, ప్రేమవిద్వేషాలతో, సంతోష విషాదాలతో కళ్ళకు కట్టినట్లు చూపుతున్నాయి. ఇక అన్ని చిత్రాలూ మిగిలిఉంటే, అజంతా గుహలను చూడ్డానికి రెండు కళ్ళు చాలేవి కావేమో!

అజంతా చిత్రాలలో అధికభాగం జాతక కథలే. సిద్ధార్థుడుగా జన్మించడానికి పూర్వం గౌతమబుద్ధుడు కొన్ని వందల జన్మలెత్తినాడని బౌద్ధమతస్థుల నమ్మకం. పూర్వజన్మలలో బుద్ధుని జీవితచరిత్రలే జాతక కథలు. ఉత్తమ మానవ జన్మలనే కాకుండా పక్షిరాజుగా, గజేంద్రుడుగా ఎన్నెన్నో జన్మలను ఆయన యెత్తినట్లు జాతక కథలు పేర్కొంటున్నాయి. ఈ వివిధ జన్మలలో కొన్నింటికి సంబంధించిన ఘట్టాలను అజంతాచిత్రాలలో చూడవచ్చు. అయితే అజంతాచిత్రాలన్నీ జాతకకథలే కావు. జాతకకథలతో ఎలాంటి సంబంధం లేనివి ఎన్నో ఉన్నాయి. ఇంతేకాదు, వెలితిగా కాస్త చోటు కనబడితే చాలు, దానిలో ఏ ఆకునో, ఏ రెమ్మనో, ఏ పువ్వునో చిత్రించివేశారు. అదీ, ఇదీ కాకపోతే, ఆ కళాతపస్వులు తమ కుంచెతో ఇటొక గీతను, అటొక గీతను గీయడం ద్వారానే సౌందర్య సృష్టి చేశారు.

అజంతా గుహల నిర్మాణం క్రీస్తుశకం ప్రథమ శతాబ్దిలో ప్రారంభమైనట్లు ఏడవ శతాబ్ది మధ్య భాగంనాటికి సమాప్తి చెందినట్లు చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఇంచుమించు ఏడుశతాబ్దాల పాటు కొనసాగిన అజంతాగుహల అలంకరణలో చివరి రెండు వందల సంవత్సరాలలో జరిగిన కృషి సర్వోత్తమమైనదని కళాభిజ్ఞులు పలుకుతున్నారు. ఫెర్గుసన్ తీర్పు ప్రకారం, పద్నాల్గవ శతాబ్దిలో ఫైజాల్, ఆర్కాన్యాజా ఇటలీలో తలయెత్తడానికి ముందు అజంతాచిత్రాలకు సాటి రాగలిగినవి యూరప్‌లో లేవు.

www.apteachers.in

అజంతాచిత్రాలలో తొణికిసలాడుతున్న భారతీయ జీవితాన్ని, సంస్కృతిని ఏ విజాతీయ చిత్రకారులూ, వారెంతటి ప్రజ్ఞాసాధకులైనా, చిత్రించగలిగి ఉండేవారు కారు. పోయినవి పోగా, ఇప్పటికి మిగిలిఉన్న అజంతా చిత్రాలను చూసి, వివిధ భారతీయ జీవితాల్ని గురించి, సంస్కృతిని గురించి, ఎన్నెన్నో విషయాలు తెలుసుకోవచ్చు. నిజానికి వాటిని మన ప్రాచీన, సాంఘిక, సాంస్కృతిక చరిత్రలుగా యెంచవచ్చు.

ప్రాచీన కాలంలో భారత సాంఘిక వ్యవస్థ ఏ రూపంలో ఉండేది? అప్పటి వృత్తులేవి? వ్యాసంగాలేవి? వినోదాలేవి? ఇలా ప్రశ్నలకు సమాధానాలు కోరితే అజంతా గుహలకు వెళ్ళాలి. ఒకప్పుడు మన దేశంలో రాణ్మందిరాలు ఏ విధంగా వుండేవి? రాజుల, రాణుల వేషభాషలేవి? రాజసభలను ఏ విధంగా తీర్చేవారు? అప్పటి సైనిక బలనిర్మాణం ఏ తీరులో ఉండేది? నాటి ఆయుధాలేవి? ఇలాంటి ప్రశ్నలకు ప్రత్యుత్తరాలను కోరితే, అజంతాగుహలకు వెళ్ళాలి. ఇంతే కాదు అక్కడికి వెడితే, మనము ఎన్నో కోణాల సమేతంగా భారత సాయుధ బలాలను సింహళంపై దండయాత్రకు చేరవేసిన భారతీయ నౌకాదళాన్ని చూడవచ్చు. వీరశివాజీ రాజ్యానికై మహాసాగరాలను దాటి వెళ్ళాడన్న భారతీయ వణిక్కులను చూడవచ్చు. పర్శ్యన్ రాయబారులకు దర్శన మిస్తున్న భారతీయ మహీపాలకులను చూడవచ్చు. అన్నింటినీ మించి గౌతమ బుద్ధుని కారుణ్య సందేశం కేవలం మానవుని వికాసానికే కాక పశుపక్ష్యాదుల జీవితాన్ని సయితం ఎంత పునీతం చేసిందో, తేజోవంతం చేసిందో చూడవచ్చు. అందువల్ల అజంతాగుహలు యాత్రాస్థలం కావలసింది చిత్రకారులకే కాదు, భారతీయ చరిత్రలో, విజ్ఞానంలో, సంస్కృతిలో, భవితవ్యంలో శ్రద్ధాభక్తులు గలవారందరికీ.

H61UVQ

రచయిత పరిచయం

నార్ల వేంకటేశ్వరరావు,

నార్ల వేంకటేశ్వరరావు 1908 డిసెంబర్ ఒకటవ తేదీన కృష్ణాజిల్లాలోని 'కవుతరం' అనే గ్రామంలో జన్మించారు. ఈయన రష్యన్‌కథలు (అనువాద రచన), నరకంలో హరిశ్చంద్రుడు (నాటకం) నార్లవారి మాట (పద్యకావ్యం), మొదలైన గ్రంథాలు రచించారు. ఈయన పత్రికాసంపాదకుడు, కవి, విమర్శకుడు. నిరంతరం సమాజశ్రేయస్సు కోసం కృషిచేసిన మేధావి. నార్లవారి రచన సరళమైన శబ్దాలతో, సొగసైన భావాలతో సుందరశైలిలో సాగుతుంది.

ప్రక్రియ – యాత్రారచన

రచయిత తాను చూసిన ప్రదేశాన్ని గురించి వర్ణించే రచనే యాత్రారచన. దీనిలో ఆ ప్రదేశం ప్రత్యేకత, ప్రకృతి రామణీయకత, చరిత్ర వంటి అంశాలుంటాయి. రచయిత ఆత్మాశ్రయ శైలిలో భావాలను తెలియజేస్తాడు.

www.apteachers.in

ఇవి చేయండి

I. వినడం - మాట్లాడడం

1. మీరు ఏదైనా ప్రదేశాన్ని చూడడానికి వెళ్ళారా? ఆ ప్రదేశాన్ని గురించి చెప్పండి.
2. పాఠంలోని ఒక అంశాన్ని గ్రహించి అది మీకు ఎందుకు నచ్చిందో చెప్పండి.
3. పాఠం చదువుతుంటే మీకు వచ్చిన ఆలోచనలను, అనుభూతిని వివరించండి.

II. చదవడం, అవగాహన చేసుకోవడం

1. పాఠం చదవండి. వర్ణనతో కూడి ఉన్న ఐదు వాక్యాలను గుర్తించండి. వాటి కింద గీత గీయండి. చదివి వినిపించండి.

2. కింద సూచించిన పదాలతో మొదలయ్యే పేరాలు చదివి, సరిపోయే శీర్షికలను సూచించండి ?

పేరా	శీర్షిక
ఇటీవలనే	
వాఘోరానది పుట్టి ...	
గుహలగోడలకు ...	
అజంతా గుహల నిర్మాణం ...	
ఇక్కడ అందాలొలుకు ...	

3. కింది పేరా చదివి పట్టికను పూరించండి.

అజంతాగుహలు మొత్తం 29. వాటిలో 5 బౌద్ధ చైత్యాలైతే మిగిలినవి బౌద్ధ విహారాలు. మొత్తం 29లో మూడింటిని ప్రారంభించి పూర్తి చేయకుండానే ఆపివేశారు. ఇవి తప్ప మిగిలిన అన్నింటినీ చిత్రాలతో నింపివేశారు. కాని ఈనాడు పదమూడు గుహలలో మాత్రమే ఆ చిత్రాల శిథిలాలు కానవస్తున్నాయి. చెక్కు చెదరకుండా ఎన్నో కొన్ని చిత్రాలు మిగిలింది ఒకటవ, రెండవ, తొమ్మిదవ, పదవ, పదహారవ, పదిహేడవ గుహలలోనే. అజంతా గుహలలోని కొన్ని చిత్రాలకు నకళ్ళు వేయించి హైదరాబాదు పబ్లిక్ గార్డెన్స్‌లోని అజంతా పెవిలియన్‌లో భద్రపరిచారు.

అజంతాగుహలు

ప్రారంభించి వదలిన గుహలు	చెక్కుచెదరని చిత్రాలున్న గుహలు	శిథిలావస్థలో చిత్రాలున్న గుహలు	పూర్తిగా కనుమరుగైన చిత్రాల గుహలు	మొత్తం గుహలు

www.apteachers.in

4. పాఠం ఆధారంగా కింద ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

(అ) నార్ల వేంకటేశ్వరరావు గురించి రాయండి.

(ఆ) అజంతాగుహలు ఎక్కడ ఉన్నాయి? వాటి విశిష్టతను తెలపండి.

(ఇ) వాఘోరానది గురించి రాయండి.

(ఈ) నేడు అజంతాగుహలు ఏ స్థితిలో ఉన్నాయి?

(ఉ) అజంతా శిల్పాలలో ఏమేమి ప్రతిబింబిస్తాయి?

III. స్వీయరచన

1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.

(అ) మేజర్ గిల్ వేటకు వెళ్ళి తొలిసారిగా అజంతా గుహలను దర్శించినట్లు చదివారు కదా! దీనివల్ల మన దేశానికి జరిగిన మేలు ఏమని భావిస్తున్నారో రాయండి.

(ఆ) జవాహర్‌లాల్ నెహ్రూ "అజంతా మనను ఏదో స్వాప్నిక జగత్తులోకి తీసుకువెళుతుంది" అన్నాడు. ఆయన ఈ మాట ఎందుకు అన్నాడో రాయండి.

(ఇ) "ప్రాచీన కాలంలో భారత సాంఘిక వ్యవస్థ ఏ రూపంలో ఉండేది? అప్పటి వృత్తులేవి? ఈ ప్రశ్నలకు సమాధానాలు కోరితే అజంతా గుహలకు వెళ్ళాలి" ఇలా అనడం వెనుక నార్ల వేంకటేశ్వరరావుగారి భావం ఏమై ఉంటుందో రాయండి.

(ఈ) "అజంతా గుహలను చూడడానికి రెండు కళ్ళు చాలవు" అని రచయిత అన్నాడు కదా! ఇలా 'రెండు కళ్ళు చాలవు' అనే మాటను ఇంకా ఏయే సందర్భాలలో వాడతారు? కొన్నింటిని తెలపండి.

2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో జవాబులు రాయండి.

(అ) ప్రస్తుత పాఠ్యభాగం ద్వారా అజంతా గొప్పతనాన్ని వివరిస్తూ ఒకవ్యాసం రాయండి.

(ఆ) రచయిత అజంతా చూసి అక్కడి విశేషాలు రాశాడు కదా! అలాగే మీరు చూసిన లేదా తెలిసికొన్న ఒక దర్శనీయ స్థలానికి సంబంధించిన విషయాలు రాయండి.

SCERT ANDHRA PRADESH

IV. పదజాలం

1. కింది వాక్యాలలోని జాతీయాలకు సరిపోయే అర్థం గ్రహించి సరైన సమాధానం కింద గీత గీయండి.

(అ) అజంతా గుహలోని కుడ్యచిత్రాలు నేటికీ చెక్కు చెదరలేదు.

i) చెదిరిపోలేదు, ii) ఏమీ పాడు కాలేదు, iii) చెక్కబడలేదు iv) శిథిలం కాలేదు.

(ఆ) దొంగలు అజంతా గుహలో తల దాచుకున్నారు.

i) తలను దాచుకున్నారు, ii) వస్తువులు దాచుకున్నారు, iii) ఆశ్రయం పొందారు iv) నివసించారు.

(ఇ) అజంతా చిత్రాలు భారతీయ సంస్కృతిని కళ్ళకుకట్టినట్టు చూపుతున్నాయి.

i) కళ్ళకు కట్టుకున్నట్టు చూపుతున్నాయి ii) కళ్ళ ముందు నిజంగా ఉన్నట్టు చూపుతున్నాయి

iii) చాలా మంచి విషయాలు చూపుతున్నాయి iv) కళ్ళు చెదిరేట్టుగా ఉన్నాయి.

2. కింది వాక్యాలలో గీత గీసిన పదాన్ని మరో సందర్భానికి అన్వయించి వాక్యాలు తిరిగి రాయండి.

ఉదా : అనంతాకాశంలోని నక్షత్రాలను పరిశీలించి ఆ అనుభూతిని చెప్పగలమా?

మంచి కథను చదివితే గొప్ప అనుభూతి కలుగుతుంది.

అ. భారతీయ చిత్రకళ మహోన్నత శిఖరాలను అధిరోహించింది.

ఆ. చెక్కడపు పని మేజర్ గిల్ దృష్టిని ఆకర్షించింది.

ఇ. కాలగతిలో కొన్నిచిత్రాలు నశించాయి.

ఈ. ఈ కుడ్యచిత్రాలను చిత్రించిన వారు బౌద్ధభిక్షువులు.

www.apteachers.in

3. కింది వాక్యాలలోని పర్యాయపదాలను గుర్తించి వాటి కింద గీత గీయండి.

(అ) హృదయాన్ని కదలించే అనుభూతిని, ఆ ఎదలోని భావాలను సులభంగా వర్ణించలేం.

(ఆ) వాఘోరానది కొండల చుట్టూ తిరుగుతూ ప్రవహించింది. ఆ వాహిని ప్రవహించే దృశ్యం మనోహరం.

(ఇ) పడమటిగాలి సన్నగా వీస్తూంది. – పశ్చిమదిశ వైపు ఒక సుందరమైన తోట ఉంది.

V. సృజనాత్మకత –

అజంతా చిత్రాల పాఠంలో అజంతా గుహల చరిత్ర, దాని విశేషాలూ చదివారు కదా! అలాగే ప్రతి గ్రామానికీ ఒక చరిత్ర కానీ, విశేషం కానీ ఉండవచ్చు. మీ గ్రామానికి గల ప్రత్యేకతను లేదా మీకు దగ్గరలోని ఇతర గ్రామాల ప్రత్యేకతను వర్ణిస్తూ రాయండి. ఆ వివరాలతో ఒక బ్రోచర్ తయారు చేయండి.

(లేదా)

చుట్టూ ఎత్తైనకొండలు, ఆ కొండలనుండి జలజలా జాలువారే జలపాతాలు, పచ్చని ప్రకృతి శోభ, పక్షుల కిలకిలారావాలతో ఆ ప్రదేశం ఎంతో సుమనోహరంగా ఉంది ...... ఇలా ఏదైనా ఒక ప్రాంతాన్ని వర్ణిస్తూ రాయండి.

VI. ప్రశంస

మీరు చూసిన ఒక దర్శనీయ స్థలాన్ని కొనియాడుతూ 'నీవు కూడా తప్పక చూడవలసింది' గా తెలుపుతూ మీ మిత్రుడికి లేఖ రాయండి.

SCERT ANDHRA PRA

H63GKJ

VII. భాషను గురించి తెలుసుకొందాం.

1. కింది వాక్యాలను పరిశీలించి, మార్పులను గమనించండి.

(అ) సంఘసంస్కర్తలు దురాచారాలను నిర్మూలించారు.

(ఆ) సంఘసంస్కర్తల చేత దురాచారాలు నిర్మూలించబడ్డాయి.

పై రెండు వాక్యాల అర్థం ఒక్కటే. కానీ వాక్య నిర్మాణంలో భేదం ఉందని గమనించారు కదా! రెండు వాక్యాల మధ్య భేదం ఏమిటి ?

1. సంఘసంస్కర్తలు దురాచారాలను నిర్మూలించారు. అనే ఈ మొదటి వాక్యంలో కర్తకు ప్రాధాన్యం ఉంది. అంటే క్రియ కర్తను సూచిస్తుంది. కర్మకు ద్వితీయా విభక్తి ప్రత్యయం చేరి ఉంది. ఇలాంటి వాక్యాన్ని 'కర్తరి వాక్యం' అంటారు.

   ఇక సంఘసంస్కర్తల చేత దురాచారాలు నిర్మూలించబడ్డాయి. అనే రెండవ వాక్యంలో (i) కర్తకు తృతీయా విభక్తి ప్రత్యయం ఉంది (ii) క్రియకు "బడు" చేరింది. (iii) క్రియ – కర్మ ప్రధానంగా ఉంది. వాక్యంలో క్రియకు 'బడు' చేరి, కర్తకు తృతీయా విభక్తి ప్రత్యయం చేరే వాక్యాన్ని "కర్మణి వాక్యం" అంటారు.

www.apteachers.in

2. కింది కర్తరి వాక్యాలను కర్మణి వాక్యాలుగా రాయండి.

(అ) వాల్మీకి రామాయణాన్ని రచించాడు.

(ఆ) ప్రజలు శాంతిని కోరుతున్నారు.

3. కింది కర్మణి వాక్యాలను కర్తరి వాక్యాలుగా రాయండి.

(అ) లైబ్రరీ నుంచి తెచ్చిన పుస్తకం నాచేత చదవబడింది.

(ఆ) నాచే రచింపబడిన గ్రంథం నేతాజీచరిత్ర.

4. కింది సమాసపదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాసం పేరు తెలపండి.

	సమాస పదం	విగ్రహ వాక్యం	సమాసం పేరు
ఉదా –	నదిగట్టు	నది యొక్క గట్టు	షష్ఠీతత్పురుష
	(అ) అజంతాస్త్రీలు		
	(ఆ) ప్రకృతిసౌందర్యం		
	(ఇ) నదీప్రవాహం		

5. కింది విగ్రహవాక్యాలకు సమాస పదాలు రాసి దాని పేరును తెలపండి.

	విగ్రహ వాక్యం	సమాస పదం	సమాసం పేరు
ఉదా –	(అ) గుహల యొక్క గోడ		
	(ఆ) కొండ యొక్క మలుపు		

ప్రాజెక్టు పని

1. మీ జిల్లాలోని దర్శనీయస్థలాలు, పర్యాటకప్రదేశాల చిత్రాలు సేకరించండి. వీటి వివరాలు రాయండి. వీటన్నిటితో ఒక సంకలనం తయారుచేసి ప్రదర్శించండి.

పునరభ్యసనం (వెనుకబడిన విద్యార్థుల కొరకు)

1. పాఠ్యాంశాలలోని పదాల జాబితాను ఉపాధ్యాయుడు తయారుచేసి చదివించాలి.
2. విద్యార్థులచే ఉక్తలేఖనం రాయించాలి. దోషాలు సవరించాలి.
3. పాఠ్యాంశ సారాంశాన్ని 4 లేదా 5 వాక్యాలలో నల్లబల్లపై రాసి విద్యార్థులచే చదివించాలి, రాయించాలి, దోషాలు సవరించాలి.

H6749G

నేనివి చేయగలనా ?

1. అనుభూతులను, ఆలోచనలను వివరించగలను. ఔను / కాదు
2. పేరాలకు తగిన శీర్షికలు రాయగలను. ఔను / కాదు
3. అజంతా గొప్పదనాన్ని / సందర్శించిన స్థలం గొప్పదనాన్ని వివరిస్తూ సొంతమాటల్లో రాయగలను. ఔను / కాదు
4. నేను చూసిన ప్రదేశాన్ని గురించి వర్ణించగలను. బ్రోచర్ తయారు చేయగలను. ఔను / కాదు

www.apteachers.in

6. గుశ్వం

(ఉపవాచకం) - బాలల అకాడమి

జానపద గాథలలో "పరమానందయ్యగారి శిష్యుల కథలు" ఎంతో వినోదాన్ని కలిగిస్తూ ఉంటాయి. ఆయన శిష్యుల చర్యలు, చేష్టలు నవ్వు పుట్టిస్తూ ఉంటాయి. పరమానందయ్య శిష్యుల కథలని చెప్పుకొనే వాటిలో ఒక కథ ఈ నాటికకు ఆధారం.

www.apteachers.in

పాత్రలు

పరమానందయ్యగారు, చెన్నడు, గున్నడు, తిన్నడు, పెద్దమనిషి.

మొదటి రంగం

(పరమానందయ్యగారి ఆశ్రమం : చెట్టుకింద తిన్నెమీద కూర్చుని పరమానందయ్యగారు శిష్యులకు పాఠం చెపుతూ ఉంటారు. శిష్యులు కింద చాపమీద భక్తిశ్రద్ధలు చూపుతూ ఆయనకు ఎదురుగా కూర్చుని ఉంటారు.)

పరమా: చెప్పు, చెన్నడూ! చెప్పు! గుళ్ళము .... చెప్పు!

చెన్నడు: గుల్లము - గుల్లము.

పరమా: గుల్ల మేమిట్రా? గుళ్ళము అను.

చెన్నడు: గుల్లము.

పరమా: కాదురా, 'ళ', బండిరా.

చెన్నడు: బండిరా అండీ? అలా చెప్పరేం? మరండీ, అందుచేతనేనండి నాకా మాట రావటం లేదు.

పరమా: ఎలా చెప్పమంటావురా?

చెన్నడు: ఇప్పుడు చెప్పారుగాదండి బండిరా అని. అదే ...

పరమా: ఏమదేరా?

చెన్నడు: గుల్లంలో బండిరా ఉందన్నారుగా? గుల్లము, బండి కూడా ఒక్కసారి నాకు నోట పట్టటం లేదండి.

గున్నడు: ఔనండి గురువుగారూ! వాడి నోరు బొత్తిగా చిన్నదండి. బళ్ళు, రాళ్ళు అసలు పట్టవు... మరో మాట చెప్పండి.

పరమా: మొదట్లోనే అలా చెప్పమని ఏడవకపోయావూ? సరే గున్నడూ? నువ్వు చెప్పు అశ్వం.

గున్నడు: అంటే ఏమిటండీ.

పరమా: అశ్వం రా ... అశ్వం ... అంటే గుర్రమన్న మాట.

చెన్నడు: అశ్వం గుర్రం ఎలా అవుతుందండి? గురువుగారూ! ... నాకు తెలియక అడుగుతానుకానీ ... బొత్తిగానూ!

పరమా: అశ్వము గుర్రం అవడం కాదురా ... రెండు మాటలకూ ఒకటే అర్థం. అశ్వం అనే మాట సంస్కృతమూ, గుర్రమనే మాట తెనుగూనూ!

గున్నడు: అలాగండీ! ఈ రెండు మాటలూ వచ్చేస్తే తెలుగూ, సంస్కృతమూ రెండు భాషలూ వచ్చేస్తాయన్నమాట.

చెన్నడు: అయితే గురువుగారూ! రెండు మాటలు రెండు ఘడియల్లో కంఠతాపట్టేసి వప్పచెప్తామండీ. అలా చెట్టు కింద కూర్చుని వల్లెవేసుకొొస్తాం.

వరమా: సరే పొండి. శ్రద్ధగా వల్లెవేసి చెప్పండి. నేను ఈలోగా పూజ పూర్తిచేసుకొని వస్తాను (వెడతాడు).

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

చెన్నడు: ఒరే గున్నా. అబ్బా! ఎంత అదృష్టవంతులంరా మనం! రెండూ ... రెండు భాషలు వచ్చేస్తున్నాయి మనకి.

గున్నడు: ఏమిట్రోయ్, రెండూ నీకే అన్నట్టుగా మాట్లాడుతున్నావ్! ఒకటి నాదీ.

చెన్నడు: నీదెలా అవుతుంది. ఒకటి నాది, రెండు నీదీని......

గున్నడు: ఒరేయ్ గుర్రం అని నువ్వనలేకపోతే నేను గురువుగారిని ఇంకో మాట చెప్పమని అడిగానా? అప్పుడు ఆయన ఏమని చెప్పార్రా....?

చెన్నడు: అవును చెప్పారు.... నాకోసం చెప్పారు కనుక అశ్వం నాదీ, గుర్రం నీదీను.

గున్నడు: నే నొప్పుకోను, నాది అశ్వం.

చెన్నడు: కాదు, గుర్రం నీది.

(గబగబ అంటూ ఇద్దరూ పోటీపడతారు)

చెన్నడు: ఒరేయ్ ! నువ్వలా పేచీ పెట్టావంటే గురువుగారితో చెబుతాను.

గున్నడు: గురువుగారితో చెబితే ఇద్దర్నీ తిడతారు. ఒరేయ్ చెన్నా నీకు తెలియదు కాబోలు!

చెన్నడు: అవునురోయ్-నిజమే ఆ మాట ! పిచ్చి మొద్దుల్లారా ! ప్రతిదానికీ అలా దెబ్బలాడుకొంటారుట్రా? ఏదో కూడబలుక్కుని, సమాధానపడి, కలిసికట్టుగా పనిచేసుకోవాలిగానీ, అంటారు. అప్పుడేం చేస్తాం?

గున్నడు: అందుకోసం సమాధానపడదాంరా, చెన్నా! ఏం?

చెన్నడు: సమాధానపడడం ఎలాగురా? గున్నా!

గున్నడు: ఎలాగంటే నేను చెబుతానుగా! జాగ్రత్తగా వినరా చెన్నా! ఏమంటే మొట్టమొదట గురువుగారు చెప్పినది... గుల్లమనేగా?

చెన్నడు: అవును, అందులో బండిరా ఉందిగా, అది నాకు రాలేదుగా-

గున్నడు: రాకపోతేనేం? నాకు చెప్పిన అశ్వం ఉందిగా! నీ మాటలో బండిరా ఉన్నచోట నా మాటలోని -శ్వ- పెట్టేస్తే సరి!

చెన్నడు: ఏమిటేమిటి? ఇట్టే చెప్పేశావురా! నాకు అట్టే అర్థమవలేదురా! విడమరచి చెప్పరా! అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు........

గున్నడు: ఏమంటే, అర్థంచేసుకొంటూ విను-వింటూ అర్థంచేసుకో - తెలిసిందా? ఏమంటే ! గుర్రములోని 'ఱ' తీసేసి, అశ్వంలోని 'శ్వ' ను 'ఱ'ఉన్నచోట పెట్టేయడమే రా!

చెన్నడు: బలే ఆలోచనరా! అప్పుడెలా అనాలి? గుల్లము అశ్వము బదులు శ్వ శ్వ ఆ! అరె! గుశ్వము-ఒరేయ్ గున్నా, వచ్చేసిందిరా గుశ్వము. గుశ్వమురా గున్నా! గుశ్వం..... గుశ్వం (అంటూ ఆనందంతో ఎగురుతూ గంతు లేస్తాడు)

గున్నడు: (చెన్నడితోపాటు సంతోషంతో తిరుగుతూ చెన్నడిని నిలబెట్టి) అదీ! చూడు, ఇప్పుడు నీకు నోరూ పడుతుంది, మన రెండు మాటలూ కలిసి ఒక సమాధానమూ కుదిరింది. బావుందిరా! చాలా బాగుంది. కాదురా!

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

చెన్నా పద...... మన గురువుగారికి దీన్ని – ఏది ఈ గుశ్వాన్ని– వప్ప జెప్పేస్తే పాఠం వప్పచెప్పినందుకు మనల్ని ఎంతో మెచ్చుకుంటార్రా పద.....పద.....

చెన్నడు: పద, పదరా బాబూ– నాకు ఆనందం ఆగటం లేదు. అంతా ఉక్కిరి బిక్కిరి అయిపోతూంది. అరుగో గురువుగారు!

ఇద్దరు: గురువుగారూ ! గురువుగారూ! వచ్చేసిందండి, ఇద్దరికీ కంఠతా వచ్చేసింది, గుశ్వమూ......

పరమా: ఏమి వచ్చేసిందిరా?

ఇద్దరూ: గుశ్వమండి! గుశ్వం

పరమా: గుశ్వమేమిటిరా? గుశ్వం రావడమేమిటర్రా? గుశ్వమూ

చెన్నడు: గుశ్వమేనండి గుశ్వం..... గుశ్వం

పరమా: ఇదెక్కడొచ్చిందిరా ? ఎప్పుడూ వినలేదూ......!

చెన్నడు: అలా అడగండి చెబుతాను గురువుగారు? నాకు గుల్లం చెప్పారా! అందులో నాకు బండిరా రాలేదుగా.

గున్నడు : నాకు అశ్వము చెప్పారా? అది నాకు వచ్చేసిందా?.......

చెన్నడు : వాడికి వొచ్చినదీ, నాకు రానిదీ రెంటినీ కలిపి, ఇద్దరికీ వొచ్చేట్టు చేసేశాం, గురువుగారూ! కలిసికట్టుగా ఉండాలని రెండూ కలిపేశాం. అప్పుడు గుశ్వము అయిందండీ. ఓ మాటలో గుశ్వం అయి ఊరుకుంది గురువుగారూ!

గున్నడు: రెండు భాషలూ కలిపేసి నేర్చేసుకుంటున్నాం గురువుగారూ!

పరమా: ఏడిచినట్టే ఉంది మీ నేర్చుకోవడం, మీరూను....!శివ శివ శివ శివ శివా!

చెన్నడు : గురువుగారూ అదేమిటండీ! గురువుగారూ! అలా అనేశారేమిటండీ! గురువుగారూ! తప్పయితే మీరు మమ్మల్ని క్షమించాలి! గురువుగారూ! క్షమించేసెయ్యాలి!

పరమా: శివ శివా ! ఏం క్షమించమంటార్రా ? మీ తెలివి అంతా విషమించిపోతూ ఉంటేనూ.....!

ఇద్దరూ: విషమించడమా? అంటే ! విషమే .... అయ్యబాబోయ్...... విషమేనాండీ?

పరమా: మీ మొహం.... చెప్పిన ఒక మాటైనా నోట పట్టని శుంఠలు .....ఎలా చచ్చేదిరా మీతోటి!

ఇద్దరూ: చచ్చిపోవద్దు, గురువుగారూ! మీరు చచ్చిపోతే మేము బతికి ఉండేటంత తెలితక్కువవాళ్ళమా గురువుగారూ! (బతిమలాడుతూ) గురువుగారూ ! నోరు తిరిగే ఇంకో మాట చెప్పి పుణ్యం కట్టుకోండి!

గున్నడు: గురువుగారూ ! క్షమించి ఇంకో మాట చెప్పండి!

పరమా: సరే చెబుతాను ఏడవండి. తురగము.

చెన్నడు: మేం తిరగమండీ!

గున్నడు: ఎక్కడా తిరగము గురువుగారూ! ఇక్కడ ఉండే వల్లెవేస్తాం. చెప్పండయ్యా.

పరమా: తిరగడం కాదురా.......తురగము అనండి, గుర్రం రాకపోతే.

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

చెన్నడు: గుఱ్ఱం రాకపోతే తిరగడమెలా తిరుగుతాము గురువుగారూ?

గున్నడు: అది గాదురా! గుఱ్ఱం వచ్చినా తిరగమని చెప్పరా. తిరగమండయ్యా. గురువుగారూ గుఱ్ఱం వచ్చినా తిరగం. చచ్చినా తిరగం. మీరు చచ్చిపోయినంత ఒట్టే! తిరగం తిరగం!

పరమా: హరీ హరీ! నేను చావనూ వద్దూ, మీరు తిరగనూ వద్దు పోండి, అవతలకు పోండి!

చెన్నడు: అది గాదండీ............

పరమా: కాకపోతే, ఏమిట్రా నీ మొహం ! శివ శివ ...... మీకు గుఱ్ఱమూ రాదు, అశ్వమూ రాదు, తురగమూ రాదు. శివ శివ – మీకే రానిది నాకేం చేసి పెడతారురా! గుఱ్ఱం మాట నేర్పితే, గుఱ్ఱాన్ని సంపాదించుకు వచ్చి, దానిమీద నన్ను కూర్చోబెట్టి, కాశీకి తీసుకు వెడతారనుకున్నానా! శివ శివ శివ వాడేడిరా మూడోవాడు.....? తిన్నడూ?

తిన్నడు: గురువుగారూ! గురువుగారూ! వచ్చేశానండీ .....పట్టేశానండి. పట్టేసి, వచ్చేశానండీ గురువుగారూ.....! (వగర్చుకొంటూ, ఆపసోపాలు పడతాడు)

పరమా: ఏం పట్టేశావురా? అంత ఆయాసమెందుకురా? కూర్చోరా.......ఆయాసం తీర్చుకోరా, ముందు స్తిమితపడరా, అప్పుడు చెప్పు!

తిన్నడు: పట్టేశానండీ......గుఱ్ఱం, గుఱ్ఱం గుడ్డూ కూడా పట్టేశానండీ.

పరమా: గుఱ్ఱమా? గుఱ్ఱంగుడ్డా? ఏం పట్టేశావురా?

తిన్నడు: రెండూ పట్టేశానండి, రెండండీ, రెండూ పట్టేశానండి, గురువుగారూ!

పరమా: ఏమిట్రా ? స్తిమితపడి చెప్పురా.... ఏం పట్టేశావూ? ఎక్కడ పట్టేశావూ?

(తిన్నడు ఆయాసపడుతూ చెబుతూ ఉంటే చెన్నడు వాడికి విసనకఱ్ఱలతో విసురుతూ తాను కూడా ఆయాసపడుతూ ఉంటాడు)

SCERT ANDHRA PRADESH

తిన్నడు: చెప్తానండి. మీకు గుఱ్ఱము ఎక్కాలనే కోరిక ఉన్నదని తెలుసుకొన్నటువంటివాడనై అద్దానిని ఎక్కడ ఉన్నా అంగ, వంగ, కళింగ, కాశ్మీర, నేపాళ, ఘూర్జర .... ఛప్పన్న దేశాలలో ఎక్కడ ఉన్నా పట్టుకొని వచ్చి, మీ పాదాలకడ ఉంచాలని బయలుదేరానండి ....కాని అదృష్టవశాత్తూ దగ్గరలోనే అది దొరికిందండి.

పరమా: అలాగట్రా, తిన్నడూ! ఎక్కడ దొరికిందిరా? నా నాయన! నా నాయన! చెప్పు చెప్పు ......

తిన్నడు: మన మఠానికి పది కోసుల్లో ఓ చెరువు గట్టున రెండు ఆడగుఱ్ఱాలు మేస్తున్నాయండి. బలేగా ఉందని అనుకొని ఆ గుఱ్ఱాల ఆసామిని అడిగానండి 'గుడ్లు అమ్ముతావా?' అని అతడు నాకేసి అట్టే పైకి కిందికి చూసి అమ్ముతానన్నాడండి. అయితే, 'ఎంత వెల?' చెప్పమన్నానండి. పది వరహాలిచ్చి పట్టుకు వెళ్ళమన్నాడండి. ఆపళంగా పరుగెత్తుకొంటూ వచ్చేశానండి. పది వరహా లిచ్చేయండి గురువుగారూ... పట్టుకొచ్చేస్తాను గురువుగారూ ! గుఱ్ఱంగుడ్డు పట్టుకొచ్చేస్తానండి.

పరమా: ఆఁ ఆఁ ఎంత పని చేసుకొచ్చావురా నాయనా......శిష్యుడంటే నువ్వేరా!

తిన్నడు: చిత్తమండి గురువుగారూ!...... మీ ఆశీర్వచన ఫలితమండి గురువుగారూ.

పరమా: వత్సా! ఆ గ్రుడ్లు శ్రేష్ఠమైనవేనా.....? ప్రశస్తమైనవేనా!

తిన్నడు: అయ్యో గురువుగారూ! రెండూనండి! రెండూ రెండేనండీ! పదివరహాలిచ్చేయండి.....పట్టుకొచ్చేస్తా! పరుగెత్తుకుని వెళ్ళి, పట్టుకొని పరుగెత్తుకొని వచ్చేస్తా.

పరమా: ఔనురా-ఔను-అది అవశ్యం ఆచరణీయమే కాని, కాస్త ఆలోచనీయం కూడాను - (ఆకాశం వైపు చూస్తూ ఆలోచిస్తాడు)

చెన్నడు: ఆలోచించకండి గురువుగారూ!.... ఇచ్చేయండి పట్టుకొస్తాం .....ఆలోచన అనవసరమండీ! ఇలాగ ఆలోచిస్తూ కూర్చుంటే అవకాశం జారిపోతుందండీ.....

గున్నడు: మాకు గుర్రము అనేమాట రాకపోయినా మీకు గుర్రమైనా వస్తుంది.... మమ్మల్ని పంపించండి..... మోసుకొచ్చేస్తాం ఆలోచించకండి. ఆలోచిస్తూ కూర్చుంటే, ఆలస్యం అయిపోతుంది.

చెన్నడు: 'ఆలస్యం అమృతం విషం' అన్నారుగా మీరు. గురువుగారూ! జ్ఞాపకం చేసుకోండి.

పరమా: అయితే, తలిచినప్పుడేనా తాత పెళ్ళి?

తిన్నడు: తాత పెళ్ళాండి? గురువుగారూ ! బలే! బలే.....! గుర్రాన్ని తీసుకొచ్చేస్తే దానిమీద ఎక్కి సవారి చేస్తూ అందరమూ తాత పెళ్ళికి తరలి వెళ్ళొచ్చు కదండీ!

చెన్నడు: ఔనౌను ......చల్ చల్ చల్ చల్ ......(అంటూ అందరూ గుర్రం ఎక్కినట్లు తిరుగుతారు)

గున్నడు: గురువుగారూ!.....ఆలోచించకండి........

పరమా: ఆలోచించకుండా ఎలాగురా? గుర్రంగుడ్డు గాని, గుర్రం కాదుగా!

చెన్నడు: అయితే నేమండి గుర్రం గాక, గుర్రంగుడ్డు కావటం మంచిదండీ!

పరమా: దాన్ని పొదగవద్దూ ? ఎవరు పొదుగుతారు?

చెన్నడు: మేమంతా లేమూ గురువుగారూ! అంత చేతగానివాళ్ళమా గురువుగారూ?

గున్నడు: పొదగబెట్టడమే గాదు, ఎదగ బెడతాం కూడానూ......

తిన్నడు: ఇందులో ఇంకొక ధర్మసూక్ష్మం కూడా ఉంది. గమనించండి గరువుగారూ! గుడ్డు దగ్గర్నించీ పొదిగి ఎదిగిన గుఱ్ఱం మనం చెప్పినమాట వింటుంది. అదే ఎదిగిన గుర్రం అయితే మన మాట వినదు. ఎగిరి తన్నుతుంది. అది చాలా ప్రమాదకరం కనుక పది వరహాలు ఇచ్చేయ్యండయ్యా మోసుకొచ్చేస్తాం.... గురువుగారూ......

పరమా: సరే! ఇంతగా సరదా పడుతున్నారు కనుక ఆ గుడ్డు పట్టుకురండి. అమ్మగారి నడిగి సొమ్ము పట్టుకెళ్ళండి. జాగ్రత్తగా వెళ్ళిరండి. గుడ్లు మొయ్య లేకపోతే, మీరు ముగ్గురూ వంతు లేసుకుని భుజాలు మార్చుకోండి. చెట్లంటా గుట్లంటా జాగ్రత్తగా వెళ్ళిరండి.

అందరూ: వెళ్ళి వస్తాం గురువుగారూ, నమస్కారం.!

పరమా: శుభం. క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగిరండి.

SCERT ANDHRA PRADESH

రెండవ రంగం

(పొలాల మధ్య గట్టుదారి. ఒక బూడిద గుమ్మడికాయను గుడ్డలో మూటకట్టి, దాన్ని ఒక కర్రకు వేలాడకట్టి ఇద్దరు శిష్యులు తమ భుజాలమీద ఆ కర్రను పెట్టుకొని మోసుకొస్తూ ఉంటారు. మూడో శిష్యుడు హుషారిస్తూ ఉంటాడు.)

అందరు: ఓం ఓం ఓం ఓం.

చెన్నడు: ఒరేయ్ గున్నడూ ! భుజం మార్చుకోరా.

గున్నడు: ఛేస్! భుజమంతా తెల్లగా బూడిదయ్యింది. ఇందాకా భుజంమీద మోసుకొస్తేనూ......

తిన్నడు: గుడ్డా? మరోటా? అయితే అయింది., జాగ్రత్తగా మోసుకురారా! మన మఠం దగ్గరకు వచ్చేస్తున్నాం!

గున్నడు: కర్రకు కట్టి మోసుకొస్తున్నాం కనుక కొంత సులువు అయింది.

తిన్నడు: ఔను. ఈ కొండ దాటామంటే మన ఆశ్రమం అల్లంత దూరంలో కనపడుతూ ఉంటుంది. ఆశ్రమం బయట గురువుగారు నుంచుని మనకోసం ఎదురు చూస్తూ ఉంటారు.

చెన్నడు: ఒరేయ్ ! చెట్టుకొమ్మలు రా, వంగి నడవరా! లేకపోతే కొమ్మలు రాసుకొని గుడ్లు గీతగా పడిపోతుంది.

గున్నడు: ఆ, కొమ్మ కిందికి వచ్చేశాక చెబుతారేం రా (ధ్వని) అరే అనుకున్నంత పనీ అయింది. కర్ర జారిపోయి గుడ్డు కింద పడిపోయిందిరోయ్!

తిన్నడు: అయ్యో, గుడ్డు పగిలిపోయిందిరోయ్!

చెన్నడు: పోతే పోయిందిగాని- ఒరేయ్ పిల్ల ఊడిపడిందిరోయ్. బలే, బలే.........

(మూట కిందపడి కాయ పగులుతుంది. అదే సమయంలో ఆ పొదలచాటు నుండి ఒక తెల్లటి కుందేలు బెదురుతూ పారిపోతుంది.)

గున్నడు: ఆ డొంకలోకి పిల్ల పారిపోయిందిరోయ్.

తిన్నడు: అరెరె! ఎలాగ? గుడ్డూ పోయి, పిల్లా పోయి......

చెన్నడు: వెదుకుదాం పదండి. అదిగో అది పారిపోతోంది.

గున్నడు: అరే! తెల్లగా బొద్దుగా చెవులూ అదీ.......మా బలేగా ఉంది. అరెరే.....మా అందమైన గుర్రం గుడ్డు పిల్లరా! ఇట్టే జారిపోయిందిరా! చూస్తూ కూడా దాన్ని పట్టుకోలేకపోయామేమిటి? చెన్నా?

చెన్నడు: ఏం చెప్పమంటావురా? చేతుల్లో దొరికి వేళ్ళమధ్యనుండి జారిపోయిందిరా, అయ్యయ్యో (ఏడుస్తాడు)

తిన్నడు: ఏడువకురా చెన్నా! నువ్వు ఏడిస్తే గున్నడు కూడా ఏడుస్తాడురా.........అప్పుడు నాకు కూడా ఏడుపొచ్చేస్తుందిరా!

గున్నడు: ఏడుపు వస్తున్నపుడు, ఏడవ వద్దంటే, ఎలా ఏడవడంరా? ఒరేయ్-ఏడుస్తూ కూర్చోడం కాదురా-ఏడుస్తూనే గుర్రం గుడ్డు పిల్లకోసం వెదుకుదాం, పదండిరా! ఈ తుప్పలూ గిప్పలూ, ముళ్ళూ గీసుకుపోయినా సరే-వెదుకుదాం పదండిరా!

చెన్నడు: అలాగే పదండిరా! ఏడుస్తూనే వెదుకుదాం ఏంచేస్తాం? పదండి!

గున్నడు: గుర్రంగుడ్డూ లేక, గుర్రంగుడ్డుపిల్లా లేక గురువుగారి మొహం ఎలా చూస్తాంమురా?

తిన్నడు: గురువుగారూ! గురువుగారూ! ఎంత పని జరిగిపోయిందండీ? (ఏడుస్తాడు)

చెన్నడు: (ఏడుస్తూ) ఏడవకురా! వెదకరా!

SCERT ANDHRA PRADESH

గున్నడు: పదరా, నువ్వు ఆ పక్కకు పరుగెత్తు, నే నీపక్కకు పరుగెడతాను. పొలాలన్నీ వెతికేద్దాం.

(విచారంగా ముగ్గురూ అక్కడంతా వెదుకుతూ, మూడు వైపులకూ వెడతారు.)

మూడవ రంగం

(ఆశ్రమంలో పరమానందయ్యగారు శిష్యులకోసం ఎదురు చూస్తూ ఉంటారు. అంతలో శిష్యులు ముగ్గురూ వచ్చి ఆయన పాదాల మీద పడతారు.)

చెన్నడు: మీ పాదాలకు దండాలు గురువుగారూ!

గున్నడు: సాష్టాంగ దండ ప్రణామాలు గురువుగారూ.

తిన్నడు: అనేకకోటి దండాలు గురువుగారూ!

పరమా: అయ్యో! అయ్యో! అదేమిటర్రా-చెన్నా, గున్నా, తిన్నా లేవండిరా- లేచి నిలబడండిరా- ఏంచేశారు?

చెన్నడు: చావలేక బతికి వచ్చాం గురువుగారూ!

గున్నడు: బతకలేక చచ్చి వచ్చాం గురువుగారూ!

తిన్నడు: చావూ కాక బతుకూ కాక, ఇక్కడకు వచ్చిపడ్డాం గురువుగారూ!

పరమా: ఏమిట్రా -ఏం జరిగింది? ఒంటినిండా ఈ రక్కు లేమిటి? ఈ రక్తా లేమిటి?

చెన్నడు: గుర్రంగుడ్డుపిల్లకోసం పరుగెత్తి పాటుపడ్డాం గురువుగారూ!

గున్నడు: చెట్లంటా గుట్లంటా పరుగులెత్తి పడి, దొర్లి ఇలా అయిపోయాము- గురువుగారూ!

తిన్నడు: పది ఆమడలూ పాటుపడ్డాం గురువుగారూ!

పరమా: ఇంతకీ ఆ గుఱ్ఱంగుడ్డుపిల్ల ఏదర్రా!

తిన్నడు: అది పారిపోయింది గురువుగారూ! దొరకలేదండీ.

చెన్నడు: గుడ్డు పగిలి పిల్ల గంతేసి పారిపోయిందండి.

గున్నడు: మా కళ్ళ ముందే తుర్రుమందండి.

పరమా: పోనీ ఆ పగిలిన ముక్కలేవర్రా?

చెన్నడు: ఇవిగో గురువుగారూ! ముక్కలన్నీ ఏరుకొచ్చామండీ-- కొంచెం కూడా వదిలెయ్యకుండా!

పరమా: ఆc......ఇదేమిటర్రా ఇదేమి గుఱ్ఱం గుడ్డర్రా! శివ శివా. ఇవి బూడిదగుమ్మడికాయ ముక్కలురా-- అయ్యయ్యో ఒకటి చెప్పి, మరొకటి చూపి, ఇంకొకటి పట్టుకొచ్చారేమర్రా!

(తిన్నెమీద కూలబడతాడు)

చెన్నడు: బూడిద గుమ్మడికాయాండి? అంటే?

గున్నడు: గుమ్మడికాయ కానిది బూడిద గుమ్మడికాయ కాబోలురా....

తిన్నడు: బూడిద పూసుకొన్న గుమ్మడికాయను బూడిద గుమ్మడికాయ అంటారు కాబోలురా!

పరమా: మీ మొహం - శుంఠల్లారా! శివ శివ - గుర్రమూ లేదు, గుర్రంగుడ్డూ లేదు- పది వరహాలు గంగపాలుచేశారు కదర్రా.

పెద్దమనిషి: అయ్యా గురువుగారూ! నమస్కారాలండి!

పరమా: ఎవరు బాబూ ! మా శిష్యుడేనా ఏమిటి?

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

పెద్దమనిషి: మీ శిష్యుణ్ని కాకపోయినా అలాంటివాడినేనండి! అయితే మీ శిష్యులలాంటివాణ్ణి మాత్రం కాదండి. మీరు జగద్గురువులు. అందుచేత అందరికీ మీరు గురువులే, అందరూ మీ శిష్యులే.....

పరమా: దాని కేం బాబూ! అదంతా మీ అభిమానం ! రా, ఇలా రా కూర్చో! అదేమిటి? ఏదో పట్టుకొచ్చావు?

పెద్దమనిషి: ఇదేనండి-గుర్రంగుడ్డుపిల్ల---

శిష్యులు: అరే, అరే, ఔనండి గురువుగారూ-అదే అదే! గుర్రంగుడ్డు పగిలి, పిల్ల పారిపోయింది.

పరమా: అది పారిపోయింది: మీ మతి జారిపోయింది-- వెర్రి చవటల్లారా! అది గుర్రంపిల్ల కాదు, కుందేలుపిల్ల.

పెద్దమనిషి : చిత్తం - మీరైనా తెలుసుకొన్నారు. దీని కోసమే మీ శిష్యులు వెతికి వెతికి ఇలా అయిపోయారు.

పరమా: నేను మాత్రం వాళ్ళలా అయిపోకుండా ఉన్నానా? వాళ్ళతో పాటు నేనున్నూ మతిలేనివాడినై పోయాను.

పెద్దమనిషి: గుర్రంపిల్లను పెడుతుంది. గుడ్డు పెట్టదుగా--

పరమా: అదే, వాళ్ళతోపాటు నాకు కూడా మతిపోయిందని అంటున్నానుగా!

పెద్దమనిషి: అంత మాట అనకండి. మీరు పెద్దలు! వాళ్ళతోపాటు ఏదో పొరపాటు పడి ఉంటారు. అంతే! ఇవిగో మీ పది వరహాలూనూ!

పరమా: ఇదేమిటి. మీరే వీళ్ళకు అమ్మేరా?

పెద్దమనిషి : ఔను -- మా పొలంలో బూడిద గుమ్మడి కాయలను చూసి, గుర్రంగుడ్డు అమ్ముతావా? అని అడిగారు. వీళ్ళేమో చిత్రమైనవాళ్ళలా ఉన్నారని వీళ్ళకు అమ్మి, వీళ్ళతో పాటు వెనకాల బయలుదేరాను, విచిత్రం చూద్దామని! ఇక్కడ మిమ్ములను చూసి, ఇలా వచ్చాను, మీతో చెబుదామని!

పరమా: మంచివాడవు నాయనా! మాకందరికీ తెలివి చెప్పావు!

పెద్దమనిషి: తెలివి మాట ఎలా ఉన్నా -- మీ శిష్యులు సృష్టించిన "గుశ్వం" మాత్రం కలకాలమూ ఉంటుంది-- మీరు, మీ శిష్యులు -- చిరకాలము వర్ధిల్లుతారు తెనుగుజాతి జానపద చరిత్రలో - సెలవు !

పరమా: శుభం.!

రచన : **ఏడిద కామేశ్వరరావు**; మూలం : **పసిడితెర**, ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ.

SCERT ANDHRA PRADESH

ఇవి చేయండి

1. ఈ నాటకం వేయడానికి ఒకరు గురువుగాను, ముగ్గురు శిష్యులుగా, ఇంకొకరు పెద్దమనిషిగా ఉండాలి. నాటకంలోని సంభాషణలను అభ్యాసం చేయండి. పాత్రలకనుగుణంగా దుస్తులు ధరించాలి. అలంకరించుకోవాలి. తరగతిలో / పాఠశాలలో ప్రదర్శించాలి.
2. "గుశ్వం" నాటకాన్ని కథగా సొంతమాటల్లో పది వాక్యాల్లో రాయండి.
3. "గుశ్వం" నాటిక హాస్యంతో కూడినది కదా! ఎందుకో వివరంగా పది వాక్యాల్లో రాయండి.
4. "గుశ్వం" నాటికలోని శిష్యులు ఎలాంటివారు ? వీరి గురించి సొంతమాటల్లో రాయండి.
5. పరమానందయ్య గురువుగారు, తిన్నడు, చెన్నడు, గున్నడు శిష్యులు కదా! గురుశిష్యుల మధ్య ఉండే సంబంధం గురించి తెలపండి.

www.apteachers.in

7. ప్రతిజ్ఞ

- శ్రీశ్రీ

ఆలోచించండి - చెప్పండి



1. పై చిత్రంలో ఎవరెవరు ఏం చేస్తున్నారో చెప్పండి.
2. ఆహారోత్పత్తి వెనుక ఉన్న కష్టాన్ని గురించి చెప్పండి.
3. మనం వాడే ప్రతివస్తువు తయారీ వెనుక ఉన్న శ్రమను గురించి చెప్పండి.
4. కర్షకుడు, కార్మికుడు లేకపోతే ఏమౌతుందో ఆలోచించి చెప్పండి.

SCERT

ఉద్దేశం

శ్రమైకజీవన సౌందర్యాన్ని ఆస్వాదించడం, కష్టపడే వారిపట్ల గౌరవం కనబరచడం. విద్యార్థులలో సామాజికస్పృహను పెంపొందించడం ఈ పాఠ్యాంశ ప్రధానోద్దేశం.

ఈ పాఠం శ్రీశ్రీ రాసిన 'మహాప్రస్థానం' లోది.

విద్యార్థులకు సూచనలు

1. పాఠం చిత్రాలు ఆధారంగా పాఠంలోని భావాన్ని ఊహించండి. చెప్పండి.
2. పాఠం చదవండి. పదపట్టిక చూసి పదాలకు అర్థాలు తెలుసుకోండి.
3. సందర్భానికి తగిన అర్థాన్ని గ్రహించి చిత్రాలు ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
4. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

www.apteachers.in

పొలాల నన్నీ,
హలాల దున్నీ,
ఇలాతలంలో హేమం పిండగ
జగానికంతా సౌఖ్యం నిండగ
విరామ మెరుగక పరిశ్రమించే,
బలం ధరిత్రికి బలి కావించే,
కర్షకవీరుల కాయం నిండా
కాలువకట్టే ఘర్మజలానికి,
ఘర్మజలానికి,
ధర్మజలానికి,
ఘర్మజలానికి ఖరీదు లేదోయ్!
నరాల బిగువూ,
కరాల సత్తువ
వరాలవర్షం కురిపించాలని,
ప్రపంచ భాగ్యం వర్ధిల్లాలని –
గనిలో, వనిలో, కార్ఖానాలో
పరిశ్రమిస్తూ,
పరిప్లవిస్తూ,
ధనికస్వామికి దాస్యం చేసే,
యంత్రభూతముల కోరలు తోమే,
కార్మికవీరుల కన్నుల నిండా
కణకణ మండే,
గలగల తొణకే
విలాపాగ్నులకు, విషాదాశ్రులకు
ఖరీదుకట్టే షరాబు లేడోయ్ !
కావున – లోకపుటన్యాయాలూ,
కాల్చే ఆకలి, కూల్చే వేదన,

www.apteachers.in

దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ
పరిష్కరించే, బహిష్కరించే
బాటలు తీస్తూ, పాటలు వ్రాస్తూ
నాలో కదలే నవ్యకవిత్వం
కార్మికలోకపు కల్యాణానికి,
శ్రామికలోకపు సౌభాగ్యానికి
సమర్పణంగా, సమర్చనంగా –
త్రిలోకాలలో, త్రికాలాలలో
శ్రమైకజీవన సౌందర్యానికి
సమానమైనది లేనేలేదని
కష్టజీవులకు కర్మవీరులకు
నిత్యమంగళం నిర్దేశిస్తూ,
స్వస్తివాక్యములు సంధానిస్తూ,
స్వర్ణవాద్యములు సంరావిస్తూ –
వ్యథార్తజీవిత యథార్థదృశ్యం
పునాదిగా ఇక జనించబోయే
భావివేదముల జీవనాదములు
జగత్తుకంతా చవులిస్తానోయ్
కమ్మరికొలిమి, కుమ్మరిచక్రం,
జాలరి పగ్గం, సాలెలమగ్గం,
శరీర కష్టం స్ఫురింపజేసే
గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి
సహస్ర వృత్తుల, సమస్త చిహ్నాలు –
నా వినుతించే
నా విరుతించే,
నా వినిపించే నవీనగీతికి,
నా విరచించే నవీన రీతికి,
భావం
భాగ్యం!
ప్రాణం!
ప్రణవం!



www.apteachers.in

కవి పరిచయం

శ్రీరంగం శ్రీనివాసరావు

శ్రీశ్రీగా ప్రసిద్ధి చెందిన శ్రీరంగం శ్రీనివాసరావు 1910వ సంవత్సరంలో విశాఖపట్టణంలో జన్మించారు. పద్దెనిమిదేళ్ళ నాటికే "ప్రభవ" అనే భావకవితా సంపుటి వెలువరించారు. అభ్యుదయ కవితా సంపుటి 'మహాప్రస్థానం'తో మహాకవి అయ్యారు. విప్లవకవిగా ఖడ్గసృష్టి, మరో ప్రస్థానం గీతాలు రాశారు. మూడు యాభైలు పేరిట వ్యంగ్య కవితలు, కార్టూను కవితలు, 1+1=1 లేక డిశంబరు 31, 1999 పేరిట రేడియోనాటికలు సంకలితం అయ్యాయి. 'చరమరాత్రి' కథల ద్వారా చైతన్య స్రవంతి పద్ధతిని తెలుగు రచనలో ప్రవేశ పెట్టారు. 15-6-1983 నాడు తుది శ్వాసవిడిచారు.

"మానవుడే నా సందేశం - మనుష్యుడే నా సంగీతం" అని ఎలుగెత్తి చాటిన యుగకర్త శ్రీశ్రీ. కష్టజీవికి కాపుదలగా కవిత్వం రాసిన కవి. శ్రీశ్రీ సృజనకు, ప్రతిభకు, తాత్విక మార్గాన్వేషణకు పేరుగన్నవాడు. నూతన పదప్రయోగాల మార్గదర్శకుడు. కర్షకులు, కార్మికులు, పీడితులు, పేదలు అనుభవించే కష్ట సుఖాలు ఈయన కవితావస్తువులు.

ప్రక్రియ - గీతం

లయకు ప్రాధాన్యం ఇస్తూ మాత్రాఛందస్సులో సాగే రచన గీతం. శ్రీశ్రీ తన మహాప్రస్థానంలోని ఖండికలన్నీ గీతాలుగా పేర్కొన్నారు.

సారాంశం

విరామమే తెలియని కష్టజీవి రైతు. ప్రపంచమంతా సుఖంగా ఉండాలని కోరేవాడు అతను. నాగలిని నమ్ముకున్నవాడు. పొలాలకు జీవితాన్ని ధారపోసి బంగారాన్ని పండిస్తాడు. ఈ రైతు శరీరంనుంచి స్రవించే చెమట ధర్మజలం. ఆ ధర్మజలానికి విలువ కట్టలేం.

కార్మికుడు ప్రపంచమంతా సంపదలతో తులతూగాలని కోరుకుంటాడు. దానికోసం తన నరాల బిగువును, చేతుల బలాన్నీ పణంగా పెడుతున్నాడు. గనిలో, అడవిలో, కర్మాగారాలలో అడుగడుగునా యజమానుల సేవకే అంకితమవుతున్నాడు. తన జీవితం యంత్రాలలో చిక్కుకు పోయింది. ఈ కార్మిక వీరుని కష్టాలలో పాలు పంచుకొనేవాడు లేడు. తన దుఃఖానికి, అగ్నిగోళాలవంటి కళ్ళనుండి జారే కన్నీటికి ఖరీదు కట్టే షరాబే లేడు (ఖరీదు కట్టలేం).

ఈ లోకంలోని అన్యాయాలనూ, ఆకలినీ, వేదననూ దారిద్ర్యాన్నీ, దౌర్జన్యాలను నిరసిస్తున్నాను. వాటిని బహిష్కరించాలనీ, పరిష్కరించాలనీ పాటలు రాస్తున్నాను. నాలో కదిలేది కొత్త కవితావేశం. ఇది కార్మికుల కళ్యాణానికి, శ్రామికుల సౌభాగ్యానికి అంకితం. ఎందుకంటే ముల్లోకాలలో మూడుకాలాలలో ఈ శ్రమైక జీవనసౌందర్యానికి సమానమైనది లేదని శ్రీశ్రీ అన్నాడు.

"బంగారు వాద్యాలతో స్వస్తి మంత్రాలతో, కష్టజీవులకూ, కర్మవీరులకూ హారతులిస్తాను. శ్రామికుల బాధలు కళ్లకు కట్టినట్లుగా రాబోయే తరాలకు చెప్తాను", అంటాడు శ్రీశ్రీ. 'నా మాటలు భావితరాలకు వేదాలు, జీవనాదాలు' అంటాడు.

ఈ దేశంలో శారీరకకష్టం చేసేవారు చాలామంది ఉన్నారు. కమ్మరికొలిమి, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి మొదలైన పనిముట్లు వివిధవృత్తులకు గుర్తులు. ఆ గుర్తులే నా కవితా వస్తువులు. నేనువారి కోసమే గీతాలు రాస్తాను. ఆ శ్రామికులు,కార్మికులు నా కవిత్వంలో నాయకులు. అదే భావం, భాగ్యం, నా కవితకు ప్రాణం. ఓంకారం.

SCERT ANDHRA PRADESH

ఇవి చేయండి

I. వినడం - మాట్లాడడం

1. కార్మికుల, కర్షకుల సౌభాగ్యం అంటే ఏమిటి? మాట్లాడండి.
2. 'కర్షకుడు కార్మికుడు' చేస్తున్న సేవను గురించి చర్చించండి?
3. శ్రీశ్రీ రాసిన కవిత విన్నారు కదా! ఇలాంటి కవితను ఆయన ఎందుకు రాసి ఉంటాడు? ఊహించి చెప్పండి.

II. చదవడం, అవగాహన చేసుకోవడం

1. పాఠం చదవండి. కింది పట్టికను పూరించండి.

వృత్తులు	వాడే పనిముట్లు
ఉదా॥ జాలరి	పగ్గం
1. ________	________
2. ________	________
3. ________	________
4. ________	________

2. కింది కవిత చదివి నాలుగు ప్రశ్నలు తయారు చేయండి.

పర్వతం ఎవడికీ వంగి సలాం చేయదు
సముద్రం ఎవడికాళ్ళకిందా మొరగదు
నేనింతా పిడికెడు మట్టే కావచ్చు
కానీ కలమెత్తితే నాకు
ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది.

SCERT ANDHRA PRADESH

3. పాఠం చదవండి. పాఠంలో కొన్ని ప్రాసపదాలు ఉన్నాయి. వాటి కింద గీత గీయండి. చదవండి.

ఉదా : పొలాలనన్నీ - హలాలదున్నీ ; హేమం పిండగ - సౌఖ్యంనిండగ.

4. కింది ప్రశ్నలకు,పాఠం ఆధారంగా సమాధానాలు రాయండి.

(అ) రైతు తనజీవితాన్ని ఎందుకు ధారపోస్తున్నాడు?
(ఆ) శ్రీశ్రీ తన నవ్యకవిత్వాన్ని ఎవరికి సమర్పిస్తానన్నాడు?
(ఇ) శ్రీశ్రీ దేనికి ఖరీదు కట్టలేమన్నాడు?
(ఈ) కార్మిక వీరుల కన్నులను కవి ఎలా వర్ణించాడు ?
(ఉ) శ్రీశ్రీ వేటిని పాటలుగా రాస్తానన్నాడు?

www.apteachers.in

III. స్వీయరచన

1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

(అ) కర్షకుల శ్రమను గురించి రాయండి.

(ఆ) కార్మికులంటే ఎవరు? వారి జీవన విధానం ఎలా ఉంటుందో ఆలోచించి రాయండి.

(ఇ) ప్రపంచమంతా భాగ్యంతో ఎప్పుడు వర్ధిల్లుతుంది?

(ఈ) అభాగ్యులను, అనాథలను చూస్తే మీకేమనిపిస్తుందో రాయండి.

2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాలలో జవాబులు రాయండి.

(అ) పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

(ఆ) మీ పరిసరాల్లో ఉన్న కష్టజీవుల జీవన విధానాన్ని రాయండి.

IV. పదజాలం

1 కింది వాక్యాల్లో గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి. వాటిని సొంత వాక్యాల్లో ప్రయోగించండి.

(అ) మనం కష్టపడితే గాని ఘర్మజలం విలువ తెలియదు.

(ఆ) జీవులెన్నో ధరిత్రి మీద జీవిస్తున్నాయి.

(ఇ) సీత హేమా భరణాలు ధరించింది.

(ఈ) జలం తాగితేనే దాహం తీరుతుంది.

2 కింది వాక్యాలు పరిశీలించండి.

(అ) ఉగాది తెలుగువారి నూతన వర్షం.

(ఆ) వర్షం పడుతుందని గొడుగు తీసుకువచ్చాను.

పై వాక్యాల్లో వర్షం అనే పదానికి సంవత్సరం, వాన అనే రెండు అర్థాలు ఉన్నట్లు తెలుస్తోంది కదా! ఇలా ఒక మాటకు అనేక అర్థాలు వస్తే వాటిని నానార్థాలు అంటారు. కింది పదాలకు నానార్థాలు రాసి, వాక్యాల్లో ప్రయోగించండి.

(ఇ) భూతం

(ఈ) కరం

3) కింది వాక్యాలను చదవండి.

బంగారం ధర బాగా పెరిగింది. అయినా ఆ పుత్తడి అంటే అందరికీ మక్కువే. కానీ మనసు బంగారమైతే ఈ స్వర్ణమెందుకు?

పై వాక్యాల్లో బంగారం, పుత్తడి, స్వర్ణం అనే పదాలకు ఒకటే అర్థం అని గ్రహించారు కదా! ఇలా ఒకే అర్థాన్నిచ్చే పదాలను పర్యాయపదాలు అంటారు. కింది పదాలకు పర్యాయపదాలు రాసి, వాక్యాల్లో ప్రయోగించండి.

(అ) హలం (ఆ) జగం (ఇ) జలం (ఈ) ధ్వని (ఉ) అగ్ని

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

4 గీతగీసిన పదాలకు వికృతులు రాసి వాక్యాల్లో ప్రయోగించండి.

(అ) శారీరకమైన పనులు చేయడానికి శక్తి అవసరం.

(ఆ) కష్టపడితే జీవితంలో మంచి ఫలితాలు పొందవచ్చు.

(ఇ) ఎప్పటికైనా ధర్మమే జయిస్తుంది.

(ఈ) ప్రాణమున్నంతవరకూ నిజాయితీగా బతకాలి.

VI. సృజనాత్మకత

రైతు / కార్మికుడు ఏ విధంగా కష్టపడుతున్నారో తెలుసుకొని అతని జీవన శైలిని ఆత్మకథగా రాయండి.

లేదా

తన కవితలో శ్రీశ్రీ కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం, జాలరిపగ్గం, సాలెల మగ్గం, గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి అనేవాటిని ఆయా వృత్తులకు చిహ్నాలుగా పేర్కొన్నారు. వీటిలో మీకు నచ్చిన వస్తువును ఎన్నుకొని చిత్రం గీయండి. దాన్ని గురించి రాయండి.

V. ప్రశంస

శ్రీశ్రీ కవితా శైలి ఎలాంటిది? ఆయన చేసిన పదప్రయోగం గురించి ఒక వ్యాసం రాయండి.

లేదా

మన గ్రామాల్లో, పట్టణాల్లో రక రకాల వృత్తుల వాళ్ళుంటారు. వాళ్ళంతా రెక్కల కష్టం మీద ఆధారపడ్డవాళ్ళే. వాళ్ళ దగ్గరకు వెళ్ళండి. తాము చేస్తున్న పనిలో వాళ్ళు పొందే ఆనందాన్ని గమనించండి. వాళ్ళను ప్రశంసించండి. వాళ్ళను ఏ విధంగా అభినందించారో రాయండి.

SCERT ANDHRA PRADESH

VII. భాషను గురించి తెలుసుకుందాం

W6CCM7

1 కింది పదాలను విడదీసి, సంధుల పేర్లను రాయండి.

(అ) విరామమెరుగక =

(ఆ) జగానికంతా =

(ఇ) విలాపాగ్నులు =

(ఈ) అనేకులింకా =

(ఉ) విషాదాశ్రువులు =

2 కింది విగ్రహవాక్యాలను సమాసపదాలుగా కూర్చండి. సమాసాల పేర్లను రాయండి.

(అ) ముగ్గురైన దేవతలు -

(ఆ) రెండైన గంటలు -

3 కింది పదాలకు విగ్రహవాక్యాలు రాయండి. ఏ సమాసమో రాసి కారణాలు చర్చించండి.

(అ) నాలుగువేదాలు -

(ఆ) రెండు చేతులు -

www.apteachers.in

(ఇ) త్రికరణాలు, –

(ఈ) కోటిరత్నాలు –

(ఉ) ముప్పైరోజులు –

(ఊ) మూడుజిల్లాలు, –

(ఋ) నూరుపద్యాలు –

4. ఈ కింది సామాన్య వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా మార్చి రాయండి.

(అ) రుకియా బజారుకు వెళ్ళింది. రుకియా కూరగాయలు కొన్నది.

(ఆ) కృష్ణ బొబ్బిలి వెళ్ళాడు. కృష్ణ ఇల్లు కట్టాడు.

(ఇ) తాతగారు ఇంటికి వచ్చారు. తాతగారు కాఫీ తాగారు.

(ఈ) మాధురి తోటకు వెళ్ళింది. మాధురి పువ్వులు కోసింది.

(ఉ) చిన్నా సినిమాకి వెళ్ళాడు. చిన్నా ఐస్‌క్రీమ్ తిన్నాడు.

5. కింది వాక్యాలను సంయుక్త వాక్యాలుగా మార్చి రాయండి.

(అ) ఆజాద్ దేవిడ్ కంటె పెద్దవాడా? ఆజాద్ దేవిడ్ కంటె చిన్న వాడా?

(ఆ) జయ ఇంటికి వెళ్ళింది. విజయ బడికి వెళ్ళింది.

(ఇ) స్వప్న అన్నం తిన్నది. పద్మ పండ్లు తిన్నది.

(ఈ) రమ అందమైనది. రమ తెలివైనది

(ఉ) పావని సంగీతం నేర్చుకుంది. పావని నృత్యం నేర్చుకుంది.

(ఊ) రైలు వచ్చింది. చుట్టాలు రాలేదు.

SCERT ANDHRA PRADESH

6. కింది పేరా చదవండి. సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను గుర్తించండి. రాయండి.

ఈశ్వరచంద్ర విద్యాసాగర్ పశ్చిమబెంగాల్‌లో జన్మించాడు. ఈయన సంస్కృతం, ఆంగ్లం, హిందీ భాషలు నేర్చుకున్నారు. చదువు పూర్తయింది. ఈశ్వర చంద్రుడు ఉద్యోగంలో చేరాడు. ఈయన ప్రధానోపాధ్యాయునిగా, ప్రత్యేక తనిఖీ అధికారిగా పని చేశాడు. ఈ ఉద్యోగం అతనికి రుచించలేదు. ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. స్త్రీవిద్య అవసరాన్ని గుర్తించి, అనేక బాలికా పాఠశాలలు స్థాపించాడు. వితంతువివాహాలను ప్రోత్సహించాడు. అంతేగాక తన కుమారునికి ఒక వితంతువుతో వివాహం జరిపించి, సభ్యసమాజానికి ఆదర్శ ప్రాయుడయ్యాడు.

7. గసడదవాదేశ సంధి

(అ) కింది పదాలను ఏ విధంగా విడదీశారో గమనించండి.

గొప్పవాడుగదా	–	గొప్పవాడు + కదా	(డు + క)
కొలువుసేసి	–	కొలువు + చేసి	(వు + చే)
వాడుడక్కరి	–	వాడు + టక్కరి	(డు + ట)
నిజముదెలిసి	–	నిజము + తెలిసి	(ము + తె)
పాలువోయక	–	పాలు + పోయక	(లు + పో)

పై ఉదాహరణలు గమనించారు కదా! పూర్వపదంచివర ప్రథమావిభక్తి ప్రత్యయాలున్నాయి.

www.apteachers.in

పరపదం మొదట క,చ,ట,త,ప లున్నాయి. ఈ విధంగా ప్రథమావిభక్తి మీది ప్రత్యయాలకు క,చ,ట,త,పలు పరమైతే వాటి స్థానంలో గ,స,డ,ద,వలు ఆదేశంగా వస్తాయి. **అంటే ...**

క → 'గ' గా మారుతుంది. **చ → 'స' గా మారుతుంది.**

ట → 'డ' గా మారుతుంది. **త → 'ద' గా మారుతుంది.**

ప → 'వ' గా మారుతుంది. (క చ ట త పలకు గ స డ ద వలు ఆదేశంగా వస్తాయి.)

కింది పదాలను విడదీసి రాయండి. వివరించండి.

(అ) నిక్కముదప్పదు (ఆ) ప్రాణములుగల్గి (ఇ) పొడగానరాక

(ఈ) నోరసూపు (ఉ) నీరుద్రావి (ఊ) పాలుదాగి

ద్వంద్వసమాస పదాల విషయంలో కూడా గసడదవాదేశసంధి కనిపిస్తుంది.

(ఆ) కింది పదాలను గమనించండి

కూరగాయలు	–	కూర	+	కాయ + లు
కాలు సేతులు	–	కాలు	+	చేయి → చేతు + లు
టక్కుడెక్కులు	–	టక్కు	+	టెక్కు + లు
తల్లిదండ్రులు	–	తల్లి	+	తండ్రి + లు
ఊరువల్లెలు	–	ఊరు	+	పల్లె + లు

పై పదాలు ద్వంద్వ సమాసానికి ఉదాహరణలు.

ద్వంద్వ సమాసంలో కూర + కాయ అన్నప్పుడు 'క' స్థానంలో 'గ' వచ్చింది. ఈ విధంగా కచటతపలకు, గసడదవలు రావడాన్నే గసడదవాదేశం అంటారు.

సూత్రం – ద్వంద్వసమాసంలో మొదటి పదం మీద ఉన్న కచటతపలకు గసడదవలు క్రమంగా వస్తాయి.

కింది పదాలను కలపండి

(అ) అక్క + చెల్లెలు ______________________

(ఆ) అన్న + తమ్ముడు ______________________

SCERT ANDHRA PRADESH

8. తత్పురుష సమాసం

(ఆ) కింది పదాలు చదవండి. వాటికి విగ్రహవాక్యాలు చూడండి.

(అ) రాజభటుడు (ఆ) తిండిగింజలు (ఇ) పాపభీతి

"రాజభటుడు"లో 'రాజు' పూర్వపదం, "భటుడు" ఉత్తరపదం.

అట్లే తిండి గింజలు – తిండి కొఱకు గింజలు – 'తిండి' పూర్వపదం, 'గింజలు' ఉత్తరపదం. పాపభీతి – పాపం వల్ల భీతి – 'పాపం' పూర్వపదం, భీతి ఉత్తరపదం.

రాజభటుడుకు విగ్రహవాక్యం రాస్తే రాజు యొక్క భటుడు అవుతుంది. దీంట్లో 'యొక్క' అనేది షష్ఠీవిభక్తి ప్రత్యయం. భటుడు రాజుకు చెందినవాడని చెప్పడానికి షష్ఠీవిభక్తి ప్రత్యయాన్ని వాడాం. ఇలా విభక్తి ప్రత్యయాలు విగ్రహవాక్యంలో ఉపయోగించే సమాసాలు తత్పురుష సమాసాలు.

www.apteachers.in

పూర్వపదం చివర ఉండే విభక్తిని బట్టి తత్పురుష సమాసాలు:

తత్పురుష సమాసం రకాలు	విభక్తులు	ఉదాహరణ
ప్రథమా తత్పురుషసమాసం	డు, ము, వు, లు	మధ్యాహ్నం-అహ్నం మధ్యభాగం
ద్వితీయా తత్పురుషసమాసం	ని, ను, ల, కూర్చి, గురించి	జలధరము-జలమునుధరించినది
తృతీయా తత్పురుషసమాసం	చేత, చే, తోడ, తో	బుద్ధిహీనుడు-బుద్ధిచేతహీనుడు
చతుర్థీ తత్పురుషసమాసం	కొఱకు, కై	వంటకట్టెలు-వంటకొఱకుకట్టెలు
పంచమీ తత్పురుషసమాసం	వలన, కంటె, పట్టి	దొంగభయం-దొంగవలనభయం
షష్ఠీ తత్పురుషసమాసం	కి, కు, యొక్క, లో, లోపల	రామబాణం-రామునియొక్కబాణం
సప్తమీ తత్పురుషసమాసం	అందు, న	దేశభక్తి-దేశమునందుభక్తి
నఞ్ తత్పురుషసమాసం	నఞ్అంటేవ్యతిరేకార్థం	అసత్యం-సత్యంకానిది

కింది పదాలు చదవండి. విగ్రహవాక్యాలు రాయండి. అవి ఏ తత్పురుష సమాసాలో రాయండి.

(అ) రాజపూజితుడు (ఆ) ధనాశ (ఇ) పురజనులు (ఈ) జటాధారి

(ఉ)భుజబలం (ఊ) అగ్నిభయం (ఋ) అన్యాయం

ప్రాజెక్టు పని

శ్రీశ్రీ రాసిన కవితలను / గీతాలను సేకరించండి.
వాటిలో ఏదైనా ఒకదాన్ని రాసి రాగ భావయుక్తంగా పాడి వినిపించండి.

పునరభ్యసనం (వెనుకబడిన విద్యార్థుల కొరకు)

1. పాఠ్యాంశాలలోని పదాల జాబితాను ఉపాధ్యాయుడు తయారుచేసి చదివించాలి.
2. విద్యార్థులచే ఉక్తలేఖనం రాయించాలి. దోషాలు సవరించాలి.
3. పాఠ్యాంశ సారాంశాన్ని 4 లేదా 5 వాక్యాలలో నల్లబల్లపై రాసి విద్యార్థులచే చదివించాలి, రాయించాలి, దోషాలు సవరించాలి.

H6FZB4

నేనివి చేయగలనా?

1. ఈ పాఠం భావాన్ని సొంతమాటల్లో చెప్పగలను. ఔను / కాదు
2. శ్రీశ్రీ కవిత్వం గురించి సొంతమాటల్లో రాయగలను. ఔను / కాదు
3. కవితలోని ప్రాసపదాలను గుర్తించగలను. భావాన్ని వివరించగలను. ఔను / కాదు
4. గేయాన్ని లయబద్ధంగా పాడగలను. ఔను / కాదు

8. ప్రకృతి ఒడిలో

- కొడవటిగంటి కుటుంబరావు

ఆలోచించండి - చెప్పండి

ప్రశ్నలు

1. చిత్రంలో ఏమేమి ఉన్నాయి ?
2. ఏం జరుగుతూంది ?
3. చిత్రంలోని పిల్లలు ఏం మాట్లాడుతుండవచ్చు? ఊహించి చెప్పండి.

ప్రస్తుత పాఠ్యాంశం కొడవటిగంటివారి తాత్త్విక వ్యాసాలనుండి తీసుకున్నది.

విద్యార్థులకు సూచనలు

1. పాఠం చిత్రం ఆధారంగా పాఠంలోని విషయాన్ని ఊహించండి. చెప్పండి.
2. పాఠం చదవండి. పదపట్టిక చూసి పదాలకు అర్థాలు తెలుసుకోండి.
3. సందర్భానికి తగిన అర్థాన్ని గ్రహించి చిత్రాలు ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
4. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

www.apteachers.in

కాటారం బడిలో ప్రార్థనసమావేశంలో పార్వతి చదివిన అంశానికి అభినందనలు తెలుపుతూ అందరూ చప్పట్లు కొట్టారు. ఆ చప్పట్ల ప్రకంపనలకు ఆ పరిసరాలలో చెట్లమీద ఉన్న రంగురంగుల సీతాకోకచిలుకలు గుంపులు గుంపులుగా, రెక్కలు రెపరెపలాడిస్తూ పైకి లేచాయి. ప్రకృతి అందాన్ని చూసి ఆస్వాదించే మనసు ఉండాలిగాని, అది ఎంత అద్భుతంగా ఉంటుందో ! ఏ కోణంలో చూసినా అందమైన దృశ్యమే కనపడుతుంది. అందమైన పువ్వులు, వయ్యారంగా తలలూపే కొమ్మలు, రెమ్మలు, రెపరెపలాడే ఆకులు, రంగులన్నీ కలబోసి రకరకాల ఆకృతులను కూర్చినట్లు ఎగురుతూ ఉంటే గాలిలో తేలి ఆడుతున్న సీతాకోకచిలుకలు ఎగురుతుంటే, ప్రకృతిలోని రంగులన్నీ మన కళ్ళముందు నాట్యం చేస్తున్నట్లు ఉంది. ప్రకృతిలో ఎన్ని రహస్యాలున్నాయో ...! ఇలాంటివి కొన్ని చూద్దామా...!

"ప్రకృతి రహస్యాలను అన్వేషించడానికి మనిషికి ఉన్న మూలసాధనాలు జ్ఞానేంద్రియాలు. ఇవి మనిషికి అనుభవాన్ని కలిగిస్తాయి. ఈ అనుభవాలలోని సామ్యాన్ని కనిపెట్టి, బుద్ధి కొన్ని సత్యాలను ప్రతిపాదిస్తుంది.

ఉదాహరణకు, నిప్పు ఎప్పుడు తాకినా కాలుతుంది. నీరు ఎప్పుడూ పల్లానికే ప్రవహిస్తుంది. తగిన ఉష్ణస్థితి ఉంటే అనేక పదార్థాలు కరుగుతాయి. చలికి నెయ్యి, నూనె పేరుకుంటాయి. ఇలాంటివి తెలుసుకునే శక్తి అన్ని ప్రాణులకూ కొద్దో గొప్పో ఉంటుంది. ప్రకృతి ధర్మాలను గ్రహించిన తర్వాత వాటిని మానవుడు తనకు అనుకూలంగా మార్చుకోగలుగుతాడు. చెయ్యి పెడితే కాలే నిప్పే, చలినుండి మనిషికి రక్షణనిస్తుంది. ఇళ్ళమధ్య నీరు నిలిస్తే, దూరంగా ఉండే పల్లపు ప్రదేశానికి గండిపెట్టి ఆ నీటిని మళ్ళించవచ్చు.

ఆధునిక శాస్త్రవేత్త ఇంత తేలిక మార్గాల ద్వారా సంపాదించే జ్ఞానంతో తృప్తిపడడు. మానవుడు నాగరికత సాధించడానికి ఈ జ్ఞానం చాలదు. కాబట్టి శాస్త్రవేత్తలు మొట్టమొదట జ్ఞానేంద్రియాల హద్దులు తెలుసుకున్నారు. మన కన్ను చూసే 'కాంతి తరంగాలు' చాలా తక్కువ. అంతకు అనేకరెట్ల తరంగాలు రేడియో తరంగాలు మొదలుకొని అతిసూక్ష్మమైన 'గామా' కిరణాలదాకా కంటికి



www.apteachers.in

కనిపించవు. కానీ అవి కూడా 'కాంతి' తరంగాల జాతికి చెందినవే. వాటిని విద్యుదయస్కాంత తరంగాలు అంటారు.

కొన్ని పరిస్థితులలో కన్ను కొన్ని కొన్ని భ్రమలకు లోనవుతుంది. సినిమా చిత్రాలు కదిలే బొమ్మలు, కదలలేని బొమ్మలను తెరమీద అతివేగంగా ఒకదాని తర్వాత మరొకదాన్ని కదిలించి చూపిస్తారు. అవే చలనచిత్రాలయ్యాయి. అప్పుడు కన్ను తాను చూసిన విషయాలను చెరిపెయ్యలేదు. అలాగే చెవులు అన్ని ధ్వనులనూ వినలేవు. మనిషి వినలేని ధ్వనులు కొన్ని కుక్కలకు వినబడతాయట. వినబడని ధ్వనులను శాస్త్రవేత్తలు అనేక ప్రయోజనాలకు ఉపయోగిస్తున్నారు. చివరికి చర్మం కూడా భ్రమలకు లోనవుతుంది. చలికాలంలో రాత్రివేళ ఆరుబయట ఉండే కొయ్యబెంచీ, ఇనుపబెంచీ ఒకే ఉష్ణోగ్రతలో ఉంటాయి. అయినా కొయ్యబెంచీ తగిలితే చెయ్యి జిల్లుమనదు, ఇనుప బెంచీ తగిలితేనే జిల్లుమంటుంది.

ఇంద్రియజ్ఞానంమీదనే ఆధారపడి ఉంటే ఈనాడు మనకు రేడియోలు ఉండేవి కావు. విద్యుచ్ఛక్తి ఉండేది కాదు. ఆకాశంలో ఎక్కడో ఉన్న నక్షత్రాలలో ఏ ఏ పదార్థాలున్నాయో తెలిసేది కాదు. ఇంద్రియ జ్ఞానాన్ని విస్తరించడానికి శాస్త్రజ్ఞులు అనేక వేల సాధనాలు కల్పించారు. టెలిస్కోపులు, మైక్రోస్కోపులు, ఫోటోగ్రఫీ, ఎక్స్‌రేలు, చీకట్లో చూడటానికి వీలైన సాధనాలు, రాడార్ వగైరాలు.

శాస్త్రజ్ఞానం ఇంతగా అభివృద్ధి అయిందంటే అది కొన్ని నియమాలను విధిగా పాటించింది.

ఆ నియమాలు జ్ఞానానికి సంకెళ్ళుగా పనిచేయక తప్పదు. వాటిని ఊడగొట్టుకోవడం



www.apteachers.in

ద్వారా జ్ఞానం ఒకమెట్టు పైకెక్కుతుంది. ఇదే విధంగా శాస్త్రజ్ఞానాభివృద్ధికి అడుగడుగునా నియమాలు అడ్డుతగులుతూ ఉంటాయి.

శాస్త్రజ్ఞానం అనుభవంనుంచి కొన్ని ప్రతిపాదనలు చేస్తుంది. ఉదాహరణకు – లోహాలన్నీ ఘనపదార్థాల రూపంలో ఉంటాయి. ఈ ప్రతిపాదనను శాస్త్రం పరమ సత్యంగా పరిగణించదు. అందువల్ల పాదరసం కూడా లోహమే అని తెలిసినప్పుడు ఆ ప్రతిపాదనకు సవరణ వస్తుంది. శాస్త్ర ప్రతిపాదనలను మళ్ళీ మళ్ళీ రుజువుచేసినమీదట అది సిద్ధాంతంగా ఆమోదం పొందుతుంది.

దృష్టి, వినికిడి, వాసనలను పసిగట్టే విషయంలో జంతువులు మానవునికన్నా ఎంతో ముందున్నాయి. గబ్బిలాల వినికిడిశక్తి మనకెంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. గాలిలోకి విసిరిన వస్తువులలో పురుగో, బంతో, కర్రో సులువుగా చీకట్లో గుర్తించే శక్తి గబ్బిలానికుంది. ఒకే పరిమాణంలో ఉన్న ఆకులు, పురుగులువంటి వాటిని ఆకారాలనుబట్టి గుర్తించగలదు. ప్రతిధ్వనులను సెకండ్‌కన్నా తక్కువ కాలంలో విశ్లేషించగలదు. తిమింగలాలు, డాల్ఫిన్‌లకు ఉన్న ఇకోలొకేషన్ శక్తి, విశ్లేషణ శక్తి గబ్బిలాల కన్నా ఎక్కువ.

ప్రకృతి వైపరీత్యాలను ముందే పసిగట్టగల అద్భుత ప్రాణులు ఈ విశ్వంలో ఎన్నో ఉన్నాయి. సమాచార రంగంలో మనకన్నా జంతువులే ముందున్నాయి. భూకంపాలను ముందే అంచనా వేయగల జంతువులున్నాయి. క్రీ. పూ. వంద సంవత్సరాలకు పూర్వమే, జంతువులు భూకంపాన్ని ముందే పసిగట్టేవని పూర్వీకులు చెబుతున్నారు. "లెనిన్‌కన్" అనే చోట ఒక కర్మాగారం కలుగుల్లోంచి వందలకొద్ది ఎలుకలు హడావిడిగా బయటకు పరిగెత్తుకొచ్చాయి. వీధులలో వీటిని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. అవి అలా వెళ్ళిన కొన్ని గంటలకే ఆ ప్రాంతంలో భూకంపం వచ్చింది. అలాగే చైనాలో ఒకసారి కలుగుల్లోంచి ఎన్నో పాములు బయటకి వచ్చాయి. అందరూ భయపడ్డారు. కొన్ని గంటల తర్వాత భయంకరమైన భూకంపం వచ్చింది. శ్రీలంకలో ఒకసారి ఎన్నో ఏనుగులు పరిగెత్తుతూనే ఉన్నాయి, అలా సుమారు ఐదు కిలోమీటర్లు పరిగెత్తాయి. మూడు గంటల తర్వాత సముద్రంలో సునామి వచ్చింది. తుఫాను, సునామీ మొదలైనవాటిని ఏనుగులు 250 కి.మీ. దూరంనుండే ముందే పసిగట్టగలవని శాస్త్రజ్ఞులు నిరూపించారు.

SCERT ANDHRA PRADESH

ఈ విధంగా కళాదృష్టిలాగే శాస్త్రదృష్టి కూడా మానవుడికి అడుగడుగునా అక్కరకు వస్తుంది. మానవుడికి ఈ విశ్వంలోగల సంబంధాలన్నింటిమీదా ప్రభావం చూపిస్తుంది. శాస్త్రదృష్టి మానవుడి కృషికి ఒక మార్గం చూపి దాన్ని ఫలవంతం చేస్తుంది. ప్రకృతి రహస్యాలను వెల్లడిచేస్తుంది.

H6JLZ1

రచయిత పరిచయం

రచయిత	:	కొడవటిగంటి కుటుంబరావు
జననం–మరణం	:	ఆగస్టు 17, 1980–అక్టోబరు 28, 1909
జన్మస్థలం	:	తెనాలి, గుంటూరు జిల్లా.
రచనలు	:	జీవితం, చదువు అనే నవలలు, అద్దెకొంప, షావుకారు సుబ్బయ్య మొదలైన కథానికలు, సినిమా వ్యాసాలు, సైన్సు వ్యాసాలు, సంస్కృతి వ్యాసాలు, తాత్త్విక వ్యాసాలు మొ॥నవి.

ఇవి చేయండి

I. వినడం - మాట్లాడటం

1. మనం చేయలేనివి జంతువులు చేయగలిగేవి ఏవి? మాట్లాడండి.
2. శాస్త్రజ్ఞానం అభివృద్ధి చెందడం అంటే ఏమిటి? దీనివల్ల గతంతో పోలిస్తే, నేడు దేంట్లో ఏమి మార్పులు వచ్చాయి.
3. నిత్యజీవితంలో మీరు గమనించిన ప్రకృతి వింతలను గురించి చెప్పండి.

II. చదవడం, అవగాహన చేసుకోవడం

1. పాఠం చదవండి. కింది భావం వచ్చే పేరాలను గుర్తించండి. వాటికి పేరు పెట్టండి.

అ. ప్రకృతి ఎంతో అందంగా ఉంటుంది. దీన్ని చూస్తే చాలా ఆనందం కలుగుతుంది.

ఆ. మనం ఎన్నో విషయాలను తెలుసుకోడానికీ, పరిశీలించడానికీ మనకున్న జ్ఞానేంద్రియాలు ఉపయోగపడుతున్నాయి.

ఇ. మానవుడు తనకున్న బలాలను, బలహీనతలను తెలుసుకున్నాడు. కాబట్టి ఉన్నదానితో తృప్తిచెందక ఎన్నో విషయాలను కనుక్కొన్నాడు.

2. జట్లు జట్లుగా కూర్చొని పాఠంలోని పేరాలను చదవండి. ఒక్కొక్క పేరాకు ఒక ప్రశ్నను తయారు చేయండి. అంటే అదే ప్రశ్నకు పేరాలోని విషయం జవాబుగా రావాలి.

3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ. జ్ఞానేంద్రియాలు అంటే ఏమిటి? వాటివల్ల మనం ఏం చేయగలుగుతున్నాం?

ఆ. ఇంద్రియజ్ఞానానికి పరిమితం కాకపోవడంవల్ల ఏం జరిగింది?

ఇ. చూపు, వినికిడి, వాసనలను తెలుసుకోడం అన్నవాటి విషయంలో మనకు, జంతువులకు ఉండే తేడాలు ఏమిటి? దీనివల్ల మీరు ఏం గ్రహించారు?

జ్ఞానేంద్రియాలు	మనం చేయగలిగేవి	మనం చేయలేనివి	జంతువులు చేయగలిగినవి
కన్ను			
ముక్కు			
చెవి			

ఈ. పాఠంలోని మొదటి పేరాకు మిగతా పేరాలకు మధ్య ఉన్న భేదమేమిటి?

SCERT ANDHRA PRADESH

III. స్వీయరచన

1. ఈ కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో మీ సొంతమాటలలో జవాబులు రాయండి

అ. "ప్రకృతి రహస్యాలు అన్వేషించడానికి మనిషికి ఉన్న మూలసాధనాలు జ్ఞానేంద్రియాలు" దీనిమీద మీ అభిప్రాయం ఐదు వాక్యాలలో రాయండి.

ఆ. శాస్త్రజ్ఞులు జ్ఞానేంద్రియాల హద్దులను తెలుసుకోడంవల్ల ఏం జరిగింది?

2. ఈ కింది ప్రశ్నలకు పదివాక్యాలలో సొంతమాటలలో జవాబులు రాయండి

అ. సాధారణ దృష్టి, శాస్త్రదృష్టి రెండూ ఒకటేనా? కాదా? ఎందుకు?

ఆ. ప్రకృతి అందాలను వివరిస్తూ వ్యాసం రాయండి.

IV. పదజాలం – వినియోగం

1. కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి. వాటితో సొంతవాక్యాలు రాయండి.

అ. శాస్త్రదృష్టి మానవుడి కృషికి ఒక <u>మార్గం</u> చూపిస్తుంది.

ఆ. కొండలను పగలగొట్టినప్పుడు భూప్రకంపనలు వస్తాయి.

ఇ. ఎండమావులను చూసి నీరు అని <u>భ్రమ</u>పడతాము.

SCERT ANDHRA PRADESH

2. కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అదే అర్థం వచ్చే మరి రెండు పదాలను ఎంపిక చేసుకొని వాటితో వాక్యాలు రాయండి.

ఉదా : పార్వతికి అభినందనలు తెలుపుతూ చప్పట్లు కొట్టారు.

(i) కొందరికి పొగడ్తలు ఇష్టం ఉండవు.

(ii) ప్రశంసలకు లొంగకపోవడం గొప్పవారి లక్షణం

అ. బొమ్మలలో రకరకాల ఆకృతులు ఉంటాయి.

ఆ. బుద్ధి కొన్ని సత్యాలను ప్రతిపాదిస్తుంది.

ఇ. మన కన్ను చూసే కాంతితరంగాలు చాలా తక్కువ.

ఈ. మానవునికంటే జంతువులు తొందరగా వాసనలను పసిగడతాయి.

ఉ. చైనాలో ఒకసారి కలుగులలోంచి ఎన్నో పాములు బయటకు వచ్చాయి.

3. కింద గీత గీసిన పదాలకు పాఠం ఆధారంగా ప్రకృతులకు వికృతులు, వికృతులకు ప్రకృతులు రాయండి.

అ. పుష్పాలు సున్నితమైనవి.

ఆ. మన దమ్మం మనం పాటించాలి.

ఇ. శాస్త్రాన్ని అతిక్రమించగూడదు.

ఈ. కొందరికి చిత్తరువులు గీయడంలో నైపుణ్యం ఉంటుంది.

ఉ. ఎవరి ప్రాణం వారికి తీపి.

V. సృజనాత్మకత

కింది వాక్యాలు చదవండి.

"చప్పట్ల చప్పుడు విని సీతాకోకచిలుకలు పైకి లేచాయి" – సాధారణ వాక్యం

"ఆ చప్పట్ల ప్రకంపనలకు ఆ పరిసరాలలో చెట్లమీద ఉన్న రంగురంగుల సీతాకోకచిలుకలు గుంపులు గుంపులుగా రెక్కలు రెపరెపలాడిస్తూ పైకి లేచాయి" – పై వాక్యాన్నే వర్ణిస్తూ రాసిన వాక్యం ఇది. వాక్యంలోని కర్త, కర్మ, క్రియ పదాలలో దేన్ని గురించి అయినా గొప్పగా / అందంగా వివరించేలా సరైన పదాలను జోడిస్తూ రాస్తే మామూలు వాక్యాలు కూడా వర్ణనాత్మక వాక్యాలుగా మారతాయి. మీరు కూడా మీకు నచ్చిన కథను / సన్నివేశాన్ని / సంఘటనను లేదా ఏదైనా ఒక అంశాన్ని గురించి వర్ణిస్తూ రాయండి.

VI. ప్రశంస

భూమిమీద ఉన్న చెట్లు, పక్షులు, జంతువులు, మానవులు ....ఇలా ప్రతి ఒక్కదాంట్లో ఏదో ఒక గొప్పదనం ఉంటుంది. మీ మిత్రులతో చర్చించి దేంట్లో ఏ ఏ గొప్పదనాలున్నాయో రాయండి.

SCERT ANDHRA PRADESH

VII. భాషను గురించి తెలుసుకుందాం

1. కింది పదాలను విడదీయండి. సంధిపేరు రాయండి.

ఉదా :– అందమైన	అందము + ఐన	ఉత్వసంధి
(అ) సూక్ష్మమైన	+	
(ఆ) పైకెత్తు	+	
(ఇ) అయిందంటే	+	

2. కింది విగ్రహవాక్యాలను సమాస పదాలుగా మార్చండి

ఉదా– మూడయిన రోజులు – మూడురోజులు

(అ) రెండయిన రోజులు –

(ఆ) వజ్రమూ వైడూర్యమూ –

(ఇ) తల్లీ బిడ్డా –

3. కింది కర్తరి వాక్యాలను కర్మణి వాక్యాలుగా రాయండి.

ఉదా – పార్వతికి అభినందనలను తెలుపుతూ అందరూ చప్పట్లు కొట్టారు.

పార్వతికి అభినందనలు తెలుపుతూ అందరిచేతా చప్పట్లు కొట్టబడ్డాయి

అ. కర్తరి : జ్ఞానేంద్రియాలు మనిషికి అనుభవాలను కలిగిస్తాయి.

కర్మణి :

ఆ. కర్తరి : చలికి నెయ్యి, నూనె పేరుకొంటాయి.

కర్మణి :

ఇ. కర్తరి : శాస్త్రజ్ఞానము కొన్ని ప్రతిపాదనలను చేస్తుంది.

కర్మణి :

3. కింది కర్మణి వాక్యాలను కర్తరి వాక్యాలుగా రాయండి.

కర్మణి : శాస్త్రజ్ఞులచేత అనేక వేల సాధనాలు కల్పించబడినవి.

కర్తరి :

కర్మణి : ఈ ప్రతిపాదన శాస్త్రంచేత పరమ సత్యంగా పరిగణింప బడదు.

కర్తరి :

కర్మణి : అది సిద్ధాంతంగా ఆమోదం పొందబడుతుంది.

కర్తరి :

SCERT ANDHRA PRADESH

5. తత్పురుష సమాసం

1. మీరు తత్పురుష సమాసం గురించి తెలుసుకున్నారు కదా! కింది వాటిలో గీతగీసిన విభక్తి ప్రత్యయాలు ఆధారంగా ఆయా తత్పురుష సమాసాల పేర్లు రాయండి.

(అ) విద్యను అర్థించేవాళ్ళు –

(ఆ) గుణాల చేత హీనుడు –

(ఇ) సభ కొరకు భవనం –

(ఈ) దొంగవల్ల భయం –

(ఉ) రాముని (యొక్క) బాణం –

(ఊ) గురువుల లో శ్రేష్ఠుడు –

(ఋ) దేశము నందు భక్తి –

W6L8NU

(పై వాక్యాల్లో వేర్వేరు విభక్తులను గమనించారు కదా!)

పై విగ్రహవాక్యాలకు సమాసపదాలు రాయండి.

2. కింది సమాసపదాలను పరిశీలించి విగ్రహ వాక్యాలు రాసి, సమాసాల పేర్లను రాయండి.

ఉదా – విద్యార్థి – విద్యను అర్థించేవాడు – ద్వితీయాతత్పురుష సమాసం

www.apteachers.in

పదం	విగ్రహవాక్యం	సమాసం పేరు
1. ధనహీనుడు –		
2. పొట్టకూడు –		
3. రాక్షసభయం –		
4. నాపుస్తకం –		
5. రాజశ్రేష్ఠుడు –		

2. అతిశయోక్తి అలంకారం

W6PVCR

కింది వాక్యాన్ని చదవండి.

ఆ పట్టణంలోని భవనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

భవనాలు ఎంత ఎత్తుగా ఉన్నా ఆకాశాన్ని తాకడం అసంభవం.

అంటే మామూలు విషయాన్ని అతిగా చేసి చెప్పడం పై వాక్యంలో గమనిస్తున్నాం.

ఈ విధంగా గోరంత విషయాన్ని కొండంతలుగా చేసి చెప్పడాన్ని 'అతిశయోక్తి అలంకార'మంటారు.

అతిశయోక్తి అలంకారానికి సంబంధించిన కొన్ని వాక్యాలు రాయండి.

ANDHRA PRADESH

ప్రాజెక్టు పని

ప్రకృతిని గురించిన చిత్రాలను సేకరించి ప్రదర్శించండి.

పునరభ్యసనం (వెనుకబడిన విద్యార్థుల కొరకు)

1. పాఠ్యాంశాలలోని పదాల జాబితాను ఉపాధ్యాయుడు తయారుచేసి చదివించాలి.
2. విద్యార్థులచే ఉక్తలేఖనం రాయించాలి. దోషాలు సవరించాలి.
3. పాఠ్యాంశ సారాంశాన్ని 4 లేదా 5 వాక్యాలలో నల్లబల్లపై రాసి విద్యార్థులచే చదివించాలి, రాయించాలి, దోషాలు సవరించాలి.

నేనివి చేయగలనా?

1.	పాఠ్యాంశంలోని శాస్త్రీయ విషయాలమీద మాట్లాడగలను.	ఔను / కాదు
2.	పాఠ్యాంశంలోని విషయాన్ని సొంతమాటల్లో రాయగలను	ఔను / కాదు
3.	శాస్త్రీయ విషయాలను అవగాహనతో ధారాళంగా చదవగలను	ఔను / కాదు
4.	ప్రకృతి అందాలను వర్ణిస్తూ వ్యాసం రాయగలను.	ఔను / కాదు
5.	శాస్త్రసాంకేతిక పదజాలాన్ని సందర్భోచితంగా ఉపయోగించగలను.	ఔను / కాదు

నామట్టుకు నాకు తెలిసింది, నాకు ఏమీ తెలియదనే – సోక్రటీస్
నిన్ను నీవు తెలుసుకో – రమణ మహర్షి

9. గులాబీ అత్తరు

(ఉపవాచకం) - శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

ఒక్క అడుగు వేస్తే దివాంజీ కనపడతాడు.

అతగా డొక్కమాటు తమకేసి చూస్తే చాలునని ఆత్రపడుతూ, అతని కటాక్షం ఆశించీ, అతని అనుగ్రహం కోసం ఎదురుచూస్తూ, అతని ఆలంబనం నమ్ముకునీ, అతనిచేత "సరే" అనిపించుకోడానికి తగ్గ ఎత్తులాలోచించుకుంటూ; అతని లోభగుణం గురించి మాత్రం లోపల్లోపల తిట్టుకుంటూ ఆ గదిలో పరివేష్టించి ఉండిన ఆశ్రితులూ, పౌర ప్రముఖులూ, రాజ బంధువులూ, రాజ పురుషులూ కనపడుతున్నారు.

వారిలో కొందరు తనకేసి చూశారు. అలాంటి చోట నుంచుని మొదల ఒక్కమాటు గదిలోకి తొంగిచూసి, తరవాత నిటారుగా నుంచుని, నుంచున్న వెంటనే తాపీగా రెండుచేతులూ చాపి, గభీమని బిరడా తీసి సీసా గాలివాటాన పెట్టాడు షుకురల్లీ ఖాను;

బిరడా తీశాడు. అంతే, వెంటనే బిగించేశాడు. కాని, ఆ క్షణమాత్రానికే అతని చుట్టూ వుండిన జవానులు తుళ్ళిపడి మత్తెక్కుతున్నట్టయిపోయారు. లోపల వుండిన పెద్ద మనుషులు, ఉలిక్కిపడి ఎగ వూపిరి తీసుకుంటూ ఇటు చూశారు.

దివానుకి పక్కగా కొంచెం వెనకాల నుంచుని అతని రాతలు ఓరకంట చూస్తున్న ఠాణేదారు చకితుడై "వచ్చాడా?" అన్నట్టొక మాటు గుమ్మంకేసి చూసి, మళ్ళీ తల వంచుకున్నాడు.

అంతలో చ్రుున తల పైకెత్తి "ఏయ్! ఏమిటీ కంపు?" అంటూ గద్దించాడు దావాంజీ, దగ్గుకుంటూ, తీక్షణంగా చూస్తూ.

దీంతో పండువెన్నెల్లో కటిక చీకటి రేఖ విరిసినట్లయింది. కొంచెం ఘాటుగానే వుండినా, హృదయంగమమైన వట్టివేళ్ళ అత్తరు కమ్మదనం దివాంజీకి కంపుగా తట్టడం చూసి లోపలివారందరూ మొగమొగాలు చూసుకున్నారు, ఉబికిన నవ్వు కళ్ళల్లో కుక్కుకుంటూ.

ఠాణేదారు పెదవి కరుచుకున్నాడు. జవానులు అందుకు వింతపడి, పెదవులు కరుచుకున్నారు. ఖాను కొయ్యే అయిపోయాడు. కంపు అన్నమాట అపశ్రుతిగా వినపడిందతనికి. మాంచి పరువైన యాభైయేళ్ళ వయస్సున్న, అత్తరు సౌరభం కంపుగా వెలపరించుకునే మనిషి కనపడడం అతనికిదే మొదటిసారి.

మొన్న మొన్ననే – రెండుమాసాల పాటు నానాపాట్లూ పడిగాని గోలకొండ కోటలో అడుగుపెట్టలేకపోయాడతను.

అసలు, వజీరు దర్శనమే కాలేదు – నెలా పదిహేను దినాలు పడిగాపులు పడివుంటేనేగాని.

ఆ ప్రయత్నంలో, నిజంగా తల ప్రాణం తోకకు వచ్చిందతనికి. కాని దర్శనం యిచ్చాక మాత్రం యీ వట్టివేళ్ళ అత్తరుకే ఆ వజీరెంత ముగ్ధుడయిపోయాడు? అప్పుడక్కడున్నవారు ఎంత సంబరపడ్డారూ? తరవాత, నవాబు ఎంత మెచ్చుకోలేదూ? మరి యిక్కడ, పెద్దాపురంలో, అడుగు పెట్టిననాడే కావలసిన భోగట్టా అంతా దొరికిపోయింది.

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

మర్నాడు ఠాణేదారు ప్రసన్నుడయిపోయాడు. మూడో నాడే కోటలో ప్రవేశం దొరికింది. అయితే, అంత సౌలభ్యానికి చివరికిదా ఫలితం, వీరిలో విలాసాలకు తగినంత విలువ లేకపోవడం అతనెరుగును.

అలాగని నిర్లిప్తత కూడా అంతంతగానే వుండడమూ అతనికి తెలుసు. అయితే మాత్రం ఇంత తల్లకిందులా?

ఇంతకీ అత్తరు సువాసన చెడుకంపుగా బాధపడే మనిషి, రాజు తరవాత రాజంత వాడయి వుండడమా? రాచ ఠీవికి ఇదితగునా? దీనివల్ల, మహారాజు ప్రాభవం, వైభవం దివాంజీకి లక్ష్యం లేదనుకోవాలా? లేక మహారాజు ప్రవృత్తి కూడా యిలాంటిదే అనుకోవాలా? అతడికి ఏమీ పాలుపోలేదు. చివరికిది ఏమి జరుగుతుందో అని అనుమానం పట్టుకుంది.

ఇంతమాత్రానికే నిరాశ చెందదలుచుకోలేదు కానీ తప్పదేమో అన్నట్టు జవాన్లకేసి చూశాడు.

ఇంతలో "ఏయ్ జవాన్"? అని పిలిచారు ఠాణేదారు, ద్వారం కేసి చూస్తూ.

"చిత్తం బాబయ్యా!" అంటూ వెంటనే లోపలికి వెళ్ళిన జవాను "ఢిల్లీ నుంచి అత్తరు వర్తకుడొకడు వచ్చి దర్శనం కోరుకుంటున్నాడండి" అని విన్నవించాడు.

అతను, నేను మనవి చేసుకున్న సాయిబేనండి" అన్నాడు ఠాణేదారు, మెల్లిగా.

"దివాణంలోనే అంగడి తెరుస్తాడటనా?" అని తలపైకెత్త కుండానే కొంచెం కటువుగా అన్నాడు. అది విని ఖాను తెల్ల పోయాడు. జవానే కాదు, ఠాణేదారు కూడా జంకిపోయాడు.

కాని 'చిత్తగించారూ?'' అంటూ వొక బోసినోటి శాస్త్రులు మాత్రం అందుకున్నాడు. తన ప్రతిభ చూపించడానికి మాంచి అవకాశం దొరికిందన్న

ఉత్సాహంతో, నలుగురికేసి చూస్తూ.

అయితే, అప్పుడు కూడా దివాంజీ తల పైకెత్తి చూడకపోగా, అతణ్ణి మాత్రం ఉద్దేశించి, ఒక్కొక్క మాటు కొక్కొక్క పెద్దమనిషి కేసి చూస్తూ "దివాణంలోనే అంగడి తెరుస్తాడటనా? అంటే చెప్పలేను గాని, అతను చేసిదాంట్లో మంచి భావుకత మాత్రం కనపడుతోంది. ఏమంటే? తన అత్తరు సువాసనతోనే తన విషయం యావత్తూ విశదపరచుకున్నాడతను. ఇది చాలా గొప్పగా వుంది. ఢిల్లీలో ఉంటున్న మనిషి కిదొక లెక్కా మరి? అక్కడ యెంతెంతలేసి పెద్దవాళ్ళుంటారు? వారి దగ్గర మసులుకునే మనిషి సామాన్యడయివుంటాడా? చాలా బాగుంది. తప్పకుండా చూడతగ్గవాడతను" అన్నాడు శాస్త్రులు, చివరిమాట ఠాణేదారు కందచేస్తూ

అయినా, దివాంజీ మాట్లాడలేదు.

చూడనే లేదు.

రాస్తూ రాస్తూ వుండిన కలం మాత్రం కిందపెట్టేసి పొడుంకాయ అందుకున్నాడు, అంతే!

"ప్రవేశపెట్టు" అన్నాడు ఠాణేదారు, ఒక్క అంగలో లోపలికి వెళ్ళి "దివాంజీ వారికి కోటి సలాములు. నేను ఢిల్లీనుంచి వచ్చానండి. ఏలినవారి పాదాలు వెతుక్కుంటూ" అన్నాడు ఖాను, చేతులూపుకుంటూనూ, మూడుమాట్లు వంగిలేస్తూనూ.

"ఏమి పని?" అనడిగాడు దావాంజీ దర్పంగా అతని సలాములు కళ్ళతో అందుకుని.

"నేనత్తర్లు తయారుచేస్తాను మహాప్రభూ! దక్షిణదేశంలో, గోల్కొండ తరువాత పెద్దాపురం ఒక్కటే చూడతగ్గది అని విన్నాను, రెక్కలు కట్టుకు వచ్చి వాలాను. తమరు కటాక్షించాలి" అని వేడుకున్నాడు ఖాను.

"రెక్కలుండడమే వస్తే ఎక్కడో వొకచోట వెళ్ళి వాలకా, ముడుచుక్కూచుంటాడా మరి, ఎవడయినా?" అని వెటకారంగా అన్నాడు. దివాంజీ.

అందులో ఉన్న దెబ్బ ఖాను గుర్తించకపోలేదు. కాని "తమరు సరిగా సెలవిప్పించారు మహాప్రభూ! ఏమంటే, రెక్కలున్నందుకుగాను, ఎక్కడ సరసులుంటే అక్కడ వెళ్ళి వాలడమే. కనుకనే నాలుగు తరాలనాడు, మా కుటుంబం, పారశీకదేశం విడిచి ఢిల్లీ వచ్చి వాలింది. వచ్చాక కూడా సైన్యంలో చేరడానికెన్నో అవకాశాలు తటస్థపడినా, పేరుతెచ్చిన కళాజీవితాన్ని విడిచిపెట్టలేక అత్తరులే తయారుచేసి, ఢిల్లీ పాదుషాల ఆదర గౌరవాలు పొందుతోంది" అన్నాడు, ధోరణి మార్చించదలచి.

దీంతో "కావచ్చు" అన్నాడు దివాంజీ, ఏ మాత్రం కాఠిన్యం తగ్గకుండా.

"మా నాయనగారి సెలవుపొంది, నేను, దక్షిణదేశ ప్రభువులను సేవించుకోడానికి వచ్చాను. గోల్కొండ నవాబుగారూ, అక్కడి వజీర్లూ మా పరిశ్రమ గుర్తించి మిక్కిలి ఆదరించాడు."

"ఇంకేం?"

"ఇంకేమంటే మనవి చేసుకున్నాను గదా, గోల్కొండ తరవాత పెద్దాపురమే చూడతగ్గదని విన్నానని? ముందు తమరిది చిత్తగించకోరుతున్నాను." ఇలా అని, ఖాను, మూత తెరిచి ఒక చిన్న పెట్టె దివాంజీ ముందు వుంచాడు. లోపల, ఎర్రని ముఖముల్ గుడ్డ అతికించిన చక్కని పెట్టె అది. అందులో ఒక చిన్నసీసా. చక్కని నగిషీ పనితో యెంతో ముచ్చటగా వుందది. సీసాలో సగానికి పైగా అత్తరు వుంది. అది చూసి అక్కడివారందరూ గుటకలు మింగారు.

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

"అది మల్లె అత్తరు మహాప్రభూ! అందులో ఉన్నది రెండే తులాలు; కాని రెండు వసంతాలకు తయారయిందది."

"వోస్!"

"మా వస్తువు మర్యాద మాకు మేమే చెప్పుకోడం ధర్మం కాదు. చిత్తగిస్తే తమకు తెలియంది కాదు. అయితే తల కొంచెం ఎడంగా ఉంచి మరీ మూత తీయించండి మహాప్రభూ!"

దాంతో అక్కడివారందరూ తమ ముక్కుకు పనికల్పించారు. కాని నువ్వు చెప్పగానే మూతలు తియ్యడమే పనా మాకు?" అనడిగాడు దివాంజీ, దురుసుగా.

ఖాను మళ్ళీ కుతకుతలాడిపోయాడు. అయితే, అధికార దర్పం ఒక్కొక్క మనిషిలో ఎలాంటి పశుప్రవృత్తి రేకెత్తిస్తుందో అతనికి తెలుసు.

లక్షలకొద్దీ అధికారులతో నిండివుండిన ఢిల్లీ నగరంలో, అతను, మొదట ఆర్జించింది యీ పరిజ్ఞానమే.

ఇలాంటివాటికి నషాళం అంటేటట్లు బదులు చెప్పడమూ అతనికి చేతనవును. పనిమీద రాకపోయి ఉంటే బదులు మాట అనేందుకు సందేహించేవాడు కాదు. కాని, యిప్పుడలా చేస్తే కార్యం భంగపడుతుంది. పారితోషికం కంటే, తన అత్తర్లకు దేవదుందుభులు మోగడం అతనికి ఎంతో అవసరం. అది, రాజు కంట పడగలిగితే తన కార్యం సిద్ధిస్తుంది.

రాజసభలు కంటకభూయిష్ఠాలు, పాలకోసం రాయి మొయ్యాలి తప్పదు. అంచేత, అతనోపిక పట్టాడు. ఇంతేకాదు. అలాంటి దురుసు మనిషిని, అతనికి తగ్గట్టు మాట్టాడి, అంతకంటే ఎక్కువగా నొప్పించడం కంటే, తగ్గి మాట్లాడి, దారికి తెచ్చుకుని, పిడికిట పట్టుకుని ఆడించడం కూడా వ్యవహర్తల లక్షణం.

ఈ నిశ్చయంతో అతను "ఏలినవారి–" అంటూ ప్రారంభించాడు; కాని మాట సగంలోనే కలగజేసుకుని, ఠాణేదారు "దివాంజీవారు అది సావకాశంగా చిత్తగిస్తారు, ముందు నువ్వు వచ్చిన పనేమిటో మనవి చేసుకో" అని అందించాడు.

"చిత్తం, చిత్తం" అంటూ మరో పెట్టె తెరిచి దివాంజీ ఎదట వుంచాడు ఖాను, ఠాణేదారు సమయస్ఫూర్తికి కళ్ళతో మెప్పు చూపిస్తూ. లోభాగాన ఆకుపచ్చ ముఖమల్ గుడ్డ అతికించిన చక్కని పెట్టె అది. ఎర్రని అత్తరుతో, అపురూపమైన నగిషీ పని చేసిన చిన్న సీసా వొకటి, కోటికిరణాల జాతిరత్నం లాగ మెరిసిపోతూంది, అందులో. అక్కడివారు దాని చక్కదనానికి ముగ్ధులయిపోయారు; కాని దివాంజీ అటు చూడనే లేదు.

దాంతో ఖాను నరాలు తోడేసినట్టయిపోయాడు; కాని ఏమీ ఎరగనట్టు "ప్రభువులకు తెలియంది లేదు" అంటూ ప్రారంభించాడు ఖాను.

"పెద్దాపురం ప్రభువులకు నజరు పెట్టుకుందామని తయారుచేశానది. గోల్కొండ నవాబుగారికి వట్టివేళ్ళ అత్తరు మిక్కిలి ప్రియం అని తెలిసి అదెంత శ్రద్ధగా తయారుచేశానో, పెద్దాపురం మహారాజులుంగారికి గులాబీ అత్తరు మిక్కిలి ప్రీతిపాత్రం అని తెలిసి అదీ అంతే శ్రద్ధగానూ తయారుచేశాను. ఆ సీసాలో ఉన్నది ఒక్కటే తులం – దీని నిమిత్తం కాశ్మీరం జాతిపువ్వులు వాడాను. ఢిల్లీ పరిసరాల్లో పారశీక జాతులే ఎక్కువ. కాశ్మీరజాతి చాలా అరుదుగా దొరుకుతుంది అంచేత, ఆ కాస్త అత్తరూ తయారు కావడానికి దాదాపుగా రెండేళ్ళు పట్టింది మహాప్రభూ" అని వివరించి చెప్పాడతను.

ఇది విని అక్కడివారు; దాని విశిష్టతా, విలువ ఊహించుకుని చాలా ఆనందించారు; కాని "ఆశ్చర్యమా?"

www.apteachers.in
అనడిగాడు ముందు దివాంజీ, మెల్లిగా.

"గొప్ప వస్తువులు తయారు చెయ్యాలంటే గడియల్లో సాగుతుందా మరి?" అంటూ ఖాను పడిన శ్రమను మెచ్చుకున్నాడు. కాని "యెంతకి గిట్టుబాటయింది పాపం?" అనడిగాడు చివరికి; జాలిపడుతున్నట్టు చూస్తూ.

ఖాను నిర్వణ్ణుడయిపోయాడు. అది గుర్తించి, కళ్ళంతా గర్వం నింపుకుని, తల పంకించుకున్నాడు, దివాంజీ. అతగాడి నిర్విణ్ణతా, ఇతగాడి గర్వరేఖా చూసి, అక్కడి పెద్దమనుష్యులందరూ చకితులయిపోయారు.

అనేక రాజసభలూ, ఎన్నో నవాబు దర్బారులూ చూసి, సమస్త మర్యాదలూ అనుభవించిన షుకురల్లీఖాను, అనేక శోధనలకు తట్టుకోగలిగిన ఆ కళాశీలి ఈ కొత్తదెబ్బకు ఠారెత్తిపోయాడు. మహారాజు మిక్కిలి సరసుడని విని ఉన్నాడు కనక, రాజదర్శనంతో తన కష్టాలన్నీ తీరిపోతాయని ఆశించాడు. అత్తరు సౌరభం కంపుగా భావించిన అధికారి దగ్గర ఇంతకంటే రసికత వుంటుందనుకోవడం తనదే తప్పని తనకి తానే మందలించుకుని, అప్పటికిక చేసేదిలేక, తన నిస్సహాయతా దాంతో పుట్టిన కోపమూ, ఆ వెంటనే వచ్చిన ఏవగింపూ అణుచుకుని, వినయాన్ని తెచ్చుకొని, "అది కంటికింపయిన వస్తువు మహాప్రభూ! దక్షిణదేశానికంతకీ జాతిరత్నం శ్రీవత్సవాయి ప్రభువు నిమిత్తం తయ్యారయింది. ఈ కారణాలు చెప్పడానికి దానికి అదనపు ధర అడగడం మాకు మన్నన కాదండీ!" అన్నాడు, కళ్ళతో బాధకనపరుస్తూనే.

"మరి మా ప్రభువులను మీరెంతగా గౌరవిస్తున్నారో మాకు తెలియడం ఎలాగా?" అనడిగాడు దివాంజీ అమాయికత్వం నటిస్తూ.

పెద్దాపురం రాజసభలో ఇలాంటి వస్తువుల విలవలు కట్టగలవారు లేరని నేననుకోగలనా మహాప్రభూ?"

"మా ప్రభువుకోసం తయారైన వస్తువు వారి అనుమతి పొందకుండా విప్పి చూడడం మాకు ధర్మమే అనుకోనా మరి?"

"మరి ప్రభువుల సన్నిధికి–"

"అది సరేనయ్యా! మేము వారి భృత్యులం కదా, మేమూ కొన్ని విధులు నిర్వర్తించుకోవాలి కదా?"

"నేను మనవి చేసుకునేది అదే మహాప్రభూ!" అన్నాడు ఖాను.

"ఒకరితో మనవి చేసుకోడానికీ, సొంతానికి సత్యం గుర్తించడానికీ చాలా అంతరం ఉంది. మీ ఢిల్లీలో, వజీర్లు ఎవరే వస్తువు తెచ్చినా దాని మంచిచెడ్డలు తెలియకుండా అది పాదుషావారి సన్నిధిలో ఉంచనిస్తారా?" తల తాటించుకుంటూ దివాంజీ ఇలా అడిగేటప్పటికి, ఖాను నిలువునా నీరయిపోయాడు. వట్టివేళ్ళ అత్తరు సౌరభంతో ఖాను పని తనాన్ని మనసులో అభినందిస్తుండిన పెద్దమనుష్యులు ఈ మడత పేచీకి నిర్విణ్ణులయినారు.

ఠాణేదారు వెంటనే ఖానుణ్ణి సంబోధించి "దివాంజీవా రిప్పుడు చాలా తొందర పనిలో ఉన్నారు. ఇప్పటికి వెళ్ళిపో, మరోమాటు దర్శనం చేసుకుందువుగాని" అన్నాడతను.

"ఇది బాగుంది" అన్నట్టుందరూ తలలూపుకున్నారు. అంతమంది పెద్ద మనుష్యులకు తన యెడల సానుభూతి ఉండినందుకు తృప్తిపడి, మళ్ళీ సలాములు చెప్పి, బుగ్రవంచుకుని వెనక్కి అడుగులేస్తూ బయలుదేరాడు ఖాను. గుమ్మం దాటేటప్పటికే రెండు పెట్టెలూ తొచ్చి వొక జవాను అతని చేతిలో వుంచాడు. ఆరాత్రి తెల్లవార్లూ ఖానుకి కంటికి నిద్రలేదు, నోటికి ముద్దకూడా పోలేదు. కళ్ళు మూసుకున్నా తెరుచుకున్నా దివాంజీ చికిలింపు చూపులే కనపడసాగాయి. సరయిన ధర చెప్పమనడం ఒక్కటే జ్ఞాపకం రాసాగింది. దీంతో క్షణక్షణమూ యీటెపోట్లు తింటున్నట్టే బాధ

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

పడిపోయాడతను, ఐతే, లోకప్రవృత్తి ఎప్పుడూ ఒకేరకంగా ఉండదు, ముక్కుకు సూటిగా వెడదామంటే ఎవరికీ సాధ్యంకాదు, నిజానికి సాయం, ప్రతిఘటనలు తటస్థపడుతుంటేనే జీవితానికి పరిణతి.

ప్రతిఘటనలు అతిక్రమించగలిగితేనే జీవితానికి విజయం చేకూరుతుంది. కాని, ఒక్కొక్క జీవితానికి హృదయం పునాది అయితే, మరొక్క జీవితానికి మేధస్సు ప్రధానం అయిఉంటుంది.

ఎక్కడ మేదస్సు ప్రధానమో అక్కడ అనుభూతి తక్కువయిపోతుంది. అక్కడ సానుభూతి కూడా ఉండదు. ఏ జీవితానికి పునాది హృదయమో అది కళాబంధురం అవుతుంది. అక్కడే కళలకు పరిణతి ఉంటుంది. అక్కడే కళలకు వినియోగం కూడా అక్కడే తన్మూలంగా కలిగే ఆనందానుభవమూ ఉంటుంది. అలాంటి ఆనందం తాననుభవించాలన్నా, ఇతర్లకు కలిగించాలన్నా ఆ కళాశీలి, తప్పనిసరిగా మహామేధావి అయివుండాలి.

కళావేత్తలోనే – కళాసాధనలోనే తన జీవితం పరిపక్వం చేసుకుంటూ ఉండాలి. ఎందుకంటే? ఎవరి సంకల్పం విశుద్ధమో, ఎవరి హృదయం కళామయమో, ఎవరి దీక్ష అనన్య సామాన్యమో, ఎవరి ప్రాప్యం లోకకళ్యాణమో ఆ కళాశీలుల నిర్మాణాలే ద్వంద్వభూయిష్ఠమైన భౌతికజగత్తులో ధ్రువతారలయి మెరుస్తూ ఉంటాయి.

నిజంగా షుకురల్లీ ఖాను అలాంటి కళాశీలి. అతని అత్తరు అలాంటి ధ్రువతార.

అయినా "అక్కర్లేదు" అని చెప్పేస్తే, వెంటనే అతనర్థమూ చేసుకోగలడు; సులభంగా నిరాశా చేసుకోగలడు, నిర్విచారంగా వెళ్ళిపోనూ గలడు. కాని ఇదేమిటీ ఈ వాలకం?

తన అత్తర్లకు విలువ కేవలం డబ్బే అయితే అందుకోసం అతనింత దూరం రానక్కర్లేదు. ఉన్నఊరే కదలనక్కరేదు. అసలు, ఢిల్లీ నగరమే ఒక మహాదేశం అంత. అక్కడే ఎందరో ప్రభువులూ, సంపన్నులు ఉన్నారు. వారిలో ఎందరో రసికులున్నారు. అతని అత్తర్లు కళ్ళకద్దుకునేవారు వందల వేలమంది ఉన్నారు.

అయితే, పెద్దాపురం ప్రభువు, శ్రీశ్రీశ్రీ శ్రీవత్సవాయి చతుర్భుజ తిమ్మజగపతి మహారాజు రసికత ఢిల్లీలో గుబాళించింది. ఢిల్లీ పాదుషా రసికతకే వంకలు దిద్దింది. అంచేత ఖాను ఆగలేకపోయాడు. దీక్ష పట్టాడు. తపస్సులో కూచున్నాడు. అపూర్వ సాధన చేశాడు. తహతహలాడిపోయాడు. రెక్కలు కట్టుకువచ్చి మరీ వాలాడు.

కాని, షష్టి గడియలూ పువ్వులతోనే కాలంగడిపే అతనికి, ఇక్కడ ప్రభుదర్శనం గగనపుష్పం అయిపోయింది. అపూర్వమైన జాతిరత్నం గులకరాళ్లతో కూడుకుపోయి ఉండినట్టనిపించిదతనికి వచ్చి వచ్చి ముళ్ళకంచె ల్లోనూ, మురికి గుంటల్లోనూ పడిపోయినట్టు బాధపడ్డాడతను.

"అంత ఢిల్లీలో కూడా – అంతంతలేసి వజీర్లయినా చెయ్య లేని కుట్ర ఇది" అని పరితపించాడు అతను. బయట ఉండగా పెద్దాపురం ఎంత ఆశ కొలిపిందో, వచ్చి ప్రవేశించాక అంత దిగగుంజేసినట్టుగా అనిపించింది అతనికి. దక్షిణదేశానికి దక్షిణ దేశమే దుష్టమృగ సంకీర్ణం అయిన కీకారణ్యంలా తోచిందతనికి. దీంతో "ముక్కూ మొగమూ ఎరుగనిచోటికి రావడం మనదే బుద్ధి తక్కువ" అని పిసుక్కున్నాడతను. కాని, తన భృత్యుల చేతిలో ఒక కళాశీలి ఎంత క్షోభ పడిపోతున్నాడో మహారాజు కెలా తెలుస్తుందీ? లోకంలో, ఎక్కడయినా ఇలాంటి ఇబ్బందులు సహజమే కావచ్చు. అయితే, ఎంతెంతలేసి ధర్మరాజ్యాలలోనూ, మహాఉదారులైన ఎలాంటి ధర్మప్రభువుల పరిపాలనలోనూ అసంతృప్తి కలిగిదంటే – ఏవగింపు పొటమరించిందంటే – విరోధభావం పుట్టుకువచ్చిందంటే – కల్లోలాలు చెలరేగాయంటే అక్కడి కార్యనిర్వాహకుల ఇలాంటి అతి లౌక్యాలవల్లనే.

www.apteachers.in

కాని, ఏదియేమయినా, ఎంత చూసినా ఖాను కిక్కడ ఒక్కటే ఫలితం. అంచేత, "సన్మానం మాట దేవుడెరుగును, మర్యాదగా అయినా ఇక్కణ్ణుంచి వెళ్ళగలమా?" అని బెంగ పట్టుకుందతనికి. ఇలా ఉండగానే కోళ్ళు కూశాయి. పనిలో పనిగా కాకులు కూడా కూసేశాయి.

తెల్లవారడం తడవుగా వెళ్ళి ఠాణేదారు పాదాల మీద వాలిపోయాడు ఖాను. ఇంతవరకూ అంత గొప్ప అత్తర్లు పెద్దాపురం కోటకు రాలేదన్న సంగతి ఠాణేదారుకి తెలుసు. ఖానుకి మంచి సన్మానం జరగడం దివాంజీకి సుతరామూ ఇష్టంలేదు. ఇదీ తెలుసు అతనికి. బుర్ర ఎగిరిపోవడానికి కయినా ఒప్పుకుం టాడు గానీ ఖాను సరయిన ధర చెప్పడు. ఇదన్నీ తెలుసు అతనికి. అయితే మాత్రం మహారాజు చూశాడంటే ఖాను అత్తర్లు విడిచి పెట్టడు. ఈ విషయాన్ని ఆ సమయంలో దివాంజీ దగ్గర వుండిన వారందరూ గుర్తించేశారు.

www.apteachers.in
ఠాణేదారు ఆలోచించాడు.

కాసేపటి తరువాత "సాహసించగలవా?" అనడిగాడతను. "మానం నిలిచేటట్టు లేదు. ఇక ప్రాణాలెందుకూ? ఆజ్ఞాపించండి" అంటూ ప్రాధేయపడ్డాడు ఖాను. "ఇక నువ్వు కోటలో ప్రవేశించడం అసాధ్యం. ప్రవేశించినా ముందుకి వెళ్ళగలగడం అబద్ధం. వెళ్ళినా నిలిచి ఉండడం దుర్ఘటం. ఇవన్నీ జరిగితే మాత్రం నీ కోరిక సఫలం అవుతుంది. తప్పదు." అన్నాడు ఠాణేదారు.

"సెలవిప్పించండి."

"మహారాజు, దినమ్మూ నాలుగ్ఘడియల పొద్దువేళ పంచకళ్యాణి మీద కొడల్లోకి షికారు వేంచేస్తారు."

"సెలవిప్పించండి."

"కోట ప్రాకారం దాటకుండా నువ్వు వారి కళ్ళబడాలి. కనీసం నీ వట్టివేళ్ళ అత్తరు నయినా వారినాకర్షించాలి."

"సెలవిప్పించండి."

"దివాంజీ వారిదివరకే ఇది ఊహించి ఉంటారు. ఇందుకు ప్రతిక్రియ ఆలోచించి ఉంటారు. ఆజ్ఞలు మాత్రం ఇంతవరకూ పుట్టలేదు."

"సెలవిప్పించండి."

'నీకు అదృష్టం ఉంటేనే ఆయనకిది మరుపు వస్తుంది. మహారాజు పెట్టిపుట్టినా మరుపు వస్తుంది. లేదూ, నువ్వు కోటలో ప్రవేశించలేవు."

"సెలవిప్పించండి."

"నావల్ల కాదగ్గదింతే. ఇక ఏటికడ్డపడు."

ఖానుకి ఊపిరి తిరిగింది.



"నిన్న నేను చూపించింది చందినీ అత్తరు. ఇదిగో, దాన్ని స్వీకరించండి, దివాంజీవారికి నా మీద అనుగ్రహమూ లేకపోయింది, ఇది వాడుకునే యోగ్యతా లేకపోయింది, ఎవరేమి

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

చెయ్యగలరు? తమరు చివరి ఉపాయం చెప్పారు. బతికివుంటే నేను తమ మేలు మరవను.” అని చెప్పి, మూడుమాట్లు వంగి సలాము చేసి ఖాను వెళ్ళిపోయాడు.

ఖాను నెమ్మదిగా కోటలో ప్రవేశించాడు. వంశధార దాటి అనుమానిస్తూనే పదడుగులు వేశాడు. కాని ఇంతలో “అరే, అరే” అని నాలుకలు కరచుకుంటూ, “ఎక్కడికెక్కడి” కంటూ వచ్చి నలుగురు సిపాయిలు అతణ్ణి అటకాయించారు. ఖానుకి, వెంటనే రక్తం ఉడుకెత్తిపోయింది. చూపులు చెదిరిపోయాయి. కాని, సప్రయత్నంగా నిలవరించుకుని “నేను దివాంజీవారి దర్శనానికి వెడుతున్నాను. నన్నెందుకడ్డుకుంటారూ?” అనడిగాడతను.

“ఇప్పుడు వీలులేదు, పోపో” అన్నారు సిపాయిలు.

“నేను పాతవాణ్ణేనయ్యా! నిన్న సాయంత్రం ఒక పనిమీద మాట్లాడే ఉన్నాను. ఆ వ్యవహారం పూర్తిచేసుకోడానికే వెడుతున్నాను”

“అయితే, వెళ్ళి వారి లోగిటి దగ్గరే కనిపెట్టుకుని ఉండు,”?

“పోనీ, ఠాణేదారుగారి కచేరీకి తీసుకువెళ్ళండి.”

“వారిప్పుడు దివాంజీగారి సన్నిధిని ఉన్నారు, నీకు కనపడరు”

“వారు వచ్చేదాకా కనిపెట్టుకుని ఉంటాను.”

“ఆ పని వారి ఇంటి దగ్గిర, కోటలో వల్లకాదు.”

ఇలాగ యుక్తులమీద యుక్తులు కురిసిపోయాయి. వాటిని ఒరుసుకుంటూ కాలం కూడా గడిచిపోయింది. “ప్రాకారంలో నిలవగలిగితే చాలు” అని ఖానుకి సలహా ఇచ్చినవారికి లోపల్లోపల అతను ధన్యవాదాలు చెప్పుకుంటూనే ఉన్నాడు. ముందుకడుగు పడన్వివద్దని సిపాయిలకు దివాంజీ ఆజ్ఞ. అందుకు వారు కూడా మురిసిపోతూనే ఉన్నారు. ఇంతలో, ఆ చుట్టుపట్ల పనిచేస్తున్న వారందరూ వచ్చి మూగారు. వచ్చేపోయేవారు కూడా వచ్చి చేరారు. చూస్తూ ఉండగానే, మహారాజు చదరంగం సహచరులూ, దశావతారీ స్నేహితులూ వచ్చారు. పనిపాటలజనమే కాక, పెద్దమనుషులూ పోగయినందుకు ఖాను సంతోషించాడు.

“ఏమిటి విషయం?” అని కొందరు అడిగారు. ఖాను తన అవస్థ అంతా చెప్పుకువచ్చాడు. దానిమీద, సిపాయిలు కూడా తమ అసహాయస్థితి చెప్పారు. ఇలా ఒక్క గడియ గడిచింది.

“ఇంకో అరగడియ గడిస్తే మహారాజుగా రిటు రానే వస్తారు” అని ఎవరో అన్నట్టు వినిపించింది. కాని, అంతవరకూ అతణ్ణి అక్కడ నిలపగలిగినందుకు ఆనందిస్తున్న సిపాయిలు, మరొకడెవడో పరుగు పరుగున వచ్చి యేదో చెప్పగానే “ఇక దయచెయ్యి” అనడం ప్రారంభించారు. “రాజు బయలుదేరుతున్నట్టున్నాడు. అంచేతనే వీళ్ళు పొమ్మంటున్నారు. ఇక గెంటుతారు.” అని గుర్తించాడు ఖాను. చిరవాంఛా, దీర్ఘశ్రమా ఇలా వ్యర్థం అయిపోతున్నందుకు చాలా చాలా కుమిలిపోతున్నాడతను.

చివరికి, అక్కడున్న వారిలో పెద్దమనుష్యులుగా కనపడుతున్నవారి నుద్దేశించి “పెద్దాపురం రాజ్యంలో కళాకారులకిదీ సన్మానం?” అని నిక్కచ్చిగా అడిగాడు.

అంతే, దాంతో అతని శరీరం వణికిపోయింది. కళ్ళెర్రబడ్డాయి. చూపులు నిశిత బాణాలుపోయాయి. ఈ స్థితిలో చప్రున గులాబీఅత్తరు పైకి తీశాడతను. అందరూ చూపులప్పగించేశారు. “ఇది పెద్దాపురం ప్రభువులకోసం

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

తయారుచేశాను" అంటూ, ముందు, సీసా చేతబుచ్చుకుని పెట్టె కిందికి విడిచి పెట్టేశాడతను. తరువాత "నిద్రాహారాలు మాని తయారుచేశా" నంటూ మళ్ళీ అందుకుని "ఢిల్లీ పాదుషావారు అటూ, పెద్దాపురం ప్రభువులవారు ఇటూ" అన్న గౌరవభావంతో నా శక్తి అంతా వినియోగించి బొట్టు బొట్టుగా కూడబెట్టానిది. ఒక్క రాకతో దక్షిణదేశంలో నా పేరు నిలిచిపోతుందన్న పేరాసతో నా రక్తం అనుకుంటూ కూడబెట్టానిది. అయితే, పెద్దాపురం ప్రభువు ఎంత సరసులో వారి పరివారం అంత విరసమైనది." అని నేను ఇక్కడికి వస్తేగాని తెలుసుకోలేకపోయాను. గులాబీ పువ్వు సౌరభం ఎంత దూరమో వ్యాపిస్తుంది. కాని దాని ముళ్ళ ప్రభావం ఉన్నచోటనేగాని వెల్లడికాదుగా? ఇది నాకు జరిగిన అమర్యాద. ఇది నా గులాబీ అత్తరుకు లభించిన అగౌరవం. ఇది పెద్దాపురం మహారాజు కందించడానికి నాకిక మార్గాలులేవు. అయితే, అది వెనక్కి తీసుకువెళ్ళడం నాకేకాదు, మా కుటుంబానికే శిరశ్చేదం. ఇక నాకు మిగిలిన తృప్తివొక్కటే. దివాంజీవారి అతి లౌక్యంతో కనుమూసే మహారాజులుంగారి స్వచ్ఛకీర్తి, ఢిల్లీ నివాసి షుకురల్లీ ఖాను గులాబీ అత్తరు సౌరభంలో కలకాలమూ గుబాళిస్తూ, ఉంటుంది. చాలు నాకిది" అంటూ ఊర్ధ్వశ్వాసతో కోటగోడకి విసిరికొట్టాడతను సీసా.

సీసా భళ్ళుమంది. సీసాపెంకులు ఘుళ్ళున చెదిరిపడ్డాయి. రాజసఖుల హృదయాలు రువ్వుమన్నాయి. ఆ ప్రదేశం అంతా అత్తరు సౌరభంతో గుమ్మంది. అందరూ ఆ పరిమళానికి మత్తెక్కుతున్నట్టయ్యారు.

ఒక క్షణానికి తెలివివచ్చి అందరూ కళ్ళెత్తి చూసేటప్పటికి, హఠాత్తుగానూ అప్రయత్నంగానూ వెనక్కి తిరిగి చూసి ఖాను కొయ్యయిపోయాడు.

అదేమిటో అని అందరూ వెనక్కి తిరగి చూడగా, పంచకల్యాణి మీద శ్రీశ్రీశ్రీ శ్రీవత్సవాయి చతుర్భుజ తిమ్మజగపతి మహాద్భుతమైన గులాబి అత్తరు సౌరభాన్ని ఆఘ్రాణిస్తూ. "ఎక్కడివీ సుమనోహర సుగంధ పరిమళాలు అని అరకంట చూస్తూ నిలిచి ఉన్నాడు.

మోర పైకెత్తుకుని, పంచకళ్యాణి గుర్రం సైతం అద్భుతాన్ని ఆస్వాదిస్తూ ఉండుండి సప్రయత్నంగా ఊపిరి తీసుకుంటోంది.

ఇప్పటికీ ఆ ప్రదేశంలో గులాబీ అత్తరు సౌరభం గుబాళిస్తునే ఉంటుందంటారు, చూసి వచ్చినవారు.

SCERT ANDHRA PRADESH

ఇవి చేయండి

1. "గులాబీ అత్తరు" కథను సంక్షిప్తంగా రాయండి.
2. షుకురల్లీఖాన్ స్వభావం ఎలాంటిది?
3. పెద్దాపురం ప్రభువు ఎవరు? ఆయన గురించి రాయండి.

www.apteachers.in

10. హరిశ్చంద్రుడు

- గౌరన

చదవండి - ఆలోచించండి - చెప్పండి

బలి చక్రవర్తి గొప్పదాత. అతడు ఒకసారి యజ్ఞం చేస్తున్నాడు. ఆ యజ్ఞవేదిక దగ్గర దానధర్మాలు చేస్తున్నాడు. వామనుడు దానం స్వీకరించడానికి వచ్చాడు.

బలి	:	ఏం కావాలి?
వామనుడు	:	మూడడుగుల నేల.
బలి	:	తప్పక ఇస్తాను.
శుక్రాచార్యుడు	:	బలీ! వద్దు! వద్దు! వచ్చినవాడు రాక్షసవిరోధి! అతనికి దానం ఇస్తే నీకే ప్రమాదం!
బలి	:	గురువర్యా! నేను ఆడినమాట తప్పను. వామనా! మూడడుగుల నేల గ్రహించు.

ప్రశ్నలు

1. బలిని దానం ఇవ్వవద్దని ఎవరన్నారు? ఎందుకన్నారు?
2. దానం ఇస్తే ఎవరికి ప్రమాదం?
3. బలిచక్రవర్తి గొప్పదనం ఏమిటి?
4. ఆడిన మాట తప్పనివారి గురించి మీకు తెలుసా?

నేపథ్యం

ఒకసారి దేవేంద్రుడు కొలువుదీర్చి ఉన్నాడు. 'మూడులోకాలలో ఎవరైనా బొంకనివారున్నారా? ఇప్పుడు జీవించి ఉన్నవారిలో కానీ గతకాలంవారిలో కానీ అసత్యమాడని వారున్నారా? భవిష్యత్తులో ఎవరైనా ఉంటారా?' అని త్రికాలజ్ఞులైన మునీశ్వరులను అడిగాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. కొంతమంది విన్నా విననట్లు ఊరుకున్నారు. కానీ వశిష్ఠుడూరుకోలేదు. హరిశ్చంద్రుడు అటువంటి ఉత్తమ లక్షణాలు కలవాడని సభలో ప్రకటించాడు. ఆ లక్షణాలు ఏమిటో ఈ పాఠం ద్వారా తెలుసుకుందాం.

ప్రస్తుత పాఠ్యభాగం గౌరన రచించిన "హరిశ్చంద్రోపాఖ్యానము" లోది.

విద్యార్థులకు సూచనలు

1. పాఠంలోని చిత్రం ఆధారంగా విషయాన్ని ఊహించి సంభాషణలు చెప్పండి.
2. పాఠం చదవండి. పదపట్టిక చూసి తెలియనిపదాలకు అర్థాలు తెలుసుకోండి.
3. సందర్భానికి తగిన అర్థాన్ని గ్రహించి చిత్రాల ఆధారంగా పాఠంభావాన్ని గ్రహించండి.
4. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

www.apteachers.in

నిరుపమ విజ్ఞాననిధి వశిష్ఠుండు
పురుహూతు తోడ నద్భుతముగాఁ బలికె
వినుము సురేంద్ర యీ విశ్వంబునందు
వినుతి కెక్కిన మహావిక్రమోన్నతుఁడు
తనరు షోడశమహాదాన వినోది
వినయభూషణుఁడు వివేకసంపన్నుఁ
డతుల సత్కీర్తి మహాభాగ్యశాలి
వితత ధనుర్వేద విద్యాధికుండు
కరుణాపయోనిధి గాంభీర్యఘనుఁడు
దురితదూరుఁడు బుధస్తోత్రపాత్రుండు
సర్వ శాస్త్రార్థ విచారకోవిదుఁడు
గర్వితరిపుగజ కంఠీరవుండు
వరుస నార్వురు చక్రవర్తులలోనఁ
దరమిడి మున్నెన్నఁదగు చక్రవర్తి
నిత్యప్రసన్నుండు నీతిపాలకుఁడు
సత్యసంధుండు త్రిశంకు నందనుఁడు
నిరుపమ విజ్ఞాననిధి భానువంశ
శరధిచంద్రుఁడు హరిశ్చంద్రుఁడా రాజు
పోఁడిమి మదిఁ దలపోసి చూచినను
వాఁడెపో బొంకనివాఁడు దేవేంద్ర

....

అల రెండువేల జిహ్వల వానికైనఁ
గొలఁదె హరిశ్చంద్రు గుణములు వొగడఁ
దను వెల్ల సత్యంబు తలఁ పెల్లఁగరుణ
పను లెల్ల ధర్మంబు పలు కెల్లఁ బ్రియము
బొంకు నాలుకకుఁ జేర్పుట కాని వావి

ANDHRA PRADESH

యింక నన్నియుఁ జెప్ప నేమి కారణము
వారిజ గర్భుని వ్రాఁత దప్పినను
వారిజాప్తుఁడు దూర్పువంకఁ గ్రుంకినను
మేరువు గ్రుంగిన మిన్ను వ్రాలినను
ధారుణీచక్రంబు తలక్రిందు వడిన
వారిధు లింకిన వజ్రాయుధంబు
ధార దప్పిన మాటతప్పఁడా రాజు.

H6TI1N



www.apteachers.in

కవి పరిచయం

ద్విపదకు పునర్జీవం పోసిన గౌరన 15వ శతాబ్దికి చెందినవాడు. ఈయన నల్గొండజిల్లా దేవరకొండ ప్రాంతంవాడు. హరిశ్చంద్రోపాఖ్యానం, నవనాథ చరిత్ర రచించాడు. సంస్కృతంలో 'లక్షణ దీపిక' అనే గ్రంథాన్ని రచించాడు. ఈయనకు 'సరస సాహిత్య విచక్షణుడు' అనే బిరుదు ఉంది. ఈయన శైలి మనోహరమైనది. సామెతలు, జాతీయాలతో కవిత్వం అలరారుతుంది. అచ్చతెలుగు పలుకుబళ్ళు కవిత్వం నిండా రసగుళికల్లా జాలువారుతాయి. పదప్రయోగాలలో నైపుణ్యం అడుగడుగునా కనబడుతుంది.

ప్రక్రియ – ద్విపద

ద్విపద రెండుపాదాలు ఉన్న పద్యం. ఇది జాతి పద్యం. గానయోగ్యమైంది.

సారాంశం

సాటిలేని విజ్ఞానఖనియైన వశిష్ఠుడు ఇంద్రుడితో ఇలా అన్నాడు. ఓ దేవేంద్రా! ఈ ప్రపంచంలో మహా పరాక్రమవంతుడు హరిశ్చంద్రుడు. ఇతడు పదహారురకాల దానాలు చేస్తూ ఆనందిస్తాడు. వినయమే అలంకారంగా కలవాడు. వివేకమే సంపదగా కలవాడు. మంచి కీర్తి వైభవాలు కలవాడు. ధనుర్వేద విద్యలో ఆరితేరినవాడు. మేఘంలా గంభీరమైనవాడు. దయకు సముద్రుని వంటివాడు. పుణ్యాత్ముడు.

పండితులచే ప్రశంసలు పొందువాడు. సర్వశాస్త్రాలసారం తెలిసినవాడు. గర్వించిన శత్రురాజులనే ఏనుగుల పాలిట సింహం వంటివాడు. షట్చక్రవర్తులలో ఒకడు. నీతిమంతమైన పాలన చేసేవాడు. సత్యం తప్పనివాడు. మహాజ్ఞాని. సత్యవాక్పరిపాలకుడు.

సూర్యవంశస్థుడయిన త్రిశంకుని కుమారుడు. సాటిలేని విజ్ఞానం కలవాడు. సూర్యవంశమనే సముద్రానికి చంద్రునివంటివాడు. ఆడినమాట తప్పని వాడు. దేవేంద్రా! రెండువేల నాలుకలు గల ఆదిశేషునికైనా ఈ హరిశ్చంద్రుని గుణగణాలు కీర్తించడం సాధ్యంకాదు. అతను సత్యస్వరూపుడు. అతని ఆలోచనలు కరుణతో నిండిఉంటాయి. హరిశ్చంద్రుడు ధర్మతత్పరుడు. ఆయన ప్రియంగా మాట్లాడతాడు. అబద్ధమనేది ఆయనకు తెలియదు.

ఇన్నిమాటలు చెప్పడం ఎందుకు? బ్రహ్మరాత తప్పినా, సూర్యుడు తూర్పున అస్తమించినా, మేరుపర్వతం భూమిలో కుంగినా, ఆకాశం ఊడి కిందపడినా, భూగోళం తలక్రిందులైనా, సముద్రాలు ఇంకిపోయినా, వజ్రాయుధం పదును తగ్గినా హరిశ్చంద్రమహారాజు మాత్రం ఆడినమాట తప్పడు.

విశేషాంశాలు

షోడశ మహాదానాలు : గోదానం, భూదానం, తిలదానం, హిరణ్యదానం, రత్నదానం, విద్యాదానం, కన్యాదానం, దాసీదానం, శయ్యాదానం, గృహదానం, అగ్రహారదానం, రథదానం, గజదానం, అశ్వదానం, ఛాగ (మేక) దానం, మహిష (దున్నపోతు) దానం.

షట్చక్రవర్తులు : హరిశ్చంద్రుడు, నలుడు, పురుకుత్సుడు, పురూరవుడు, సగరుడు, కార్తవీర్యార్జునుడు.

www.apteachers.in

ఇవి చేయండి

I. వినడం - మాట్లాడటం

(అ) హరిశ్చంద్రుని గొప్పదనం గురించి మీ అభిప్రాయాలు చెప్పండి.

(ఆ) ద్విపదరూపంలోని ఈ పాఠాన్ని లయబద్ధంగా రాగంతో పాడండి.

(ఇ) సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పండి.

II. చదవడం, అవగాహన చేసుకోవడం

1. కింది భావాలున్న ద్విపద పాదాలను పాఠంలో వెతికి రాయండి.

(అ) హరిశ్చంద్రుడు వినయమే అలంకారంగా గలవాడు. వివేకం సంపదగా గలవాడు.

(ఆ) హరిశ్చంద్రుడు ఎల్లప్పుడూ ప్రసన్నంగా ఉంటాడు. నీతిగా పరిపాలన చేస్తాడు.

(ఇ) త్రిశంకుని కుమారుడు సత్యాన్నే పలికేవాడు.

2. కింది పద్యం చదవండి. భావంలో ఖాళీలు ఉన్నాయి. పూరించండి.

నుతజల పూరితంబులగు నూతులు నూటికంటె సూనృత
వ్రత! యొక బావిమేలు, మరి బావులు నూటికంటె నొక్క స
త్క్రతువది మేలు, తత్క్రతు శతంబున కంటె సుతుండుమేలు, త
త్సుతశతకంబుకంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్.

పై పద్యం శకుంతల దుష్యంతునితో చెప్పింది. సత్యవ్రతం యొక్క గొప్పదనాన్ని తెలిపే పద్యం ఇది.

భావం: స్వచ్ఛమైన జలం ఉన్న నూరునూతులకన్నా ఒక ____________ మేలు. అలాంటి వందబావులకన్నా ఒక ____________ మేలు. అలాంటి వంద ____________ ల కన్నా ఒక ____________ ఉండటం మేలు. అలాంటి వందమంది ____________ ఉండటం కన్నా ఒక ____________ మేలు.

3. కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా సమాధానాలు రాయండి.

(అ) హరిశ్చంద్రుని గుణగణాలను కవి ఏ విధంగా వర్ణించాడు?

(ఆ) హరిశ్చంద్రుని గొప్పతనం గురించి వశిష్ఠుడు ఎవరితో చెప్పాడు? ఎందుకు చెప్పాడు?

(ఇ) హరిశ్చంద్రునికి ఉన్న విశిష్టతలు ఏవి?

(ఈ) అసాధారణాలైనవి కూడా సంభవించ వచ్చని కవి వేటిని పేర్కొన్నాడు? వీటిని ఏ సందర్భంలో పేర్కొన్నాడు?

SCERT ANDHRA PRADESH

4. కింది వాక్యాలకు సమానార్థాన్నిచ్చే వాక్యాలు గుర్తించండి.

(అ) హరిశ్చంద్రుడు వివేకసంపన్నుడు, వినయభూషణుడు. ( )

(i) హరిశ్చంద్రుడు కేవలం వివేకసంపన్నుడు.

(ii) హరిశ్చంద్రుడు వినయభూషణుడే.

(iii) హరిశ్చంద్రునికి వివేకసంపదకన్న వినయభూషణం అధికం.

(iv) హరిశ్చంద్రునిలో వివేకసంపద, వినయభూషణం రెండూ సమానమే.

(ఆ) మేరువు గ్రుంకినా, మిన్ను వ్రాలినా హరిశ్చంద్రుడు అసత్యం పలకడు. ( )

(ఎ) మేరువుకుంగినా, ఆకాశం ఊడిపడ్డా హరిశ్చంద్రుడు అబద్ధం ఆడడు.

(బి) మేరువు కుంగి, మిన్ను వాలినా, సత్యం పలుకుతాడు హరిశ్చంద్రుడు.

(సి) మేరువు కుంగినా, మిన్ను వాలకున్నా హరిశ్చంద్రుడు అబద్ధం ఆడడు.

(డి) మేరువు కుంగినా మిన్ను వాలినా హరిశ్చంద్రుడు సత్యం పలకడు.

III. స్వీయరచన

1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో సమాధానాలు రాయండి.

(అ) "హరిశ్చంద్రుణ్ణి షోడశ మహాదాన వినోది" అని వశిష్ఠుడు ఎందుకు అన్నాడు?

(ఆ) హరిశ్చంద్రునిలో మిమ్మల్ని ఆకట్టుకునే అంశాలేవి?

(ఇ) 'హరిశ్చంద్రుడు ఆడినమాట తప్పడు' అని తెలుసుకున్నారు కదా! ఆడినమాట తప్పని వారు ఎలా ఉంటారో రాయండి.

(ఈ) 'మిన్ను వ్రాలినా' అని వశిష్ఠుడు హరిశ్చంద్రుని పరంగా ఉపయోగించాడు కదా! ఈ జాతీయాన్ని ఏ సందర్భంలో ఉపయోగిస్తారు?

2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాలలో జవాబులు రాయండి.

(అ) 'హరిశ్చంద్రుడు' పాఠ్యభాగ సారాంశం సొంతమాటల్లో రాయండి.

(ఆ) వివేకసంపన్నుడు, సత్యసంధుడు, విద్యాధికుడు, కరుణాపయోనిధి, విజ్ఞాననిధి అని హరిశ్చంద్రుణ్ణి కీర్తించారు కదా! మన సమాజంలోని వ్యక్తులు అందరూ ఈ గుణాలతో ఉంటే ఈ సమాజం ఎలాఉంటుందో ఊహించి రాయండి.

IV. పదజాలం

1. కింది పట్టికను పరిశీలించండి. అందులో హరిశ్చంద్రుని గుణగణాలకు సంబంధించిన పదాలున్నాయి. అయితే ఒక్కొక్క పదం రెండుగా విడిపోయింది. వాటిని కలిపిరాయండి. ఆ పదాల ఆధారంగా సొంత వాక్యాలు రాయండి.

నీతి	శాలి	బొంకని	పాలకుడు	కరుణా
నిధి	విజ్ఞాన	సంధుడు	శరధి	దాన
భాగ్య	సత్య	చంద్రుడు	వినోది	వాడు
పయోనిధి	వివేక	వినయ	భూషణుడు	సంపన్నుడు

ఉదా : నీతినిధి – నీతినిధియైన సర్పంచ్‌వల్ల గ్రామానికి మేలు జరుగుతుంది.

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

2. కింది పదాలు చదవండి. గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి. వాక్యంలో ప్రయోగించండి.

(అ) అడవికి కంఠీరవం రాజు.

(ఆ) త్రిశంకు నందనుడు హరిశ్చంద్రుడు.

(ఇ) ఆంజనేయుడు శరధి దాటాడు.

(ఈ) దేవతలకు రాజు సురేంద్రుడు.

(ఉ) భానుడు ప్రపంచానికి వెలుగును, వేడిని ఇస్తున్నాడు.

3. కింది వాక్యాలు పరిశీలించండి. పర్యాయపదాలతో ఇలాంటి వాక్యాలు రాయండి.

(అ) భానుకిరణాలు చీకట్లు పోగొడతాయి. ఆదిత్యుడు వెలుగుతో పాటు వేడిమినిస్తాడు. రవి మొక్కలకూ జంతువులకూ ప్రాణాధారం. సూర్యుడు లేకపోతే ఈ సమస్త జీవులూ ఉండవు.

(ఆ) వానరులు లంకను చేరడానికి సముద్రాన్ని దాటాలి. ఇందుకోసం ఆ శరధి పై వారధి కట్టాలి. దీనికి నలుణ్ణి వినియోగించారు. నలుని నేతృత్వంలో వానరవీరుల సహాయంతో . అంబుధిపై వారధి తయారయింది. శ్రీరాముని వెంట వానరులు కడలి దాటి వెళ్లారు. సంద్రంలో ఆ వారధి ఈ నాటికీ కనిపిస్తుంది.

T ANDHRA PRADESH

V. సృజనాత్మకత

మహాభాగ్యశాలి, ధనుర్వేదవిద్యాధికుడు, సర్వశాస్త్రార్థకోవిదుడు, నీతిపాలకుడు, ధర్మపరాయణుడు, మహాసత్వవంతుడు అయిన హరిశ్చంద్రుని పాత్రకు ఏకపాత్రాభినయం తయారుచేయండి. ప్రదర్శించండి.

(లేదా)

హరిశ్చంద్రుని గుణగణాలను తెలిపే విశేషణాలను తెలుసుకున్నారు కదా! ఇలాంటి విశేషణాలను ఉపయోగించి ఎవరైనా ఒక గొప్పనాయకుడి గురించి ఒక వ్యాసంరాయండి.

VI. ప్రశంస

ఆడినమాట తప్పకుండా తను చేస్తున్న వృత్తిలో నిజాయితీపరులైనవారివల్ల ప్రజలకు కలిగే మేలును ప్రశంసిస్తూ పత్రికకు లేఖ రాయండి.

VII. భాషను గురించి తెలుసుకొందాం

1 కింది వాటిని పూరించండి.

సంధి పదం	విసంధి	సంధిపేరు
(అ)	అన్న+తమ్ముడు+ లు	
(ఆ) గుణములు వొగడ		
(ఇ) విద్యాధికుడు		
(ఈ)	సుర+ ఇంద్ర	
(ఉ) తలపెల్ల		
(ఊ) నల్ల గలువ		
(ఋ)	వీడు + తడిసె	
(ౠ) కాలుసేతులు		

2. కింది పేరాలోని సంధి పదాలను గుర్తించి అవి ఏ సంధులో రాయండి.

విద్యార్థులందరూ ఆడుకుంటూండగా ఎగురుతున్న పక్షి కిందపడింది. ఆ పక్కనే ఉన్నవాళ్ళంతా దానివైపు పరుగెత్తారు. కాని పురుషోత్తముడనే పిల్లవాడు నీళ్ళుతీసుకువెళ్ళి ఆ పక్షిపైన చల్లాడు. అది తేరుకొని లేచి పైకెగిరివెళ్ళింది. అందరూ అతన్ని మెచ్చుకొన్నారు.

H6V4QH

SCERT ANDHRA P

3. అలంకారాలు

అ. వృత్త్యనుప్రాసాలంకారం

అలంకారాలు ప్రధానంగా రెండురకాలు

(1.) అర్థాలంకారాలు (2.) శబ్దాలంకారాలు

ఉపమాది అలంకారాలు అర్థాలంకారాలు. వీటిగురించి కింది తరగతుల్లో తెలుసుకున్నారు కదా! ఇప్పుడు కొన్ని శబ్దాలంకారాలను గురించి తెలుసుకుందాం.

కింది వాక్యాలను చదవండి.

(1) "ఆమె కడవతో వడి వడి అడుగులతో గడపను దాటింది."

(2) "చిట పట చినుకులు టపటపమని పడుతున్న వేళ"

మొదటివాక్యంలో 'డ' అనే హల్లు

రెండవవాక్యంలో 'ట' అనే హల్లు చాలాసార్లు వచ్చాయి.

www.apteachers.in

ఈవిధంగా ఒక హల్లును మళ్ళీ మళ్ళీ ఉపయోగిస్తే వినసొంపుగా ఉంటుంది. శబ్దంద్వారా సౌందర్యం ఇక్కడ ప్రధానంగా కనబడుతుంది. ఈ విధంగా శబ్దానికి ప్రాముఖ్యాన్ని ఇచ్చే అలంకారాలలో వృత్త్యనుప్రాస అలంకారం ఒకటి. మరికొన్ని ఉదాహరణలు చూడండి.

(అ) బాబు జిలేబి పట్టుకొని డాబా పైకెళ్ళాడు.

(ఆ) గట్టుమీది చెట్టుకింద కిట్టు రొట్టెను లొట్టలేస్తూ తింటున్నాడు.

(ఇ) లక్ష భక్ష్యాలు తినేవాడికి ఒక భక్ష్యం లక్ష్యమా!

ఒక హల్లుగాని, రెండు, మూడు హల్లులుగానీ, వేరుగా నైనా, కలిసి ఐనా, మళ్ళీ మళ్ళీ వచ్చినట్లయితే దాన్ని 'వృత్త్యనుప్రాస అలంకారం' అంటారు. "ప్రతిజ్ఞ" పాఠం చదవండి. వృత్త్యనుప్రాస అలంకారానికి చెందిన పదాలు/వాక్యాలు గుర్తించండి.

ఆ ఛేకానుప్రాసాలంకారం :-

కింది వాక్యం చదవండి.

నీకు వంద వందనాలు

పై వాక్యంలో 'వంద' అనే హల్లుల జంట వెంటవెంటనే అర్థభేదంతో వచ్చింది. ఇక్కడ మొదట వచ్చిన 'వంద' సంఖ్యను తెలుపుతున్నది. రెండోసారి వచ్చిన 'వంద'నాలు - నమస్కారాలు అన్న అర్థాన్నిస్తున్నది.

హల్లుల జంట అర్థ భేదంతో వెంటవెంటనే వస్తే దానిని 'ఛేకానుప్రాస అలంకారం' అంటారు.

ఇలాంటివే మరికొన్ని ఉదాహరణలు రాయండి.

ప్రాజెక్టు పని

సత్యం గొప్పతనం తెలుసుకున్నారు కదా! సత్యాన్ని తెలిపే కథలను, పద్యాలను సేకరించండి. మీ పాఠశాలలో ప్రదర్శించండి.

(లేదా)

హరిశ్చంద్రుని కథను చదివి అతని గొప్పతనాన్ని వర్ణించేవాక్యాలను చార్ట్‌పై రాసి ప్రదర్శించండి.

పునరభ్యసనం (వెనుకబడిన విద్యార్థుల కొరకు)

1. పాఠ్యాంశాలలోని పదాల జాబితాను ఉపాధ్యాయుడు తయారుచేసి చదివించాలి.
2. విద్యార్థులచే ఉక్తలేఖనం రాయించాలి. దోషాలు సవరించాలి.
3. పాఠ్యాంశ సారాంశాన్ని 4 లేదా 5 వాక్యాలలో నల్లబల్లపై రాసి విద్యార్థులచే చదివించాలి, రాయించాలి, దోషాలు సవరించాలి.

H6YREE

నేనివి చేయగలనా ?

1. పాఠ్యభావాన్ని సొంతమాటల్లో చెప్పగలను.	ఔను / కాదు
2. ద్విపదను రాగయుక్తంగా భావయుక్తంగా చదవగలను.	ఔను / కాదు
3. పాఠంలోని భావాన్ని సొంతంగా రాయగలను.	ఔను / కాదు
4. "సత్యవాక్కు" గొప్పతనం గురించి వ్యాసం రాయగలను.	ఔను / కాదు

మనం దేనికి అర్హులమో అదే మనకు లభిస్తుంది.

www.apteachers.in

11. జీవన భాష్యం

- ఆచార్య సి. నారాయణరెడ్డి

చదవండి - ఆలోచించండి - చెప్పండి

"శ్రద్ధగలవాడే జ్ఞానాన్ని పొందుతాడు".
"చీకటిని తిడుతూ కూర్చోడం కన్నా చిన్న దీపం వెలిగించు".
"అణుశక్తి కన్నా ఆత్మశక్తి మిన్న".
"త్యాగగుణానికి తరువులే గురువులు".

ప్రశ్నలు

1. పై వాక్యాలద్వారా మీరేం గ్రహించారు?
2. ఇలాంటి వాక్యాలనేమంటారు?
3. ఇలాంటి సందేశాలు, మంచిమాటలు ఇంకా ఏవే రూపాలలో ఉంటాయి?

SCERT APPRADESH

ఉద్దేశం

దుఃఖాన్ని తట్టుకుంటూ, కష్టాలను ఎదుర్కొంటూ, తనంతట తాను ఎదుగుతూ, ఇతరుల కోసం పాటుపడుతూ జీవించే మనిషి, సమాజంలో గౌరవం పొందుతాడని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

ప్రస్తుత పాఠ్యభాగం 'డాక్టర్ సి. నారాయణరెడ్డి 'సమగ్ర సాహిత్యం ఆరో సంపుటి'లోని "తెలుగు గజళ్ళు" లోది.

విద్యార్థులకు సూచనలు

1. పాఠం చిత్రం చూడండి. మీకేమర్థమైందో చెప్పండి.
2. పాఠం చదవండి. పదపట్టిక చూసి తెలియని పదాలకు అర్థాలు తెలుసుకోండి.
3. సందర్భానికి తగిన అర్థాన్ని గ్రహించి చిత్రాలు ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
4. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

www.apteachers.in

ఉర్దూ సాహిత్యంలో "గజల్" సంగీత, సాహిత్యాల మేలుకలయికతో విరాజిల్లుతున్న ప్రక్రియ. 12వ శతాబ్దంలో మొగల్ రాజుల కాలంలో ఇరాన్ సంస్కృతిలో భాగంగా గజల్ కూడా భారతదేశంలో ప్రవేశించింది. అమీర్ ఖుస్రూ (1253-1325) ఇండియాలో గజల్ రచన ఆరంభించాడు.

గజల్ అనే పదానికి ప్రియభాషిణి అనే అర్థం ప్రాచుర్యంలో ఉంది. ప్రేమ, ఆత్మీయత, ఆనందం, ఆవేదన మొదలైన మనోభావాలన్నింటినీ మనసుకు హత్తుకునేలా వ్యక్తీకరించడానికి గజల్ ఒక చక్కని సాహిత్య ప్రక్రియ. గజల్‌లోని భావం ఏ చరణానికి ఆ చరణం విడివిడిగా ఉంటుంది. కొన్ని సందర్భాలలో రెండు చరణాలు కలిపి ఒకే భావాన్ని వ్యక్తం చేయవచ్చు. గజల్ పల్లవిని ఉర్దూలో 'మత్లా' అంటారు. చివరి చరణాన్ని "మక్తా" (ముగింపు) అంటారు. పల్లవిలోని ప్రతి చరణానికీ చివర ఉన్న పదానికి అంత్యప్రాస ఉంటుంది. చివరి చరణంలో రచయిత పేరుతో వాక్యం ఉంటుంది. దీన్ని నామముద్ర "తఖల్లస్" అని అంటారు. సరసభావన, చమత్కారం, కుదింపు గజల్‌కున్న జీవలక్షణాలు.

తెలుగులో మొదటిసారి గజల్ రచన చేసిన కవి దాశరథిగారు. అయితే తెలుగు గజళ్ళకు ప్రాచుర్యాన్ని కల్పించిన వారు ఆచార్య సి.నారాయణరెడ్డిగారు. వీరి గజళ్ళలో సామాజికాంశాలు, ప్రగతిశీల భావాలు కనిపిస్తాయి. వీరు రాసిన గజల్స్ 'సినారె గజల్స్' పేరుతో ప్రసిద్ధి పొందాయి. కొన్నింటిని పరిశీలిద్దాం.

నలుగురు మనుషులు కలిసి పరస్పర సహకారంతో జీవించడమే ఉత్తమ సాంఘిక జీవనం. సాటి మనుషుల పట్ల సానుకూల దృక్పథాన్ని ఏర్పరుచుకోవాలి. అప్పుడే అందరూ కలిసి ఆనందంగా జీవించగలుగుతారు. అలాగే ఎంత సామర్థ్యమున్నా అధికారం, సంపదలూ ఉన్నా, ఎన్నో విజయాలను సాధించినా, ఇక నాకు ఏ కష్టాలూ బాధలూ రావని ధీమాగా ఉండలేం. విధి ఎప్పుడు ఏ కష్టాలను కలిగిస్తుందో! ఎప్పుడు ఏ సమస్యలతో పరీక్షలు పెడుతుందో! ఎవరూ ఊహించలేరు. మానవాళికి పనికివచ్చే గొప్పపని చేయడం, స్వార్థాన్ని త్యాగం చేయడం ద్వారా ఆ మనిషి పేరు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందనే భావాలు స్ఫురించే విధంగా సినారె రాసిన 'జీవనభాష్యం' గజల్‌ను చదవండి.

SCERT ANDHRA PRADESH



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచేత ఉచిత పంపిణీ

www.apteachers.in

మబ్బుకు మనసే కరిగితే అది నీరవుతుంది.
మనసుకు మబ్బే ముసిరితే కన్నీరవుతుంది.
వంకలు డొంకలు కలవని జడిపించకు నేస్తం.
జంకని అడుగులు కదిలితే అది దారవుతుంది.
ఎడారి దిబ్బలు దున్నితే ఫలమేముందనకు
ఇసుక గుండెలు పగిలితే అది పైరవుతుంది.
మనిషీ మృగమూ ఒకటనే అనుకుంటే వ్యర్థం.
మనుషులు పదుగురు కూడితే ఒక ఊరవుతుంది.
ఎంతటి ఎత్తుల కెదిగినా ఉంటుంది పరీక్ష
హిమగిరి శిరసే మాడితే అది యేరవుతుంది.
బిరుదులు పొందే వ్యాప్తికి విలువేమి 'సినారే'
చెరగని త్యాగం మిగిలితే ఒక పేరవుతుంది...... అంటే

నీటితో నిండిన మబ్బులు తేమతో బరువెక్కితే వర్షమై ఏ విధంగా కురుస్తాయో అలాగే మనసుకు ఆందోళన, బాధ, చింత, దిగులు అనే మబ్బులు కమ్ముకుంటే దుఃఖం వచ్చి కన్నీరుగా మారుతుంది. ఒక లక్ష్యాన్ని సాధించడానికి బయలుదేరినపుడు అడుగడుగునా ఎన్నో కష్టాలు, అడ్డంకులు ఎదురవుతాయని లోకం భయపెడుతుంది కానీ ఆ మాటలకు భయపడకుండా, నిరుత్సాహపడకుండా ముందుకు నడిస్తేనే విజయం లభిస్తుంది. బీడు పడిన నేలలో ఏ పంటలూ పండవని, ఏ ప్రయత్నాలూ చేయకుండానే, నిరాశపడవద్దు. కష్టపడి ఆ నేలను దున్నితే, విశ్వాసంతో విత్తనాలు నాటితే మంచి పంటలు పండుతాయి. మన పేరు ప్రపంచానికంతా తెలిసేలా ప్రఖ్యాతి పొందాలంటే మానవాళికి పనికి వచ్చే గొప్ప పనులు చేయాలని ఈ గజల్ ద్వారా కవి సమాజానికి సందేశాన్నిస్తున్నాడు.

ఒక వైపున అమ్మ మరో వైపున దేవతలు, ఎవరు గొప్ప అని అడిగితే, నవమాసాలు మోసి, జన్మనిచ్చి, గోరుముద్దలు తినిపించి, నడకను, నడతను నేర్పుతూ మమతను పంచే అమ్మకు ఎవరూ సాటిరారు. అమ్మను మించిన దేవతలు ఎవరూ లేరు. అందుకే అమ్మే గొప్పదంటూ నేను అమ్మ వైపే నిలుచుంటాను. అని అమ్మతత్వాన్ని గజల్ రూపంలో చెప్పారు. అది చదవండి.

అమ్మ ఒక వైపు దేవతలంతా ఒక వైపు
సరితూచమంటే నేను ఒదిగేను అమ్మ వైపు
ఈ బండి చూడరా నాన్నా ఈ గుఱ్ఱమింక నీదన్నా
తెగ మంకుతో, చిననాడు దిగలేదు అమ్మ మూపు,
రొదలలో మౌన పాఠంలా వ్యధలతో జ్ఞానపీఠంలా
నా బాల్యమంతా తానే నడిపింది అమ్మ చూపు
చీకటికి చంద్రబింబంలా, ఆకలికి పూర్ణకుంభంలా
నిలువెల్ల మమతల వెలుగై నిలిచిందో అమ్మరూపు
మెరిసే ప్రభాత కిరణంలా విరిసే వసంత కుసుమంలా
పెరిగే సినారె బ్రతుకులో దొరికింది అమ్మ ప్రాపు.

చిన్నప్పుడు ఆ బొమ్మ కావాలి! ఈ మిఠాయి కావాలి! అని మొండికేసి ఇప్పుడే కొని పెట్టమని మంకుపట్టు పట్టి అమ్మ చంకనెక్కి, ఇదుగో ఈ బండి చూడు ఎంతబాగుందీ అదుగో ఆ గుఱ్ఱం చూడు అది నీకే అంటూ బుజ్జగించినా అమ్మ చంక దిగలేదు. నేనెంత అల్లరి చేసినా, చిరునవ్వుతో భరించింది. దెబ్బతగిలి ఏడుస్తున్నప్పుడు ఓర్చుకోవాలని,

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

మిత్రులతో దెబ్బలాడినపుడు సర్దుకోడం నేర్చుకోవాలనీ జ్ఞానబోధచేస్తూ నా బాల్యమంతా వేలుపట్టి నడిపించింది. చీకటిలో ఏమీ కనిపించనపుడు తన వెన్నెల వెలుగులతో దారిని చూపే చంద్రునిలా, ఆకలైనపుడు ఆకలికి తీర్చే నిండుకుండలా తన ప్రేమానురాగాలతో వెలుగులా నిలిచింది అమ్మ. మెరిసే సూర్యోదయకాలపు సూర్యకిరణంలా వసంత ఋతువులో పూసే పూవులా పెరిగిన నాకు అమ్మ అండ దొరికిందని ఈ గజల్ ద్వారా కవి అమ్మ ప్రేమను, గొప్పతనాన్ని తెలియపరుస్తున్నాడు.

ఈ విశాల ప్రపంచంలో మానవుడు సంఘజీవీ స్వేచ్ఛాజీవీ. తెలుసుకోవాలన్న తపన మనిషి నైజం. ప్రకృతిలో ప్రతి ప్రాణీ స్వేచ్ఛగా జీవించాలని కోరుకుంటుంది. అధికారానికి తలొగ్గి బానిసలా జీవించాల్సివస్తే, దాన్ని ప్రశ్నించే తత్వం, ఎదిరించే శక్తి ఉండాలనే భావాన్ని తెలిపే ఈ గజల్‌ను చదవండి.

అవని రూపు పరమాణువునడిగి తెలుసుకో,
కడలిలోతు కన్నీరై కరిగి తెలుసుకో,
ఏ సిరులూ పొందని సంతృప్తి ఏమిటో
కళాసరస్వతుల కాళ్ళు కడిగి తెలుసుకో
మనసు అడుగులో మెదిలే మాటల నైజం,
కనుపాపల కొలనుల్లో మునిగి తెలుసుకో,
అన్నీటికీ తలవూపితే అదీ దాస్యమే,
సరుకు విలువ ప్రశ్నలతో చెరిగి తెలుసుకో,
ఎప్పుడు ఓటమి ఎవరికి చెప్పిరాదులే.
విరిగినపుడు నిలువెత్తుగా పెరిగి తెలుసుకో,
పండిన చెట్టే ఎందుకు వంగుతుందలా
ఉద్ధరుడా నువ్వు కాస్తా ఒదిగి తెలుసుకో
పట్టువడదు అలవోకగ ప్రతీది 'సినారె'
మౌలిక తత్వం సలసల మరిగి తెలుసుకో.

పరమాణువులో దాగిన లక్షణాలను విశ్లేషించడం ద్వారా భూమి స్వభావాన్ని తెలుసుకోవచ్చు. సముద్రంలోతు తెలియాలంటే కారే కన్నీటి బిందువుల వెనకదాగున్న కష్టాల కడలిని అర్థం చేసుకోవాలి. సంతృప్తి గురించి తెలియాలంటే, ఎంత సంపద ఉన్నా సంపన్నులు పొందలేకపోతున్న సంతృప్తిని తమ కళారాధనతో పొందుతున్న కళాకారులను పరిశీలించాలి. గుండెలోతుల్లోనుండి ప్రేమతో పలకరించేవారూ నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించేవారూ ఉంటారు. ఎవరి మాట వెనక ఏఏ అర్థాలున్నాయో తెలుసుకోగలగాలి. కెరటం నాకు ఆదర్శం. పడుతున్నందుకు కాదు, పడినా లేస్తున్నందుకు అన్నట్లుగా ఓటమిని జయించాలంటే కెరటంలా కిందపడినా పైకి లేవగలగాలి. పండిన చెట్టు వంగడానికి కారణం ఉపకార గుణం. అలా ఎంత ఎదిగినా ఒదిగి ఉపకరించడం నేర్చుకోవాలి. అనాయాసంగా ఏదీ పట్టుబడదు. విజయం సాధించాలంటే కష్టపడడం తప్ప మరొక దొడ్డిదారి ఏదీ లేదు. దాని మూలాలను బాగా శోధించి తెలుసుకోవాలనే భావనను ఈ గజల్ ద్వారా సి.నా.రె గారు తెలిపారు.

విశ్వంలో ప్రతిప్రాణి కూడా పదికాలాల పాటు సుఖంగా జీవించాలంటే ప్రకృతిని కాపాడుకోవాలి. అలాగే స్వార్థాన్ని వదిలి, పరులకు సేవ చేయాలి అనే భావాలు మరొక గజల్‌లో చెప్పారు. చదవండి.

విరిసే పచ్చదనంలో ఉన్నది వృక్షం చేసిన సంతకం.
మెరిసిపడే చినుకుల్లో ఉన్నది మేఘం చేసిన సంతకం.
చట్టాల చుట్టూ తిరిగితేనే అరికట్టలేరు అక్రమాలను.

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

నైతికపరిరక్షణలో ఉన్నది న్యాయం చేసిన సంతకం.
రాసే వేళ్ళున్నాయని రాతలు రాశులుగా పోస్తేయెలా?
కదిలించే రచనల్లో ఉన్నది హృదయం చేసిన సంతకం,
ఎవరికి వారే గీపెడితే ఆశించిన గమ్యం దొరకదోయ్,
సమైక్య సంఘర్షణలో ఉన్నది సంఘం చేసిన సంతకం,
ఆలయాలలో కొలిచే ప్రతిమలు ఆత్మ సంతృప్తికే 'సినారే'
దయకురిసే మనుషుల్లో ఉన్నది దైవం చేసిన సంతకం.

పచ్చదనమంటే అది వృక్ష సంపదకు చిరునామా. చినుకులు కురవాలంటే మేఘం రూపుదిద్దుకోవాలి. కేవలం ప్రభుత్వాలు, చట్టాలవల్ల సమాజం బాగుపడదు. ఎవరికి వారు స్వీయక్రమశిక్షణను, నైతిక నియమాలను అలవరచుకోవాలి. రాశికన్నా వాసి ముఖ్యం. పుక్కిటి పురాణాలు ఎన్ని రాసినా ప్రయోజనం శూన్యం. సమైక్యతతోనే సంఘం వర్ధిల్లుతుంది గానీ, వ్యక్తిగతంగా పోరాడి సాధించేది ఏమీ ఉండదు. మానవతను మేలుకొలిపేదే నిజమైన సాహిత్యమవుతుంది. అలాగే తోటి మనిషికి సేవచేసే దయగల మనషుల్లోనే దైవం దాగి ఉందనే భావాన్ని ఈ గజల్ ద్వారా కవి వ్యక్తపరిచారు.

తెలుగు నేలపై సినారె ప్రేరణతో ఎంతో మంది కవులు గజల్ రచయితలుగా మారారు. వారు సామాజిక సమస్యలను, మానవ నైతికవిలువలను, ప్రజల కర్తవ్యాన్ని, బాధ్యతలను, దేశసేవను దృష్టిలో ఉంచుకుని గజళ్లు రాస్తున్నారు. వారిలో చల్లా రాంబాబు, పెన్నా శివరామకృష్ణ, డా॥ తటవర్తి రాజగోపాలం గారు ముఖ్యులు. శ్రీనివాస్‌గారు గజళ్లను తన శైలిలో గానం చేస్తూ గజల్ శ్రీనివాస్‌గా పేరుగాంచారు. ప్రముఖ పాకిస్థాన్ గాయకులు మెహిది హసన్ ప్రపంచ వ్యాప్తంగా గజల్ గాయకునిగా ప్రఖ్యాతిగాంచారు.

SCERT ANDHRA PRADESH

కవి పరిచయం

ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి 1931లో కరీంనగర్ జిల్లా హనుమాజీపేట గ్రామంలో పుట్టారు. వీరు ప్రముఖ ఆధునిక కవి, వక్త, పరిశోధకులు, బహుభాషావేత్త, ప్రయోగశీలి.

నాగార్జునసాగరం, కర్పూరవసంతరాయలు, మధ్యతరగతి మందహాసం, విశ్వంభర, ప్రపంచ పదులు మొదలైన నలభైకి పైగా కావ్యాలు, అద్భుతమైన సినిమాపాటలు రాసారు. 'ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు, ప్రయోగములు' అన్న వీరి సిద్ధాంతగ్రంథము ఎన్నో ముద్రణలను పొందింది. వీరి 'విశ్వంభర' కావ్యానికి జాతీయ స్థాయిలో అత్యున్నత సాహితీ పురస్కారమైన 'జ్ఞానపీఠ అవార్డు' లభించింది. భారతప్రభుత్వం వీరిని పద్మభూషణ్ బిరుదుతో గౌరవించింది. 'చమత్కారం' – వీరి కలానికీ గళానికీ ఉన్న ప్రత్యేకత.

ప్రక్రియ –

ఉర్దూ సాహిత్య ప్రక్రియ 'గజల్'. దీంట్లో ఒకే విషయాన్ని చెప్పాలనే నిర్బంధం ఉండదు. గజల్‌లోని భావం ఏ చరణానికి ఆ చరణం విడిగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో రెండు చరణాలు కలిసి ఒకే భావాన్ని వ్యక్తపరుస్తాయి. గజల్ పల్లవిని ఉర్దూలో 'మత్లా' అని, చివరి చరణాన్ని "మక్తా" అని అంటారు. పల్లవి చివర ఉన్న పదం, ప్రతి చరణం చివర అంత్యప్రాసను రూపొందిస్తుంది. చివరి చరణంలో కవి నామముద్ర ఉంటుంది. దీన్ని "తఖల్లస్" అంటారు. సరసభావన, చమత్కార ఖేలన, ఇంపూ, కుదింపూ గజల్ జీవగుణాలు.

www.apteachers.in

ఇవి చేయండి

I. వినడం - మాట్లాడడం

1. 'జీవనభాష్యం' గజల్స్‌ను రాగయుక్తంగా, భావయుక్తంగా పాడండి.
2. 'జీవన భాష్యం' అనే పేరు ఈ పాఠానికి తగిన విధంగా ఉందా? ఎందుకు? చర్చించండి.
3. ఈ 'గజళ్ళ' ద్వారా 'సినారె' ఏం సందేశమిస్తున్నారు?

II. చదవడం, అవగాహన చేసుకోవడం

(అ) కరిగితే, ముసిరితే, మమత, దేవత, పెరిగి, మరిగి వంటి పదాలు గజల్‌లో ఎక్కడెక్కడ ఉన్నాయో చూసి, వాటికింద గీతగీయండి. ఆ పాదాలు రాయండి.

(ఆ) గజళ్ళలో కవి తన గురించి ప్రస్తావించిన పంక్తులు ఏవి? వాటిని రాసి భావాన్ని సొంత మాటల్లో రాయండి.

2. కింది పేరాను చదివి, ఐదేసి ప్రశ్నలు తయారు చేయండి.

చైనా తత్త్వవేత్త కన్ఫ్యూషియస్. ఆయన చాలా తెలివైనవాడు. ఒక రాజుగారు అతణ్ణి గురించి విని తన సభకు పిలిపించుకున్నాడు. మూడుపంజరాలు చూపించాడు. మొదటి పంజరంలో ఒక ఎలుక, దాని ఎదురుగా తినే పదార్థాలు ఉన్నాయి. రెండో పంజరంలో పిల్లి ఉంది, దాని ఎదురుగా పళ్ళెములో పాలు ఉన్నాయి. మూడో పంజరంలో ఒకగద్ద ఉంది, దాని ఎదురుగా తాజామాంసం ఉంది. కానీ ఎలుక ఏ పదార్థమూ తినటం లేదు; పిల్లి పాలు ముట్టుకోవడం లేదు; గద్ద కూడా మాంసం ముట్టడం లేదు. దీనికి కారణమేమిటి? అని అడిగాడు రాజు. తత్త్వవేత్త ఇలా సమాధానం ఇచ్చాడు. పిల్లిని చూసి భయపడి ఎలుక ఆహారం తీసుకోలేదు. పిల్లి ఎలుకమీద ఆశతో పాలు ముట్టుకోలేదు. పిల్లిని, ఎలుకను ఒకేసారి తినాలనే ఆశతో గద్ద మాంసం ముట్టుకోలేదు. అలాగే భవిష్యత్తు మీద ఆశతో ప్రజలు వర్తమానాన్ని విస్మరిస్తున్నారు. సుఖానికి దూరమవుతున్నారు. ఈ సమాధానానికి సంతృప్తి పడి రాజు కన్ఫ్యూషియస్‌కు విలువైన బహుమానాన్ని ఇచ్చాడు.

SCERT ANDHRA PRADESH

(అ) --

(ఆ) --

(ఇ) --

(ఈ) --

(ఉ) --

www.apteachers.in

3. కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా సమాధానాలు రాయండి.

(అ) "ఎడారి దిబ్బలు దున్నితే ఫలమేముందనకు" అనే వాక్యంలో మీరేం గ్రహించారు?

(ఆ) నిలువెల్లా మమతల వెలుగై నిలిచిందో అమ్మరూపు – అంటే మీకేమి అర్థమైంది?

(ఇ) సమైక్య సంఘర్షణ అంటే ఏమిటి? వివరించండి.

III. స్వీయ రచన

1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

(అ) ఈ పాఠంలో గజల్ ప్రక్రియను గూర్చి తెలుసుకున్నారు కదా! మీకు తెలిసిన నాలుగు సాహిత్య ప్రక్రియల పేర్లు తెలపండి. వాటిని గురించి రాయండి.

(ఆ) మంచి పంటలు పండడానికి రైతు చేసే శ్రమ ఎలాంటిదో వివరించండి.

(ఇ) ఓటమి కలిగినపుడు మనిషి మనస్తత్వం ఎలా ఉంటుంది? వివరించండి.

(ఈ) అమ్మను జ్ఞానపీఠంగా కవి ఎందుకు వర్ణించాడు?

2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

(అ) సంతకం యొక్క ప్రాధాన్యం ఏమిటి? సంతకం గురించి సినారె ఏమి చెప్పారు?

(ఆ) తెలుసుకోడం వల్ల ప్రయోజనం ఏమిటి? కవి ఏమేమి తెలుసుకోమన్నాడు?

SCERT ANDHRA PRADESH

IV. పదజాలం

1 కింది పదాలకు అర్థాలు తెలుసుకోండి ఆ పదాల్ని ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి.

(అ) ముసరడం	= ------	(ఇ) పూర్ణకుంభం	= ------
(ఆ) అలవోకగా	= ------	(ఈ) హృదయం	= ------

V. సృజనాత్మకత

'జీవన భాష్యం" గజల్‌లోని అంత్య ప్రాసల ఆధారంగా సొంతగా ఒక వచన కవితను రాయండి.

------- నీరవుతుంది.
------- దారవుతుంది.
------- పైరవుతుంది.
------- ఊరవుతుంది.
------- ఏరవుతుంది.
------- పేరవుతుంది.

(లేదా)

ఆచార్య సి. నారాయణరెడ్డి గారు ఒకవేళ మీ పాఠశాలకు వస్తే మీరు వారి దగ్గర ఏం తెలుసుకోవాలనుకొంటున్నారో ప్రశ్నలు రాయండి.

www.apteachers.in

VI. ప్రశంస

చదువులో వెనకబడిన ఒకవిద్యార్థి తనలో కలిగిన మార్పువల్ల కొద్దికాలంలోనే గతంలో కన్నా మెరుగైన ఫలితాలను పొందాడు. అతనిలో వచ్చిన మార్పును గురించి తెలుపుతూ వాళ్ళ అమ్మానాన్నలకి ఉత్తరం రాయండి.

VII. భాషను గురించి తెలుసుకొందాం

1. క్త్వార్థం

భాషాభాగాల్లో ఒకటైన 'క్రియ'ను గురించి కింది తరగతుల్లో తెలుసుకున్నారు. క్రియలను బట్టి వచ్చే వాక్య భేదాలను కొన్నింటిని చూద్దాం.

కింది వాక్యం చదవండి.

భాస్కర్ ఆటలు ఆడి అలసిపోయి ఇంటికి వచ్చాడు.

భాస్కర్ – కర్త

వచ్చాడు – కర్తృవాచక పదానికి సంబంధించిన ప్రధానక్రియ.

ఆడి, అలసి – కర్తృవాచక పదానికి సంబంధించిన ఇతరక్రియలు.

ఆడి, అలసిపోయి అనే పదాలు క్రియలే కానీ, వాటితో పూర్తిభావం తెలియడం లేదు.

'ఆడి' అనే క్రియకు 'ఆడి' తర్వాత ఏం చేశాడు? ఏం జరిగింది? అనే ప్రశ్న ఉదయిస్తోంది.

పూర్తి అర్థాన్ని ఇవ్వడం లేదు. ఇంకా, జరిగిపోయిన విషయాన్ని అంటే భూతకాలంలోని పనిని సూచిస్తుంది.

'అలసిపోయి' అనే క్రియ కూడా అలాంటిదే.

వీటిని **భూతకాలిక అసమాపక క్రియలని, క్త్వార్థం అనీ అంటారు.**

ఈ క్రియలన్నీ కూడా 'ఇ' కారంతో అంతమవుతాయి. అంటే భూతకాలిక అసమాపక క్రియ అయి, చివర 'ఇ' అనే ప్రత్యయం చేరిన క్రియారూపం క్త్వార్థక క్రియ అన్నమాట.

SCERT ANDHRA PRADESH

కొన్ని ఉదాహరణలు చూడండి. కిందివాక్యాల్లోని క్త్వార్థక క్రియలను గుర్తించండి.

1. రాముడు లంకకు వెళ్ళి, రావణునితో యుద్ధం చేసి, జయించి, సీతను తీసుకొని అయోధ్యకు వచ్చాడు.
2. పుష్ప అన్నంతిని, నిద్రపోయింది.

2. శత్రర్థకం

కింది వాక్యం చదవండి.

"అఖిలేశ్ మధుకరుడితో మాట్లాడుతూ నడుస్తున్నాడు".

ఈ వాక్యంలో –

'నడుస్తున్నాడు' అనే ప్రధాన క్రియకు 'మాట్లాడుతూ' అనే ఉపక్రియ వర్తమానకాలంలో ఉండి అసమాపక క్రియను సూచిస్తున్నది.

www.apteachers.in

ఈ విధంగా,

'మాట్లాడు' అనే ధాతువుకు '-తూ' అనే ప్రత్యయం చేరుతున్నది. ఇలా చేరడం వల్ల, వర్తమానకాలిక అసమాపక క్రియగా మారుతున్నది. వర్తమానకాలిక అసమాపక క్రియను శత్రర్థకం' అంటారు.

కింది వాక్యాలు చదవండి. వీటిలో 'శత్రర్థకం' పదాల కింద గీత గీయండి.

(అ) జ్యోతిర్మయి కంప్యూటర్‌లో ఏదో చదువుతూ ముఖ్యాంశాలు రాసుకుంటున్నది.

(ఆ) సౌజన్య పడుతూ లేస్తూ సైకిల్ తొక్కడం నేర్చుకుంటున్నది.

(ఇ) మాధవి ఆలోచిస్తూ పుస్తకం చదువుతున్నది.

(ఈ) ఫల్గుణ్ పేపరు చదువుతూ టీ.వి చూస్తున్నాడు.

(ఉ) సలీమా పాడుతూ నాట్యం చేస్తున్నది.

పైన తెలిపిన విధంగా మరికొన్ని వాక్యాలు రాయండి.

3. చేదర్థకం

కింది వాక్యం చదవండి.

"కష్టపడి పనిచేస్తే ఫలితం దానంతటదే వస్తుంది".

కింది ప్రశ్నకున్న జవాబు గురించి ఆలోచించండి.

ప్ర॥ ఫలితం దానంతటదే ఎప్పుడు వస్తుంది?

జ. కష్టపడి పనిచేస్తే –

కష్టపడడం – కారణం

ఫలితం – కార్యం

W74ZS5

కార్యం ఫలించడానికి కారణం అవసరం. కార్యకారణ సంబంధ వాక్యమే చేదర్థక వాక్యం.
అంటే పై వాక్యం కార్యకారణ సంబంధాన్ని సూచిస్తున్నది. ఇలా కార్యకారణ సంబంధాలను సూచించే వాక్యాల్లో తే/ఇతే/ఐతే/ అనే ప్రత్యయాలు చేరుతాయి. (ప్రాచీన వ్యాకరణం ప్రకారం ఇన / ఇనన్ అనే ప్రత్యయాలు).
దీన్ని బట్టి వీటిని 'చేత్' అనే అర్థం ఇచ్చే ప్రత్యయాలు అని అంటాం (ఇదే చేత్ అనే అర్థం ఇచ్చేవి)
సంక్లిష్ట వాక్యాల్లో చేత్ అనే ప్రత్యయం చేరి కార్యకారణ సంబంధం తెలిపే వాక్యాలను చేదర్థక వాక్యాలని అంటాం.

కింది వాక్యాలు పరిశీలించండి. చేదర్థక పదాల కింద గీత గీయండి.

(అ) మొక్కలు నాటితే అవి పర్యావరణానికి మేలు చేస్తాయి.

(ఆ) జీవ వైవిధ్యాన్ని కాపాడితే ప్రకృతి సమతులితమవుతుంది.

(ఇ) మంచి పుస్తకాలు చదివితే అజ్ఞానం తొలగుతుంది.

1. కింది పదాలు విడదీసి, సంధుల పేర్లను పేర్కొనండి.

(అ)	బాల్యమంతా	+
(ఆ)	దేవతలంతా	+
(ఇ)	దారవుతుంది	+
(ఈ)	విరిగినప్పుడు	+

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

2. రూపకాలంకారం

కింది వాక్యాన్ని చదవండి.

"ఆయన మాట కఠినమైనా మనసు వెన్న" అన్న వాక్యంలో

మనసు – ఉపమేయం (పోల్చబడేది)

వెన్న – ఉపమానం (పోల్చినది)

ఉపమానమైన 'వెన్న' లక్షణాలను, ఉపమేయమైన 'మనసు'తో భేదంలేకుండా పోల్చడం జరిగింది. అంటే, వెన్నకు, మనసుకు భేదం లేదు. రెండూ ఒకటే (మెత్తనివే) అనే భావాన్ని ఇస్తున్నది. ఇలా, **ఉపమానానికి ఉపమేయానికీ అభేదాన్ని (భేదం లేదని) చెప్పడాన్ని 'రూపకాలంకారం' అంటారు.**

ఉదా : (అ) లతాలలనలు రాజుపై కుసుమాక్షతలు చల్లినారు.

(ఆ) మౌనిక తేనెపలుకులు అందరికీ ఇష్టమే.

3. కింది వాక్యాలను పరిశీలించండి, అలంకారాన్ని గుర్తించండి.

(అ) మా అన్న చేసేవంట నలభీమపాకం.

(ఆ) కుటుంబానికి తండ్రే హిమగిరి శిఖరం.

(ఇ) నందనందనుడు ఆనందంగా నర్తించెను.

(ఈ) నల్లపిల్లి మెల్లగా ఇల్లు చొచ్చి చల్లని పాలు తాగింది.

H78HG2

ప్రాజెక్టు పని

ఆచార్య సి.నారాయణ రెడ్డిగారి రచనలు, పాటల వివరాలను సేకరించి ఒకపట్టికను తయారు చేయండి. దాన్ని తరగతిలో చదివి వినిపించండి, ప్రదర్శించండి.

పునరభ్యసనం (వెనుకబడిన విద్యార్థుల కొరకు)

1. పాఠ్యాంశాలలోని పదాల జాబితాను ఉపాధ్యాయుడు తయారుచేసి చదివించాలి.
2. విద్యార్థులచే ఉక్తలేఖనం రాయించాలి. దోషాలు సవరించాలి.
3. పాఠ్యాంశ సారాంశాన్ని 4 లేదా 5 వాక్యాలలో నల్లబల్లపై రాసి విద్యార్థులచే చదివించాలి, రాయించాలి, దోషాలు సవరించాలి.

నేనివి చేయగలనా ?

1. ఉర్దూ సాహిత్య ప్రక్రియ 'గజల్' ను గురించి వివరించగలను, భావాన్ని సొంతమాటల్లో చెప్పగలను.	ఔను / కాదు
2. పేరాచదివి ప్రశ్నలకు జవాబులు రాయగలను.	ఔను / కాదు
3. గజల్ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలను.	ఔను / కాదు
4. పాఠంలోని పదాల ఆధారంగా వచనకవితను రాయగలను.	ఔను / కాదు

తెలివైనవాళ్ళు గడచిపోయినదానికి శోకించరు. జరుగుతున్న పనులమీదనే దృష్టి పెడతారు.

www.apteachers.in

12. మధుపర్కాలు

- రావూరు వేంకట సత్యనారాయణరావు

పుట్టన్నది రెండు నిట్టాళ్ళపాక. అవి నెత్తిమీద నీడకోసం వేసుకున్న నిట్టాళ్ళు, అసలా ఇంటికి నిట్టాళ్ళు ఆ దంపతులే. పుట్టన్నా, సీతమ్మా ఒక్కటే ఎత్తు. భౌతికంగానే కాదు...ఆత్మలో కూడా సమానమైన ఎత్తులోనే ఉంటారు. ఒకటిగా ఉన్న ఆత్మను రెండుచేసి, రెండింటికి రెండు శరీరాలు కల్పించి, భూలోకంలో కొన్నాళ్ళు ఆడుకురండని ఆ విధాత పంపాడా, అనిపిస్తుంది వారిని చూస్తే.

పుట్టన్న వృత్తి బట్టలనేత. రోజుకు ఏ నాలుగుగంటలో తప్ప, చేతిలో కండెను పడుగులో నుంచి అటూ యిటూ గిరాటువేస్తూ, వస్త్రం నేస్తూనే ఉంటాడు. సీతమ్మ రాట్నం దగ్గరనుంచి లేవదు. వడివడిగా చిలపలు తోడటం, కండెలు చుట్టడం, పడుగు వేసినప్పుడు భర్తతోపాటు గంజిపెట్టడం, కుంచె తీయడం ఆమె విధులు. ఏ సమయంలో కూడా వారు 'కాయకష్టం చేస్తున్నాం' అనే భావాన్ని బయట పెట్టేవారు కాదు. అదో యజ్ఞంగానే చూసుకునేవారు. ఒక్క కండె చుడితే సీతమ్మ కళ్ళు పువ్వులయ్యేవి. ఒక జానెడునేస్తే పుట్టన్న పెదవుల మీద పొట్లపువ్వులు పూచేవి.

వారి పాక కెదురుగా ఒక గానుగచెట్టుంది. దానిక్రింద వారికున్న ఆవు కట్టి వేసి వుండేది. వెలిసిపోయిన కాషాయవర్ణం, ఒక్క వ్రేలెడు ఎడందాగా వచ్చి కలుసుకొన్న గిన్నె కొమ్ములు. పరోపకార బుద్ధితో బరువై క్రిందకు దిగిన పొదుగు. ఆ ఎర్ర ఆవుతో తెల్లటి కోడెదూడ. తల్లికి అందనంత దూరంలో కట్టి వేసివుండే ఆ దూడవంక అప్పుడప్పుడూ చూచి 'అంబా' అంటూ వుంటుందా గోమాత. తక్కిన సమయంలో మోర పైకెత్తి చూరువంక చూస్తుంది. ఆ గోమాత కా చిన్ని లేగ ఒక్కటే కాదు, ఆ పల్లెలో చాలామంది పెంపుడు పిల్లలున్నారు. వారందరివద్ద నుంచీ ప్రతి ఉదయం సాయంత్రం పాలకోసం కొమ్ము చెంబులు వస్తాయి. పుట్టన్న పాలు పితికి వాటినినింపి తను వట్టి చెంబుతో ఇంట్లోకి వెడతాడు. ఆ వెళ్ళేటప్పుడు చూస్తే అతని ముఖంలో వెన్నెల రేఖలు కనిపిస్తాయి. పసిపాపల కోసం తన గోవుపాలు వినియోగపడ్డాయనే సంతృప్తే ఆ వెలుతురుకు కారణం.

పుట్టన్న వంశస్తులావూరులో చాలా కాలం నుంచి ఉంటున్నారు. తరతరాలుగా వచ్చే బాంధవ్యముద్ర చెరిగిపోకుండా కాపాడుకోవడం అతనిముఖ్య ఆశయం. ఏ ఇంట్లో పెళ్ళి జరిగినా అతడు స్వయంగా నేసి మధుపర్కాలు పంపాలి. ఏటా జరిగే పెళ్ళిళ్ళ సమయంలో అతడు రాత్రింబగళ్ళు మగ్గం వద్దనే ఉంటాడు. సీతమ్మ రాట్నం మీద నుంచి చెయ్యి తీసినట్లే కనిపించదు. మధుపర్కాలకు వారేమి పైకం తీసుకోరు. వాటితో నూత్న వధూవరులు పీటల మీద కూర్చోవడం, తలంబ్రాలు పోసుకోడం – చూడటం...... వారికళ్ళ నుంచి ఆనంద బాష్పాలు కురియడం...... అదో మామూలు.

పుణ్యం, ధర్మం జీవితానికి పెట్టని కోటలుగా భావిస్తూ జీవిస్తున్న పుట్టన్నకు, ధనంమీద ఆశలేదు. మూడు పూటలా కడుపును గంజితో నింపడం ఒక్కటే అతని ఆశయం. సీతమ్మ కూడా అంతకుమించి ఏమీ కోరదు. కాకపోతే గోవుకు మేత ఒకటి కావాలి. కాని, కొమ్ము చెంబులతో పాలకు వచ్చేవారంతా, చిట్టూ, తవుడూ, తెలకపిండి చెక్కలు, కానుకలుగా తెస్తూనే ఉంటారు. ఊరి ఆసామి.... కుప్పనూర్పిళ్ళ కాలంలో అడక్కుండానే వరిగడ్డి తెచ్చి అతని దొడ్లో వామిపెట్టి పోతారు. జనపకట్టలు తెచ్చి ఇంటిమీద ఎండేసి పోతారు. పుట్టన్న వద్దని బ్రతిమాలినా వినరు. “నీ గోవు కామధేనువు పుట్టన్నా” అని వారు నవ్వుకొని వెళ్ళి పోతారు.

అయినా ఏటేటా అతడు లగ్నాలకు అందించే మధుపర్కాలతో సంపాదన అంతా హరించిపోయింది. అప్పు అడగడమంటే అతనికెంతో అభిమానం. అప్పంటే నే మాత్రం ఒప్పుకొంటానా, గూట్లో పిట్టల్లాగా కూర్చునేవాళ్ళను......

SCERT ANDHRA PRADESH

గెద్దలు పెట్టి కొట్టడం నే మాత్రం చూడగలనా' అంటుందామె. ఇల్లాంటి పరిస్థితిలో ఊరి పెద్దకాపు పాపయ్యగారింట్లో పెళ్లి వచ్చింది. అసలు శ్రావణమాసంలో ఆ గ్రామంలో పెళ్ళిళ్లు చెయ్యరు. పాపయ్యగారి తల్లికి చూపు పోతోందన్న భయంతో పెళ్ళి తల పెట్టారు. "మసగ్గానైన మనుమరాలి పెళ్ళి చూడనియ్యవుట్రా నాయనా?" అన్న తల్లి మాటలకు జాలిపడి ఆయన ఆ నెలలోనే లగ్నం పెట్టించాడు.

"అదైనా అయిదురోజుల వ్యవధిలో పెట్టారు. సీతమ్మ నూతికిపోయి వస్తుంటే పాపయ్య కనబడి 'అప్పా, అమ్మాయి పెళ్ళికి లగ్నం పెట్టాం...... వచ్చే శనివారం...... బావతో చెప్పు' అన్నాడు.

"అలాగే అన్నయ్యా...... మంచిమాట చెవినేశావు. మంచినీళ్ళబిందె ఇంట్లో దించి వచ్చి వదినతో మాట్లాడుతా" అంటూ వెళ్ళింది. మాట విన్నప్పుడు సీతమ్మ ముఖంలో చిరునవ్వు తొంగిచూచింది గాని...... నాలుగు అడుగులు వేయగానే ఆ నవ్వు అంతరించిపోయింది. వడివడిగా వెళ్ళి బిందె దించింది. భర్తతో ఈ వార్త చెప్పింది. అతడూ వినగానే నవ్వాడు. కాని ఆ నవ్వుకూడా గాలిలో వెలిగించిన దీపంలాగా గప్పున ఆరిపోయింది.

"కాయకష్టమైతే చేస్తాం...... నూలెలా వస్తుంది" అని అతడు విచారపడ్డాడు.

"పోనీ ఈ ఒక్కమాటుకీ......" అని వూరుకొంది సీతమ్మ.

"ఒక్కమాటుకీ? ఆచారం ఆపివేద్దామంటావా!...... ఆచారం నేనాపలేను...... పుట్టన్న పట్టరాని కోపంతో.

"ఆచారం ఆపమనలేదు......"

"మరేమిటి నువ్వన్నది?"

"పోనీ అప్పు......"

"నాకు చెప్పకామాట...... ఒక్క రూపాయి అప్పుచేస్తే...... ఇచ్చినవాడికి ఎక్కడలేని చనువూ వస్తుంది. కాసేపైనా చక్కగా పడుతోంది నిద్ర...... అది కూడ పోతుంది. అందాకా దేనికి, అప్పుమాట జ్ఞాపకంవస్తే మగ్గంలో కూర్చుని ఇటుకండె అటూ, అటుకండె ఇటూ విసిరే స్తిమితం ఉంటుందా, అప్పు మాత్రంచెయ్యను" అన్నాడతడు - ఉత్తరీయం కొంగుతో కళ్లు ఒత్తుకుంటూ. తానామాట ఎత్తడం తప్పని సీతమ్మ లోలోపల బాధపడుతూ "అవును. చెయ్యొద్దు" అంది.

వారిద్దరూ చాలాసేపు మౌనంగా కూర్చున్నారు. అప్పుడు పుట్టన్న మొఖం అరచేతుల్లో దాచుకొని అన్నాడు "పోనీ ఆవును" సీతమ్మ "ఆవునా?" అన్నది. మళ్ళీ ఇద్దరిమధ్యా నిశ్శబ్దం వచ్చి నిలచింది. గుండెల్లో చెప్పరాని దడదడ పుట్టింది.

"ఏం చేస్తాం? తరతరాలా వచ్చే ఆచారాన్ని పోగొట్టుకోడంకన్నా గోవును వదులుకోడం మంచిదికదూ, ఈ లగ్నానికీ వస్త్రాలందిస్తే చాలు. అంతగా అయితే మళ్ళీ పెళ్ళిళ్ళ కాలం వచ్చేసరికి ఊళ్ళోనుంచి లేచిపోదాం. పొరుగూరికి ఆచారాలు వెంట రావుగా" అన్నాడతడు.

"కాని, ఆవును అమ్మితే పాలకు వచ్చేవాళ్ళంతా ఏమైపోతారు?" అన్నదామె.

"ఏంచేస్తాం? పోనీ ఒక పనిచేద్దాం......" ఆవును ఊళ్ళోనే అమ్ముదాం. పిల్ల పాలవాళ్ళంతా అక్కడికే పోయి తెచ్చుకొంటారు" అన్నాడు.

"వాళ్ళకంత బుద్ధి పుట్టొద్దూ?" అంది సీతమ్మ.

"అంతకంటె మనమాలోచించలేమో, ఆవును ఈపూటే బేరం పెడతా...... చద్దెన్నం తిని బస్తీకి వెళ్ళి నూలు తెస్తా" అన్నాడు పుట్టన్న.

సీతమ్మ "సరే!" అంది. పుట్టన్న కళ్ళనీళ్ళు ఉత్తరీయంతో గట్టిగా తుడుచుకొని, కొప్పులాగా ఉన్న జుట్టుముడిని ఒక్కసారివిప్పి, దులిపి, మళ్ళీ ముడివేసుకొని బయలుదేరాడు.

అప్పుడే సందెవెలుగులు దూసుకువస్తున్నాయి. గానుగచెట్టు చిటారు కొమ్మకు అతికించినట్లుగా నెలవంక కనిపిస్తూన్నాడు. పుట్టన్న వాకిట్లోకి రాగానే ఆవు "అంబా" అని అరిచింది. పుట్టన్నకు పట్టరాని దుఃఖం వచ్చింది. వెళ్ళి దాని మెడ కౌగలించుకొన్నాడు. "నా మీద కోపం వచ్చిందా? అమ్ముతున్నానని బాధపడుతున్నావా? ఏం చెయ్యను, ఆచారంకోసం అమ్ముకోవలసివచ్చింది. నువ్వెక్కడున్నా ప్రతిరోజూ వచ్చి చూస్తా...... నిన్ను దైవం లాగా కొలుస్తున్నా.

SCERT ANDHRA PRADESH

నువ్వు కాపాడకపోతే ఎవరు కాపాడుతారు నన్ను?" అని మెడ వదలి ఉత్తరీయంతో దాని ఒళ్ళంతా తుడిచాడు. దాన్ని విడవలేక విడవలేక ఊళ్ళోకి వెళ్ళాడు.

మరునాడు ఉదయం పుట్టన్న లేచి గానుగపుల్ల విరిచి ముఖం కడుక్కొంటున్నాడు. తూర్పు దిక్కున సూర్యుడు సగం పైకిరాగా – చల్లటి ఎండ వచ్చి పల్లెమీద పడుతోంది. పక్షులు గూళ్ళల్లో ఉండే రెక్కలు విదలించుకొంటున్నాయి. పుట్టన్న ఇంటికి కొమ్ముల చెంబులు వచ్చినాయి. వారికి ఆవు కనిపించలేదు. పుట్టన్నా! ఆవేది?" అన్నదొక ముసలమ్మ. పుట్టన్న వెనక్కి తిరక్కుండానే "అమ్మేశా తల్లీ, అచ్చన్నగారికి".

"అయ్యో! అమ్మేశావా! ఇక మా పిల్లల గతేమిటి! గుక్కెడు పాలు పోస్తున్నాం – గనక కక్కటిల్లకుండా పరుంటున్నారు" అన్నదా అవ్వ.

"ఏం చెయ్యను తల్లీ! అలా వచ్చింది కాలం. అమ్మేటప్పుడు అచ్చన్నతో చెప్పాను. పిల్లపాలు మాత్రం పోస్తూ ఉండాలి సుమా" అని.

వచ్చినవారంతా దీనంగా నిలబడ్డారు.

పిల్ల పాలకోసం వచ్చినవారిలో ఆ ఊరి పూజారికూడా ఉన్నాడు. ఆయన ముందుకువచ్చి ఇలా అన్నాడు – "నువ్వు ఋషిలాంటివాడవు గనుక, పసిపిల్లలకోసం త్యాగం చేశావు. నువ్వుచేసే దానంవల్ల ఎందరు పిల్లలు కడుపులు నిండి కమ్మటినిద్ర పోతున్నారు? ఎందరు తల్లుల చూపులు చల్లగా ఉంటున్నాయి?"

"ఏంచెయ్యను బాబు......నే బతకడం కోసం అయితే ఆవుని అమ్మేవాణ్ణి కాను, పరువు బతికించుకోడం కోసం అమ్మాల్సి వచ్చింది" అన్నాడు పుట్టన్న.

"అది మా దురదృష్టం" – అన్నాడు పురోహితుడు.

ఇంతలో సీతమ్మ బైటికివచ్చి కుడితికుండ "ఇదిగో! నిన్నే! ఈ కుడితి అచ్చన్నగారింటి దగ్గర ఇచ్చొస్తా......" అంది.

"ఇచ్చిరా! ఈ పూటతో ఈ కుడితితో మనకూ, ఆవుకూ ఉన్న ఋణం తీరిపోతుంది," అన్నాడు వెనక్కి తిరక్కుండానే. సీతమ్మ కన్నీరు చీరకొంగుతో తుడుచుకొంటూ వెళ్ళిపోయింది. పాలకు వచ్చినవారు కూడా ఒక్కొక్కరే వెళ్ళిపోయారు. మరికొంచెం సేపటికి పుట్టన్న వెనక్కి తిరిగి చూచాడు. సిరితొలిగిపోయిన తరువాత మిగిలిన నిరుపయోగజీవిలాగా కనిపిస్తోంది – కట్టుకొయ్య. పుట్టన్న మనస్సు బావురుమన్నది. దాన్ని పీకి దూరంగా గిరాటువేద్దామనుకొని, గుంజిచూశాడు. అది రాలేదు. కాళ్ళీడ్చుకుంటూ ఇంట్లోకి వెళ్ళాడు.

ఆ రోజే బయలుదేరి బస్తీకి వెళ్ళాడు. నూలు తెచ్చాడు. ఆ నాలుగు రోజులు అతడు మగ్గం గోతిలో నుంచి లేవలేదు. సీతమ్మ రాట్నం వదలలేదు. నాలుగురోజులు గడిచాయి. తెల్లారే లగ్నం...... ఆ సందెవేళ ఆముదం దీపాలు – అటూఇటూ పెట్టి నేత నేస్తున్నాడు పుట్టన్న. ఇంతట్లోనే చెరువుగట్టున మేళాలు మ్రోగినాయి. "పెళ్ళివారు దిగారు" అంది సీతమ్మ. "ఇంకొక్క ఘడియలో నేత పూర్తి అవుతుంది" అన్నాడు పుట్టన్న. మరి కాసేపటికి పల్లకి, దానివెంట బళ్ళూ ఆ వీధినే వచ్చాయి. సీతమ్మ చూడటానికి బైటికి వెళ్ళింది. ఇలాయి బుడ్ల వెలుతుర్లో పెళ్ళికొడుకును చూచింది. వెంట ఇరవై బళ్ళున్నాయి. అన్నీ వాళ్ళ ఇల్లు దాటిపోయేదాకా నిలబడి చూచి ఇంట్లోకి వచ్చింది సీతమ్మ "పెళ్ళికొడుకు కళ్ళూ, ముఖం బాగానే ఉన్నాయి. పాతికేళ్ళుంటాయి. అయినా ఫరవాలా! ఈడుగానే ఉంటాడు. పార్వతి మాత్రం ఒడ్డూ పొడుగూ లేదూ." అంది.

"ఎవరికెలాంటి మొగుణ్ణి తేవాలో ఆ దేవుడికి తెలియదేమిటే," అన్నాడు పుట్టన్న.

ఇంకొక గంటసేపటికి మధుపర్కాలు – తీసుకువెళ్ళడంకోసం మేళాలతో పెళ్ళివారు వచ్చారు. సీతమ్మ మధుపర్కాలు మడతపెట్టి ఇంట్లో ఉన్న దేవుడిపటం దగ్గర పెట్టి నమస్కరించి తెచ్చింది. ఒక ముత్తయిదువ ఆమె నుదుట కుంకంపెట్టి పళ్ళు, తాంబూలం ఇచ్చింది. పక్కనున్న మగాయన "పుట్టన్నా! తెల్లారి జానెడు పొద్దెక్కే లగ్నం...... నువ్వు పెందరాళే లేచి రావాలి" అన్నాడు. పుట్టన్న ముసిముసి నవ్వులు నవ్వుతూ "కాలుకడిగి కన్యాదానం చేస్తుంటే దేవతలు తొంగి చూస్తారట. నరుడు రాకుండా ఉంటాడా!" అన్నాడు. వచ్చిన మంగళ వాద్యాలతో మధుపర్కాలు తీసుకొని వెళ్ళిపోయారు. పుట్టన్న దంపతుల మనస్సులు మల్లెపందిరిగా మారిపోయాయి.

SCERT ANDHRA PRADESH

తెల్లవారింది. పాపయ్యగారింట్లో పెళ్ళి వైభవంగా జరుగుతోంది. అర ఎకరం పందిరి వేసినా జనం పట్టక కిటకిటలాడిపోతున్నారు. ఒక పందిరి గుంజనానుకొని సీతమ్మ నిలబడింది, ఆవిడకు కొంచెం పక్కగా పుట్టన్న ఉన్నాడు. నూతన దంపతులు తలంబ్రాలు పోసుకుంటున్నారు. సన్నాయిపాట సాగిపోతోంది, సంతోష తరంగాలుగా. పిల్ల తల్లిదండ్రులు ఒకరినొకరు ఎరగనంత కొత్తగా చూచుకుంటున్నారెందుకో. పుట్టన్న తన ధర్మం నెరవేర్చుకొన్నానన్న ఆనందంలో మునిగిపోయాడు. లగ్నం అయింది. 'అందరూ భోజనాలకు పదండి' అన్న కేకలు నాలుగువైపుల నుంచి వినిపించాయి. అంతా వెళ్ళినా పుట్టన్న, సీతమ్మ గోడ పక్కగా నిలబడి – ఏదో చెప్పుకొని నవ్వుతున్నారు. పాపయ్య చూశాడు వారిని.

"ఏం అక్కా, నువ్విక్కడేఉన్నావు – బావయ్య అలిగాడా? కలిగిందేదో పెడతాం. అంత అలిగితే ఎలా బావా," అన్నాడు.

"అలిగినవాళ్ళకిక్కడ అత్తెసరు వెయ్యలేదనిచెపుతున్నా," అని సీతమ్మ నవ్వింది.

"అంత అలగాలని ఉంటే తిని అలుగుతాను గాని, పప్పన్నం వదులుతానా," అన్నాడు పుట్టన్న.



www.apteachers.in

పాపయ్య నవ్వి "పదండి లోపలికి" అంటూ బైటి గుమ్మంవైపు వెళ్ళి వాకిట్లో ఇంకెవరన్నా ఉన్నారేమోనని చూచివచ్చాడు.



మధుపర్కాలు తీసుకొని వెళ్ళి ఇచ్చిందాక ఒక దీక్షతో ఉన్నారు పుట్టన్న దంపతులు. ఆ కార్యం నెరవేరింది. వారి మనసులో బరువు తగ్గింది. తగ్గిన తర్వాత ఆవు మీద బెంగ అధికమైంది. ఎలాగో మనస్సుకు సంతృప్తితెచ్చుకొని నిద్రపోయారు. కాని నిద్రలో వారి కా గోమాత ప్రత్యక్షమైంది. పుట్టన్నకు ఆవు 'అంబా' అని అరుస్తూన్నట్లు వినిపించింది. దిగ్గనలేచి వెళ్ళి ఇంటిమీద ఉన్న జనపకట్ట తీసుకుని గానుగచెట్టు దగ్గరికి వెళ్ళాడు. బిక్కు బిక్కు మంటూ కట్టుకొయ్య కనిపించింది. అతడి మనస్సు చిట్లి, కొన్ని బెల్లులూడిపోయి నట్లయింది. తిరిగివచ్చి ఇంట్లో పడుకొన్నాడు. నిద్ర రావడం లేదు. ఆవు ముట్టెతెచ్చి అతని పొట్టమీద నెట్టి గోకమన్నట్లుగా తోచింది. గభాలున లేచి కూర్చున్నాడు. చూపు చూరులోకీ, మనస్సు శూన్యంలోకీ చొచ్చుకుపోతోంది. "నువ్వు పోసిన పాలు త్రాగి పసిపిల్లలు గుక్కలు మాని నిద్రపోతున్నారు" అని పూజారి అన్నమాటలు వినిపించినాయి. ఆ భావాన్ని తరుముకొంటూ వెనకనుంచి పసిపిల్లల ఏడ్పులు వినిపించినాయి. చెవులు గట్టిగా మూసుకొని "సీతా" అని పిలిచాడు. ఆమె లేచింది. తన అనుభూతి అంతా చెప్పాడు. "అయిపోయినదాని కింత దిగులైతే ఎలా? ముందు సంగతి ఆలోచించాలిగాని" అన్నదామె. "ముందు సంగతి ఆలోచించాడా దేవుడు. జరిగినదానికి విచారపడటం ఒక్కటే మన పని" అని పుట్టన్న బైటికి వెళ్ళాడు.

తూర్పురేక లారుతున్నాయి. పుట్టన్న కట్టుకొయ్యవైపు చూడలేక తలవంచుకొన్నాడు. 'అంబా' అనే పిలుపు వినిపించింది. అదీ తన భ్రమే ననుకొంటూ తలఎత్తాడు. గానుగ చెట్టు కింద ఆవు నిలబడి ఉంది. పరుగెత్తుకు వెళ్ళాడు. దాని మెడ కవుగలించుకొన్నాడు. "సీతా! సీతా" అని పిలిచాడు. ఆమె వచ్చింది. "ఆవు తెంచుకు వచ్చింది" అన్నాడు. "తెంచుకు రావడమేమిటి కట్టుకొయ్యకు కట్టేసివుంటే" అన్నదామె. ఇద్దరూ విస్తుపోయారు. ఎవరుతెచ్చి కట్టివేస్తారు. "తెంచుకొని వీధివెంట పోతుంటే ఎవరైనా తెచ్చి కట్టేసి ఉంటారు. వాళ్లకు మనం అమ్మివేశామని తెలియదుగావున్ను" అంటూ పుట్టన్న ఉత్తరీయంతో కొమ్ములు తుడుస్తున్నాడు. ఒక కొమ్ము తుడుస్తూంటే "త్యాగం నువ్వు నేర్పిందే" అన్నట్లు రెండోది తుడుస్తూంటే "నీ పవిత్రత మాకెలావస్తుంది" అన్నట్లు ఉంది. పాలవేళ అయింది. "తోలుకుపోయి అచ్చన్న ఇంట వదలివద్దాం" అన్నాడు భర్త. "ఒక్క జనపకట్ట తిన్న తర్వాత తోలుకుపోదాం" అన్నది భార్య. "అక్కడికే పట్టుకుపోయివేద్దాం. పిల్లపాలవాళ్లు వచ్చి నిలబడతారేమో!" అంటూ అతడు తాడు విప్పాడు. అతడు తాడు పుచ్చుకు ముందు నడవబోతాడు. గోవు కదలలేదు. తప్పదు తల్లీ!" అతనికి అప్పగించి రావాలి" అన్నాడు పుట్టన్న. ఆ మాట ఆలకించినట్లుగానే అడుగులు వేసింది ఆవు. సీతమ్మ జనపకట్ట చంకను పెట్టుకొని వెంట నడుస్తోంది. కాస్త దూరం వెళ్ళేటప్పటికి అచ్చన్న ఎదురొచ్చాడు. పాపయ్యగారి అల్లుడు దబ్బిచ్చాడని తనే తోలుకువచ్చి కట్టేశాననీ చెప్పాడు.

www.apteachers.in

భార్యభర్తలిద్దరూ ఒకరి మొగం వంక ఒకరు చూసుకొన్నారు. “ఆయన డబ్బివ్వడమేమిటి!” అన్నాడు పుట్టన్న. “అప్పేమో రా,” అంది సీతమ్మ. “ఆవును. కట్టేసివెళ్లి అడుగుదాం పద.” “మీ ఇంటిదగ్గరే కట్టేసుకోబావా, సొమ్ము నా సంచిలో పడిందిగా,” అన్నాడు అచ్చన్న. ఆవును తోలుకు తెచ్చి గానుగచెట్టు కింద కట్టేసి, భార్యాభర్తలిద్దరూ బయలుదేరి పాపయ్యగారి ఇంటికి వెళ్లారు.

వెండి పువ్వులున్న పీటమీద కూర్చుని, వెండి మరచెంబు దగ్గిర పెట్టుకొని ముఖం తోముకుంటున్నాడు పాపయ్యగారి అల్లుడు. మామగారు అరుగుక్రింద నుంచుని, అల్లుడైనా పలకరిస్తాడేమో, జవాబు చెప్పాలని ఉబలాట పడుతున్నాడు. పాపయ్యగారి భార్య కిటికీ దగ్గరికి వచ్చి అల్లుణ్ణి చూసి, పమిటి వెడల్పు చేసి కప్పుకొని, భర్తవంక చూచి చిరునవ్వు నవ్వింది. వెళ్ళిపొమ్మనే భావంతో నాలిక ములగాకంత బయటపెట్టాడు భర్త. ఇంతలో పుట్టన్న దంపతులు వచ్చారు వాకిట్లోకి. పాపయ్య “ఏమిటి బావా ! పొద్దునే వచ్చావు! మా చెల్లెల్ని పుట్టింట్లో దించిపోదామనా” అన్నాడు.

“దానికైతే నే రావాలా? కోడళ్లు పుట్టింటికి వెళ్ళడానికి – కోయిల కూయడానికి ఒకళ్ల పెత్తనం అక్కర్లేదని మా పెద్దమ్మ చెపుతూ ఉండేది,” అన్నాడు పుట్టన్న.

పాపయ్యకు నవ్వు వచ్చిందిగాని. అల్లుడున్నాడని జ్ఞాపకంవచ్చి ఆపుకొని ఓరకంటితో ఆయనవంకే చూచాడు. రామ్మూర్తి నీళ్ళు పుక్కిలించబోయాడు – నవ్వు ఆపుకోలేక వుమ్మేశాడు.

“మా పుట్టన్నబావ ! మీకు మధుపర్కాలు తెచ్చి యిచ్చిందీయనే! మీకే కాదు, ఊళ్లో యెక్కడ పెళ్ళయినా, ఈయనే తెచ్చిస్తాడు. కానీ పుచ్చుకోడు. అంత ధర్మాత్ముడు,” అన్నాడు పాపయ్య.

“తెలుసు,” అన్నాడు రామ్మూర్తి.

“నే చేసేదీ ఒక ధర్మమేనా? గుళ్లు కట్టించానా, గోపురాలు కట్టించానా, సత్రవులు వేశానా, ఒక మాట అడగాలని వచ్చాను అల్లుడుగార్ని!” అన్నాడు పుట్టన్న.

“ఏమిటది!” అన్నాడు పాపయ్య ఆశ్చర్యంతో.

“నేను అచ్చన్నకు ఆవును అమ్మాను. అది కొనితెచ్చి మళ్ళీ నా వాకిట్లో కట్టేశారు మీ అల్లుడుగారు.”

“ఆ! మీ ఆవునా!...”

“అవును...కట్టేశాను..మీద్వారా నేర్చుకున్న విద్యే అది. మీరు ధర్మం కోసం అమ్మనూ అమ్మారు. నేనూ ధర్మం కోసమే అది కొనితెచ్చి మీ కిచ్చాను. మావంటి యువకులు త్యాగం, ధర్మం నేర్చుకోడం తప్పంటారా!”

“తప్పనడంలేదు.....మీరు ఆవును నావంటివాడికి దానం చెయ్యడమేమిటా అంటున్నాను. ఏ పిల్లలున్నవాళ్ళకో ఇస్తే పుణ్యం వస్తుందిగాని నావంటివాడికీ...”

“నాకు తెలుసు తాతా!...ఆ ఆవు నీదగ్గర ఉంటే రోజూ పదిమంది పసిపిల్లలకు పాలు దొరుకుతున్నాయి. ఇంకెవరికిచ్చినా వాళ్ళ కడుపులే నిండుతాయి....”

“నిజమేననుకోండి. అయినా నేను మీ దగ్గర ఆవును తీసుకోవడం మంచిది కాదు ...నే నోటు రాస్తా మీకు..”

“నోటు రాస్తావా తాతా! ఏం నోటు రాసి ఇచ్చావని మాకు మధుపర్కాలు తెచ్చావు! మొదటినుంచి నువ్వు మధుపర్కాలద్వారా తీర్చేవి నోటు బాకీలేనా!... సహాయసహకారాలు, ధర్మాలు లేక ఇలా నోట్లు పుట్టినాయి. లేనివారి లోట్లు ఉన్నవారు తీర్చడమే ధర్మం' అని భగవంతుడు ఒకేసారి మానవజాతికి దస్తావేజు రాసి ఇచ్చాడు”.

పార్వతీ కిటికీలోనుంచి ఈ సంభాషణ అంతా వింటూనే వుంది. పుట్టన్న మాట్లాడకుండా నిలబడ్డాడు. పాపయ్యగారికి అల్లుడి మాటలు అమృతపు జల్లులుగా తోచాయి. ఆ మాటల కిటికీల ద్వారా అల్లుని హృదయంలోకి తొంగిచూస్తున్నాడు. తనభాగ్యం మంచిదై ఈ అల్లుడు లభించాడను కొన్నాడు. కాదు కాదు – మా పార్వతి చేసుకొన్న పూర్వపుణ్యం అనుకొన్నాడు.

అల్లుడు పుట్టన్నతో యిలా అన్నాడు.

“తాతా! పోనీ ఆ ఆవు నీది కాదనుకో, దానికి నువ్వు ధర్మకర్తవనుకో.... గ్రామంలో పిల్లలకు ఆ క్షీరం దానంచేస్తూ ఉండు.”

పుట్టన్నకి పట్టరాని సంతోషం వచ్చింది. “అట్లాంటి పనిఅయితే చెయ్యడానికేం బాబూ! గంతులేస్తూ చేస్తా. పెద్దవాళ్ళకు చేసిన సహాయంలోనే ఎంతో పుణ్యం ఉంటుందంటారు. పసివాళ్లకు చేసిన సేవ భగవంతుడిసేవే నంటారు. ఇట్టాంటి పని చెపితే, ఎట్టాంటివాడైనా ఒప్పుకొంటాడు... అయితే నే వెళ్లివస్తా. ఈ మాట మా ఆవిడికి చెప్పి మళ్లీవస్తా... మీకెట్టా

SCERT ANDHRA PRADESH

దణ్ణంపెట్టాలో తెలియడంలా... మీరీవూరు వచ్చినప్పుడల్లా.. నన్నూ... నా ఆవునీ చూసి వెళ్ళాలి.” అని రెండడుగులువేసి గిరుక్కున వెనక్కు తిరిగి,” మరిమీది చిన్నతనమైనా, చాలా మంచి మనస్సండి. ‘మంచివూహలు గలవారి పంచనే బతకమంటారు’ పెద్దలు. మీరీ ఊరినుంచి వెళ్ళేదాకా–ఈ అరుగుదగ్గరే నుంచుంటా. ఇంకేమన్నా మంచిమాటలు చెప్పాలని ఉంటే చెప్పండి... ఉండండి ఆవు మాట మా ఆవిడకి చెప్పివస్తా... దాన్నికూడా తీసుకొస్తా మీకు దణ్ణంపెట్టడానికి,” అని మళ్లీ తిరిగి వెళ్లబోయాడు.

“తాతా!” అన్నాడు అల్లుడు.

“ఏమిటి బాబూ! ఏమన్నా మంచిమాట తట్టిందా! చెప్పండి...త్వరగా చెప్పండి.”

“చెపుతా, నిన్ను, నీ ఉత్సాహాన్ని చూస్తుంటే మంచి మాటలకు కరువా తాతా! చెపుతున్నా విను. నాకు చాలా ఆస్తిఉంది. మా మామగారు మర్యాదకోసం నాకో రెండెకరాల మాన్యం రాసియిచ్చారు, కానుకంటే కాదనలేకపోయాను...దాన్ని నేనెవరికి కానుకగా ఇవ్వాలా అని ఆలోచించా. ఇప్పటికి తేలింది. నువ్వు నూతన దంపతులకు మధుపర్కాలు కప్పి సత్కరిస్తూవచ్చిన మహాదాతవి. నా రెండెకరాల మాన్యం నీకు రాసిస్తా. దానికి ‘మధుపర్కాల మాన్యం’ అని పేరు పెడతా. ఆ ఫలసాయంతో నువ్వు మధుపర్కాలు నేసి మామూలుగా నూతన దంపతులకు కానుకలిస్తూ ఉండు... ఏం తాతా?”

“ఆ! మాన్యమా! మధుపర్కాల మాన్యమా! మరి, అది పుచ్చుకుంటే నా సేవేం ఉంటుందందులో... వద్దులెండి... వద్దు...” అని పుట్టన్న కేకలు పెట్టాడు.

“అలా అనకు తాతా! ఫలసాయం ఎంతవచ్చినా అది నూలికి సరిపోతుంది. కాని మధుపర్కాలు తయారుకావాలంటే నీ సేవ ఎంతో కావాలి. అంతేకాదు తాతా...ఆ పడుగుపేకల్లో నీ పవిత్రాత్మకూడా ప్రతిబింబిస్తుంది. ఉత్తమమైన నేత పరిశ్రమ నారాధించడమే కాకుండా వాటిని దానంచేసే నీ ఆత్మ ఎంత గొప్పది తాతా! నీవంటివారిలోనే జాతీయ జీవనం తన ప్రాచీన రూపాన్ని ఇప్పటికీ కాపాడుకొంటోంది!..గ్రామజీవనానికి వెన్నెల స్తంభాలవంటి ఈ పరిశ్రమల్ని పోషించేవారికంటే దేశభక్తులు, త్యాగమూర్తులూ వేరెవరున్నారు తాతా! గ్రామం ఒక పాలవెల్లి. దానిలో పువ్వులు మీ వంటివారు. తాతా! ఈ పూటే దస్తావేజు రాయిస్తాను.”...

పుట్టన్నకు సంతోషంతో గొంతు పూడిపోయి ఎంతో నత్తివచ్చింది. ఏం చెప్పాలో తోచక గిరగిర తిరుగుతున్నాడు. చివరకు “సరేబాబూ..ఇదికూడా మా ఆవిడతో చెప్తొస్తా. ఏదైనా మంచిమాట విన్నప్పుడు ఒక్కణ్ణే ఆలోచించలేను....,, వెంటనే దాంతో చెప్పాలి. చెప్పి మళ్లీ వస్తా,” అంటూ పరుగెత్తాడు.

SCERT ANDHRA PRADESH

కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

(1) పుట్టన్న దంపతుల ఆచారమేమిటి? దాన్ని కొనసాగించటానికి ఆయన చేసిన త్యాగమేమి?

(2) ఈ కథవల్ల పల్లెటూళ్ళలోని మనుషులమధ్య ఆత్మీయతానుబంధాలు ఎలా ఉన్నాయని మీకనిపించింది?

(3) పుట్టన్నదంపతుల మంచితనాన్ని వర్ణిస్తూ పది వాక్యాలు రాయండి.

(4) ఈ పాఠంలోని అల్లుడుగారి పాత్ర ద్వారా ఎలాంటి ఆదర్శాన్ని గ్రహించారు?

www.apteachers.in

13. సందేశం

- యస్.టి.జ్ఞానానందకవి

ఆలోచించండి - చెప్పండి

స్వంత లాభం కొంతమానుకు
పొరుగువారికి తోడుపడవోయ్
దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్
పాడిపంటలు పొంగి పొర్లే
దారిలో నువు పాటుపడవోయ్;
తిండి కలిగితే కండగలదోయ్
కండ కలవాడేను మనిషోయ్
చెట్టపట్టాల్ కట్టుకొని దే
శస్థులంతా నడువవలెనోయ్
అన్నదమ్ములవలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్

- గురజాడ అప్పారావు

SCERT ANDHRA PRADESH

ప్రశ్నలు

1. పై పంక్తులు ఏ గేయంలోనివి? ఆ గేయాన్ని ఎవరు రాసారు?
2. ఈ గేయంలో ఉన్న విషయాలేమిటి?
3. గేయ సందేశం ఏమిటి?
4. దేశభక్తిని గురించిన గేయాలు, కవితలు, పద్యాలను కవులు ఎందుకు రాస్తారు?

ఉద్దేశం

భిన్న సంస్కృతులకు, సంప్రదాయాలకు నిలయమైనది మనదేశం. "భిన్నత్వంలో ఏకత్వం"తో ప్రపంచ ప్రసిద్ధిని పొందిన మన దేశం గొప్పతనాన్ని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యతను గురించి తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

ఈ పాఠం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచారశాఖ వారు ప్రచురించిన 'సమైక్యభారతి' కవితా సంకలనంలోది.

విద్యార్థులకు సూచనలు

1. పాఠంలోని చిత్రాలు చూడండి. పద్యాలు వేటి గురించి ఉన్నాయో ఊహించండి. చెప్పండి.
2. పాఠం చదవండి. పదపట్టిక చూసి తెలియని పదాలకు అర్థాలు తెలుసుకోండి.
3. సందర్భానికి తగిన అర్థాన్ని గ్రహించి చిత్రాలు ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
4. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

www.apteachers.in

*చం. పరమ తపోనివేశనము బంగరుపంటలకు న్నివాస మ
ఖ్బురమగు శాంతిచంద్రికల భూమి ప్రపంచచరిత్రలోన బం
ధురతర కీర్తిగొన్న భరతోర్వర నా జనయిత్రియంచు పా
డర! శిరమెత్తరా! విజయఢంకను గొట్టుమురా! సహోదరా! 1

మ. ఇది నాదేశము నన్నుఁ గన్నయది నా యీ దేశ సౌభాగ్య సం
పదలీవిశ్వమునందు వర్ధిలగఁ దోడ్పాటున్ బొనర్తున్ మహా
భ్యుదయమ్మున్ నెలకొల్పుదున్ భువనముల్ పూజింపనంచీవు నీ
యెదలో గట్టి ప్రతిజ్ఞఁ గైకొనుమురా! హిందూకుమారాగ్రణీ! 2

*ఉ. జాతి శిరస్సు నెత్తికొని క్ష్మాతలవీధిని గౌరవాన హుం
దాతన మొప్పగాఁ దిరిగినన్ గలుగున్ గడుకీర్తి భారత
క్ష్మాతలి కట్టి భాగ్యమును గల్గగ శాంతి సముద్ధరింప లే
రా! తరుణమ్మిదే మరల రాదు సుమీ! గతకాల మెన్నడున్ 3

మ. మతమేదైనను భాషయేదయిన సంపాదించుకొన్నట్టి సం
స్కృతి యేదైనను నిండు నీ తనువులో జీర్ణించు జాతీయతా
హితనవ్యోజ్జ్వల భావబంధురత లీ హింసా ప్రపంచాన క
ద్భుత రీతిన్ గనిపింపగా వలయు బాబూ! శాంతి దీక్షారతా! 4

తే.గీ. నిఖిల ధరణికి శాంతిని నేర్పినట్టి
భరత భువనమ్ము నీ తల్లి ప్రథితయశము
నిలువఁబెట్టుట నీవంతు నిశ్చయముగ
నీకుఁ గలదు బాధ్యతయు హిందూకుమార! 5

సీ. శిరమెత్తరాదు మచ్చరికించి విషపు దౌ
ర్జన్య కులమత హింసాపిశాచి
నిలువఁగారాదు పెన్ బలిసిపోయిన దుష్ట
నయవంచకాళి గూండాయిజమ్ము
తొలఁచఁగారాదు విద్రోహాన దేశ భా
గ్యాల దార్ఢ్యతను లంచాల జలగ
వచియింపఁగారాదు ప్రతినిధి యగువాడు
పగ నసల్ మొలకెత్త పలుకుబడుల

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

ఆ.వె. అంద అన్నదమ్ములన్న మధురమైన
ధర్మమునకు దెబ్బతగులరాదు
నాడురా! సమేకతా డిండిమము మ్రోగు
వసుధ పొగడ నవ్యభారతమున 6

*శా. ఈ గంగానది బ్రహ్మపుత్రయును నీకృష్ణమ్మ కావేరియున్
ఈ గోదావరి సింధు నర్మదలు నీ యీదేశ సౌభాగ్య ధా
న్యాగారాలకు పట్టుగొమ్మలు నఖండంబైన నీ ధారుణీ
భాగ్యమ్మీ సకల ప్రపంచమునకున్ స్వామిత్వముం బూనెడిన్ 7

తే.గీ. ముసలి సన్న్యాసి బాపుజీ బోసినోరు
విప్పిపలికిన పలుకుకే విశ్వజగతి
జోతలర్పించె జాతికి ఖ్యాతి యదియ
ఆ మహామౌని నేల పాదయ్యె నేడు 8

ఆ.వె. దేశభక్తి మఱియు దేశసమగ్రత
ప్రజల నాడులందు ప్రబలి ప్రబలి
కర్మభూమియగు నఖండ భారతమహా
క్షితిని నెగురు ప్రగతి కేతనమ్ము 9



www.apteachers.in

కవి పరిచయం

డా॥ ఎస్.టి. జ్ఞానానందకవి
(1922-2011)

ఈయన పూర్తిపేరు **సురగాలి తిమోతి జ్ఞానానందకవి.** బొబ్బిలి తాలుకా పెదపెంకి గ్రామంలో జన్మించారు. తెలుగు పండితులుగా పని చేశారు. ప్రాథమిక విద్యార్థి దశలోనే ఆశువుగా సీస పద్యాలు చెబుతూ 'దీనబంధు శతకాన్ని' రాశారు. ఆమ్రపాలి, పాంచజన్యం, క్రీస్తుశతకం, నా జీవిత గాథ, కూలీ నుండి కళాప్రపూర్ణ వరకు, పర్జన్యం, గోల్కొండ మొ॥నవి వీరి రచనలు. 1975లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. రాష్ట్ర ప్రభుత్వంచే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. భారతప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. సరళమైన శైలితో సామాజిక చైతన్యాన్ని అందించారు.

సారాంశం :

SCERT ANDHRA PRADESH

1. ఓ సోదరా! మనదేశం తపోభూమి. బంగారు పంటలకు నిలయం. శాంతి వెన్నెలలు కురిసే పుణ్యభూమి. ప్రపంచంలో అఖండ కీర్తిని పొందిన భరత భూమి నా తల్లి అని గర్వంగా తలఎత్తుకుని చాటిస్తూ, విజయఢంకాను మోగిస్తూ నీ దేశాన్ని గురించి కీర్తించు.

2. ఓ భారత కుమార శ్రేష్ఠుడా! "ఇది నా దేశం. నన్ను కన్నది. నా దేశ సౌభాగ్యసంపదలు అభివృద్ధి చెందడానికి నేను సహాయపడతాను. ప్రపంచమంతా దీన్ని పూజించేటట్లుగా గొప్ప ప్రగతిని నెలకొల్పుతాను" అంటూ నీ మనస్సులో గట్టిగా "ప్రతిజ్ఞ" చెయ్యి.

3. భారత జాతి తలెత్తుకుని ప్రపంచ వీధిలో సగౌరవంగా, హుందాగా తిరిగినప్పుడే గొప్ప కీర్తి కలుగుతుంది. మన దేశానికి అటువంటి సౌభాగ్యం కలిగే విధంగా శాంతిని పెంపొందించడానికి సరైన సమయం ఇదే! అందుకు సిద్ధంకండి. ఎందుకంటే పోయిన కాలం తిరిగి రాదు కదా!

4. శాంతిదీక్ష యందు ఆసక్తి కలవాడా! నీ మతం, భాష సంస్కృతి ఏవైనప్పటికీ నీ నరనరాల్లో నిండిన భారతీయభావన హింసతో నిండిన ఈ ప్రపంచానికి నూతన కాంతులు ప్రసరిస్తూ కనిపించాలి.

5. ఓ భారత కుమారా! సమస్త ప్రపంచానికీ శాంతిని నేర్పినట్టి భారతమాత నీ తల్లి. కాబట్టి ఆమె సముజ్జ్వలకీర్తిని నిలబెట్టాల్సిన బాధ్యత నీదే.

6. ఇటువంటి పుణ్యదేశంలో అసూయలు, దౌర్జన్యాలు, కుల, మత హింసలనే పిశాచాలను తల ఎత్తనీయకూడదు. నానాటికీ పెరిగిపోతున్న దుష్టులు, మోసగాళ్ళ గూండాయిజం నిలువకూడదు. బలిష్ఠమైన దేశ సౌభాగ్యాన్ని లంచాలనే జలగలు పట్టి పీల్చకూడదు. పగలు, సెగలు రగిలించే మాటలు ప్రతినిధులైన వాళ్ళు మాట్లాడకూడదు. మనమంతా అన్నదమ్ములమనే తీయనైన ధర్మానికి దెబ్బతగలనీయకూడదు. అలా జరిగినప్పుడు సమైక్యత అనే ఢంకా మోగి, నవ భారతాన్ని గురించి ప్రపంచం పొగుడుతుంది.

www.apteachers.in

7. గంగ, బ్రహ్మపుత్ర, కృష్ణ, కావేరి, గోదావరి, సింధు, నర్మద అనే జీవనదులు ఈ దేశ సౌభాగ్యానికీ, ధాన్యాగారాలకూ ముఖ్యమైన ఆధారం. అఖండమైన సౌభాగ్య సంపదలు కలిగిన ఈ దేశం ప్రపంచానికే అధిపతి అయింది.

8. గాంధీజీ పలికిన పలుకులకు ప్రపంచమంతా జేజేలు పలికింది. మన జాతికి ఖ్యాతి వచ్చింది. అటువంటి మహాత్ముని కన్నభూమి నేడు, ఆయన ఆశయాలకు అనుగుణంగా లేదు.

9. దేశభక్తి, దేశసమగ్రత అనే భావాలు ప్రజల నరనరాల్లో వ్యాపించి, పుణ్యభూమి అయిన అఖండభారతదేశంలో ప్రగతిజెండా రెపరెపలాడుతుంది.

ఇవి చేయండి

I. వినడం - మాట్లాడడం

1. ఈ పాఠంలోని పద్యాల్లో మనదేశం గొప్పతనం గురించి చదివినపుడు మీకేమనిపించింది?
2. ప్రజాప్రతినిధులు ఎలా ఉండాలని మీరు భావిస్తున్నారు?
3. లంచగొండితనం మన దేశ ప్రగతి గౌరవాలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నదో చర్చించండి.

SCERT ANDHRA PRADESH

II. చదవడం - రాయడం

1 కింది పద్యం చదవండి. దాని భావంలోని ఖాళీలలో సరైన పదాలు రాయండి

"దేశభక్తి మరియు దేశసమగ్రత
ప్రజల నాడులందు ప్రబలి ప్రబలి
కర్మభూమి యగు నఖండ భారతమహా
క్షితిని నెగురు ప్రగతి కేతనమ్ము"

భావం : దేశభక్తి, ... అనే భావాలు ప్రజల్లోని నర నరాల్లో .... కర్మభూమిఅయిన మన .... దేశం ప్రగతి .... రెపరెపలాడుతోంది.

2 కింది ఖాళీలకు సరైన సమాధానాన్ని గుర్తించండి.

(అ) మధురమైన ధర్మానికి ---- తగలరాదు. (రాయి / దెబ్బ)

(ఆ) భరత జాతి --- ఆశయాలకు అనుగుణంగా లేదు. (మహాత్ముడి / బుద్ధుడి)

(ఇ) సకల జగతికి ---నేర్పినట్టి మన భరతమాతను పూజించాలి. (అశాంతి /శాంతి)

(ఈ) అఖండ భారతావనిలో ---- కేతనం ఎగురవేయాలి. (ప్రగతి / తిరోగతి)

www.apteachers.in

3 కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా జవాబులు రాయండి.

(అ) భారతీయులు ఏమని ప్రతిజ్ఞ చేయాలి?

(ఆ) మనదేశ సౌభాగ్యానికి పట్టుగొమ్మలు ఏవి?

(ఇ) ఈ పాఠంలో కవి చెప్పిన "మహామౌని" ఎవరు? ఆయన గొప్పతనం ఏమిటి?

(ఈ) మన దేశ ప్రగతి కేతనం ఎప్పుడు రెపరెపలాడుతుంది?

III. స్వీయరచన

1 కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

(అ) పాఠంలో కవి చెప్పిన విషయాలే గాక, మనదేశ కీర్తిని పెంచిన ఇతర విషయాలు రాయండి.

(ఆ) మన జీవనదులు దేశానికి ఎటువంటి పరిపుష్టిని కలిగిస్తున్నాయి?

(ఇ) భారతీయ సంస్కృతిలో నీకు బాగా నచ్చిన విషయాలు ఏమిటి? అవి ఎందుకు బాగా నచ్చాయి?

(ఈ) నీవే ప్రజాప్రతినిధివి అయితే దేశంకోసం ఏం చేస్తావు?

SCERT ANDHRA PRADESH

2 కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

(అ) మనదేశాన్ని గురించి ప్రపంచం పొగడాలంటే, దేశంలో ఏమేమి ఉండగూడదని కవి చెప్పాడు?

(ఆ) "భారతీయుడుగా పుట్టినందుకు గర్విస్తున్నాను" ఈ వాక్యాన్ని సమర్థిస్తూ రాయండి.

IV. పదజాలం

1 కింద గీతగీసిన పదాలకు అర్థాలను రాసి ఆ వాక్యాలను తిరిగిరాయండి.

(అ) మా పాఠశాలలో గణతంత్ర దినోత్సవంనాడు జాతీయ కేతనాన్ని ఎగర వేస్తాం.

(ఆ) ప్రతి వ్యక్తికీ మనోదార్ఢ్యం ఉండాలి.

(ఇ) ఇతరుల సంపదలు చూసి మచ్చరికించ గూడదు.

(ఈ) రవి చేతిరాతను చూసి అందరూ అబ్బురపడతారు.

2 కింద గీత గీసిన పదాలకు వికృతి పదాలతో తిరిగి వాక్యాలు రాయండి

(అ) నాదేశ సమగ్రతను కాపాడతానని ప్రతిజ్ఞచేస్తున్నాను.

(ఆ) నాది తెలుగుజాతి. నాది తెలుగుభాష.

(ఇ) మనకు దేశంపై భక్తి ఎక్కువగా ఉండాలి.

(ఈ) మన కీర్తి ఖండఖండాంతరాలకు వ్యాపించింది.

www.apteachers.in

3 పాఠానికి సంబంధించిన మాటలను కింది గళ్ళ నుండి వెతికి పక్క గళ్ళల్లో రాయండి వాటితో వాక్యాలు తయారు చేయండి.

శ్రీ	ధు	జీ	ము	రా	వి
సిం	పూ	శ	మా	క	క్తి
బా	దే	ది	ద	భ	ష్పా
సం	దూ	నం	శ	కృ	తి
హిం	నా	దే	శ	ము	శాం
జ్ఞా	స	గం	గా	న	కు

1
2
3.
4.
5.
6.
7.
8.
9.
10

V. సృజనాత్మకత

పాఠంలో మనదేశం గొప్పతనాన్ని తెలుసుకున్నారు కదా! మనదేశ గొప్పతనాన్ని వర్ణిస్తూ భారతీయ విలువలు కాపాడటానికి అందరూ బాధ్యత తీసుకోవాలని ఒక "కరపత్రం" తయారు చేసి ప్రదర్శించండి.

VI. ప్రశంస

మనదేశం ప్రపంచ ప్రసిద్ధి చెందటానికి ఎంతోమంది కృషిచేశారు. నేటికీ విద్య, వ్యాపారం, క్రీడలు, సాంస్కృతికం, రాజకీయం మొదలైన రంగాలలో ఎంతోమంది కృషి చేస్తున్నారు. అటువంటి వ్యక్తులలో మీకు తెలిసిన వ్యక్తిని గూర్చి, వారి కృషిని గూర్చి ప్రశంసిస్తూ ఒక వ్యాసం రాయండి.

VII. భాషను గురించి తెలుసుకుందాం

1. కింది పదాలకు గురువులను లఘువులను గుర్తించండి.

U I I
ఉదా ॥ దేశము

ధరణి	నీతల్లి	కేతనం
శిరస్సు	క్షితిని	నీ వంతు
సౌభాగ్యం	ప్రగతి	జలగ
కుమారా	జాతీయ	ప్రణతి

H7DVTS

2. కింది వాటిలో తప్పుగా ఉన్న గణాలను గుర్తించి సరి చేయండి.

చరిత్ర -IIU	పంటలు-IUI	పూజింప-UUI
వనముల్-IUU	ఎన్నడున్-IUU	నిశ్చయం-UIU
గౌరవం -IIU	కొమ్మలు-IUI	బాధ్యత-UUI
నిఖిల -IUI	సంపద -UII	సత్కృతి - UIU

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

ప్రబలి -III	జీర్ణించు-UUI	సంస్కృతి-UII
పొగడ -IUI	నేర్పిన -UII	ధారుణీ-UII
జాతికి -III	కావేరి-IUI	కొట్టుము-UII

3. ఛందస్సులో గణాల విభజన తెలుసుకున్నారు కదా! ఇప్పుడు గణాలు ఆధారంగా పద్య లక్షణాలను తెలుసుకుందాం.

(అ) కింది పద్య పాదాలను పరిశీలించండి.

భ	ర	న	భ	భ	ర	వ
U I I	U I U	I I I	U I I	U I I	U I U	I U
ఆ య త	ప క్ష తుం	డ హతి	న క్కు ల	శై ల ము	లెల్లను	గ్గ గాc

భ	ర	న	భ	భ	ర	వ
U I I	U I U	I I I	U I I	U I I	U I U	I U
జే యు మ	హా బ లం	బు ను బ్ర	సి ద్ధి యు	నుం గల	నా కు నీ	ప నిం

SCERT ANDHRA PR

పై పాదాల్లో "భ,ర, న, భ, భ, ర, వ" అనే గణాలు ఒకే వరసలో వచ్చాయి కదా!

- ఇలా పద్యంలో నాలుగుపాదాల్లో ఒకేరకమైన గణాలు ఒకేవరసలో ఉన్న పద్యాన్ని "వృత్తపద్యం" అంటారు.
- పద్యపాదంలో మొదటి అక్షరాన్ని "యతి" అంటారు. ఈ యతి అక్షరం, దాని వర్ణ మైత్రి అక్షరం ఆ పాదంలో నియమితస్థానంలో రావడాన్ని "యతిమైత్రి" లేదా 'యతిస్థానం' అంటారు.
  పై పద్యపాదాల్లో ఆ-అ; జే(ఏ)-సి(ఇ) లకు యతిమైత్రి చెల్లింది.
- పై పద్యపాదాల్లో రెండవ అక్షరంగా నాలుగు పాదాల్లో "య" అను అక్షరం వచ్చింది.
  ఇలా పద్యపాదాలన్నింటిలోను రెండవఅక్షరంగా ఒకే హల్లు రావడాన్ని "ప్రాస" నియమం అంటారు.
- పై పద్యపాదాలు 'ఉత్పలమాల' పద్యానివి.
  పై ఉదాహరణననుసరించి 'ఉత్పలమాల' పద్యలక్షణాలను ఈ విధంగా పేర్కొనవచ్చు.

ఉత్పలమాల :
1. ఇది వృత్తపద్యం.
2. పద్యంలో నాలుగు పాదాలుంటాయి.
3. ప్రతిపాదంలో భ,ర, న, భ,భ,ర,వ అనే గణాలుంటాయి.
4. ప్రతిపాదంలో 10 వ అక్షరం యతి స్థానం.
5. ప్రాసనియమం ఉంటుంది.
6. ప్రతి పాదంలోను 20 అక్షరాలుంటాయి.

ఈ లక్షణాలుగల పద్యపాదమే ఉత్పలమాల పద్యపాదం.

www.apteachers.in

(ఆ) ఉత్పలమాల పద్యలక్షణాలు తెలుసుకున్నారు కదా! ఈ పద్యలక్షణాల ఆధారంగా కింద ఇవ్వబడిన చంపకమాల పద్యానికి గురులఘువులు గుర్తించి, గణ విభజన చేసి పద్యం కిందగల లక్షణాలు పూరించండి.

'అమిత పరాక్రమంబును, రయంబును, లావును గల్గ ఖేచరో
త్తముడవు, నీవు, నీదయిన దాస్యము వాపికొనంగ నీకు జి
త్తము గలదేని, భూరి భుజ దర్పము శక్తియు నేర్పడంగ మా
కమృతము 'దెచ్చియి మ్మనిన నవ్విహగేంద్రుడు సంతసంబునన్
చంపకమాల

(1) ఇది --- పద్యం (2) పద్యంలో ---పాదాలున్నాయి
(3) ప్రతి పాదంలో -,-,-,-,-,-,- అనే గణాలున్నాయి.
(4) ప్రతిపాదంలో --- అక్షరం యతి స్థానం (అ- య) (త-దా) (త-ద) (అ-ఆ) వీటికి యతి మైత్రి
(5) ప్రాస నియమం -----
(6) ప్రతి పాదంలోను ------ అక్షరాలుంటాయి.

(ఇ) కింది పాదాలు ఏ వృత్తాలకు సంబంధించినవో గుర్తించండి.

III	IUI	UII	IUI	I UI	IUI	UIU
పరమ	తపోని	వేశన	ముబంగ	రుపంట	లకున్ని	వాసమ (బు) ......

U I I	UIU	I I I	UII	UII	UIU	I U
రాతరు	ణమ్మిదే	మరల	రాదుసు	మీగత	కాలమె	న్నడున్

(ఈ) కింద సూచించిన పద్య పాదాలను పూరించి గణవిభజన చేసి అవి ఏ పద్యపాదాలో గుర్తించండి.

1. 'జాతి శిరస్సు నెత్తికొని' ......, 2. 'పరమ తపోనివేశనము' ...... చేసి

ప్రాజెక్టు పని

ప్రపంచ స్థాయిలో మన దేశగౌరవం పెరగాలంటే కింద ఇవ్వబడిన అంశాలకు సంబంధించి మనమేం చేయాలో తరగతి గదిలో సమగ్రంగా చర్చించి వ్యక్తిగతనివేదిక (రిపోర్ట్) ను తయారు చేయండి.

1. క్రీడలు, కళలు 2. వైజ్ఞానిక ప్రగతి 3. అవినీతి, లంచగొండితనం లేని సమాజం. 4. భాషాసంస్కృతీ పరిరక్షణ.

పునరభ్యసనం (వెనుకబడిన విద్యార్థుల కొరకు)

1. పాఠ్యాంశాలలోని పదాల జాబితాను ఉపాధ్యాయుడు తయారుచేసి చదివించాలి.
2. విద్యార్థులచే ఉక్తలేఖనం రాయించాలి. దోషాలు సవరించాలి.
3. పాఠ్యాంశ సారాంశాన్ని 4 లేదా 5 వాక్యాలలో నల్లబల్లపై రాసి విద్యార్థులచే చదివించాలి, రాయించాలి, దోషాలు సవరించాలి.

H7HIHP

నేనివి చేయగలనా ?

1. మనదేశ గొప్పదనం గురించి మాట్లాడగలను. ఔను / కాదు
2. పాఠంలో పద్యాలను భావయుక్తంగా చదివి, భావాలను సొంతమాటల్లో రాయగలను. ఔను / కాదు
3. దేశ సమైక్యతను గురించి కరపత్రం తయారు చేయగలను. ఔను / కాదు
4. దేశానికి కీర్తి తెచ్చే వ్యక్తులను గురించి ప్రశంసిస్తూ సొంత మాటల్లో వివరించగలను. ఔను / కాదు

14. సంస్కరణ

- నండూరి రామమోహన రావు

ఆలోచించండి - చెప్పండి

SCERT ANDHRA PR

ప్రశ్నలు

1. మొదటిచిత్రంలో ఉన్నవారు ఎవరు?
   ఆయన ఎలా ప్రసిద్ధులు ?
2. రెండో చిత్రంలో ఉన్నవారు ఎవరు ?
   వారు ఎవరికోసం కృషి చేశారు ?
3. సాంఘిక దురాచారాలు అంటే ఏమిటి?
4. నేడు మన సమాజంలో
   ఏయే దురాచారాలు ఉన్నాయి?

ఉద్దేశం

వార్తాపత్రికల్లోని సంపాదకీయాలు, వ్యాఖ్యలు సమాజ చైతన్యానికి తోడ్పడతాయి. కాబట్టి విద్యార్థుల్లో సంపాదకీయ వ్యాసాలపట్ల, వ్యాఖ్యలపట్ల అభిరుచి కలిగించాలనేది ఈ పాఠం ఉద్దేశం.

ఈ పాఠం "నండూరి రామమోహనరావు వ్యాఖ్యావళి" గ్రంథం లోనిది.

విద్యార్థులకు సూచనలు

1. పాఠంలోని చిత్రం చూడండి. ఏం జరుగుతున్నదో చెప్పండి. దీని ద్వారా పాఠంలోని విషయాన్ని ఊహించండి. చెప్పండి.
2. పాఠం చదవండి. పదపట్టిక చూసి తెలియని పదాలకు అర్థాలు తెలుసుకోండి.
3. సందర్భానికి తగిన అర్థాన్ని గ్రహించి చిత్రాలు ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
4. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

www.apteachers.in

శాసనాలు చేసినంతమాత్రాన ఏ సాంఘిక సంస్కరణ ప్రయత్నమూ విజయవంతం కాబోదు. దాని ఆవశ్యకతను ప్రజలు గుర్తించాలి. దానికి సంబంధించిన మానసిక చైతన్యం వారిలో ప్రస్ఫుటించాలి. వారి నుంచి పూర్తి సహకారం రావాలి.

అతిబాల్యవివాహాలు ఈనాడు ఎక్కడైనా చెదురుమదురుగా జరుగుతున్నాయేమోగాని, ఒక పెద్ద సాంఘిక సమస్యగా పరిగణించదగినంతగా జరగడంలేదు. ఈ పరిణామం సాధ్యం కావడానికి శారదాశాసనం ఒక్కటే కారణమని అనుకోలేము. బాల్యవివాహ దురాచారాన్ని రూపుమాపడానికి ఎందరో మహామహులైన సంఘ సంస్కర్తలు కృషిచేశారు. వారి కృషిఫలితంగా ప్రజలలో వాటిపట్ల కలిగిన ఏవగింపు ఈ దురాచార నిర్మూలనకు ముఖ్యకారణం.

శారదా శాసనం

మన దేశంలో బాల్య వివాహాల నిర్మూలనకు సంఘ సంస్కర్తల ఉద్యమాల ఫలితంగా బ్రిటిష్ ఇండియా గవర్నమెంటు 28-09-1929లో "రావ్ సాహెబ్ హరబిలాస్ సర్దా" పేరుతో ఇచ్చిన శాసనం. ఇది శారదాశాసనం గా ప్రసిద్ధి పొందింది. ఈ శాసనంలో అమ్మాయిలకు 14 సం॥లు, అబ్బాయిలకు 18 సం॥ నిండకుండా వివాహం చేయటం నిషేధించారు. ఈ శాసనం చేసిన ఆరు నెలలకు అంటే 01-04-1930 నుండి అమలులోకి వచ్చింది.

అదే విధంగా తరతరాలుగా మన సమాజాన్ని బాధిస్తున్న మరొక దురాచారం వరకట్నం. దీన్నికూడా నిషేధిస్తూ శాసనాలు లేకపోలేదుగాని, ఇది నిర్మూలన కాలేదు సరిగదా, నానాటికీ పెనుభూతంవలె పెరిగిపోతున్నది.

ఆమధ్య హైదరాబాదులో ఒక సభలో ప్రసంగిస్తూ అప్పటి ఒరిస్సా ముఖ్యమంత్రి శ్రీమతి నందినీ శతపథి స్త్రీల అభ్యున్నతికి అవరోధాలుగా నిలిచిన రెండే రెండు ముఖ్యసమస్యలు విద్యావిహీనత, వరకట్నపు దురాచారం అని పేర్కొన్నారు. నిజమేగాని, మొదటిదాని కంటె రెండవదే జటిల సమస్య.

నందినీ శతపథి

ఒరిస్సా రాష్ట్రానికి తొలి మహిళా ముఖ్యమంత్రిగా 1972 - 1976 మధ్య పని చేశారు. రెండు సార్లు రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు.

ఒకప్పటి సంగతి ఏమైనా, ఈనాడు స్త్రీ విద్యావశ్యకత గురించి వ్యతిరేకాభిప్రాయం దాదాపుగా లేదు. ఈనాడు అది ప్రయత్నపూర్వకంగా సాధించవలసిన సంస్కరణ కాదు. అవకాశాలు లేకపోవడమే స్త్రీలలో విద్యావ్యాప్తి చురుకుగా జరగకపోవడానికి కారణం.

www.apteachers.in

మొత్తం జనాభాలోనే నూటికి సుమారు 70మంది విద్యాశూన్యులైనప్పుడు తరతరాలుగా పురుషులకంటె అన్ని విధాలుగా వెనుకబడిన స్త్రీలు విద్యా విషయంలో కూడా వెనుకబడి ఉండడంలో ఆశ్చర్యంలేదు.

వరకట్నపు దురాచారం మాత్రం ఇందుకు భిన్నమైన సమస్య. దీని నిర్మూలనకు ప్రజలే సిద్ధంగా లేరనడం సత్యదూరంకాదు. వరకట్నం పుచ్చుకోడం, ఇవ్వడం కూడా ప్రతిష్ఠకు, సంఘంలో గౌరవానికి సంబంధించిన విషయాలుగా చెల్లుతున్నాయి. కట్నం అసలు తీసుకోకపోవడం నలుగురిలో చిన్నతనంగా వరునివైపువారు భావించినట్టే, అది వరునివైపు ఏదో లోపానికి సూచనగా వధువు వైపువారు, ఇతరులు భావించడం సర్వసామాన్యంగా జరుగుతున్నది. దీన్నిబట్టే ఎంత

www.apteachers.in

హెచ్చుకట్నం ఇస్తే, తీసుకుంటే అంత ఘనంగా భావించడం కూడా ఉన్నది. ఈ భావాల నిర్మూలనకు మొదటగా ప్రయత్నం జరగాలి, ప్రచారం జరగాలి.

దీనితో ముడిపడిన సమస్య అసలు వివాహాలను జరిపే తీరు ఎంత వైభవంగా, ఎంత ధనవ్యయం చేసి వివాహం జరిపిస్తే అంత ఘనతగా పరిగణించడం మన సమాజంలో పరిపాటి. నిరాడంబరంగా వివాహం జరపడానికి సంఘం హర్షించదు. ఇందువల్ల ఎంత శక్తిహీనుడైనా అప్పో సప్పో చేసి ఘనంగా వివాహం జరిపినట్లు అనిపించుకోవలసివస్తున్నది. ఇంతేకాదు, వివాహ సమయంలో బంధుమిత్రులు వధూవరులకు చదివించే కానుకల హెచ్చుతగ్గులు కూడా ప్రతిష్ఠకు సంబంధించిన విషయంగా పట్టించుకునే స్థితికి మన సంఘం దిగజారిపోయింది.

ఈ దురాచారాల నిర్మూలనకు శాసనాలు అవసరమే కావచ్చు కానీ అంతకంటే ముఖ్యంగా వీటిపట్ల ఏహ్యభావాన్ని ప్రజలలో కలిగించడం ముఖ్యం. వీటిపట్ల యువతీ యువకులు ఎదురుతిరిగేటట్టు చేయడం ముఖ్యం. శాసనాలు మాత్రమే దీన్ని సాధించలేవు.

PRADESH

www.apteachers.in

రచయిత పరిచయం

నండూరి రామమోహనరావు

తెలుగు పాత్రికేయులలో సుప్రసిద్ధులైన నండూరి రామమోహన రావు (1927–2011) కృష్ణాజిల్లా విస్సన్న పేటలో జన్మించారు. జ్యోతి, ఆంధ్రజ్యోతి, బాలజ్యోతి, వనితాజ్యోతి మొదలైన పత్రికలకు సంపాదకులుగా పనిచేశారు. విశ్వరూపం, నరావతారం, విశ్వదర్శనం వీరి ప్రముఖ రచనలు. నండూరి వారి సంపాదకీయవ్యాసాలు అయిన "అనుపల్లవి", "చిరంజీవులు", "నండూరి రామమోహనరావు వ్యాఖ్యావళి" పేరిట సంకలనాలుగా వచ్చాయి. పిల్లలకోసం కొన్ని ఇంగ్లీషు నవలలను తెలుగులోరాశారు. "చిలకచెప్పిన రహస్యం", "మయూరకన్య". "హరివిల్లు" పేరిట పిల్లలగేయాలు రాశారు.

తెలుగు విశ్వవిద్యాలయం వీరికి గౌరవడాక్టరేటు ఇచ్చి గౌరవించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమపాత్రికేయుడు అవార్డుతో సత్కరించింది.

ప్రక్రియ – సంపాదకీయ వ్యాసం

సమకాలీన సంఘటనలలో ముఖ్యమైనవాటిని తీసుకుని పత్రికల్లో వ్యాఖ్యానరూపంగా పూర్వాపరాలను పరామర్శిస్తూ సాగేరచన సంపాదకీయ వ్యాసం. దీన్ని పత్రికా సంపాదకులు గానీ, ప్రత్యేక వ్యాసకర్తలు గానీ రాస్తూ ఉంటారు. తక్కువ మాటల్లో పాఠకులను ఆకట్టుకునేటట్లు, ఆలోచించేటట్లు చేయగలగడం మంచి సంపాదకీయ లక్షణం. ఇవి తత్కాలానికి సంబంధించినవే అయినా ఒక్కొక్క సందర్భంలో విభిన్న కాలాలకూ వర్తిస్తుంటాయి.

ఇవి చేయండి

I. వినడం – మాట్లాడడం.

1. మీరు గమనించిన దురాచారాలు, మూఢనమ్మకాలపై మీ అభిప్రాయాలు చెప్పండి.
2. ప్రస్తుతం సమాజంలో ఉన్న సాంఘిక దురాచారాలు ఏవి? వాటి నిర్మూలనకు మీవంతు కృషిగా ఏమి చేయాలనుకుంటున్నారు?
3. "వరకట్న నిర్మూలన" కు రావలసిన మార్పులను "వరుని వైపు – వధువు వైపు" జట్లుగా విడిపోయి చర్చించండి.

II. చదవడం, అవగాహన చేసుకోవడం

1. కింది పదాలు ఏ పేరాలోనివో గుర్తించి. ఆ పదాన్ని దేనికి సంబంధంగా వాడారో రాయండి

పదం	పేరా సంఖ్య	ఎందుకోసం వాడారు
పెనుభూతం		
జటిల సమస్య		
రూపుమాపడం		
పరిపాటి		

www.apteachers.in

2 కింది పేరాను చదవండి. ఎక్కడ?, ఏమిటి?, ఎందుకు?, ఎవరు?, ఎలా? అనే పదాలతో ప్రశ్నలు రాయండి.

వేమన జన్మించింది, తిరిగింది రాయలసీమే ఐనా ఆయన పద్యాలు, ఆయన సందేశం, ప్రభావం ఆంధ్రదేశమంతా ఉంది. వీరి పద్యాలు వివిధ భాషల్లోకి అనువాదమయ్యాయి. వేమన సందేశానికి దేశవ్యాప్తంగానే కాక ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. సమాజంలోని ఎక్కువ తక్కువలు, వివక్షలు, అంటరానితనం, అంధవిశ్వాసాలు, మూఢాచారాలు, జీవహింస, అవినీతి, అధర్మం మొదలైన విషయాలపై తన సరళమైన పద్యాల ద్వారా ప్రజల మనస్సులో హత్తుకు పోయేటట్లు విమర్శనాత్మక రచనలు చేశాడు. కులవ్యవస్థపై దాడి చేశాడు. స్వానుభవమైన, ఆచరణయోగ్యమైన తత్త్వాన్ని సరళ భాషలో ప్రజలకు చెప్పి ప్రజాకవిగా తెలుగువారి మదిలో శాశ్వతస్థానం పొందారు.

3 కింది పట్టికను చూడండి. సదాచారం ఏదో దురాచారం ఏదో గుర్తించండి. కారణం రాయండి.

అంశం	సదాచారం / దురాచారం
బాల్య వివాహాలు చేయడం	
పెద్దలను గౌరవించడం	
వరకట్నం తీసుకోడం / ఇవ్వడం	
తల్లిదండ్రులకు సేవచేయడం	
వృద్ధులను వృద్ధాశ్రమాల్లో చేర్చడం	
స్త్రీవిద్యను ప్రోత్సహించడం	
బడి ఈడు పిల్లలను పనుల్లో పెట్టడం	
ఆడపిల్లలకు తొందరగా పెళ్ళిళ్ళు చేయడం.	
చిన్నపిల్లలను వసతి గృహాల్లో ఉంచి చదివించడం	
తోటివారిని ఎవరినైనా సమానంగా చూడడం.	

4 పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి

(అ) శాసనాలు అమలు కావాలంటే ఏమి చేయాలని నండూరివారు అన్నారు?

(ఆ) బాల్య వివాహాలు తగ్గుముఖం పట్టడానికి ఏమేమి తోడ్పడతాయి?

(ఇ) వరకట్న దురాచారం గురించి రచయిత అభిప్రాయం ఏమిటి?

III. స్వీయరచన

1 కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో సమాధానాలు రాయండి.

(అ) నేడు పెళ్ళిళ్ళ సందర్భంగా ఎన్ని రకాలుగా ధనం వృథా అవుతూందో మీరు గమనించిన విషయాలు రాయండి.

(ఆ) నేటికీ సమాజంలో ఏయే దురాచారాలు కనపడుతున్నాయి? దానికి కారణాలేమిటి?

(ఇ) దేశంలో వందశాతం అక్షరాస్యత ఇంకా సాధించలేక పోవడానికి కారణాలు ఏమిటి?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచేత ఉచిత పంపిణీ

www.apteachers.in

2 కింది ప్రశ్నలకు పదేసి వాక్యాలలో జవాబులు రాయండి.

(అ) **ఆడంబరంగా పెళ్ళిళ్ళు చేయడం కోసం అధికంగా ఖర్చు చేయడం –** దీన్ని వ్యతిరేకిస్తూ సరైన కారణాలు రాయండి.

(ఆ) 'స్త్రీలందరూ విద్యావంతులైతే, వరకట్న నిర్మూలన జరుగుతుంది' – దీనిపై మీ అభిప్రాయాలను తెలుపుతూ వ్యాసం రాయండి.

IV. పదజాలం

1 కింది పదాలకు సమానార్థాన్నిచ్చే పదాల సమూహంలో సమానార్థాన్ని ఇవ్వని పదం ఉంది. దాన్ని గుర్తించండి.

ఉదా : ఇనుడు – సూర్యుడు, రవి, ఇంద్రుడు, భానుడు

(అ) పరిణయం– పెళ్లి, పరిమళం, మనువు, వివాహం

(ఆ) శాసనం – ఆజ్ఞ, చట్టం, ఉత్తరం, ఉత్తరువు

(ఇ) స్త్రీ – కొమ్మ, ఐంతి, పడతి, ఉవిద

(ఈ) ధనం – విత్తం, దండనం, ద్రవ్యం, పైకం

(ఉ) అభ్యున్నతి – తిరోగతి, ప్రగతి, పురోగతి, అభివృద్ధి

2 కింది ప్రకృతి, వికృతి పదాల ఆధారంతో వాక్యాలు రాయండి.

(విద్య–విద్దె, స్త్రీ – ఇంతి, నిజం – నిక్కం, యత్నం – జతనం)

ఉదా॥ (అ) విద్య రహస్యంగా దాచిన ధనం వంటిది.

జ. విద్దె లేనివాడు వింత పశువు.

(ఆ) నేడు స్త్రీలు అన్నిరంగాలలో అభివృద్ధి చెందుతున్నారు.

జ. ______________________

(ఇ) నిజం నిర్భయంగా చెప్పాలి.

జ. ______________________

(ఈ) నిరంతర యత్నం వల్ల పనులు సాధించవచ్చు.

జ. ______________________

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

3 కిందివాటిని సొంతవాక్యాలలో రాయండి

(అ) పెనుభూతం (ఆ) తరతరాలు (ఇ) నిరాడంబరం (ఈ) అప్పో సప్పో

(ఉ) దిగజారి పోవు (ఊ) దురాచారాలు (ఋ) శాసనాలు (ౠ) హెచ్చుతగ్గులు

V. సృజనాత్మకత

వరకట్నానికి రోజూ ఎంతోమంది బలైపోతున్నారు. వీటినిగురించి పత్రికల్లో, టి.వి.ల్లో రోజూ చూస్తూనే ఉన్నాం. వరకట్నం లాంటి భయంకరమైన దురాచారాన్ని నిర్మూలించాలనే భావం ప్రజల్లో కలిగేటట్లు "పోస్టర్" తయారు చేయండి.

(లేదా)

ఈ మధ్యకాలంలో పెండ్లిళ్ళు, ఇతర కార్యక్రమాల్లో సుమారు 20% ఆహార పదార్థాలు వృథా అవుతున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయి. దీన్ని అరికట్టడానికి నియమావళి రూపొందించి పోస్టర్ రూపొందించండి.

VI. ప్రశంస

రంగాపురం గ్రామంలో 'రాధ' 10వ తరగతి చదువుతున్నది. ఆమెకు వివాహం నిశ్చయమైంది. ఆ గ్రామంలోని "బాలల హక్కుల వేదిక" సభ్యులు వెళ్ళి బాల్య వివాహం జరపడం వల్ల నష్టాలను 'రాధ' తల్లిదండ్రులకు వివరించారు. బాల్య వివాహాన్ని ఆపారు. రాధ తన చదువును తిరిగి కొనసాగించింది. రాధ వివాహం ఆపిన "బాలల హక్కుల వేదిక"ను అభినందిస్తూ ఒక లేఖ రాయండి.

SCERT ANDHRA PRADESH

VII. భాషను గురించి తెలుసుకుందాం

H7MRVF

1 కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.

ఉదా॥ చేసినంత – చేసిన +అంత = అత్వసంధి

(అ) ఎక్కడైనా (ఆ) కారణమని (ఇ) బాధిస్తున్న

(ఈ) నిజమే (ఉ) ఏమైన (ఊ) లేరనడం (ఋ) హీనుడైన

2 కింది సమాస పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి.

ఉదా॥ సంఘ సంస్కర్తలు – సంఘాన్ని సంస్కరించేవాళ్ళు. ద్వితీయా తత్పురుష సమాసం.

(అ) వరకట్నం (ఆ) స్త్రీల అభ్యున్నతి (ఇ) విద్యావిహీనత (ఈ) విద్యావ్యాప్తి

(ఉ) ధన వ్యయం (ఊ) శక్తి హీనుడు

www.apteachers.in

3. ముందు పాఠాల్లో క్త్వార్థకం, చేదర్థకం, శత్రర్థకం క్రియలను గురించి తెలుసుకున్నారు కదా!

కింది వాక్యాలలో గీతగీసిన క్రియలు వేటికి సంబంధించినవో గుర్తించండి.

ఉదా : నీటిని వృథా చేస్తే భవిష్యత్తులో ప్రజలు నీటికోసం ఇబ్బందులు పడ్తారు. చేదర్థకం

(అ) టి.వి. ఎక్కువగా చూస్తే విలువయిన సమయం వృథా అవుతుంది. = -------------

(ఆ) అప్పన్న కొట్టుకు వెళ్ళి మంచివి ఏరి తీసుకురా! -------------

(ఇ) దీప దిక్కులు చూస్తూ నడుస్తోంది. -------------

(ఈ) అఖిల పాటలు వింటూ ముగ్గులు వేస్తున్నది. -------------

(ఉ) మేధావంతుల వలస తగ్గితే మన దేశాభివృద్ధి వేగం పుంజుకుంటుంది. -------------

(ఊ) మీ అక్క భోజనం చేసి లేవలేకపోతోందేమో? -------------

(ఋ) మహేశ్ తేనీరు తాగుతూ పత్రిక చదువుతున్నాడు. -------------

4. తత్పురుష సమాసాలు

విభక్తులు ఆధారంగా ఏర్పడే తత్పురుష సమాసాల గురించి తెలుసుకున్నారు కదా! కింది వాటిని కూడా పరిశీలించండి.

1 పూర్వ కాయము – కాయము యొక్క పూర్వము

పైదానిలో 'పూర్వ' అనే పదానికి 'ము' అనే ప్రథమా విభక్తి ప్రత్యయం చేరడం వల్ల 'పూర్వము'గా మారింది. ఇలా మొదటి పదానికి ప్రథమా విభక్తి ప్రత్యయం రావడాన్ని 'ప్రథమా తత్పురుష సమాసం' అంటాం.

* సమాసంలో పూర్వపదానికి ప్రథమా విభక్తి ప్రత్యయం చేరడమే ప్రథమా తత్పురుష. అంటే విగ్రహవాక్యంలో విభక్తి ప్రత్యయాలు (డు, ము, వు, లు) చేరతాయి.

దీన్నే ఏకదేశి సమాసం అనికూడా అంటారు. సాధారణంగా తత్పురుష సమాసాలలో ఉత్తరపదార్థానికి ప్రాధాన్యం ఉంటుంది. కాని ఏకదేశి సమాసం అంటే పూర్వపదార్థ ప్రధానంగల తత్పురుష సమాసం.

SCERT ANDHRA PRADESH

కింది వాటిని పరిశీలించండి.

నఞ్ + సత్యం = అసత్యం = సత్యం కానిది

నఞ్ + న్యాయం = అన్యాయం = న్యాయం కానిది

నఞ్ + ఉచితం = అనుచితం = ఉచితం కానిది

సంస్కృతంలో 'నఞ్' అనేది వ్యతిరేకార్థ బోధకం. దీనికి బదులు తెలుగులో అ, అన్ అనే ప్రత్యయాలు వాడతారు.

పై ఉదాహరణల్లో వాడిన 'నఞ్' అనే అవ్యయాన్ని అనుసరించి దీన్ని 'నఞ్ తత్పురుష సమాసం' అంటారు.

www.apteachers.in

4. కింది పదాలకు విగ్రహవాక్యాలు, సమాసపదాలు రాసి, సమాసం పేరు రాయండి.

సమాస పదం	విగ్రహ వాక్యం	సమాసం పేరు
(అ) అర్ధరాత్రి		
(ఆ) అనూహ్యము		
(ఇ)	క్రమం కానిది	

5. తత్పురుష సమాసానికి చెందిన పదాలను ఇంతకుముందు పాఠాల్లో వెదకండి. పట్టికలో రాయండి.

సమాసం పేరు	విగ్రహ వాక్యం	సమాస పదం
ప్రథమా తత్పురుషసమాసం		
ద్వితీయా తత్పురుషసమాసం		
తృతీయా తత్పురుషసమాసం		
చతుర్థీ తత్పురుషసమాసం		
పంచమీ తత్పురుషసమాసం		
షష్ఠీ తత్పురుషసమాసం		
సప్తమీ తత్పురుషసమాసం		
నఞ్ తత్పురుషసమాసం		

ప్రాజెక్టు పని

సంఘంలో దురాచారాలను రూపుమాపటంకోసం కృషి చేసిన సంఘసంస్కర్తల చిత్రపటాలు, వారి సేవల వివరాలు పాఠశాల గ్రంథాలయం నుండి / పత్రికలనుండి సేకరించి ప్రదర్శించండి.

పునరభ్యసనం (వెనుకబడిన విద్యార్థుల కొరకు)

1. పాఠ్యాంశాలలోని పదాల జాబితాను ఉపాధ్యాయుడు తయారుచేసి చదివించాలి.
2. విద్యార్థులచే ఉక్తలేఖనం రాయించాలి. దోషాలు సవరించాలి.
3. పాఠ్యాంశ సారాంశాన్ని 4 లేదా 5 వాక్యాలలో నల్లబల్లపై రాసి విద్యార్థులచే చదివించాలి, రాయించాలి, దోషాలు సవరించాలి.

H7REJC

నేనివి చేయగలనా ?

1. సమాజంలోని దురాచారాలు, సదాచారాల గురించిన చర్చల్లో పాల్గొనగలను. ఔను / కాదు
2. పాఠం చదివి, కీలక పదాలను గుర్తించి వివరించగలను. ఔను / కాదు
3. సమర్థిస్తూ, వ్యతిరేకిస్తూ, నా అభిప్రాయాలను సొంతమాటల్లో రాయగలను. ఔను / కాదు
4. సాంఘిక దురాచారాలను ఖండిస్తూ ప్రజలను ఆలోచింపజేసే "పోస్టర్" తయారుచేయగలను. ఔను / కాదు

www.apteachers.in

15. జీవ గడియారాలు

(ఉపవాచకం) - వింజనంపాటి రాఘవరావు

"నా కోడీ, కుంపటీ లేకపోతే తెల్లారదు" అందిట వెనకటికో ముసలమ్మ. కథ సంగతి పక్కకు పెడితే, అలారం గడియారం రాకముందు మనిషికి సమయాన్ని తెలియజేసిన, ఇప్పటికీ తెలియజేస్తున్న జీవగడియారం కోడిపుంజు.

కోడిపుంజు సమయాన్ని ఎలా లెక్క కడుతుందో మనకు తెలీదు. కాని ప్రతి రోజూ దాదాపు ఒకే సమయానికి కూస్తుందన్న సంగతి మాత్రం మనకు తెలుసు. జీవప్రపంచంలో సమయాన్ని లెక్క కట్టకగలిగేది ఒక్క కోడి మాత్రమేనా? ఇంకేవైనా జంతువులు లేదా వృక్షాలు ఉన్నాయా? ఉంటే అవి కాలాన్ని ఎలా లెక్కిస్తాయి? మనందరకూ వచ్చే అనుమానాలు ఇవి. వీటికి సమాధానంకోసం ప్రయత్నిద్దాం.

మళ్ళీ కోడిపుంజు దగ్గరకు వద్దాం. 'ఇంటి నిండా కోళ్లు ఉన్నవి కాని, కూసేందుకు కోడిలేదు' అని సామెత. కోడిపుంజు మాత్రమే కూస్తుందని మనకు తెలుసు. కోడిపుంజు వేకువ ఝామునే కాక పగలు కూడా చాలా సార్లు నియమిత సమయాల్లో కూస్తుంది. కాని మనం దాన్ని పట్టించుకోం. ఎందుకంటే మనకు దాని అవసరం లేదు కాబట్టి. కాని కోడిపుంజు కూయడానికి కారణం దాని శరీరంలో ఉన్న, ఎవరికీ కనిపించని గడియారం. దాని ప్రభావం వల్ల అది అప్రయత్నంగానే కూస్తుంది. మనం ఏ ప్రయత్నం చేసినా కూయకుండా ఆపలేం.

SCERT ANDHRA PRADESH

మనుషులకు సంబంధించిన ఓ చిన్న ఉదాహరణ తీసుకుందాం. మనం రాత్రి ఏ వేళప్పుడు పడుకున్నా, రోజూ మనం నిద్రలేచే వేళకే మెలకువ వస్తుంది. మంచం దిగాలా వద్దా అన్నది మన నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఒక్క కోమాలోకి వెళ్లిన వాళ్లు తప్ప మిగిలిన వారెవరైనా నిర్విరామంగా నిద్రపోలేరు. మనకు రోజూ అన్నం తినే వేళకు ఆకలివేస్తుంది. మరి మనకు మెలకువ కలిగించేది, రాత్రి కాగానే నిద్రపోవాలని సూచించేది, ఆకలిద్వారా భోజనసమయం అయిందని గుర్తుచేసేందుకు మన శరీరంలో ఎక్కడో ఏదో ఒక అలారం గడియారం ఉండి ఉండాలి. ఈ గడియారాలు మనకు కనిపించకపోయినా వాటి ప్రభావం మనకు తెలుస్తూనే ఉంటుంది. మనకు అనుభవంలోకి వచ్చే, మనకు కనిపించకుండా మన శరీరంలోనే ఉన్న ఈ జీవగడియారాల ప్రపంచంలోకి తొంగిచూద్దాం రండి.

భూమ్మీద నివసించే జీవులన్నింటిలో జరిగే దైనందిన కార్యకలాపాలు, 24 నుండి 28 గంటల ఆవృత్తి (Cycle) లో జరుగుతూంటాయన్నమాట. ఈ 24 గంటల కాలంలో, ఒక జీవి ప్రదర్శించే దైనందిన కార్యకలాపాలను దైనందిన లయలు లేదా సర్కేడియన్ రిథమ్స్ అంటారు.

మానవులలో ఎన్ని గంటలకు నిద్రపోవాలి, ఎన్ని గంటలకు నిద్రలేవాలి, ఆహారం ఎప్పుడు తీసుకోవాలి అనే విషయాలు మనం ఆరేడు నెలల వయసులో ఉన్నపుడే స్థిరపడతాయి.

www.apteachers.in

చురుకుగా ఉండే సమయాన్ని ఆధారం చేసుకొని జంతు ప్రపంచంలోని జంతువులను రెండు వర్గాలుగా విభజించారు. దివాచరాలు-పగలు చురుగ్గా ఉండేవి. నిశాచరాలు - రాత్రివేళ చురుగ్గా ఉండేవి.

మన ఇంట్లో ఉండే ఎలుకలు, బొద్దింకలు, దోమలు ఇత్యాదులు రాత్రివేళ మాత్రమే బయటకు వస్తాయి. పగలు విశ్రాంతి తీసుకుంటాయి. పిచ్చుకలు, కాకులు, ఆవులు, ఇతర జంతువులు పగలు చురుగ్గా ఉంటాయి. మానవునితో సహవాసం చేస్తున్నందుకుగాను కుక్క, పిల్లి వంటి జంతువులు పగటివేళ మేలుకుని ఉన్నా, రాత్రిళ్లు మాత్రం చురుగ్గా ఉంటాయి. కారణం సహజసిద్ధంగా అవి రాత్రిళ్లు ఆహారం కోసం వేటాడతాయి. ఈ జీవులను శాస్త్రవేత్తలు రకరకాల పరీక్షలకు గురిచేశారు. ఉదాహరణకు రాత్రిపూట సంచరించే గబ్బిలాన్ని పగటి సమయంలో చీకటి గదిలో ఉంచడం, పగటిపూట సంచరించే ఉడతను రాత్రిపూట పగటిలా వెలుగులో వుంచడం వంటివి. అన్ని పరీక్షలలోనూ, జీవులన్నీ, ఈ దైనందిన లయలను నిర్దిష్ట క్రమంలోనే ప్రదర్శిస్తాయి అని రుజువైంది.

ఈ దైనందిన లయలు జంతువులకు మాత్రమే పరిమితం అనుకుంటే పొరపాటే. మొక్కలలో కూడా ఇవి ఉంటాయి. కొన్ని చెట్ల ఆకులు మన మాదిరిగా రాత్రికాగానే నిద్రపోయి తెల్లవారగానే మేలుకుంటాయి. చిక్కుడు జాతికి చెందిన కొన్ని మొక్కలలో ఆకులు ఉదయం నిక్కబొడుచుకొని ఉండి, సాయంత్రానికి వాలిపోతాయి. అలాగే పూలు వికసించడం కూడా. ఈ మొక్కలను పూర్తిగా చీకటిలో ఉంచినా, లేదా 24 గంటలూ వెలుగులో ఉంచినా వాటి పనిలో మార్పురాదు. ఒక మల్లెపూవును పగటివేళ కటిక చీకటిగదిలో ఉంచినా కూడా వికసింపచేయడం సాధ్యం కాదు. ఈవిధంగా సూర్యుని వెలుతురు ఆధారం చేసుకొని జీవులు చూపే, ఈ మార్పులను పగటిలయలు - 'డయర్నల్ రిథమ్స్' అంటారు.

SCERT ANDHRA PRADESH

H7V289

ఇంతకుముందు ఉదహరించిన లయలన్నీ శరీరం లోపలినుండి జరిగేవే కాని, వాటిపై బయటి పరిస్థితుల ప్రభావం చాలా పరిమితంగా ఉంటుంది. అందుచేత వీటిని అంతర్గత లయలు అంటారు. ఈ లయలు గడియారంలోని 24 గంటలను పోలి ఉంటాయి. కాబట్టి వీనిని జీవగడియారం లేదా శరీరధర్మ గడియారం అనవచ్చు.

ఇంతకూ ఈ గడియారాలవల్ల ఉపయోగాలేమిటి? వీటి అధ్యయనంవల్ల మనకు ప్రయోజనం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు ముందు ముందు చూద్దాం.

మనం చేతిగడియారం చూసుకుని ఏ పని ఎప్పుడు చేయాలో నిర్ణయించుకున్నట్లే, జీవుల శరీరంలోని గడియారం ఏ సమయంలో జీవి ఒక పని సమర్థంగా చేయగలదో నిర్ణయిస్తుంది. మొక్కలు సూర్యుడు ఉండే పగటివేళ ఆహారాన్ని తయారుచేయగలుగుతాయి. అంటే రాత్రివేళ ఆకులు విస్తరించి ఉండడం వల్ల ఉపయోగం లేదన్నమాట.

సీతాకోకచిలుకలు పుట్టిన వెంటనే సూర్యతాపానికి గురికాకుండా ఉండడానికి తెల్లవారుఝామునే ప్యూపా నుండి బయటకు వస్తాయి. కీటకాలు మకరందం లభించే సమయాల్లో చురుగ్గా ఉంటాయి. మొక్కలు కూడా కీటకాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచేత ఉచిత పంపిణీ

www.apteachers.in

చురుగ్గా ఉండే సమయాల్లోనే పుష్పాలను వికసింపజేస్తాయి. ఇది పరస్పర సంబంధాలపై ఆధారపడి ఉంటుంది.

ఒక జీవి పుట్టిననాటినుంచి ఏర్పడిన ఈ లయలు, ఆ జీవి బాహ్యపరిస్థితులు మారినా లయలు మాత్రం మారవు. అందుకే కాబోలు పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకలతో కానిపోవు అంటారు మనవాళ్ళు.

సముద్రపు ఒడ్డున నివసించే 'ఫిడ్లర్ క్రాబ్' అనే వాయులీన పీత, ఉదయం ముదురురంగులో ఉండి, రాత్రిళ్ళు లేతరంగులకు మారిపోతుంది. బహుశః శత్రువులనుండి రక్షించుకోవడానికి కాబోలు ఈ రంగులు మార్చడం. దాన్ని ఎప్పుడూ వెలుతురు ఉండే ఎ.సి.గదిలోకి మార్చినా, రంగుల మార్పిడిలో మాత్రం తేడా రాలేదు. అంటే సూర్యునితో సంబంధం లేకుండానే ఈ లయ కొనసాగుతుందన్నమాట. "పీత కష్టాలు పీతవి". అలాగే నిద్రగన్నేరు మొక్కలో ఆకుల కదలిక ఈ కోవకు చెందినదే.

మానవులలో ఆహారం తీసుకోడం ఒక అలవాటుగా మారడం వల్ల ఈ లయలో కొంత మార్పు ఉండవచ్చు. ప్రతిరోజూ నియమబద్ధంగా ఆహారం తీసుకొనేవారికి, నిర్ణీత సమయానికే ఆకలి వేస్తుంది. రోజుకు ఒకసారి మాత్రమే భోజనం చేసేవారికి రోజులో ఒకసారి మాత్రమే ఆకలి వేస్తుంది. అలాగే నిద్ర, మెలకువ కూడా.

సంవత్సరం పొడుగునా పగలు, రాత్రి సమానంగా ఉండవు. మరి పగలు, రాత్రి సమానంగా లేనపుడు, పగటి లయలు ప్రదర్శించే జీవులు ఏం చేస్తాయి?

వేగంగా నడిచే గడియారాన్ని మనం రోజూ నిద్రలేవగానే సరిచేసుకున్నట్లుగా, ప్రతిరోజూ జీవుల శరీరంలోని ఈ కనిపించని గడియారం తన్ను తాను సరిచేసుకుంటుంది. ఈ గడియారాన్ని మనం కృత్రిమంగా కూడా సరిచేయవచ్చు. ఉదాహరణకు ఒక బొద్దింకను కొన్ని రోజులపాటు కృత్రిమ పగలు, రాత్రి వాతావరణంలో ఉంచితే దాని శరీరంలోని గడియారం ఈ కృత్రిమ లయకు అలవాటై పోతుంది. అలాగే మనం విమానంలో ఖండాంతర ప్రయాణం చేసినప్పుడు అక్కడి రాత్రి, పగలు భేదాలకు అలవాటుపడటానికి వారంరోజులవరకూ సమయం పడుతుంది. దీన్ని 'జెట్‌లాగ్' అంటారు. అలాగే రాత్రి, పగలు షిఫ్టుల్లో పనిచేసేవారికి, ఈ తేడాకు అలవాటుపడటానికి కొంత సమయం పడుతుంది. ఎంత ప్రయత్నం చేసినా నిర్ణీత సమయాన్ని మించి మేల్కొని ఉండటం ఎవరికీ సాధ్యం కాదు.

24 గంటల సమయంలో జరిగే దైనందిన లయలే కాక ఇతర రకాల లయలు కూడా జీవులు ప్రదర్శిస్తాయి. చంద్రకళలకు అనుగుణంగా ఉండే ఈ లయలను చంద్రలయలు అంటారు. సముద్రపు ఒడ్డున నివసించే జీవులు సముద్రపు ఆటుపోట్లు కనుగుణంగా ప్రవర్తిస్తాయి.

ఆసక్తి కలిగించే మరొక విచిత్రమైన ఉదాహరణ ఏమిటంటే, సాధారణంగా చేపలు నీళ్ళలోనే గ్రుడ్లు పెడతాయని మనందరకు తెలుసు. కాని కాలిఫోర్నియా తీరంలో ఉండే 'గ్రునియన్' అనే జాతి చేపలు సముద్రం పోటులో ఉండే సమయంలో తీరానికి వస్తాయి. ఆడచేపలు ఇసుకలో బొర్రెలు చేసి గుడ్లు పెడతాయి. అలలు తగ్గే సమయానికి చేపలు సముద్రంలోకి వెళ్లిపోతాయి. గుడ్లు నీటిమట్టానికి ఎగువగా ఉండి, వేడికి పొదగబడి పిల్లలౌతాయి. పెద్ద అలలు వచ్చే సమయంలో మాత్రమే గుడ్డు నుంచి పిల్లలు వెలువడి సముద్రంలోకి వెళ్లిపోతాయి.

మనందరకూ తెలిసిన మరో ఉదాహరణ. పెసలు, శనగలు వంటి పప్పు గింజలు నానబెట్టినప్పుడు వాటిలో కొన్ని నానకుండా గట్టిగా ఉంటాయి. వాటిని ఎన్ని గంటలు నానబెట్టినా నానవు. వీటిని నిద్రావస్థలోనున్న గింజలంటారు. తర్వాతి సీజన్‌లో మాత్రమే ఇవి మొలకెత్తుతాయి. అకాలవర్షాలు మొక్కలజాతి మొత్తాన్ని ధ్వంసం చేయకుండా ప్రకృతి

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

చేసిన ఏర్పాటు ఇది. అలాగే మార్చి, ఏప్రిల్ నెలల్లో కోశాన్ని నిర్మించుకున్న సీతాకోకచిలుక లార్వాలు, వర్షాకాలం వచ్చిన తర్వాతే కోశం నుండి బయటకు వస్తాయి. ఎండాకాలంలో వాటికి ఆహారం లభ్యం కాదు, వాటిని నియంత్రించే కారకాలను గూర్చి పరిశోధన జరగాల్సి ఉంది. ఈ లయలు, గడియారాలు ఎలా పని చేస్తాయని అన్నది ఇంకా స్పష్టం కాకపోయినా కణాలలో ఉండే కేంద్రకం ప్రధాన పాత్ర వహిస్తుంది అన్నది నిర్వివాదాంశం. ఇక నాడీ వ్యవస్థ, హార్మోన్లు సంయుక్తంగా ఈ లయలను నిర్వహిస్తాయి.

ఈ లయలను మన కనుగుణంగా మార్చుకోడంలో శాస్త్రవేత్తలు విజయం సాధించారు. ప్రధానంగా వ్యవసాయ రంగంలో వెలుతురు, చీకట్లను మార్చడం ద్వారా ఫలసాయాన్ని పెంచవచ్చని గుర్తించారు. కాబట్టే నేడు మనం రుతువులతో సంబంధం లేకుండా కాయలు, పండ్లు పొందుతున్నాం.

మొక్కలు చైతన్యవంతంగా ఉన్నప్పుడే పోషకాలు అందించడం ద్వారా వృథావ్యయాన్ని తగ్గించి, అధిక దిగుబడి సాధించవచ్చు. చేపలు, రొయ్యలు ఎప్పుడు ఆహారాన్ని ఎక్కువ తీసుకుంటాయో, తెలియడం వలన చేపల చెరువు శుభ్రంగా ఉండటమే కాక వృథా వ్యయం తగ్గుతుంది. కోళ్ల ఫారంలో ఎక్కువ సమయం వెలుగు ఉంచడం వల్ల గుడ్ల ఉత్పత్తి పెరగడం రైతులందరికీ తెలిసిందే. పగలు తక్కువ ఉన్న కాలంలో గొర్రెలలో ఉన్ని ఎక్కువవుతుంది. కాబట్టి ఎండాకాలం చీకటిలో ఉంచడం వలన ఉన్ని ఉత్పత్తి ఎక్కువ చేయవచ్చు. ఇక మన సంగతి, రక్తంలో కొలెస్ట్రాల్, గ్లూకోజ్‌ల శాతం లయబద్ధంగా మారుతుంటుంది. కాబట్టి ఏ సమయంలో మనం మందులు వాడితే పూర్తి స్థాయిలో ఫలితం ఉంటుందో డాక్టర్లు నిర్ణయిస్తారు. ఉదాహరణకు ఆస్థమా రోగులలో రాత్రిళ్లు శ్వాస సమస్యలు అధికమౌతాయి. అంచేత ఎడ్రినలిన్ అనే ఇంజక్షన్ రాత్రిళ్ళు ఇస్తారు. అలాగే ఇన్సులిన్ ఇంజక్షన్ రక్తంలో గ్లూకోజ్ శాతం పెరిగినపుడే ఇవ్వాలి.

తెలతెలవారుతుండగానే సందడిచేసే కాకులు, చీకట్లు ముసురుతుండగానే ముడుచుకుపోయే ఆకులు, ఇరవైఒక్క రోజులు కాగానే గుడ్డులోంచి బయటకొచ్చే కోడిపిల్ల ఇలా ఎన్నెన్నో మనకు ప్రకృతి నియమాలను తెలియజేస్తుంటాయి. ఇంత లయబద్ధంగా కదులుతున్న ప్రకృతిని చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది కదా! అందుకే ప్రకృతి తనను గురించి తెలుసుకోమంటూ నిరంతరం సవాళ్ళు విసురుతూనే ఉంటుంది.

SCERT ANDHRA PRADESH

క్రింది ప్రశ్నలకు జవాబులను రాయండి.

1. డయర్నల్ రిథమ్స్ అంటే ఏమిటి? వివరించండి.
2. జెట్‌లాగ్ అంటే ఏమిటి? వివరించండి.
3. జీవగడియారాలు పాఠంనుండి మీరు ఏమి గ్రహించారో సంక్షిప్తంగా గ్రహించండి.

www.apteachers.in

16. భూదానం

హిందీ మూలం : వినోబా భావే

అనువాదం : వేమూరి రాధాకృష్ణమూర్తి

చదవండి - ఆలోచించండి - చెప్పండి

SCERT A

ప్రశ్నలు

1. చిత్రంలో ఎవరెవరున్నారు? ఏం చేస్తున్నారు?
2. వీళ్ళు ఎందుకు పాదయాత్ర చేస్తున్నారు?
3. ఇలా పాదయాత్రలు చేసినవారు మీకు తెలుసా? చెప్పండి?

నేపథ్యం

భూమి ప్రకృతిలో భాగం. అది అందరిదీ అని గుర్తించి భూమిని అందరికీ సమానంగా పంచడానికి 'భూదాన ఉద్యమం' చేపట్టారు వినోబా భావే. ఆ ఉద్యమంలో ఆయన పొందిన అనుభవాలను ఆయన మాటల్లోనే తెలుసుకొందాం.

విద్యార్థులకు సూచనలు

1. పాఠం చిత్రం ఆధారంగా పద్యాల భావాలను ఊహించండి. చెప్పండి.
2. పాఠం చదవండి. పదపట్టిక చూసి పదాలకు అర్థాలు తెలుసుకోండి.
3. సందర్భానికి తగిన అర్థాన్ని గ్రహించి చిత్రాలు ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
4. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

వినోబాభావే

హైదరాబాదుకు సమీపంలో గల శివరాంపల్లిలో సర్వోదయ సమ్మేళనం జరుగబోతున్నది. రైల్లో వెళ్తే వార్ధానుంచి హైదరాబాదుకు ఒక రాత్రి ప్రయాణం. కాని నేను పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నాను. ఇది మార్చి 1951 నాటి మాట. రైల్లోగాని, విమానంలోగాని వెళ్ళగూడదా? అని జనం అడిగారు. విమానాలవంటి యాత్రాసాధనాలను మనం ఎంత ఇష్టపడినా మన కాళ్లకు గల ప్రత్యేకత మన కాళ్లదే గదా! పాదయాత్ర సాగిస్తున్నప్పుడు ప్రకృతిని, ప్రజలను బహు దగ్గరగా చూడవచ్చు. అలాంటి అవకాశం మరే యాత్రాసాధనంవల్లా లభించదు. అలాంటి అనుభవం పొందాలనే లక్ష్యంతో పాదయాత్రకు పూనుకొన్నాను. మన దేశాన్ని ఈ విధంగా దర్శించడం ఊహాతీతమైన విషయం కాకపోయినా నిజానికి ఒక గొప్ప విశేషం. కాలినడకన యాత్ర సాగించి ఉండకపోతే ఇలాంటి అవకాశం నాకు లభించి ఉండేది కాదు.

పల్లెప్రజల్లో ఉత్సాహం ఉంది. పట్టణాల ప్రజలలోకూడా ఉత్సాహం ఎక్కువగానే ఉంది. వీళ్ళను కలియడం ఎంత అవసరమో ఇప్పుడు బోధపడింది. చిన్న చిన్న గ్రామాలలో మకాంచేయాలని అనుకొన్నా. సాధ్యమైనచోట్ల గ్రామాలలో కొందరి ఇళ్ళకు కూడా వెళ్ళి వచ్చా. నాకు తెలుగు వచ్చు. కానీ తెలుగులో మాట్లాడలేను. అయినా నాకు వచ్చిన తెలుగు భాషవల్ల ఎంతో ప్రయోజనం కలిగింది. ప్రార్థన సభల్లో స్థితప్రజ్ఞుని లక్షణాలను గురించి తెలుగులో చెప్పేవాణ్ణి. నా తెలుగు మాటలు ప్రజల హృదయాలకు హత్తుకోవడం నేను గమనించాను. మనవాడే, మన సోదరుడే మాట్లాడుతున్నాడనివాళ్ళు భావించేవారు. ఎంతో ప్రేమతో ప్రజలు మాకు స్వాగతం పలికారు. శివరాంపల్లి వెళ్ళవలసిన అవసరం లేకపోతే తోవలో కొద్ది రోజులపాటు ఉండవలసిన గ్రామాలు అనేకం తగిలాయి. ఒక ఊరు వెళ్ళడం, అక్కడి పరిస్థితి చూడడం, అక్కడి లోటుపాట్లు తెలుసుకోడం, అక్కడి సమస్యల్ని పరిష్కరించగలగడం అనే పనులు చేసినా ఆ చోటు వదిలి ముందుకు సాగిపోవడం నాకు నచ్చలేదు. కాని అలా చేయక తప్పలేదు. ఇక ఆయా చోట్ల ఆ పనులు చేసేందుకు అక్కడి స్థానికుల్ని తయారుచేసే ప్రయత్నం కూడా చేశా. ఒక్క విషయం స్పష్టంగా బోధ పడింది. ప్రతి గ్రామంలోనూ మనకు సంబంధించిన వ్యక్తి ఒకరు ఉండాలి. వారితో మనకు సంబంధం ఏర్పడి ఉండాలి. అప్పుడు ఎన్నో ఘనకార్యాలను మనం సాధించవచ్చుననే నిర్ణయానికి వచ్చాను.

భూదానోద్యమంలో వినోబాభావే పాదయాత్ర

శంకరాచార్యులు, మహావీరుడు, బుద్ధుడు, కబీర్, చైతన్యుడు, నామదేవ్ వంటివాళ్ళు భారతదేశంలో కాలినడకన తిరిగారు. వారు కావాలనుకొంటే గుర్రాలమీద తిరగగలిగేవారే. కాని వారంతా వేగంగా నడిచే వాహనాన్ని అభిలషించలేదు. ప్రజల ఆలోచనాప్రక్రియలో మార్పు తేవాలని వారు కోరుకోవడమే అందుకు కారణం. పాదయాత్రే తగిన యాత్రా సాధనమని వారు విశ్వసించారు. దేశమంతా కాలినడకన తిరిగారు. అయితే ఈనాటి యుగంలో పాదయాత్రను గురించి యోచించడమే విడ్డూరంగా ఉంటుంది. కాని ప్రశాంతంగా యోచిస్తే అంతకంటే మించిన మంచి సాధనం మరొకటి లేదని చెప్పక తప్పదు. అందువల్ల కాలినడకన తిరగాలనే నిర్ణయానికి వచ్చాను. ఇలా తిరిగేటప్పుడు ప్రతి మాటా నిండు హృదయంతో, ఎంతో విశ్వాసంతో చెప్పేవాణ్ణి. అందుకు అవసరమైన నిబ్బరం, ఆత్మవిశ్వాసం నాకు కలిగాయి.

1951 ఏప్రిల్ 8వతేది. అది మా యాత్రలో మూడోరోజు. పోచంపల్లిలో గ్రామదళితులు మమ్మల్ని కలుసుకోడానికి వచ్చారు. “మాకు కొద్దిగా భూమి దొరికితే కష్టపడి పనిచేసుకుంటాం. కష్టార్జితం తింటాం,” అని వాళ్ళు చెప్పారు. వాళ్ళకు

www.apteachers.in

80 ఎకరాల పొలం అవసరం అని తేలింది. "మీకు పొలం కావాలంటే ఇప్పిస్తా! కాని ఒక్క షరతు. మీరు విడివిడిగా పొలం తీసుకోగూడదు. అంతా కలిసి మొత్తం పొలంలో సమష్టి వ్యవసాయం చేసుకోవాలి," అని చెప్పాను.

మా షరతుకు వాళ్లు అంగీకరించారు. అయితే కాగితంమీద రాసి సంతకాలుచేసి ఇవ్వండి. మీ అర్జీని ప్రభుత్వానికి పంపిస్తాను అని చెప్పాను. కాని అక్కడే అదే సభలో ఒక సోదరుడు (వెదిరె రామచంద్రారెడ్డి) వంద ఎకరాల భూమి దళితులకు ఇవ్వడానికి సంసిద్ధతను వెల్లడించారు. "మీకు వంద ఎకరాల పొలం దానంగా ఇస్తాను." అని నా సమక్షంలో ఆయన దళితులకు వాగ్దానం చేశారు.

వినోబాభావే సమక్షంలో వంద ఎకరాల పొలం దానం ఇస్తానని ప్రకటిస్తున్న వెదిరె రామచంద్రారెడ్డి

ఇది ఒక అసాధారణమైన ఘట్టం. సాధారణంగా రక్తపాతానికి, కోర్టు కచ్చేరీల చుట్టూ తిరగడానికి, కుత్తుకలు నరుక్కోడానికి ఆటపట్టు అవుతుంది పొలం. అటువంటి పొలం, అందులో వంద ఎకరాల భూమి దానంగా లభించడం సామాన్యమైన విషయమా? దీని వెనక ఏదో ఒక కారణం, ఏదో ఒక సంకేతం ఉన్నది అనిఅనిపించింది. ఆ రాత్రంతా యోచిస్తూనే ఉన్నాను. ప్రజలు ప్రేమతో భూమిని ఇవ్వగలరు అనే అనుభూతి నాకు కలిగింది.

పండిత జవాహర్‌లాల్ నెహ్రూ నాకు ఒక జాబు రాశారు. ఆ జాబులో, ఇప్పుడు జరుగుతున్నదానికి తమ సంతోషం వ్యక్తం చేశారు. ఆయనకు సమాధానం రాసి పంపాను. అసలు ఏ సమస్యనైనా అహింసావిధానంలో తప్పక పరిష్కరించవచ్చు. అందుకు హృదయశుద్ధి అవసరం. ఇంతవరకు ఈ విషయం నా ఊహలో మాత్రమే ఉంది. కాని ఇప్పుడు అది ఆచరణలోకి వచ్చిందని తెలుసుకున్నాను.

భూసమస్య చాలా పెద్దది. ఇది అంతర్జాతీయ సమస్య. ఈ సమస్యను మనం శాంతియుతంగా పరిష్కరించగలిగితే స్వరాజ్యం లభించిన తరవాత మనం సాధించిన ఘనకార్యమవుతుంది. ఊహించే శక్తితో మనం యోచించగలిగితే ఈ సమస్యలో ప్రపంచశాంతికి సంబంధించిన బీజాలు నిక్షిప్తమై ఉన్నాయని బోధపడుతుంది. నేనేదో గొప్ప సమస్యను పరిష్కరిస్తున్నాననే భావం నాకు కలగలేదు. ఆ విధంగా భావిస్తే అది అహంకారానికి హేతువవుతుంది. కాని ఒక్క విషయం మాత్రం నేను గ్రహించగలిగాను. భూసమస్య విషయంలో కలిగిన ప్రత్యక్షానుభవాన్ని సరిగా అర్థం చేసుకోగలిగితే భూసమస్యాపరిష్కారానికి మార్గం సుగమమవుతుంది. భూదానంకోసం ప్రజలముందు చేయి చాచాను. నెమ్మది నెమ్మదిగా భావప్రచారం జరిగింది. భగవంతుడు నా మాటలకు శక్తిని ప్రసాదించాడు. ప్రభుత్వ శక్తికి మించిన కార్యం. ఇది జీవిత విలువల్ని మార్చివేసే కార్యక్రమం అని ప్రజలు గ్రహించారు.

ఇది ఒక యజ్ఞం. దీనికి భూదానయజ్ఞం అని పేరు పెట్టాను. ఇది సాధారణమైన యజ్ఞం కాదు. ఈ యుగంలో జరిగిన ఈ ఘట్టం అసాధారణమైనది. అందుకు కారణం ఇది ఒక మహత్తరమైన దానం కావడమే. చిత్తశుద్ధితో ప్రజలు చేసిన మహత్కార్యం, ప్రజల ఔదార్యానికి ఒక తార్కాణం. అందుకు నేనే సాక్షిని.

నేను ప్రతి చోటా స్పష్టంగా చెప్పాను. బీదవాళ్లకు ఏదో ఉపకారం చేశామని దాతలు భావించగూడదు. అది అహంకారం అవుతుంది. దానివల్ల మేము ఆశించిన ఫలితం చేకూరదు. గాలిమీద, నీటిమీద, వెలుగుమీద అందరికీ హక్కు ఉన్నట్లే భూమి మీదకూడా అందరికీ హక్కు ఉన్నది. కొందరి దగ్గర ఒక్క అంగుళమైనా భూమి లేకపోవడం, కొందరి

www.apteachers.in

దగ్గర వందలాది వేలాది ఎకరాలు పడిఉండటం సబబు కాదు. ధర్మం కాదు. ఈ విషయాన్ని సక్రమంగా గ్రహించి భూదానం చేసినప్పుడే నా సంకల్పం నెరవేరుతుంది అని స్పష్టంగా దాతలకు, ప్రజలకు చెప్పాను. చేసిన తప్పును సవరించుకొంటున్నామనే భావంతో ఇలాంటి సత్కార్యానికి పూనుకోమని కూడా చెప్పాను. ఎవరైనా భూదానానికి ముందుకు వచ్చినప్పుడు వారి దానంలో తామస భావంగాని, రాజసభావం గాని ఇమిడి ఉన్నదా అని జాగ్రత్తగా పరిశీలించి చూసేవాణ్ణి. అలాంటి భావం కనబడితే ఆ దానం నేను స్వీకరించలేదు. ఏదో విధంగా భూమిని సమీకరించడం నా లక్ష్యం కాకపోవడమే అందుకు కారణం.

పేదలకు భూమిని ఇప్పించడమే పాదయాత్రలో నా ప్రధాన కార్యక్రమం. తల్లికీ బిడ్డలకూ కలిగిన ఎడబాటును తొలగించి ఇద్దరినీ దగ్గరకు చేర్చడమే నా లక్ష్యం. దేశంలో దానం చేయాలన్న ప్రవృత్తిని మేల్కొలపాలి. ఒక ప్రభంజనాన్ని సృష్టించాలి. ఆ ప్రేరణే నన్ను ముందుకు నడిపిస్తున్నది. భూదాన యజ్ఞానికి మూలం గాంధీజీయే!

పవనార్‌నుంచి ఢిల్లీ వరకు పాదయాత్ర సాగింది. అప్పటికి సుమారు 35 వేల ఎకరాల భూమి దానరూపంలో లభించింది. భారతీయుల సంస్కృతివిశేషాలతో విలసిల్లిన ఈ భూఖండంలో శాంతియుతంగా సాగిన ఈ ఉద్యమానికి ప్రజల సహకారం పూర్తిగా లభించింది. దేశంలో మొత్తం 30 కోట్ల ఎకరాల భూమి ఉన్నది. ఆ మొత్తంలో 6వ భాగం ఇమ్మని కోరాను. భారతదేశంలో గల ఒక్కొక్క కుటుంబంలో సగటున ఐదుమంది చొప్పున ఉన్నారు. ఆ కుటుంబంలో మరొకణ్ణి చేర్చుకోమని చెప్పాను. సామాన్య బీద ప్రజానీకమే ఆరోవ్యక్తి. అందువల్లనే ఆ ఆరోవ్యక్తి కోసం నేను మొత్తం భూమిలో ఆరోభాగం ఇమ్మని కోరాను.

భూదానోద్యమ సభలో వినోబాభావే

"నేను చేస్తున్నదంతా ఏమిటి? నా ఉద్దేశం ఏమిటి? నేను మార్పు కోరుతున్నాను. మొదట హృదయ పరివర్తనం. తరవాత జీవన పరివర్తనం. తరవాత సమాజ పరివర్తనం. ఈ విధంగా మూడు విధాల మార్పులు అంటే మూడు రకాల విప్లవాలు రావాలని నా ఆకాంక్ష." నేను మొదటినుంచి న్యాయం, అధికారం అనే ప్రాతిపదికమీద భూదానాన్ని గురించి ప్రస్తావిస్తూ ఉన్నాను. న్యాయం అంటే చట్టపరమైన న్యాయం కాదు. నేను కోరేది భగవంతుని విధానం ప్రకారం లభించే న్యాయం. స్వరాజ్యశాస్త్రం అనే నా గ్రంథంలో ఈ విషయం స్పష్టంగా పేర్కొన్నాను. మనం చట్టరీత్యా భూమిని సంపాదించాలి.

SCERT ANDHRA PRADESH

నేను భూసమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని కోరుకున్నాను. భారతదేశమంతటా భూదానాన్ని గురించి ఒక్కొక్క సభ జరుగుతూ ఉండేది. భూమిని ఇమ్మని నేను ప్రజల్ని కోరడం, వాళ్ళు భూదానం చేయడం ముమ్మరంగా సాగింది. ఒక ఏడాదిలో ఒక లక్ష ఎకరాల భూమి దానరూపంలో లభించింది. నా ఆనందానికి అవధులు లేవు.

H7HMX3

పాదయాత్ర చేస్తున్నప్పుడు ఎన్నో అనుభవాలు కలిగాయి. వాటినన్నింటినీ రెండు మాటల్లో క్రోడీకరించి చెబుతున్నాను. నా అనుభవాల్ని టూకీగా ఎలా చెప్పాలా అని యోచించాను. సాక్షాత్కారం అనే మాట నాకు గోచరించింది; ఈ రూపంలో నిజంగా నాకు లభించింది దేవుని సాక్షాత్కారమే! మనిషి మనస్సులో మంచితనం ఉంది. దాన్ని వెలికితీయవచ్చుననే కృతనిశ్చయంతో నేను పనిచేశాను. అందుకు భగవంతుడు ఈ రూపంలో నా ముందు సాక్షాత్కరించాడని నా దృఢ విశ్వాసం. మనిషి మనస్సు ఈర్ష్య, అసూయ, మాత్సర్యం,లోభం మొదలయినవాటికి నిలయం అని విశ్వసించి బయలుదేరి ఉంటే నాకు ఆ గుణాలే దర్శనం ఇచ్చి ఉండేవి. అలా జరగలేదు. భగవంతుడు అనుగ్రహించాడు. దేవుడు కల్పవృక్షం వంటివాడు. మనం ఏ రూపంలో కోరుకుంటే ఆ రూపంలో దర్శనమిస్తాడనే సత్యాన్ని నేను తెలుసుకోగలిగాను.

ఇవి చేయండి

I. వినడం-మాట్లాడడం

1. "భూదానం" అని పాఠం పేరును విన్నప్పుడు మీరేమి అనుకున్నారు?
2. ఈ పాఠంద్వారా మీరు గ్రహించినదేమిటి?
3. "భూ సమస్య చాలా పెద్దది" అని వినోబా అన్నారు కదా! ఇలా ఎందుకు అని ఉంటారు? ఇది ఈనాటి పరిస్థితులలో కూడా ఇలాగే ఉందా? దీనిమీద మీ అభిప్రాయం చెప్పండి.

II. చదవడం - రాయడం

1. **కింది వాక్యాలు చదవండి. ఆ వాక్యాలకు సమానభావం వచ్చే వాక్యాన్ని గుర్తించండి.**

అ. **పల్లెపట్టణాల ప్రజల్లో ఉత్సాహం ఎక్కువగా ఉంది. పల్లెల్లో ఆప్యాయతతో కూడిన ప్రత్యేక విశేషం కనపడింది.**

అ. పల్లె పట్టణాల ప్రజల్లో ప్రత్యేక విశేషం ఉంది. ( )

ఆ. పల్లె ప్రజల కంటే పట్టణాల ప్రజల్లో ఎక్కువ విశేషం ఉంది. ( )

ఇ. పల్లె ప్రజల్లో పట్టణ ప్రజలకంటే తక్కువ విశేషం కనబడింది. ( )

ఈ ఆప్యాయత అనే ప్రత్యేక విశేషం పల్లెప్రజల్లో ఎక్కువగా కనబడింది. ( )

ఆ. **వినోబాకు తెలుగు వచ్చు. కానీ తెలుగులో మాట్లాడలేరు. అయినా వచ్చిన తెలుగు భాషవల్ల ఎంతో ప్రయోజనం కలిగింది.**

అ. వినోబాకు తెలుగు వచ్చు. కానీ సరిగా మాట్లాడలేరు. ( )

ఆ. వినోబాకు తెలుగు రాదు. కాబట్టి అసలే మాట్లాడలేరు. ( )

ఇ. వినోబాకు తెలుగు బాగా వచ్చు, బాగా మాట్లాడగలరు. ( )

ఈ. వినోబాకు తెలుగు బాగా రాదు. కాని ఎంతో కొంత మాట్లాడగలరు. ( )

ఇ. **శివరాంపల్లి వెళ్ళవలసిన అవసరం లేకపోతే తోవలో కొద్ది రోజులపాటు ఉండవలసిన గ్రామాలు అనేకం తగిలాయి.**

అ. శివరాంపల్లికి తప్పకుండా వెళ్ళాలి కాబట్టి తోవలోని గ్రామంలో ఉండవలసిన అవసరం ఉన్నా ఉండకుండా వెళ్లారు. ( )

ఆ. శివరాంపల్లికి వెళ్ళ వలసిన అవసరం లేదు. అందుకే తోవలోని గ్రామాల్లో ఉండకుండా వెళ్ళారు. ( )

ఇ. శివరాంపల్లికి వెళ్లారు. తోవలోని గ్రామాల్లో కూడా కొద్ది రోజులు ఉండి వెళ్ళారు. ( )

ఈ. శివరాంపల్లికి వెళ్ళడం కంటే ఇతర గ్రామాల్లో ఉండడం ఎక్కువ అవసరం. ( )

ఈ. **'మాకు కొద్దిగా భూమి దొరికితే, కష్టపడి పని చేసుకుంటాం; కష్టార్జితం తింటాం.'**

అ. కష్టపడి పని చేయడానికి భూమి ఉంటే, మేము మా కష్టార్జితం తింటాం. ( )

ఆ. భూమి లేదు కాబట్టి , మేము కష్టపడి కష్టార్జితం తింటున్నాం. ( )

ఇ. మాకు కొద్దిగా భూమి దొరికితే కష్టపడకుండా తినవచ్చు. ( )

ఈ. మాకు భూమి ఉన్నది కాబట్టి మేము కష్టార్జితం తినవలసిన పనిలేదు. ( )

SCERT ANDHRA PRADESH

2. పాఠంలోని కింది పేరాలు చదవండి. ఆ పేరాలోని ముఖ్యమైన పదం / పదాలు కింద గీత గీయండి. అవి ఎందుకు ముఖ్యమైనవో రాయండి.

1వ పేరా, 3వ పేరా, 6వ పేరా, 7వ పేరా, 13వ పేరా, చివరిపేరా.

3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ. వినోబా శివరాంపల్లికి ఎలా వెళదామనుకున్నారు? ఎందుకు?

ఆ. వినోబాకు తెలుగు రావడంవల్ల ఎలాంటి ప్రయోజనం పొందారు?

ఇ. వినోబా గ్రామాలకు వెళ్ళడం వల్ల ఏమి గ్రహించారు?

ఈ. వినోబాకు పోచంపల్లిలో ఎలాంటి అనుభవం ఎదురైంది?

ఉ. వినోబా భూసమస్యను ఎలా పరిష్కరించాలని భావించారు?

III. స్వీయరచన

1. కింది ప్రశ్నలకు ఆలోచించి ఐదేసి వాక్యాలలో జవాబులు రాయండి.

అ. "పల్లెల్లో పట్టణాల కంటే ఆప్యాయతతో కూడిన ప్రత్యేక విశేషం కనబడింది," అని వినోబా అన్నారు కదా! పల్లెల్లోని ప్రత్యేక ఆప్యాయత అంటే ఏమై ఉంటుంది?

ఆ. ఏదైనా ఇతర ప్రాంతాలకు వెళ్ళినప్పుడు అక్కడి భాషను నేర్చుకోవడం అవసరమా? ఎందువల్ల?

ఇ. సమష్టి వ్యవసాయం అంటే ఏమిటి? ఈనాడు గ్రామాల్లో సమష్టి వ్యవసాయాలు జరగక పోవడానికి గల కారణాలు ఏమిటి?

ఈ. బీదలకు ఉపకారం చేశామని దాతలు భావించగూడదని వినోబా చెప్పారు కదా! ఆయన ఎందుకని అలా అని ఉంటారు?

ఉ. పేదలకు భూమికి ఉండే సంబంధం తల్లికి, బిడ్డలకు ఉన్న సంబంధం వంటిది అని వినోబా అన్నారు కదా! అది సరైందేనా? ఎందుకు?

SCERT ANDHRA PRADESH

2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాలలో సమాధానాలు రాయండి.

అ. వినోబా గురించి 10 వాక్యాలలో వ్యాసం రాయండి.

ఆ. కొందరికి అసలే భూమి లేకపోవడం, మరికొందరికి వందల ఎకరాల భూమి ఉండడం అనే పరిస్థితి నేడు కూడా ఉంది కదా! ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి మీరు సూచించే పరిష్కార మార్గాలు ఏమిటి?

IV. పదజాలం

1. పాఠం ఆధారంగా కింది పదాల అర్థాలు తెలుసుకోండి. వీటిని సొంతవాక్యాలలో రాయండి.

అ. "కష్టార్జితం" ....

ఆ. "నిండు హృదయం" ....

ఇ. "అసాధారణ ఘట్టం" ....

ఈ. "హృదయశుద్ధి" ....

ఉ. "జీవన పరివర్తనం" ....

ఊ. "సమాజ పరివర్తనం" ....

ఎ. "సత్కార్యాలు" ....

2. కింది పదాలకు పర్యాయపదాలు రాసి సొంత వాక్యాలు రాయండి.

అ. రాత్రి

ఆ. పల్లె

ఇ. హృదయం

ఈ. భూమి

ఉ. ఆకాంక్ష

3. కింది పదాలకు నానార్థాలు రాయండి.

అ. పాపము

ఆ. ప్రజలు

ఇ. ధనము

ఈ. యుగము

ఉ. పొలం

ఊ. వ్యవసాయం

H81AKZ

4. కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు వికృతిపదాలు రాయండి.

అ. ప్రజలు ప్రేమతో భూమిని ఇస్తున్నారు.

ఆ. త్రిలింగ భాష మధురమైనది.

ఇ. మంచివారి హృదయంలో భగవంతుడుంటాడు.

ఈ. ఎవరి కార్యములను వారు సమర్థంగా చెయ్యాలి.

SCERT ANDHRA PRADESH

V. సృజనాత్మకత

1. నువ్వే వినోబా స్థానంలో ఉంటే, నేటి పరిస్థితుల్లో ప్రజలకు ఏమని సందేశం ఇస్తావు? దాన్ని రాసి ఏక పాత్రాభినయం చేయండి. (లేదా)
2. ఈనాటి పరిస్థితులకనుగుణంగా భూదానం ఆవశ్యకతను వివరిస్తూ ఒక పోస్టరును తయారు చేసి ప్రదర్శించండి.

VI. ప్రశంస

1. భూదానం అనేది ఒక సత్కార్యం. ఇలాంటివే ఇంకా ఏ ఏ సత్కార్యాలు చేయవచ్చు? ఇలాంటి సత్కార్యాలు చేసినవారిని అభినందిస్తూ లేఖ రాసి ప్రదర్శించండి. (లేదా)
2. వినోబా భూదాన ఉద్యమంకోసం చేసిన పాదయాత్రను అభినందిస్తూ, ఆయనకు ఏమని లేఖ రాస్తారు? రాసి గోడ పత్రికలో ప్రదర్శించండి.

www.apteachers.in

VII. భాషనుగురించి తెలుసుకుందాం

1. కింది పదాలను విడదీయండి. సంధిపేరు రాయండి.

అ. సర్వోదయం ఆ. ఊహాతీతం ఇ. ఆయాచోట్ల ఈ. తేవాలని ఉ. మరొకటి

2. కింది సమాస పదాలకు విగ్రహవాక్యాలు, సమాస నామాలు రాయండి.

అ. పాదయాత్ర ఆ. పల్లెప్రజలు ఇ. వంద ఎకరాలు ఈ. నా గ్రంథం

3. కింది వానిలో కర్తరివాక్యం కర్మణివాక్యంగా, కర్మణివాక్యం కర్తరి వాక్యంగా మార్చండి.

అ. నెహ్రూ తన జాబులో సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఆ. ఆయనకు సమాధానం రాయబడి పంపబడింది.

ఇ. భగవంతుడు నా మాటలకు శక్తిని ప్రసాదించాడు.

ఉ. నాచే దీనికి భూదానయజ్ఞం అని పేరు పెట్టబడింది.

ప్రాజెక్టు పని

పోచంపల్లిలో రామచంద్రారెడ్డిగారు వినోబాభావే ప్రసంగానికి ప్రేరణపొంది ఒకేసారి వంద ఎకరాలను దానం చేశారు కదా! అలా మీ ఊరిలోనూ పేరు పొందిన దాతలు కొందరు ఉంటారు కదా! వాళ్ళ పేర్లను సేకరించి ఎవరు ఏ రకమయిన దానం చేశారో తెలియజేసే వివరాలను రాసి గోడపత్రికలో పెట్టండి.

పునరభ్యసనం (వెనుకబడిన విద్యార్థుల కొరకు)

1. పాఠ్యాంశాలలోని పదాల జాబితాను ఉపాధ్యాయుడు తయారుచేసి చదివించాలి.
2. విద్యార్థులచే ఉక్తలేఖనం రాయించాలి. దోషాలు సవరించాలి.
3. పాఠ్యాంశ సారాంశాన్ని 4 లేదా 5 వాక్యాలలో నల్లబల్లపై రాసి విద్యార్థులచే చదివించాలి, రాయించాలి, దోషాలు సవరించాలి.

H84X9H

నేనివి చేయగలనా ?

1. వినోబాను గురించి ఆయన చేసిన పాదయాత్రను గురించి సొంతమాటల్లో చెప్పగలను. ఔను / కాదు
2. "ఆత్మకథ" రూపంలోని ఈ పాఠాన్ని చదివి అర్థంచేసుకొని సొంతమాటల్లో చెప్పగలను. ఔను / కాదు
3. పాఠంలోని పదజాలాన్ని సొంత మాటల్లో ప్రయోగించగలను. ఔను / కాదు
4. వినోబాను గురించి, భూదాన ఉద్యమాన్ని గురించి సొంతమాటల్లో రాయగలను. ఔను / కాదు
5. భూదాన ఉద్యమాన్ని గురించి కరపత్రం / పోస్టర్ తయారుచేయగలను. ఔను / కాదు

మీరు సాహసంతో పనిని చేపట్టలేకపోతే మీరు ఓటమికి గురి కానేకారు. కానీ మీరు జీవితంలో ఏదీ సాధించలేకపోతారు. – వినోబా భావే

www.apteachers.in

17. స్ఫూర్తిప్రదాతలు

(ఉపవాచకం)

సాహసవీరుడు - మల్లి మస్తాన్ బాబు

నీ పిలుపు విని ఏఒక్కరూ రాకున్నా! సాగిపో... సాహసంతో ముందడుగువేయ్... విజయం నీ సొంతమౌనోయ్...

"ఎప్పుడుజూసినా చెట్లెమ్మట, పుట్లెమ్మట తిరగడమేగాని నాలుగు అక్షరంముక్కలు నేర్చుకుందామని లేదేందిరా! వీడి అల్లరిని భరించలేకుండా ఉన్నాంగానీ ఎక్కడన్నా దూరంగా ఏదన్నా హాస్టల్లో జేరిపిద్దాం. అప్పుడన్నా బాగుపడతాడు." ఐదుగురు సంతానంలో చిన్నవాడైన మస్తాన్‌బాబు గురించి తండ్రి మస్తానయ్య ఆందోళన పడుతుంటే "నా బిడ్డకేమి చురుకైనోడు, తెలివైనోడు వాడికి చదువురాక ఎక్కడికి పోద్ది" ముద్దుల కొడుకును హాస్టల్లోచేర్చి ఎక్కడ దూరం చేస్తారోనని కొడుకును గారాబంగా దగ్గరికి తీసుకుంటూ అంది తల్లి సుబ్బమ్మ. ఆ తల్లికి ఏం తెలుసు భవిష్యత్తులో తన కొడుకు కీర్తిప్రతిష్ఠలు శిఖరాయమాన మవుతాయని.

నెల్లూరు జిల్లా సంగం మండలంలో గాంధీ జనసంఘం ఒక మారుమూల గిరిజన గ్రామం. యానాదులు, ఎరుకల సంక్షేమంకోసం అహర్నిశలూ కృషిచేసిన పద్మశ్రీ వెన్నెలకంటి రాఘవయ్యగారు గిరిజనులకోసం నిర్మించిన గ్రామం ఇది. రెక్కాడితేగాని డొక్కాడని వీరు ఊరిపక్కనే ఉన్న కాలువలో చేపలు పట్టి అమ్ముకుంటూ, వ్యవసాయం, కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తారు. ఆ కుగ్రామంలో మల్లి మస్తానయ్య కుటుంబానికి ఒక ప్రత్యేకత ఉంది. వాళ్ళ గురించి గ్రామంలోనే కాదు, చుట్టుపక్కల ఊళ్లలో కూడా చెప్పుకుంటారు. కారణం ఏమిటంటే పూటగడవడం కూడా కష్టంగా ఉండే ఆ కుటుంబంలోంచి ఆడపిల్లతో సహా నలుగుర్నీ బడికి పంపి చదివిస్తూండడమే. మస్తానయ్య కాస్త అక్షరజ్ఞానం ఉన్నవాడు. చదువు విలువ తెలిసినవాడు. ఉన్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేసేవాడు. ఇంట్లో తిండికి, బట్టకు లేకపోయినా పిల్లల పుస్తకాలకు మాత్రం కొరత రాకూడదనుకునేవాడు. అలాంటి నిరుపేద కుటుంబంలో 1974 సెప్టెంబరు 3వ తేదీన మస్తాన్‌బాబు జన్మించాడు.

ఐదేళ్ళ వయసులో మస్తాన్‌బాబును ఊరిలో ఉండే పాఠశాలలో చేర్పించారు. చిన్నవాడైన మస్తాన్‌బాబు బడికి వెళ్ళకుండా స్నేహితులతో కలిసి ఊరి చివర ఉండే తోటల్లోకి వెళ్ళి చెట్లెక్కుతూ, కాయలు కోసుకుంటూ, కాలువల్లో ఈత కొడుతూ రోజంతా ఆడేవాడు. ఎన్నెన్నో కొత్త కొత్త ఆటలు సృష్టించేవాడు. ఏ సాయంత్రానికో ఇల్లు చేరేవాడు. రాత్రికి తండ్రి ఇంటికిరాగానే మస్తాన్‌బాబు అల్లరిపై ఫిర్యాదుల పర్వం మొదలయ్యేది. తరవాత కథ మామూలే. ఆటల ధ్యాసలోపడి బడి పూర్తిగా మానేస్తున్నాడని సాయంత్రంపూట ప్రైవేటు ట్యూషన్ పెట్టించాడు. మస్తానయ్య అంతటితో

www.apteachers.in

ఊరుకోలేదు. తన కొడుకును బాగా చదివించాలని ఆరు కిలోమీటర్ల దూరంలో ఉండే సంగం అనే ఊరిలో పాఠశాలలో చేర్పించాడు. బస్సులో వెళ్ళి ఒకచోట దిగి అక్కడి నుండి ఒక మైలుదూరం నడిచి బడికి వెళ్ళాలి. దారిలో ఉండే చెట్లూ చేమలూ, కొండలూ గుట్టలూ మస్తాన్‌బాబుకు ఎంతో ఆసక్తి కలిగించేవి.

ఒకరోజు స్నేహితులతో కలిసి గుట్టలు ఎక్కడానికి వెళ్ళాడు. అదే అతడి పర్వతారోహణకు బీజం పడినరోజు. రాళ్ళు, ముళ్ళు దాటుకుంటూ కొండనెక్కడం అతనికి తెలియని ఆనందాన్నిచ్చింది. స్నేహితులంతా వంటచెరకు సేకరిస్తుంటే పొదల మధ్య కాలిబాట చేసుకుంటూ ముందుకు వెళ్ళసాగాడు. చేతిలో ఉన్న కత్తితో నాగజెముడు పొదలు నరుకుతుంటే ఆ చెట్లకుండే తెల్లని పాలు చింది కళ్ళలో పడ్డాయి. అంతే కళ్ళు మండిపోతుంటే ఏడుస్తూ బాధ తట్టుకోలేక కిందపడి దొర్లసాగాడు. ఇంతలో స్నేహితులు వచ్చారు. అందరూ కలిసి వైద్యశాలకు తీసుకుపోయారు. ఈ వార్త తండ్రికి చేరింది. కుటుంబ సభ్యులంతా హుటాహుటిన ఆసుపత్రికి చేరారు. డాక్టరు మందులిచ్చి భయపడాల్సిందేమీ లేదని చెప్పి ఇంటికి పంపాడు.

కొడుకు గురించి మస్తానయ్యకు ఆందోళన ఎక్కువయింది. ఇంకెక్కడయినా మంచి బడి దొరుకు తుందేమోనని విచారించాడు. కోరుకొండ సైనిక పాఠశాల ఉందని అక్కడ చక్కని క్రమశిక్షణతోపాటు మంచి చదువుకూడా వస్తుందని తెలుసుకున్నాడు. అప్పుచేసి కోరుకొండ ప్రవేశ పరీక్ష శిక్షణలో చేర్చాడు. తన చదువుకోసం తండ్రిపడుతున్న తపన ప్రతినెల ఫీజు చెల్లించడంకోసం పడుతున్న కష్టం మస్తాన్‌బాబును ఆలోచింపజేసాయి. తండ్రి తరచుగా చెప్పే స్వశక్తితో ఎదగాలనే ఏకలవ్యుని కథను ఎప్పుడూ గుర్తుకు తెచ్చుకునేవాడు. ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. అందరూ ఎంతో సంతోషంలో మునిగిపోయారు. కాలం ఊరుకుండదుకదా! బంధువుల పొలంలో మోటారు బిగించి వస్తున్న మస్తానయ్య మీద శత్రువులు దాడిచేశారు. కొడవళ్ళు, గొడ్డళ్ళతో నరికేశారు. తీవ్రమైన గాయాలపాలై పడిపోయిన అతన్ని చూసి చనిపోయాడనుకుని వాళ్ళు వెళ్ళిపోయారు. తన బిడ్డలను చదివించాలని, తాను ఎలాగైనా బ్రతకాలని దృఢసంకల్పంతో గాయాలనుసైతం లెక్కచేయకుండా నడుచుకుంటూ రోడ్డుమీదకొచ్చాడు. తెలిసినవాళ్ళెవరో వైద్యశాలలో చేర్చారు. మరణం అంచుదాకా వెళ్ళి తిరిగి బయటపడేలా చేసింది తన కొడుకును సైనిక పాఠశాలలో చేర్పించాలన్న పట్టుదలేనని తండ్రి చెపుతుంటే ఎలాగైనా సరే కష్టపడి చదవాలనే సంకల్పం మస్తాన్‌బాబులో మొలకెత్తింది.

SCERT ANDHRA PRADESH

కోరుకొండ సైనిక పాఠశాల వాతావరణం మస్తాన్‌బాబుకు ఎంతగానో నచ్చింది. తెల్లవారుఝామున నాలుగు గంటలకు ప్రారంభమయ్యే దినచర్య రాత్రి 8 గంటలకు ముగుస్తుంది. ఊపిరిసలపని ఈ కాలనిర్ణయ పట్టిక ఇంటి గురించి బెంగపడకుండా చేసింది. బుద్ధిబలాన్నే కాకుండా శారీరక దారుఢ్యాన్ని పెంపొందించే వ్యాయామం, క్రీడలు, ఈత మొదలైన అంశాలన్నింటిలోనూ మస్తాన్‌బాబు ఉత్సాహంగా పాల్గొనేవాడు. పాఠశాల అనుభవాలతో వారం వారం ఇంటికి ఉత్తరాలు రాసేవాడు. పాఠశాల ఆవరణలో ఉన్న లెఫ్టినెంట్ ఉదయభాస్కర్ విగ్రహాన్ని ప్రతిరోజూ తదేకంగా చూసేవాడు. ఉదయభాస్కర్ కోరుకొండ పాఠశాల పూర్వవిద్యార్థి. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహిస్తూ ప్రాణాలు కోల్పోయాడు. ఎప్పటికయినా సరే ఎవరెస్టును ఎక్కాలని మస్తాన్‌బాబు కలలుకనేవాడు. పదోతరగతిలో ఉండగా పాఠశాల తరపున సిమ్లావెళ్ళే అవకాశం వచ్చింది. మంచుతో కప్పిన హిమాలయ శిఖరాలను, పైన్ వృక్షాల వరసలను వాటి పూల సుగంధాన్ని మైమరచిపోయి ఆస్వాదించాడు. అయితే అక్కడ జరిగిన ట్రెక్కింగ్‌లో మస్తాన్‌బాబు కేవలం 'సి' గ్రేడు మాత్రమే పొందగలిగాడు.

కోరుకొండ పాఠశాలలో ఏడేళ్ళ చదువు పూర్తయింది. మిత్రులంతా విడిపోతున్నామని చాలా బాధపడ్డారు. ఇంజనీరింగ్ చదవాలన్న తన కోరికను తండ్రికి తెలిపాడు. ఆయన ఎంతో సంతోషించాడు. జంషెడ్‌పూర్ ఐ.ఐ.టి.లో బి.టెక్.లో చేరాడు. ఉన్న కాస్త పొలం కూడా అమ్ముకోక తప్పలేదు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఎంతగా ఇబ్బందిపెడుతున్నా చిరునవ్వుతో భరిస్తూ చదువుమీద నుండి దృష్టి మరల్చలేదు. హాస్టలుకు డబ్బుకట్టలేక వేరుగా గదిలో ఉన్నప్పుడు

రోజుల తరబడి తిండిలేకపోవడంవల్ల ఆరోగ్యం క్షీణించింది. స్నేహితుల సహకారంతో కాలం గడిపేవాడు. ఆర్థికంగా ఎన్ని కష్టాలున్నప్పటికీ ఎప్పుడూ చిరునవ్వుతో సరదాగా ఉండే మస్తాన్ బాబును చూసి తోటి విద్యార్థులు ఆశ్చర్యపోయేవారు. ఈ స్వభావమే అతడికి ఎంతో మంది స్నేహితులయ్యేలా చేసింది. కళాశాలలోని సాహసికుల సమాఖ్యలోచేరి కొండలు ఎక్కడం, పడవ నడపడం వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవాడు. అతడిలోని ఏకాగ్రతను, పట్టుదలను స్నేహస్వభావాన్ని అధ్యాపకులతోసహా అందరూ అభిమానించేవారు. 1994లో కళాశాల తరఫున హిమాలయ ట్రెక్కింగ్ వెళ్ళినప్పుడు 14 500 అడుగుల ఎత్తులోఉన్న యమునోత్రి పర్వతాలను అధిరోహించాడు. సూర్యుని వెలుగుసోకి వివిధ రంగుల ఆభరణాలు ధరించినట్లుగా వెలిగిపోతున్న మంచు పర్వతాలను చూసి ఎవరెస్ట్‌ను ఎక్కితీరాలన్న పట్టుదల మరికాస్త పెరిగింది.

ఇంజనీరింగ్ విద్యపూర్తికాగానే ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. తండ్రి ఎంతో సంతోషించాడు. దాదాపు మూడేళ్ళపాటు ఉద్యోగం చేశాడు. తన జీవితలక్ష్యం ఇది కాదని మరేదో ఉందని నిరంతరం మథన పడేవాడు. ఉద్యోగం మానేసి మస్తాన్‌బాబు యం.టెక్. చదవాలని నిర్ణయించుకోడంతో తండ్రి అడ్డుచెప్పలేదు. ఖరగ్‌పూర్ ఐ.ఐ.టి.లో చేరాడు. కళాశాలలో మిత్రులతో కలిసి మరొకసారి హిమాలయాలకు వెళ్ళాడు. ఏడేళ్ళ తరవాత మళ్ళీ హిమాలయాలను చూసే అవకాశం రావడం అతడిలో ఎంతో ఆనందాన్ని నింపింది. యం.టెక్. పూర్తయింది. కలకత్తాలోని ఐ.ఐ.ఎమ్.లో యం.బి.ఎ.లో చేరాడు. ఐ.ఐ.యం. తరఫున ఎవరెస్ట్ బేస్ క్యాంపులో పాల్గొన్నాడు. అప్పటికే అంతర్జాలంలో (ఇంటర్నెట్) విస్తృతంగా పరిశోధించి ఎవరెస్ట్ గురించిన పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని సేకరించేవాడు. ఒకరోజు కళాశాల నుండి గదికి చేరేసరికి తండ్రికి ఆరోగ్యం సరిగాలేదని తొందరగా రావాలని ఇంటినుంచి వార్త అందింది. తండ్రి మరణం అతడిని ఎంతగానో కుంగదీసింది. బాధను దిగమింగి యం.బి.ఎ. పూర్తిచేయాలని సంకల్పించాడు. యం.బి.ఎ. చివరి పరీక్ష పూర్తికాగానే లక్షల వేతనం వచ్చే ఉద్యోగవకాశాలన్నిటిని వదులుకొని "నీకు నచ్చిన పనిని సాధించే వరకు వెనుదిరగవద్దు" అనే తండ్రి మాటను మననం చేసుకుంటూ హౌరా రైలెక్కి ఢిల్లీ చేరుకున్నాడు.

SCERT ANDHRA PRADESH

తన కలలను సాకారం చేసుకునేందుకు గంగోత్రి లోయను చేరుకున్నాడు. పూర్తిస్థాయి పర్వతారోహకుడిగా మారడానికి సాధన మొదలుపెట్టాడు. పర్వతారోహణ అత్యంత ప్రమాదకరమైన సాహసయాత్ర. ప్రాణవాయువు లభించని స్థితి, ముంచుకొచ్చే మంచు తుఫానులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. పర్వతారోహకుడికి ఉండవలసిన శ్వాసనియంత్రణ, ఆత్మస్థైర్యం, ఒంటరిగా గడపగలగడం. శారీరక దృఢత్వం మొదలైనవన్నీ సాధనచేశాడు. ఈత, వ్యాయామం, ప్రాణాయామం మొదలైనవన్నీ బాల్యంనుండే సాధన చేస్తుండంవల్ల ఇవన్నీ సునాయాసంగా అధిగమించగలిగాడు. గంగోత్రి, భాగీరథి, అలకనంద పవిత్ర జలాలను స్పృశిస్తూ కాలాపత్థర్ చేరుకున్నాడు. బౌద్ధబిక్షువుల మంత్రోచ్చారణలు వింటూ ముందుకుసాగాడు. తనకు ఇష్టమైన భగవద్గీతను, రుద్రాక్షమాలను చేతబట్టుకొని సంక్లిష్టమైన పర్వతసానువులు దాటుకుంటూ, ప్రమాదభరితమైన మంచు శిఖరాలను లోయలను అధిగమిస్తూ హిమాలయాలలోని కాంచనగంగ కనుమలను అధిరోహించాడు. ట్రాన్స్‌హిమాలయన్ అధిరోహణలో భాగంగా 2000 కిలోమీటర్లను 132 రోజులలో అధిగమించి మౌంట్ ఎవరెస్ట్ నుంచి మౌంట్ కైలాస్ వరకు చేరుకున్నాడు. గ్లోబల్‌వార్మింగ్‌వల్ల మారిపోతున్న పర్వతాల రూపురేఖలను ప్రజలకు వివరించడానికి ప్రయత్నించాడు. అతని ప్రయత్నం అంతటితో ఆగలేదు. ప్రపంచ వ్యాప్తంగా ఏడుఖండాలలో ఉన్న ఎత్తయిన పర్వతాలను అధిగమించాలనే పట్టుదలను పెంచింది.

H86IYQ

2005లో దక్షిణ అమెరికాలోని అకాంగువాను మొదట అధిరోహించిన తర్వాత ఆయనకు దక్షిణ అమెరికాతో విడదీయరాని బంధం ఏర్పడింది. ఆండీస్ పర్వతాలలోని అత్యున్నత శిఖరాలను అధిరోహించాలి అనుకున్నాడు. 2006లో తన సంకల్పాన్ని ప్రారంభించాడు. 2006 జనవరి 19 గురువారం అంటార్కిటిక్ ఖండంలోని విన్సన్‌మాసిఫ్

www.apteachers.in

అనే 4897 మీటర్ల ఎత్తున్న పర్వతశిఖరాన్ని అధిరోహించాడు. ఫిబ్రవరి 17 శుక్రవారం దక్షిణ అమెరికాలోని 6962 మీటర్ల ఎత్తున ఉన్న అకాన్‌కాగ్వా శిఖరం మీద కాలుమోపాడు. మార్చి 15 బుధవారం ఆఫ్రికాలోని 5895 మీటర్ల ఎత్తున్న కిలిమంజారోను, కేవలం రెండున్నర రోజులలోనే ఎక్కి రికార్డు సృష్టించాడు. ఏప్రిల్ 1 శనివారం ఆస్ట్రేలియాలోని 2228 మీటర్ల ఎత్తున్న మౌంట్ కోస్‌క్యూస్కో పర్వతాన్ని చేరుకున్నాడు. మే 21 ఆదివారం ఆసియాలోని 8848 మీటర్ల ఎత్తున్న, ప్రపంచంలోకే ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరం మీద 2006 మే 21 ఆదివారం నాడు కాలుమోపాడు. దేశభక్తికి గుర్తుగా జాతీయ పతాకాన్ని స్ఫూర్తినిచ్చిన సైనిక పాఠశాల పతాకాన్ని ఎవరెస్ట్ శిఖరం మీద నాటాడు. జూన్ 13 మంగళవారం ఐరోపాలోని ఏల్ మౌంట్ శిఖరాన్ని, జులై 1 సోమవారం ఉత్తర అమెరికాలోని మౌంట్ మెకెన్లీ పర్వత శిఖరాన్ని అధిరోహించాడు. కేవలం 172 రోజుల వ్యవధిలో ప్రపంచంలో మరే సాహసికుడు సాధించలేని విధంగా సెవెన్ సెమ్మిట్స్ పూర్తిచేశాడు. ఈ పర్వతవీరుడి అద్భుతసాహసం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులలో నమోదయింది.

దక్షిణ అమెరికా ఖండంలోని ఆండీస్ పర్వతాలంటే మస్తాన్‌బాబుకు ఎంతో ఇష్టం. హిమాలయాల తర్వాత ఇవే ఎత్తైన పర్వతాలు. 7000 కి.మీ. ల పొడవున విస్తరించిన ఈ పర్వతాలలో అగ్నిపర్వతాలు కూడా ఉన్నాయి. 2006వ సంవత్సరంలో ఏడు ఖండాలలోని ఏడు శిఖరాలను అధిరోహించే క్రమంలో అకాన్ కాగ్వా శిఖరాన్ని ఎక్కినపుడే మిగతా 13 శిఖరాలను కూడా అధిరోహించాలని మస్తాన్‌బాబు నిర్ణయించుకున్నాడు. ఈ పర్వత శ్రేణిలోని 14 శిఖరాలను అధిరోహించడం కోసం స్పానిష్ భాషపై పట్టుసాధించాడు. స్థానికులతో అనుబంధం పెంచుకుని ఈ పర్వతాల ఆనుపానులన్నీ తెలుసుకున్నాడు. 2015 మార్చి 23 వ తేదీన 6749 మీటర్ల ఎత్తున్న నెవాడో ట్రిస్ క్రూసెన్‌సర్ పర్వతాన్ని అధిరోహించడానికి బయలుదేరాడు. వాతావరణం ప్రతికూలంగా ఉంది. అయినప్పటికీ ఆ పర్వతాల గురించి పూర్తిగా అవగాహన ఉండడం వల్ల అంతటి ప్రమాద స్థితిలోనూ లక్ష్యాన్ని చేరుకున్నాడు. నాలుగు శిఖరాలను దాటాడు. తిరిగివస్తూండగా సుమారు 600 మీటర్ల దిగువన మార్చి 24న మంచుతుఫాను ప్రళయభీకరంగా విరుచుకు పడింది. మస్తాన్‌బాబు తలదాచుకున్న గుడారం కకావికలమైపోయింది. ఏ పర్వతాలను ప్రాణప్రదంగా ప్రేమించాడో ఏ పర్వతారోహణ ద్వారా భరతజాతి కీర్తిని దిగంతాల దాకా చేరవేశాడో ఆ పర్వతాలలోనే తనువుచాలించాడు. సాహసవీరుడుకి ప్రపంచం యావత్తూ నివాళులర్పించింది. వీరుడికి మరణం ఉండదంటారు. ఆయనలోని కార్యదక్షత, దృఢసంకల్పం మనందరికీ మార్గదర్శనం చేస్తాయి. ప్రతి పాఠశాలకు, కళాశాలకు, ప్రతి విద్యార్థికి స్ఫూర్తినివ్వడానికి మస్తాన్‌బాబు సాహసజీవితం మల్లెపూల సుగంధంలా మన మనస్సుల్లో ఎప్పటికీ ఉంటుంది.

SCERT ANDHRAPRADESH

వ్యాపార దిగ్గజం - సత్య నాదెళ్ళ

వైఫల్యాన్ని ఎదుర్కోడం కాదు. వైఫల్యంనుంచి ఏం నేర్చుకున్నామనేది ముఖ్యం. నా విజయగాథలన్నీ నా వైఫల్యాల నుంచి నేర్చుకున్న గుణపాఠాలే...

మానవ పరిణామక్రమంలో రాతియుగం, ఇనుముయుగం మొదలైన దశలున్నట్లుగానే నేడు నడుస్తున్నది సాంకేతికయుగం – అంతర్జాలంతో అనుసంధానమై ప్రపంచమంతా కుగ్రామంలా మారిపోయిన, కంప్యూటర్ యుగం. కరెంటుబిల్లు మొదలుకుని క్రయోజనిక్ రాకెట్ ఇంజన్‌దాకా ప్రతిచోటా కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానం విస్తరించింది. కంప్యూటర్ అక్షరాస్యత అత్యవసరంగా మారిన కాలమిది. విద్య, వైద్యం, వ్యవసాయం, రక్షణ... ఒకటేమిటి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచేత ఉచిత పంపిణీ

www.apteachers.in

అన్నిరంగాల్లోనూ కంప్యూటర్ సాంకేతికత ప్రధానపాత్ర పోషిస్తోంది. మనదేశంలో శరవేగంగా విస్తరించి అతిస్వల్పకాలంలోనే కోట్లమందిని వినియోగదారులుగా మార్చుకున్న మొబైల్‌ఫోన్ కూడా కంప్యూటర్ విజ్ఞానఫలితమే. ఇది కంప్యూటర్ రంగంలో ఒక అగ్రశ్రేణి సంస్థ.

1976 లో బిల్‌గేట్స్ ఈ సంస్థను స్థాపించాడు. నాటినుండి నేటివరకు టెక్నాలజీ ద్వారా ప్రపంచ గమనానికి కొత్త ఒరవడిని ఉరవడిని కల్పించిన ఘనత మైక్రోసాఫ్ట్‌కు దక్కుతుంది. ఇంతగొప్ప సంస్థకు సి.ఇ.ఒ. (Chief Executive Officer) గా పనిచేసే భాగ్యం ఒక భారతీయుణ్ణి – తెలుగువాడిని – వరించింది. ఆయనే సత్యనారాయణ నాదెళ్ళ అలియాస్ సత్య నాదెళ్ళ. కోట్లాదిరూపాయల వ్యాపార సామ్రాజ్యానికి పాలనాధిపతిగా ఎంపికయ్యాడు. అకుంఠిత దీక్షాదక్షతలలో ఇంత గొప్ప అవకాశాన్ని చేజిక్కించుకున్న మనవాడైన సత్య నాదెళ్ళ గురించి తెలుసుకుందాం.

1962వ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ నుంచి ఐ.ఎ.యస్.కు ఎంపికయిన నాదెళ్ళ యుగంధర్ నాయుడిది అనంతపురం జిల్లా, ఎల్లనూరు మండలం, బుక్కాపురం గ్రామం. వీరి శ్రీమతి ప్రభావతి. ఈ దంపతులకు 1967లో సత్యనాదెళ్ళ జన్మించారు. కలెక్టరుగా, ప్రధానమంత్రి నేతృత్వంలోని కేంద్ర ప్రణాళికాసంఘ సభ్యునిగా, ప్రధానమంత్రి కార్యదర్శిగా పనిచేసిన యుగంధర్ మంచి అధికారిగా మన్ననలు అందుకున్నారు. విద్యావంతుల కుటుంబంలో పుట్టిన సత్య బాల్యంనుంచే తెలివితేటలు ప్రదర్శించేవాడు. తండ్రికున్న కార్యదీక్షా లక్షణాల్ని పుణికిపుచ్చుకొని పెరిగాడు. హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ విద్యార్థిగా అందరితో కలవిడిగా ఉండడం, అందర్నీ కలుపుకొని పోవడం, నిజాయితీగా వ్యవహరించడం, ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయటం, అవసరాల్లో ఉన్నవారిని ఆదరించటం, చేయూతనివ్వడం లాంటి సర్వోన్నత లక్షణాలను అలవరుచుకున్నాడు. సత్యకు క్రికెట్ అంటే ఎంతో మక్కువ. క్రికెట్‌జట్టులో సభ్యుడిగా, తన ప్రతిభను నిరూపించుకొని కెప్టెన్‌గా కొనసాగాడు. క్రికెట్ బృందాన్ని సమన్వయపరిచే క్రమంలోనే నాయకత్వలక్షణాలు నేర్చుకున్నానని ఆటలు ఆడటం ద్వారా మాత్రమే ఒత్తిడిని అధిగమించడం, విజయంకోసం పోరాడడం వంటి గుణాలు అలవడతాయనీ తాను నమ్ముతానని ఒక ఇంటర్వ్యూలో సత్య నాదెళ్ళ చెప్పారు. పాఠశాల విద్య పూర్తయిన తరవాత మణిపాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చదివి 1988 లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో బి.ఇ. డిగ్రీ పొందారు. ఆ తరువాత అమెరికాలోని విస్కాన్సిన్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్సులో మాస్టర్స్ డిగ్రీ, షికాగో యూనివర్సిటీనుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందారు.

ఆయన ప్రతిభను గుర్తించి ఎన్నో సంస్థలు ఉద్యోగంలో చేరమని ఆహ్వానించాయి. అమెరికాలో అనేక సాఫ్ట్‌వేర్ సంస్థల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. కొంతకాలం సన్ మైక్రోసిస్టమ్స్‌లో పనిచేసిన తరువాత 1992 లో మైక్రోసాఫ్ట్‌లో అడుగుపెట్టారు. వ్యాపారసేవల విభాగంలో కీలకపాత్ర పోషించి ఐదేళ్ళలో కంపెనీ వ్యాపారాన్ని 6 వేలకోట్లనుండి 31 వేలకోట్లకు చేర్చారు. ఆతరవాత కొంతకాలం బిల్‌గేట్స్‌కు టెక్నాలజీ సలహాదారునిగా వ్యవహరించారు. సంస్థ ఉత్పత్తులు, టెక్నాలజీ రూపకల్పనలో దిశానిర్దేశం చేయటంమీద దృష్టి నిలిపారు. మైక్రోసాఫ్ట్‌లో క్లౌడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను రూపొందించిన ఘనత సత్య నాదెళ్ళదే. మైక్రోసాఫ్ట్‌లో ఇంటర్‌నెట్ స్కేల్ క్లౌడ్ సేవలను దీనిమీదే నిర్వహిస్తున్నారు. అనేక అంతర్జాతీయ కంపెనీల అధునాతన సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాంల నిర్వహణకు ఇదే కీలకం అయింది. అంతేకాక మైక్రోసాఫ్ట్‌లో 20 బిలియన్‌డాలర్లకు పైగా వ్యాపారంచేసే సర్వర్ అండ్ టూల్స్ విభాగానికి అధిపతిగా ఆయన దాన్ని పూర్తిగా పునర్‌వ్యవస్థీకరించారు. ఆన్‌లైన్ సర్వీసెస్ డివిజన్, బిజినెస్ డివిజన్లలో 'సత్య' వైస్‌ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. 38 ఏళ్ళ క్రితం మైక్రోసాఫ్ట్‌ను నెలకొల్పిన బిల్‌గేట్స్, స్టీవ్ బోమర్‌లే మైక్రోసాఫ్ట్‌సంస్థకు ఇంతవరకు సి.ఇ.వోలుగా పనిచేసారు. ఇప్పుడు సత్య నాదెళ్ళ మూడవ సి.ఇ.వోగ 2014 ఫిబ్రవరి 2014న పదవీబాధ్యతల్ని స్వీకరించి మైక్రోసాఫ్ట్‌సంస్థను ప్రగతిపథంలో పరుగెత్తిస్తున్నారు.

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

మైక్రోసాఫ్ట్‌సంస్థ వ్యవస్థాపకులైన బిల్ గేట్స్ సత్య నాదెళ్ళను సి.ఇ.వో.గ నియమిస్తూ "మైక్రోసాఫ్ట్‌సంస్థ కొత్త మార్పులకు లోనవుతున్న తరుణంలో సంస్థను ముందుకు నడిపేందుకు 'సత్య'ను మించి మరొకరు లేరంటూ కితాబిచ్చారు. అత్యుత్తమ ఇంజనీరింగ్ నైపుణ్యాలు, వ్యాపారదృక్పథం, అందర్నీ ఏకతాటిపై తేగల సత్తా గల నాయకుడిగా సత్య తన సామర్థ్యాన్ని నిరంతరం నిరూపించుకుంటూనే ఉన్నారంటూ బిల్ గేట్స్ ప్రశంసించాడు. మరోవైపు మైక్రోసాఫ్ట్‌కు సరైన సారథి అనీ, ఆయనతో కలిసి 20 ఏళ్ళు కలిసి పనిచేశానని మైక్రోసాఫ్ట్‌కు సరైన సమయంలో సరైన నాయకుడు లభించాడనీ స్టీవ్ బోమర్ తెలిపాడు.

సి.ఇ.వోగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజున ఉద్యోగులకు రాసిన ఇ-మెయిల్‌లో "అసాధ్యాలను సాధ్యం చేయగలమని నమ్మాలి... అసంభవమన్న భ్రమలను తొలగించగలగాలి" అంటూ ప్రసిద్ధ రచయిత ఆస్కార్ వైల్డ్ చేసిన వ్యాఖ్యలను ఉటంకించారు. సాఫ్ట్‌వేర్‌శక్తిని పూర్తిస్థాయిలో వెలికి తీసుకురాగలగడంతోపాటు డివైజ్‌ల ద్వారా, సర్వీసుల ద్వారా ప్రతివ్యక్తి, ప్రతిసంస్థ సాధికారత సాధించగలిగేలా చూడగలగడం తమ వల్లే సాధ్యమవుతుందని సత్య పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్‌ముందు అపార అవకాశాలున్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు మరింత వేగంగా స్పందించటంతోపాటు మరింత కష్టపడవలసి ఉందని ఈ సందర్భంగా 'సత్య' వ్యాఖ్యానించాడు. టెక్నాలజీ ప్రపంచాన్నే మార్చేసిన అరుదైన సంస్థలలో ఒకటైన మైక్రోసాఫ్ట్‌కి సి.ఇ.వో బాధ్యతలు చేపట్టడం తనకెంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఏడాదికి 112 కోట్ల వేతనం తీసుకునే ఉద్యోగిగా తమ సంస్థలో నవకల్పనలకే పెద్దపీట వేస్తామని చెప్పారు.

సత్య నాదెళ్ళ జీవితభాగస్వామి శ్రీమతి అనుపమ. వీరికి ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి. కుమారుడికి బుద్ధిమాంద్యం ఉండటం వల్ల అలాంటి పిల్లలకొరకు హైదరాబాద్‌లో ఒక పాఠశాలను స్థాపించారు. "నేను నిర్మించటాన్ని, నిరంతరం నేర్చుకోవడాన్ని ఇష్టపడతాను. పట్టుదల, కార్యదక్షత, నిజాయతీ, నాయకత్వం, సేవాభావం అనే లక్షణాలను సాధించినపుడే ఎంతటి క్లిష్టమైన విజయశిఖరాలనైనా అధిరోహించగలుగుతాం" అంటూ ఆ చరిత్రను నిరూపించిన సత్య నాదెళ్ళ నేటి యువతరానికి చక్కని రోల్‌మోడల్.

SCERT ANDHRA PRADESH

కళాతత్వవేత్త - డాక్టర్ సంజీవ్ దేవ్

ప్రకృతే మనకు గురువు, దైవం, ఆప్తమిత్రుడు. మనకెదురయ్యే సమస్యలన్నింటికీ ప్రకృతినుండే పరిష్కారం లభిస్తుంది. ప్రకృతిని ప్రేమించగలిగితే ప్రశాంతజీవనం సాధ్యమౌతుంది...

మనచుట్టూ ఉన్న ప్రాపంచిక దృగ్విన్యాసాలను మాంస నేత్రంతో అంటే కంటితో అవలోకించడం అలవాటయ్యాక ఆ అనుభూతుల పరంపరను జ్ఞాననేత్రంతో అంటే మనస్సుతో విశ్లేషించడం మొదలౌతుందంటారు తాత్వికులు. అందరికీ పరిసరాలు ఒక్కతీరుగానే ఉన్నప్పటికీ కొందరు మాత్రం ఆ పరిసరాలలోంచే కొత్త సంబంధాలను గుర్తించగలుగుతారు. సరికొత్త ఆలోచనలు చేయగలుగుతారు. కారణాలకోసం అన్వేషిస్తారు. మానవాళి క్షేమంకోసం తపిస్తారు, ఆలోచనలనూ, ఆవిష్కరణలనూ, ప్రజలందరికీ చేరువయ్యేలా చేయడానికి ప్రయత్నిస్తారు.

ఇందుకోసం ఒక్కొక్కరు ఒక్కొక్క పంథాను అవలంబిస్తారు. కొందరు కవులైతే కొందరు కళాకారులవుతారు. ఇంకొందరు శాస్త్రవేత్తలవుతారు, మరికొందరు తత్వవేత్తలవుతారు. చిత్రమేమిటంటే వీరిలో ఉన్న ఈ పార్శ్వాలన్నీ వారందరిలోనూ అంతో ఇంతో వ్యక్తమవుతూవుంటాయి. అరిస్టాటిల్, లియోనార్డో డావెన్సీ, రవీంద్రనాథ్ ఠాగూర్, అబ్దుల్ కలాం మొదలైనవారంతా తాత్వికులుగా, వైజ్ఞానికులుగా, కళాకారులుగా బహుముఖప్రజ్ఞను ప్రదర్శించారు. ఈ కోవకు చెందినవారే కళాతత్వవేత్త డా॥ సంజీవ్ దేవ్. చిత్రకళ అనగానే రవివర్మ, దామర్ల రామారావు, వడ్డాది పాపయ్య, బాపు మొదలైన లబ్ధప్రతిష్ఠులు మన మదిలో మెదులుతారు. యాభైఏళ్ళ వయస్సులో కుంచెపట్టి అద్భుత కళాసృష్టి చేసిన కళాతపస్వి డా॥ సంజీవ్ దేవ్.

గుంటూరుజిల్లా దుగ్గిరాల మండలం, తుమ్మపూడి గ్రామంలో కీ॥శే॥ సూర్యదేవర రామదేవరాయలు, వెంకాయమ్మ దంపతులకు 1914వ సంవత్సరం జూలైనెల 3వ తేదీన సంజీవ్ దేవ్ జన్మించాడు. నాలుగేళ్ళ వయస్సులోనే అతని తల్లి మరణించింది. కొంతకాలం వారి చిన్నాన్న సూర్యదేవర వెంకటకృష్ణయ్యగారివద్ద పెరిగాడు. ఆ తరవాత కృష్ణాజిల్లాలోని కోనాయపాలెంలో అమ్మమ్మ సంరక్షణలో మేనమామ ఇంట పెరిగాడు. విద్యాభ్యాసమంతా ఇంటిదగ్గరే కొనసాగింది. కొత్త విషయాలను తెలుసుకోడానికి ఎంతో ఆసక్తిని చూపేవాడు. తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలో చక్కని ప్రావీణ్యం సంపాదించాడు. అయితే 13 సంవత్సరాల వయస్సు వచ్చేటప్పటికి తనను గారాబంగా పెంచుతున్న అమ్మమ్మ కూడా చనిపోయింది. మరికొంతకాలానికి తాను అమితంగా ప్రేమించే తన గారాల చెల్లికూడా చనిపోవడంతో జీవితంలో విషాదంతప్ప మరేమీ మిగలలేదని తల్లడిల్లిపోయాడు. అక్కున చేర్చుకుని ఆదరించేవారు లేక ఒంటరితనాన్ని భరించలేక 18 సంవత్సరాల వయస్సులో హిమాలయాలకు వెళ్ళిపోయాడు.

హిమాలయాలలో స్వామి పవిత్రానంద దగ్గర శిష్యునిగా చేరాడు. ఆయన సాంగత్యంలో పాశ్చాత్య తర్కశాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. మానవ జీవితం గురించి, ప్రకృతి గురించి పరిశోధన చేశాడు. ఆ సమయంలో రామకృష్ణ మిషన్‌వారు ప్రచురిస్తున్న 'ప్రబుద్ధ భారతి' అనే పత్రికలో ప్రచురించే వ్యాసాన్ని చదివి, ఆ పత్రిక సంపాదకులైన ప్రబోధానందస్వామితో తన అనుభవాలను ఉత్తరప్రత్యుత్తరాలద్వారా పంచుకునేవారు. ఒకసారి విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌ని కలుసుకుని తాను రచించిన కవితలను బెంగాలీ భాషలో ఆయనకు వినిపించినప్పుడు రవీంద్రుడు ఎంతగానో సంతోషించి 'కవి కవిగానే కాక మనిషిగా జీవించినపుడే కవిగా జీవించినట్లవుతుంది' అని సంజీవ్ దేవ్‌తో అన్నాడు. సంజీవ్ దేవ్ ప్రకృతి ప్రేమికుడు కావడంతో కవిగానే కాకుండా చిత్రకళా విమర్శకునిగా కూడా పేరు పొందాడు. సంజీవ్ దేవ్ పరిశీలనా విధానాలను, విశ్లేషణలను గమనించిన విశ్వవిఖ్యాత చిత్రకారుడు నికోలస్ రోరిక్ 'నీ కళలో అద్భుతమైన సృజనాత్మకత వెలుగులీనుతోంది' అని ప్రశంసించాడు.

రవీంద్రుని మేనకోడలి కుమారుడైన అసిల్‌కుమార్ హల్దార్ లక్నో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేసేవాడు. అతడు బెంగాలీ భాషలో రచించిన 'మానస్ ముకుర్' అనే కావ్యాన్ని సంజీవ్ దేవ్‌కు అంకితమిచ్చారంటే వారిద్దరిమధ్య ఎంతటి స్నేహసంబంధాలున్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రసిద్ధ నవలాకారుడు ప్రేమ్‌చంద్‌ను, భారతీయ జీవనవిధానాన్ని అమితంగా ప్రేమించిన అనీ బిసెంట్‌ను, ప్రఖ్యాత తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తిని ఇలా ఎందరినో కలిసినప్పుడు భారతీయ పాశ్చాత్య తాత్విక అంశాలపై సుదీర్ఘమైన చర్చలు చేసేవారు.

కొంతకాలం తరవాత తన స్వగ్రామానికి తిరిగి వచ్చారు. సొంత ఊరిని మించిన స్వర్గమేదీ ఉండదని సాటి మనిషిని సంతోషపెట్టడంకన్నా మించిన సౌఖ్యమేదీ ఉండదని ఆయన ఎప్పుడూ చెపుతుండేవారు. తనకు సన్నిహితులైన చిత్రకారుడు ఎస్.వి. రామారావు, భావకవి కృష్ణశాస్త్రి, నవలారచయిత చలం, కథారచయిత బుచ్చిబాబు మొదలైనవారితో

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

కవిత్వచర్చలు చేసేవారు. ప్రముఖ చరిత్రకారుడు రాహుల్ సాంకృత్యాయన్ ఆంధ్రరాష్ట్రానికి వచ్చినప్పుడల్లా సంజీవ్ దేవ్ ఇంటిలో దిగేవారు.

సంజీవ్ దేవ్ గొప్ప మానవతావాది మాత్రమే కాదు, లేఖారచయిత కూడా. దేశవిదేశాలనుండి ఎంతో మంది విభిన్న అంశాలపై ఆయనకు ఉత్తరాలు రాసేవారు. వారందరికీ ఓపికగా ప్రత్యుత్తరాలిస్తూ సందేహ నివృత్తి చేసేవారు. ఆయనకోసమే మారుమూల గ్రామమైన తుమ్మపూడిలో తపాలాశాఖవారు పోస్టాఫీసును ప్రారంభించారు. కష్టాల్లో ఉన్నవారిని ఓదారుస్తూ వారి సమస్యలకు సంజీవ్ దేవ్ లేఖలద్వారా చూపిన పరిష్కారాలు నేటికీ మార్గనిర్దేశం చేస్తాయి.

మనం ఆనందంగా జీవించడంతోపాటు ఇతరులను కూడా ఆనందంగా జీవించేలా చూడడమే సర్వమతాల సారం అని ప్రకటించిన సంజీవ్ దేవ్ కవి, చిత్రకారుడు మాత్రమే కాదు మనోవైజ్ఞానికవేత్తకూడా. మనోవిజ్ఞాన శాస్త్రం గురించి అనేక ప్రసంగాలు, వ్యాసాల ద్వారా ప్రజానీకానికి అవగాహన కల్పించేవాడు. రసరేఖలు, తేజోరేఖలు, రూపారూపాలు, దీప్తిధార, కాంతిమయి, రూపదర్శిని, బయోసింఫని మొదలైన రచనలు చేశారు. ఆయన ఆత్మకథగా చెప్పే తెగిన జ్ఞాపకాలు, స్మృతిబింబాలు ఎంతో ప్రాచుర్యం పొందిన రచనలు. ఇంగ్లీషు సాహిత్యంలో ఈస్తటిక్ అనే కళాతత్వశాస్త్రానికి తెలుగులో సంజీవ్ దేవ్ రచనలు చక్కగా సరిపోతాయని సాహితీవిశ్లేషకులు పేర్కొన్నారు.

SCERT ANDHRA PRADESH

అనేక భాషలను సొంతంగా నేర్చుకుని బహుభాషావేత్తగా రూపొందినట్లుగానే చిత్రకళను కూడా సొంతంగా అభ్యసించి చిత్రకారుడయ్యాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ లాగా ముందు చిత్రకళావిమర్శకుడై యాభైసంవత్సరాల వయస్సు దాటాక కుంచె చేతపట్టి అద్భుతమైన వర్ణచిత్రాలను రూపొందించాడు. సాహిత్యాన్ని, చిత్రలేఖనాన్ని, సంగీతాన్ని, శిల్పాన్ని గురించి విడివిడిగా వివరించడమేకాక లలితకళలన్నింటిలోను అంతర్లీనంగా ఉన్న సంబంధ బాంధవ్యాలను, తాత్వికతలను తులనాత్మకంగా విశ్లేషించారు. ఆయన ప్రతిభను గుర్తించి ఆంధ్ర విశ్వవిద్యాలయం డి.లిట్‌తో సత్కరించింది. కళలు, సాహిత్యం, సమాజ అభ్యున్నతికి దోహదపడేవిగా ఉండాలని కాంక్షించి జీవితాంతం దానికోసమే కృషిచేసిన కళాతత్వవేత్త సంజీవ్ దేవ్ 25-8-1999న ఇహలోక యాత్రను ముగించాడు. చిన్నతనంలోనే ఎన్నో కష్టాలను ఎదుర్కొని స్వయంకృషితో అద్భుత ప్రతిభను ప్రదర్శించిన సంజీవ్ దేవ్ జీవనవిధానం మనందరికీ ఆనందదాయకం.

క్రింది ప్రశ్నలకు జవాబులను రాయండి.

1. సాహసవీరుడు మస్తాన్‌బాబు జీవితచరిత్రనుండి మీరేమి నేర్చుకున్నారు?
2. 'కార్యదక్షత,' దృఢసంకల్పం మనకు మార్గదర్శనం చేస్తాయి. చర్చించండి.
3. సత్య నాదెళ్ళ వ్యాపారదిగ్గజంగా మారడానికి తోడ్పడిన అంశాలేమిటి?
4. డా॥ సంజీవ్ దేవ్ తమ రచనలు, చిత్రాల ద్వారా సమాజానికి ఏమి తెలియజేస్తున్నారని మీరు భావిస్తున్నారు?

www.apteachers.in

పదాలు - అర్థాలు

అర్థాలు

(అ)

అంధకారం = చీకటి
అఖండం = ఏకరూపం, ముక్కలుగా లేనిది
అధ్యక్షుడు = సభాకార్యక్రమాలను నడిపే ప్రధానవ్యక్తి, అధికారి
అనలుడు = అగ్ని
అనిమిషనాథుడు = దేవేంద్రుడు
అనిలము,అనిలుడు = వాయువు
అనిర్వచనీయం = మాటల్లో చెప్పలేనిది
అనుభూతి = మనసులో పుట్టే భావం
అన్యులు = ఇతరులు
అభినయం = నటన
అభిముఖం = ఎదురు
అభీష్టం = కోరిక
అభ్యుత్థానం = ఎదురుగా వస్తున్నవారిని గౌరవించడానికి తాను కూర్చున్నచోటినుంచి లేవడం
అమరులు = దేవతలు
అమృతాంశుడు = చంద్రుడు
అరుణం = ఎరుపు
అవధులు = హద్దులు
అశని = పిడుగు

(ఆ)

ఆగామి = రాబోయే
ఆయత = పెద్ద
ఆర్తవం = ఆయా ఋతువులకు సంబంధించిన పదార్థం, పువ్వు
ఆర్షసంప్రదాయం=ఋషులసంప్రదాయం
ఆవిష్కరణ=ప్రకటన,వెల్లడించడం, బయటకుతీయడం
ఆస్తరణం = పరుపు
ఆహ్వానం = పిలుపు

(ఇ)

ఇక్షుదండం = చెఱకు గడ
ఇడుములు = కష్టాలు
ఇతిహాసం = చరిత్ర, తొల్లిటికథ
ఇనుడు = సూర్యుడు

(ఉ)

ఉక్కు = ధైర్యం
ఉజ్జ్వల = బాగా వెలుగుతున్న
ఉద్దేశ్యం = గురి, లక్ష్యం, (ఉద్దేశించదగినది)
ఉప్పరము = ఆకాశం
ఉన్ముఖుడు = సిద్ధపడేవాడు
ఉపలము = రాయి
ఉరగము = పాము
ఉర్వి = భూమి
ఉల్క = నిప్పుకణం

(ఎ, ఏ)

ఎద = హృదయం
ఎరుక = జ్ఞానం, తెలుసు
ఏర్చు(క్రి) = దహించడం
ఏహ్యాభావం = అసహ్యం

(ఒ, ఓ)

ఒనర్చు (క్రి) = చేయడం
ఓఢ్రము = ఒడిశా భాష

(క)

కంఠీరవం = సింహం
కటకటా! = అయ్యయ్యో
కడలి = సముద్రం
కరము = చేయి
కరి = ఏనుగు
క్షమ = ఓర్పు
కల్యాణం = పెళ్ళి; మేలు
కాన = అడవి
కాయం = శరీరం
కార్ముకం = విల్లు
కాలగతి = కాలం గడవడం
క్ష్మాతలం = భూమండలం
క్షితి = భూమి
కుడ్యం = గోడ
కుతూహలం = ఆసక్తి
కుశ = దర్భ
కేశాలంకరణ = వెంట్రుకలను అందంగా తీర్చడం
కొస = చివర
క్రోధం = కోపం
క్రోలు(క్రి) = తినడం, తాగడం

(ఖ)

ఖగం = పక్షి
ఖాద్యం = తినుబండారం (తినదగినది)

(గ)

గండశిలలు = కఠినమైన శిలలు
గమించు(క్రి) = పోవడం
గలంబా = పూత
గాడి = రథము
గాడ్పు = గాలి
గుణం = స్వభావం

(ఘ)

ఘర్మజలం = చెమటనీరు

(చ)

చంచల = కదులుతున్న
చంద్రిక = వెన్నెల
చవి = రుచి
చిరము = చాలాకాలం
చూడ్కి = చూపు
చెరుపు = కీడు

(జ)

జంకు(క్రి) = భయపడు
జట = శిఖ
జటిల = జడలున్న, చిక్కులు పడ్డ
జనయిత్రి = తల్లి
జని = జన్మ, పుట్టుక
జలధార = నీటిధార
జిహ్వ = నాలిక
జీర్ణం = అరగటం
జోతలు = జోహార్లు

(ఢ)

ఢంకా = డప్పు (పెద్దది, పైన చర్మం కప్పి ఉన్నది)

(త)

తగరు = పొట్టేలు
తటము = ఒడ్డు
తనువు = శరీరం
తరంగం = కెరటం, అల
తరుణం = తగిన సమయం
తరుగుల్మాలు = చెట్లూ తీగెలపొదలూ
తర్కం = వాదన
త్యజించడం = విడవడం, వదలడం
త్వర = వేగం
తారక = నక్షత్రం

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

తిరునాళ్ళు = దేవతలకు చేసే పండగలు,ఉత్సవాలు
తుండం = పక్షిముక్కు
తుహినం = మంచు
తూష్ణీభావం = తిరస్కారం, మౌనం
తేటి = తుమ్మెద

(ద)

దగ్ధమైన = కాలిన
దండం = నమస్కారం, ఒక ఉపాయం
దర్పం = గర్వం
దస్తారా = కాగితాల బొత్తి
దానవులు = రాక్షసులు
దారుఢ్యం = దృఢత్వం,
దవాగ్ని = అడవులను దహించే అగ్ని
దాస్యం = బానిసతనం
దాహం = కాలడం
దినకరుడు = సూర్యుడు

(ధ)

ధరిత్రి = భూమి
ధారుణి = భూమి
ధోవతి = మగవాళ్ళు మొలకు చుట్టి కట్టుకొనే వస్త్రం

(న)

నందనుడు = కొడుకు
నయవంచన =నమ్మించిమోసంచేయడం
నలుకువడు(క్రి) = ముక్కలవడం
నవ్యము = కొత్తది
నిఖిలం = సమస్తం
నిర్గతము = బయటికి వచ్చినది
నిరుపమ = పోలికలేని
నివేశం = ప్రదేశం
నుతి = పొగడ్త
నొడివి - నుడివి = చెప్పి

(ప)

పంక్తి = వరస
పక్షం = రెక్క, పదిహేను రోజులకాలం
పచనం = వండటం; ఉడకటం
పటము = వస్త్రము
పడయు(క్రి) = పొందడం
పత్రికాప్రతినిధి = ఒక పత్రికలో ప్రచురించడానికి సమాచారం సేకరించేవాడు
పన్నిదం = పందెం
పనుపు(క్రి) = ఆజ్ఞాపించడం
పరిక్రమము = విహారం; చుట్టూ తిరగడం
పరిఘ = కందకం
పవనం = గాలి
పాకం = వంట
పాటవం = నైపుణ్యం, పటుత్వం
పాయు(క్రి) = తొలగడం
పావనం = పవిత్రం
ఫికరు = బెంగ, భయం
పుటభేదం = పట్టణం
పునీతం = పవిత్రం
పురుహూతుడు = దేవేంద్రుడు
ప్రథితయశం = ప్రసిద్ధి చెందిన కీర్తి
పెయ్య = ఆడ దూడ
పెటారు = పెట్టె
పొరలు(క్రి) = దొర్లడం

(బ)

బయలు = ఆవరణ లేని ప్రదేశం
బంధుల = బంధువుల
బృందం = సమూహం
బేడ = 12 పైసల విలువ
బొబ్బ = పెద్ద కేక

(భ)

భంగి = విధం, రీతి
భరోసా = నమ్మకం
భవం = పుట్టుక
భానుడు = సూర్యుడు
భూషలు = అలంకారాలు

(మ)

మదం = అహంకారం
మరకతం = పచ్చ (ఒక జాతి రాయి)
మారి = జబ్బు
మూకవిప్పు(క్రి) = చెదరగొట్టడం

(య)

యదార్థం = నిజం
యుగ్మం = జంట

(ర)

రకం = పన్ను, విధం
రజం = దుమ్ము
రయము = వేగం
రవం = ధ్వని
రాణ్మందిరాలు = రాణివాసాలు, రాజభవనాలు
రిపువు = శత్రువు

(వ)

వన్నె = రంగు, అందం
వ్యయం = ఖర్చు
వల్వ = వలువకు రూపాంతరం, వస్త్రం
వాక్కు = మాట
వాతం = గాలి
వారిజం = తామరపూవు
వారి = నీరు
వారిజాప్తుడు = సూర్యుడు
వారిజగర్భుడు = బ్రహ్మ
వ్యాప్తి = ప్రసిద్ధిపొందడం, వ్యాపించడం
విక్షిప్త = విసిరివేయబడిన, చెదరగొట్టబడిన
వితత = విరివిగా ఉన్న, వ్యాపించిన
విరుతించే = ధ్వనించే
విలాపం = దుఃఖంతోడి మాట
విస్మరించి = మరచి
వెల్లివిరియు =ప్రవహించు, ఉబుకు
వైజయంతి = విష్ణుమూర్తి మెడలోని పూలదండ
వైదికులు = వేదాలు తెలిసినవారు
వైలక్ష్యం = విలక్షణత్వం
వంతు = పోటీ

(శ)

శయ్య = పరుపు
శిథిలాలు = పాడైన నిర్మాణాలు
శిరోభాగం = తలభాగం
శ్రావ్యం = వినసొంపైనది

(ష)

షరాబు = వెండి, బంగారపు వ్యాపారి

(స)

సంధానిస్తూ = కూరుస్తూ
సంరావిస్తూ = మోగిస్తూ
సంస్కరణ = బాగు చేయడం
సమర్చనం = విశేషమైనపూజ
సముద్ధరణ = బాగు చేయడం
సహస్రం = వెయ్యి
స్వస్తి = మంగళం
స్రవంతి = నది
సుగుప్తం = బాగుగా దాచబడినది
సామర్థ్యం = యోగ్యత

(హ)

హలం = నాగలి
హేమం = బంగారం
హుకుం = ఆజ్ఞ

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

పర్యాయపదాలు

అనలుడు = అగ్ని, హవ్యవాహనుడు, వహ్ని, హుతభుక్కు
అనిమిషులు = దేవతలు, సురలు, అమరులు, త్రిదశులు.
అభీష్టం = కోరిక, కాంక్ష, ఈప్సితం , ఆశ
అశని = పిడుగు, కులిశం, నిర్ఘాతము,
ఆర్తవం = పుష్పం, సుమం, కుసుమం, పూవు
ఇక్షువు = రసాలము, చెఱకు, ఇంచు
ఇనుడు = సూర్యుడు, రవి, ద్యుమణి, నభోమణి
ఉరగము = పాము, సర్పము, ఫణి, అహి
ఎద = హృదయం, మది
కంఠీరవం = సింహం, మృగరాజు, కేసరి, పంచాస్యం
కరము = చేయి, హస్తము, కేలు
కృషి = ప్రయత్నం, శ్రమ
కాయం = శరీరం, దేహం, తనువు,
కేతనం = జెండా, టెక్కెము, పతాక, ధ్వజం
కేలు = హస్తము, పాణి, చేయి
ఖగం = పక్షి, విహగం ,పులుగు
గభాలున = వెంటనే, తొందరగా
గాడి = రథము, తేరు, స్యందనం
గాడ్పు = గాలి, కరువలి, వాయువు
గేహం = ఇల్లు, గృహం, కేతనం,
జిహ్వ = నాలిక, రసన, కకుత్తు
తట్ట = గంప, బుట్ట
తేటి = తుమ్మెద, భ్రమరం, ద్విరేఫం, మిళిందం,బంభరం
నందనుడు = కుమారుడు, కొడుకు, పుత్రుడు, ఆత్మజుడు
నుతి = పొగడ్త, స్తోత్రము, స్తుతి
పడతి = స్త్రీ, ఉవిద, ఇంతి, మహిళ, నవల, కొమ్మ
పావనం = పవిత్రం, పునీతం ,పూతం
పుటభేదనం = పట్టణం, నగరం, పురం
బుధులు = పండితులు, విద్వాంసులు, కోవిదులు,
భానుడు = సూర్యుడు, అర్కుడు, పూషుడు, రవి
వెండి = కలధౌతం, రజతం
వారిజం = పద్మం, సరసిజం, జలజం, తామర
వారిజగర్భుడు = బ్రహ్మ, చతుర్ముఖుడు, నలువ, విధి

నానార్థాలు

అక్షము = బండిఇరుసు, సర్పం, జూదం, పాచిక
అనలము = అగ్ని, కృత్తిక, నల్లజీడి, మూడు అంకె
అనిమిషం = చేప, రెప్పపాటులేనిది
అరుణం = ఎరుపు, కాంతి, కుష్ఠురోగం, బంగారం
అశని = వజ్రము, పిడుగు,
ఆస్తరణం = ఎఱ్ఱ కంబళి, పరుపు, ఆసనం, ఏనుగు మీద పరిచే ఎఱ్ఱ కంబళి
ఇనుడు = సూర్యుడు, ప్రభువు, పోషకుడు, భర్త
ఇల = బుధుని భార్య, ఆవు, మాట, భూమి
ఉల్క = నిప్పుకణం, కాగడా
ఎద = హృదయం, భయం
కంఠీరవం = సింహం, మత్తగజం, పావురం
కరము = చెయ్యి, పిక్కిలి, తొండము, కిరణము
కరి = నిదర్శనం, ఏనుగు, కోతి
కారు = నలుపు, అడవి, వర్షర్తువు
కాయం = శరీరం, సమూహం, స్వభావం,
కాఋ = దట్టము, అజ్ఞానం, పట్టకారు, వ్యర్థపుమాట
కాలం = సమయం, నలుపు, చావు, తాడి (చెట్టు)
కుడ్యం = గోడ, పూత
కుశ = తాడు, నీరు, దర్భ, ఒక ద్వీపం
కేతనం = జెండా, ఇల్లు
ఖగము = పక్షి, బాణం, సూర్యుడు (గ్రహాలు), గాలి
గుణం = దారం, స్వభావం, వింటినారి
ఘటం = కుండ, శిఖరం, పాదునూయి
చరణం = పాదం, వేరు, కులం, పద్యపాదం
జలం = నీరు, ఎఱ్ఱతామర, ఎఱ్ఱకలువ
జిహ్వ = నాలుక, వాక్కు, జ్వాల
తార = నక్షత్రం, వాలి భార్య, కంటిపాప, ఓంకారం
తీర్థం = పుణ్యనది, జలం, ఉపాధ్యాయుడు, మంత్రి
తుండం = పక్షి ముక్కు, నోరు, ఖండం
దక్షిణ = ఒకదిక్కుకు సంబంధించిన; సంభావన
దర్శనం = చూపు, కన్ను, అద్దం, బుద్ధి, శాస్త్రం
దాహం = దప్పిక, కాలుట

SCERT ANDHRA PRADESH

www.apteachers.in

దిక్కు = దిశ, శరణం

ధర్మం = పుణ్యం, న్యాయం, ఆచారం, యజ్ఞం

ధ్వని = శబ్దం, వ్యంగ్యార్థం.

నందనుడు = కొడుకు, సంతోషపెట్టువాడు

పక్షం = వరుస, రెక్క, 15 రోజులు, వైపు

పదము = చిహ్నము, పాదము, స్థలము

పరిఘము = బాణం, గాజుకుండ, దెబ్బ

పాకం = పంట, వంట, నారికేళాది కావ్యపాకాలు

పావనం = జలం , గోమయం, రుద్రాక్ష, పవిత్రం

బుధుడు = పండితుడు, బుధగ్రహం, వేల్పు

వ్యుత్పత్త్యర్థాలు

అంధకారం = లోకులను అంధులుగా చేసేది -చీకటి

అనలుడు = లోకమునకు జీవనాధారమైనవాడు -అగ్ని

అనిమిషులు = రెప్పపాటు లేనివారు - దేవతలు

అనిలుడు = ప్రాణులకు జీవనాధారమైనవాడు -వాయువు

అమృతం = మరణమును పొందింపనిది - సుధ

ఇతిహాసం = ఇలా జరిగిందనిచెప్పేది - తొల్లిటికథ

ఉరగము = (ఉరస్సు) రొమ్ముతో పాకేది - పాము

ఉర్వి = విశాలమైనది -భూమి

కంఠీరవం = కంఠంలో ధ్వని కలది, సింహం

క్ష్మా = భారం వహించడంలో ఓర్పుకలది, భూమి

కేశము = శిరస్సున ఉండేది - వెంట్రుక

ఖగం = ఆకాశంలో పోయేది - పక్షి

ఛాందసుడు = ఛందోరూపమైన వేదంచదివినవాడు - బ్రాహ్మణుడు

తార = దీనిచే నావికులు తరింతురు -చుక్క

దినకరుడు = దినాన్ని కల్గజేయువాడు -సూర్యుడు

ధరణి = సమస్తాన్నీ ధరించునది - భూమి

నందనుడు = సంతోషమును కలిగించువాడు- కొడుకు

భూజము = భూమినుండి పుట్టినది -చెట్టు

వారిజము = నీటినుండి పుట్టినది - పద్మం

వారిజగర్భుడు = పద్మము గర్భముగా గలవాడు - బ్రహ్మ

స్రవంతి = పర్వతాదుల నుండి స్రవించేది - నది

ప్రకృతి	-	వికృతి
అగ్ని	--	అగ్గి
నిమిషము	--	నిముసము
హృదయం	--	ఎద, ఎడద
సింహం	--	సింగం
పక్షి	--	పక్కి
గుణము	--	గొనము
గృహము	--	గీము
చంద్రుడు	--	చందురుడు
జట	--	జడ
గర్వం	--	గరువము
గౌరవం	--	గారవము
దీపము	--	దివ్వె
ఆహారం	--	ఓగిరం
పక్షము	--	పక్క
నిజము	--	నిక్కము
గర్భము	--	కడుపు
బ్రహ్మ	--	బమ్మ
శయ్య	--	సెజ్జ
భృంగారం	--	బంగారం
సంతోషం	--	సంతసం
సుఖం	--	సుకం
ఘటము	--	కడవ
కార్యం	--	కర్జము

SCERT ANDHRA PRADESH